సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 304

గురువారం 25-1-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



భళా బోపన్న

43 ఏళ్ల వయసులో టెన్నిస్ డబుల్స్‌లో వరల్డ్ నంబర్‌వన్ -14లో



బుల్ బౌన్స్ బ్యాక్

మళ్లీ 71 వేల పాయింట్ల పైకి సెన్సెక్స్ 21,450 పాయింట్ల పైకి నిఫ్టీ -15లో



రష్యాలో కూలిన ఆర్మీ విమానం

రష్యాలో సైనిక విమానం కుప్పకూలింది. 65 మంది ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలు సహా 74 మంది మరణించారని రష్యా తెలిపింది.

వివరాలు 6లో ▸



ఫిబ్రవరి 16న భారత్ బంద్!

రైతు సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 16న భారత్ బంద్ పాటించనున్నట్లు భారతీయ కిసాన్ యూనియన్ ప్రకటించింది.

వివరాలు 6లో ▸



ప్రైమరీలో ట్రంప్‌కు మరో గెలుపు

రిపబ్లికన్ పార్టీ తరఫున అమెరికా అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్న ట్రంప్ న్యూహ్యాంప్‌షైర్ ప్రైమరీలోనూ గెలిచారు.

వివరాలు 6లో ▸



సూర్యకుమార్‌కు ఐసీసీ అవార్డు

ఐసీసీ 2023 వార్షిక పురస్కారాల్లో భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును గెల్చుకున్నారు.

వివరాలు 14లో ▸

అంతరాలపై విద్యా యుద్ధం

రాష్ట్రంలో పేదరికానికి నాణ్యమైన విద్యే సరైన మందు

ఇండియా టుడే సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- నాణ్యమైన విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు కావాలి
- సంపన్నుల పిల్లలకు అందే చదువులు పేద పిల్లలకూ అందాలన్నదే మా లక్ష్యం
- ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంపై కొందరు పెద్దలు విమర్శిస్తున్నారు
- అలా అడిగే వారి పిల్లలు, మనవళ్లు ఏ మీడియంలో చదువుతున్నారో వారు ప్రశ్నించుకోవాలి
- పిల్లలకు నాణ్యమైన ఇంగ్లిష్ విద్య కోసం సమగ్ర విధానం.. స్కూళ్లలో నాడు-నేడు కింద మౌలిక సదుపాయాలు
- టీచర్లకు శిక్షణ.. బోధనా సామర్థ్యం పెంపు
- ప్రతి ఏటా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు.. 2025-26 నుంచి ఒకటో తరగతి నుంచి ఐబీ సిలబస్
- ఏటా ఒక తరగతి చొప్పున 2035 నాటికి 10వ తరగతి వరకు అమలు
- విద్యలో నాణ్యత ఉన్నప్పుడే ప్రపంచ స్థాయిలో పోటీని ఎదుర్కోగలరు
- వీటన్నింటికీ రూ.14 వేల కోట్లు ఖర్చు



ఇండియా టుడే సదస్సులో సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ ప్రశ్నలకు బదులిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'పేదరిక నిర్మూలన నాణ్యమైన చదువు ద్వారానే సాధ్యమని నేను నమ్ముతాను. అది ప్రతి ఒక్కరి హక్కు కావాలి. పేద పిల్లలు తెలుగు మీడియంకు పరిమితమైతే, సంపన్నుల పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నారు. సంపన్నులకు అందే నాణ్యమైన చదువులు పేద పిల్లలకూ అందాలన్నదే మా లక్ష్యం' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తిరుపతిలో జరుగుతున్న ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్ రెండో రోజు కార్యక్రమంలో బుధవారం సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ అడిగిన ఓ ప్రశ్నకు ఇలా సమాధానం చెప్పారు. పిల్లలు ఓటర్లు కాదు కాబట్టి వారి గురించి ఎవరూ పట్టించుకోరని, ఇది దురదృష్టకరమని అన్నారు. అయితే పిల్లలు

మిగతా 2వ పేజీలో ▶

మేలు జరిగుంటేనే నాకు ఓటేయండి

మా పాలనలో మంచి జరిగిందని భావిస్తేనే అండగా నిలబడమని ప్రజలను కోరుతున్నా: సీఎం జగన్

8లో

రాజ్‌దీప్: నిజంగా ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం మధ్య ఉన్న గ్యాప్‌ను అంత సులభంగా మార్చగలరా? దానివల్ల పిల్లలు ఇబ్బంది పడే పరిస్థితి రాదా?

సీఎం జగన్: గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలను ఏకపక్షంగా ఇంగ్లిష్ మీడియంలోకి మార్చడం లేదు. ప్రతి ఒక్కటీ ఒక పద్ధతి ప్రకారం, శాస్త్రీయ విధానంలో సాగుతోంది. ఒక సమగ్ర విధానంలో కొనసాగుతోంది. ప్రతి పుస్తకాన్ని బైలింగ్వువల్.. అంటే ఒక పేజీ ఇంగ్లిష్, పక్క పేజీ తెలుగులో ముద్రిస్తున్నాం. ఇంకా బైజూస్ కంటెంట్‌ను కూడా తీసుకొచ్చాం. ప్రభుత్వ పాఠశాలల్లో అనూహ్య మార్పులు చేస్తున్నాం. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. ఆరో తరగతి నుంచి, ఆపై తరగతుల్లోని ప్రతి క్లాస్‌రూమ్‌లో ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్) ఏర్పాటు చేస్తున్నాం. ఆ మేరకు 62 వేల తరగతులు ఉండగా, ఇప్పటికే 40 వేల తరగతి గదుల్లో ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేశాం. మిగిలిన తరగతి గదుల్లో వచ్చే నెల చివరి నాటికి ఐఎఫ్‌పీలు ఏర్పాటు చేసే లక్ష్యంతో పని చేస్తున్నాం. ఆ విధంగా ఒక ప్రణాళికా బద్ధంగా పాఠశాల విద్యా రంగంలో వినూత్న మార్పుల దిశలో పని చేస్తున్నాం. బైలింగ్వువల్ పాఠ్య పుస్తకాలు, 3వ తరగతి నుంచే సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, టీచర్లలో నైపుణ్యం, సామర్థ్యం పెంపు, బైజూస్ కంటెంట్, తరగతి గదుల్లో ఐఎఫ్‌పీల ఏర్పాటు.. ఇలా వీటన్నింటి వల్ల ప్రాథమిక విద్యా రంగంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇవన్నీ కాకుండా.. పిల్లలు 8వ తరగతిలోకి వచ్చే సరికి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు ఇస్తున్నాం.

న్యూస్‌రీల్

సైకిల్‌కు 'చెయ్యి'చ్చేస్తారట!



కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డి కుటుంబం టీడీపీకి షాక్ ఇవ్వనున్నట్టు సమాచారం. కుటుంబానికి ఒకే టికెట్ అనడం, అందులోనూ ఆశించిన సీటు కాకుండా వేరేచోట బరిలో నిలవాలని సూచించడం వంటి పరిణామాలతో టీడీపీపై కినుక వహించిన కోట్ల కుటుంబం ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీతో రాజకీయ ప్రయాణం చేయనున్నట్లు సమాచారం.

వివరాలు 8లో ▸

నిర్ణయాధికారం 'ఆమె'దే!



రాష్ట్రంలో రాబోయే సాధారణ ఎన్నికల్లో గెలుపు ఓటములను మహిళా ఓటర్లే నిర్దేశించనున్నారు. 152 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకు 1,036 మంది మహిళా ఓటర్లున్నారు. 18 నుంచి 19 సంవత్సరాల వయసు గల మహిళా ఓటర్లు 3.5 లక్షల మంది ఉన్నారు.

వివరాలు 16లో ▸



10న విశాఖలో ఏఐ, క్లౌడ్ సమ్మిట్

సాక్షి, విశాఖపట్నం: జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు కీలక వేదికగా నిలిచిన విశాఖ మరో ముఖ్యమైన సదస్సుకు ముస్తాబవుతోంది. కృత్రిమ మేధ, క్లౌడ్ కంప్యూటింగ్‌కు సంబంధించిన విప్లవాత్మక మార్పులపై ఫిబ్రవరి 10న ఏఐ క్లౌడ్ సమ్మిట్ నిర్వహించనున్నట్లు ఐటీ వర్గాలు వెల్లడించాయి. ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, డీప్‌టెక్ సమ్మిట్స్ ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో సదస్సు జరుగనుంది. పలు అంతర్జాతీయ సంస్థలకు చెందిన చీఫ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్లు, ఐటీ నిపుణులు, ప్రొఫెసర్లు, స్టార్టప్ సంస్థల ప్రతినిధులు, ఇంక్యుబేటర్స్, కృత్రిమ మేధ, క్లౌడ్ టెండర్ నిపుణులు పాల్గొననున్నారు.

రామంటున్న జనం.. టీడీపీలో కలవరం

'రా కదలిరా' సభలు కొన్ని రద్దు.. మరికొన్ని వాయిదా

ఇప్పటి వరకు కష్టమ్మీద కొన్ని చోట్ల మాత్రమే సభలు

- ఆశించిన స్థాయిలో విజయవంతం కాక సతమతం.. జనాన్ని తరలించలేక చేతులెత్తేస్తున్న తమ్ముళ్లు
- మిగిలిన చోట్ల నిర్వహించడం ఇక కష్టమని నిర్ధారణ.. ఉరవకొండ, పీలేరులో బుధవారం జరగాల్సిన సభలు వాయిదా
- గోపాలపురం సభకు బదులుగా రాజమండ్రితో సరిపెట్టే యోచన.. పార్టీ పరిస్థితి అధ్వానంగా మారడంతో బయటకు రాని నేతలు
- సీట్ల సర్దుబాటు తేలక జనసేన నుంచి అందని సహకారం



జనం లేక వెలవెలబోతున్న అల్లూరి సీతారామరాజు జిల్లా దుంబ్రిగూడ సభ (ఫైల్)

7లో

టీడీపీ సభలకు జనం 'కదలిరా'వడం లేదు. కార్యకర్తలు నానా తంటాలుపడి బలవంతంగా తరలించినా... చివరి వరకూ ఉండటం లేదు. పసలేని ప్రసంగాలు... అదేపనిగా రాగాలు తీస్తూ జగన్‌పై నిందారోపణలు... జనాన్ని ఆకర్షించని నిర్ణయాలు... సభలను నీరుగార్చేస్తున్నాయి. ప్రతి పార్లమెంటు పరిధిలో ఒక్కోసభ నిర్వహించాలని యోచించినా... పట్టుమని పది సభలే నిర్వహించారు. అవి కూడా ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదు. దత్తపుత్రుడి సాయం తీసుకుందామనుకుంటే... ఆయన నుంచి సానుకూల స్పందన రావడం లేదు. సీట్ల సర్దుబాటు తేలకుండా సభలకు వెళ్లేందుకు జనసేన నేతలు కూడా సుముఖత చూపడం లేదు.



'పొత్తు' కడుపులో కత్తులు!

బాబుకు 68 సీట్ల జాబితాతో పవన్ ప్రతిపాదన

పార్టీ నేతలు, కొన్ని కుల సంఘాల ఒత్తిడితో పలు డిమాండ్లు

- 45కు తక్కువ కాకుండా కేటాయించాలని వినతి
- టీడీపీ బలంగా ఉన్న సీట్లు జనసేనకు ఇచ్చారన్న అభిప్రాయం కలిగించాలని సూచన
- అందుకే గత ఎన్నికల్లో గెలిచిన 23లో రెండైనా ఇవ్వాలని అభ్యర్థన
- జనసేన జాబితా బయటకు పొక్కడంతో క్షేత్రస్థాయిలో పెరిగిన విభేదాలు
- కత్తులు నూరుతున్న ఇరుపార్టీల నాయకులు.. సీట్ల పంపకాలపై రెండు పార్టీల్లోనూ ప్రతిష్టంభన

సాక్షి, అమరావతి: పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించే స్థానాలపై పవన్‌కళ్యాణ్ తెలుగుదేశం పార్టీ ముందుంచిన ప్రతిపాదిత అసెంబ్లీ నియోజకవర్గాల జాబితా ఇటీవల బయటకు పొక్కడంతో క్షేత్రస్థాయిలో ఇరు పార్టీల నాయకుల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. తమ సీటు ఎలా అడుగుతారంటూ టీడీపీ నేతలు స్థానిక జనసేన నాయకులపై తీవ్రస్థాయిలో విరుచుకు పడుతున్నారు. రెండు పార్టీల నాయకులు ఒకరిపై మరొకరు కత్తులు నూరుకుంటున్నారు. ఈ విషయమై జనసేన పార్టీ నాయకులు ఆ పార్టీ పెద్దలకు ఫిర్యాదులు చేస్తున్నట్టు సమాచారం.

ఒత్తిళ్లకు తలొగ్గే పవన్ ప్రతిపాదనలు

పార్టీ నాయకులు, కొన్ని కుల సంఘాల నుంచి వచ్చిన ఒత్తిడికి తలొగ్గి జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కొద్ది రోజుల క్రితం

మిగతా 8వ పేజీలో ▶

డిగ్రీ లెక్చరర్స్ పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ షురూ

వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచిన ఏపీపీఎస్సీ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. అర్హత గల అభ్యర్థులు ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏపీపీఎస్సీ ప్రకటించింది. రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో 11 సబ్జెక్టుల్లో 240 డిగ్రీ లెక్చరర్ పోస్టులకు డిసెంబర్ 30న సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చిన సంగతి తెలిసిందే. సబ్జెక్టుల వారీగా పోస్టులు, వేతనం, రిజర్వేషన్, విద్యార్హతలు వంటి పూర్తి వివరాలతో కూడిన సమాచారం సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో ఉంచినట్టు కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు.

ఇనుంచుకేత్



పేదలకు ఇళ్ల స్థలాల్లో సరికొత్త చరిత్ర

సుమారు 30 లక్షల జగనన్న ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్

- పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు రిజిస్టర్ చేసిన ప్రభుత్వంగా రికార్డు
- ఈ నెల 27 నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం
- గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు
- ఇళ్ల స్థలాలపై ఇక పేదలకు పూర్తి హక్కులు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల పక్షపాతి అని మరోసారి రుజువు అవుతోంది. రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం.. ఇప్పుడు వాటికి రిజిస్ట్రేషన్లు కూడా చేయడం ద్వారా కొత్త చరిత్ర సృష్టించనుంది. తద్వారా పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్టర్ చేసిన తొలి ప్రభుత్వంగా రికార్డులకెక్కనుంది. ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం సాధారణమే అయినా ఒకేసారి 30 లక్షల మందికిపైగా ఇవ్వడం, వాటికి రిజిస్టర్ చేస్తుండటం దేశంలోనే ప్రప్రథమం. దీనివల్ల పేదలకు ఆ స్థలాలపై పూర్తి హక్కులు లభిస్తాయి. ఈ నెల 27వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు చేసే కార్యక్రమం

మిగతా 7వ పేజీలో ▶



కూటమికి బీటలు

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమికి గట్టి పోటీ ఇవ్వాలన్న విపక్షాల ప్రయత్నాలకు ఆదిలోనే హంసపాదు! కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష 'ఇండియా' కూటమికి భాగస్వామ్య పార్టీలు తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ బుధవారం రెండు భారీ షాకులిచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామని రెండు పార్టీలూ చెప్పాయి. మమత ప్రకటనను విపక్ష ఇండియా కూటమికి చావు దెబ్బగా బీజేపీ అభివర్ణించింది.

6లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మా పాపకు పునర్జన్మ



రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం మాది. నాకు భార్య సుశీల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నా. మాది పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం వెలగవాడ. మా కుమార్తె షణ్ముఖప్రియ మూడేళ్ల వయసులో తీవ్ర అస్వస్థతకు గురైంది. పాపకు సికిల్‌సెల్ ఎనీమియా అని, అది ప్రాణాంతక వ్యాధి అని వైద్యులు చెప్పడంతో మేమెంతో తల్లడిల్లాం. పాపకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలన్నా, ప్రతినెల ఏబీ పాజిటివ్ రక్తం అందించాలంటే రూ.18 వేల నుంచి రూ.20 వేలు ఖర్చయ్యేది. అది మాకు తలకు మించిన భారంగా మారింది. రోజంతా కష్టపడితే వచ్చిన మొత్తం కుటుంబ పోషణకే సరిపోయేది కాదు. ఈ సమయంలో పాదయాత్రగా వచ్చిన జగనన్నను రాజాం సమీపంలో కలిసి మా కష్టం చెప్పుకున్నాం. మా సమస్య ఓపిగ్గా విన్న ఆయన వివరాలు రాసి అందించాలని సూచించారు. ఆయన అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే మాకు స్థానిక అన్నవరం పీహెచ్‌సీ నుంచి ఫోన్ వచ్చింది. మా పాప యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న వైద్యులు నేరుగా ఇంటికి వచ్చారు. పాపకు మెరుగైన వైద్యం అందిస్తామని, రూ.10 వేల పింఛన్ ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. నాలుగేళ్లుగా పాపకు పింఛన్ అందుతోంది. పాలకొండ ఏరియా ఆస్పత్రిలో ప్రతి నెలా రక్తం ఎక్కిస్తున్నారు. బిడ్డ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. మా పాప వెలగవాడ ఉన్నత పాఠశాలలో ఐదో తరగతి, బాబు ఏడో తరగతి చదువుతున్నాడు. వారికి అమ్మఒడి, జగనన్న విద్యా కానుక అందుతున్నాయి. చదువు బెంగలేదు. జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. నాకు వాహన మిత్ర కింద ఏటా రూ.10 వేలు అందుతోంది. నా భార్యకు వైఎస్సార్ ఆసరా, తల్లి ఆదిలక్ష్మికి చేయూత వర్తించడంతో ఆర్థికంగా నిలదొక్కుకున్నాం. మా పాపకు పునర్జన్మ ప్రసాదించిన జగన్ మాకు దేవుడితో సమానం.

– యర్ర సింహాద్రి, వెలగవాడ
(మారోజు కళ్యాణ్‌కుమార్, విలేకరి, పాలకొండ)

సొంతింట్లో సంతోషంగా జీవనం



మా లాంటి పేదవారికి సొంతిల్లు వస్తుందని.. సొంతింట్లో నివాసముంటామని కలలో కూడా ఊహించలేదు. మాది చేనేత కుటుంబం. చేనేత కార్మికులకు గత ప్రభుత్వాలు ఎలాంటి ఆసరా కల్పించకపోవడంతో నలుగురు పిల్లలతో ఈ వృత్తిలో ఎదుగూబొదుగూ లేక ఇబ్బందులు పడ్డాం. మాది అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం బయ్యవరం. మాకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెల్లో ఒక కుమారుడు, ఒక కుమార్తెకు వివాహం చేశాం. ఇక మిగిలిన వారితో వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నాం. సొంత ఇల్లు లేక ఉమ్మడి కుటుంబంలో చిన్న ఇంట్లో భర్త, పిల్లలతో నివాసం ఉండేవాళ్లం. ఎక్కడైనా స్థలం కొనుక్కుని ఇల్లు కట్టుకుందాంమంటే మా లాంటి పేదలకు సాధ్యమయ్యేది కాదు. వైఎస్ జగన్ ప్రభుత్వం రాగానే గ్రామంలో పేదలందరికీ ఇళ్లు పథకంలో సెంటున్నర స్థలం మంజూరు చేశారు. గృహ నిర్మాణానికి నిధులు కూడా మంజూరు చేశారు. మరికొంత సొమ్ము కలిపి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. భర్త, పిల్లలతో కలిపి ఏడాదిగా నివాసం ఉంటున్నాం. నా భర్తకు నేతన్ననేస్తం పథకంలో ఏటా రూ.24 వేలు ప్రభుత్వం అందిస్తోంది. వైఎస్సార్ ఆసరా ద్వారా ఇప్పటి వరకు నాకు రూ.16 వేలు వచ్చింది. నా కుమారుడికి ఆటో ఉంది. ఏటా రూ.10 వేల వంతున వాహన మిత్ర సొమ్ము వస్తోంది. ప్రస్తుతం కుటుంబమంతా సంతోషంగా జీవిస్తున్నాం.

– శెట్టి సత్యవతి, బయ్యవరం
(కోసూరు రమేష్, విలేకరి, మాకవరపాలెం)

మంచాన పడ్డ నన్ను ఆదుకున్నారు



నాకు కిడ్నీ వ్యాధి వచ్చి 14 ఏళ్లు కావస్తోంది. ఎన్నో వ్యయప్రయాసలు పడ్డాను. గత ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా సాయం అందలేదు. అప్పుల పాలయ్యాను. మాది శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం రామకృష్ణాపురం. కిడ్నీ వ్యాధి పెరగకుండా ఉండేందుకు విశాఖలో మందులు వాడే వాడిని. మందులు, రక్త పరీక్షలు, డయాలసిస్‌కు నెలకు రూ.15 వేల వరకు ఖర్చయ్యేది. పైగా డాక్టర్ల ఫీజు కూడా చెల్లించాల్సి వచ్చేది. దాదాపు రూ.3 లక్షల వరకు అప్పు చేశాను. అప్పుల బాధల్లోనే ఇద్దరు కుమార్తెలకు పెళ్లి చేయాల్సి వచ్చింది. ఒకటిన్నర ఎకరం భూమి అమ్ముకునే స్థితికి దిగజారాను. జగన్ సీఎం అయ్యాక కిడ్నీ రోగులకు పింఛన్ రూ.10 వేలు ఇస్తున్నట్టు ప్రకటించి అమలు చేశారు. డయాలసిస్ చేయించుకుంటున్న నాకు నాలుగేళ్లుగా నెలకు రూ.10 వేలు చొప్పున పింఛను వస్తోంది. దానివల్ల అప్పు చేయాల్సిన అవసరం లేకుండా పోయింది. ప్రస్తుతం నేను ఎనిమిది వారాలుగా కొత్తగా నిర్మించిన కిడ్నీ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నా. నా భార్య లక్ష్మీకి వైఎస్సార్ ఆసరా కింద సాయం అందింది. నాకు వైఎస్సార్ రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 వంతున అందింది. రేషన్ కార్డుపై బియ్యం, కందిపప్పు, పంచదార వంటివి అందిస్తున్నారు. మంచాన పడ్డ నన్ను జగన్ కొడుకులా ఆదుకున్నారు. ఇలాంటి సీఎం ఈ రాష్ట్రానికి ఎంతో అవసరం.

– సంగారు కనకరాజు, రామకృష్ణాపురం
(గుంట శ్రీనివాసరావు, విలేకరి, వజ్రపుకొత్తూరు)

అంతరాలపై విద్యాయుద్ధం

▶ మొదటి పేజీ తరువాయి

మంచి విద్యావంతులైతేనే, వారికి నాణ్యతతో కూడిన విద్యను అందిస్తేనే.. సమాజంలో దారిద్ర్యం పోతుందని నొక్కి చెప్పారు. పది మంది నిరుపేద విద్యార్థులను ఏపీ ప్రభుత్వం అమెరికాకు పంపించడమే కాకుండా వైట్‌హౌస్‌కు కూడా తీసుకెళ్లడం గొప్ప విషయమని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న విద్యా సంస్కరణలు, పథకాలు చాలా ఆకర్షిస్తున్నాయని ఈ సందర్భంగా రాజ్‌దీప్ అభినందించారు. రాజ్‌దీప్, సీఎం వైఎస్ జగన్ మధ్య జరిగిన సంభాషణ వివరాలు ఇలా ఉన్నాయి.

? రాజ్‌దీప్ సర్దేశాయ్: విద్యా రంగంలో ఇంత మంచి చేస్తున్నా, ప్రచారానికి ఎందుకు దూరంగా ఉంటారు?

■ **సీఎం జగన్:** ఇండియా టుడే జర్నలిస్టులు ఇక్కడి స్కూల్స్ సందర్శించి, అభివృద్ధి పనులు స్వయంగా చూడడం ఎంతో ఆనందంగా ఉంది. అందుకు మీకు అభినందనలు. ఇక్కడ మేము ఏయే పనులు చేశామనేది చెప్పుకోవడం కాకుండా, మీరు స్వయంగా చూడడం నాకెంతో సంతోషం కలిగిస్తోంది.

? రాజ్‌దీప్: సాధారణంగా అన్ని ప్రభుత్వాలు విద్య, వైద్య రంగాలపై ఎక్కువగా వ్యయం చేయవనే విమర్శలు వినిపిస్తుంటాయి. అందుకు భిన్నంగా మీరు ఈ రెండు రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, వాటిని అభివృద్ధి చేసి చూపించాలనుకుంటున్నారా?

■ **సీఎం జగన్:** పేదరిక నిర్మూలనకు నాణ్యతతో కూడిన విద్య అనేది కీలకమని నేను గట్టిగా నమ్ముతాను. విద్యా హక్కు అనేది ఇంకా నినాదంగా మిగలకూడదు. నాణ్యతతో కూడిన విద్య అనేది హక్కుగా మారాలి. నిరుపేదలు ఒక చదువుకు పరిమితమైతే, సంపన్నుల పిల్లలు వేరే చదువులు చదువుతున్నారు. నిరుపేద పిల్లలు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవడం, అది కూడా కేవలం తెలుగు మీడియంలోనే చదవడం.. మరో వైపు ధనికులైన పిల్లలు ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో చదవడం సరికాదు. నిరుపేదలు, ధనికుల మధ్య కొనసాగుతున్న ఈ వ్యత్యాసం, తేడా తొలగాలి. ధనికుల మాదిరిగా నిరుపేద పిల్లలు కూడా చదవాలి. వారికి ఆ విధంగా విద్యను అందించాలి. ఆ ఆలోచన నుంచి వచ్చినవే ఈ మార్పులు. మా ప్రభుత్వం ఆ దిశలోనే పని చేస్తోంది. నిరుపేద పిల్లలకు కూడా అత్యుత్తమ నాణ్యతతో కూడిన విద్య, ఇంగ్లిష్ మీడియంలో బోధన కొనసాగాలి.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

? రాజ్‌దీప్: 2018లో రాష్ట్రంలో ప్రాథమిక విద్యా రంగంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) 84.48 శాతం ఉండగా.. అప్పుడు జాతీయ స్థాయి సగటు జీఈఆర్ 99.21 శాతం ఉంది. ఇప్పటి పరిస్థితి ఏమిటి? మీ పిల్లల డ్రాపవుట్స్ తగ్గకుండా ఏం చర్యలు తీసుకున్నారు?

■ **సీఎం జగన్:** అప్పట్లో జీఈఆర్‌లో మా రాష్ట్రంలో దేశంలో చాలా తక్కువ స్థాయిలో ఉంది. 29 రాష్ట్రాలు, ఇతర కేంద్ర పాలిత ప్రాంతాలు ఏడింటిలో చూస్తే.. మా రాష్ట్రం జీఈఆర్‌లో దారుణంగా 32వ స్థానంలో ఉండింది. అలాంటి పరిస్థితుల్లో అన్ని కోణాల్లో ఆలోచించి, వినూత్న చర్యలు మొదలుపెట్టాం. పిల్లలు స్కూళ్లకు ఎందుకు వెళ్లడం లేదన్న కారణాలు తెలుసుకున్నాం. ఆ దిశలో దిద్దుబాటు చర్యలు మొదలుపెట్టాం. అందులో కీలకమైంది మధ్యాహ్న భోజనం. దాన్ని సమూలంగా మారుస్తూ.. రోజుకో మెనూతో పిల్లలకు మంచి పౌష్టికాహారం ఇస్తూ గోరుముద్ద అమలు చేస్తున్నాం. అమ్మ ఒడి ద్వారా.. తల్లిదండ్రులు వారి పిల్లలను బడులకు పంపేలా ప్రోత్సహిస్తున్నాం. ఫలితంగా జీఈఆర్‌ను వంద శాతానికి తీసుకెళ్లాం.

రాజ్‌దీప్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధన, మూడో తరగతి నుంచే గ్లోబల్ విద్య, టోఫెల్‌లో శిక్షణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే దీనిపై విమర్శలు వినిపిస్తున్నాయి. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు వంటి నేత కూడా దీనిపై విమర్శలు చేస్తున్నారు.

సీఎం జగన్: ప్రభుత్వ పాఠశాలలను ఇంగ్లిష్ మీడియంలోకి మారుస్తున్నారని విమర్శలు చేస్తున్న వారందరినీ నేను ఒక్కటే అడుగుతున్నాను. వారి పిల్లలు, వారి మనవళ్లు, మనవరాళ్లు ఏ మీడియంలో చదువుతున్నారు? వారిని తెలుగు మీడియం స్కూళ్లకే పంపిస్తున్నారా? అదే నా సూటి ప్రశ్న. ఇంగ్లిష్ మీడియం వైపు నా చొరవను ప్రశ్నించే ముందు.. ముందుగా నా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలి.





ఇండియా టుడే సదస్సుకు హాజరైన ప్రతినిధులు

? రాజ్‌దీప్: ప్రభుత్వ యంత్రాంగంలో ఏదీ అంత త్వరగా మారదు, ఇది అందరికీ తెలుసు. కానీ కేవలం పెద్ద నగరాల్లోనే ప్రతిష్టాత్మక స్కూళ్లలో ఉన్న 'ఇంటర్నేషనల్ బాకలారియెట్' (ఐబీ) సిలబస్‌ను మీరు తీసుకువస్తున్నారు. దీని ప్రభావం ఎంత వరకు ఉంటుంది?

■ **సీఎం జగన్:** రాష్ట్రంలో ఐబీ సిలబస్‌కు సంబంధించి ఎస్సీఈఆర్టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్)తో ఈ నెల 31న ఒప్పందం కుదుర్చుకోబోతున్నాం. తొలి ఏడాది.. అంటే 2024–25 విద్యా సంవత్సరంలో కేవలం టీచర్ల సామర్థ్యం పెంపు పైనే పనిచేస్తాం. తర్వాత 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రతి ఏడాది.. ఫస్ట్ క్లాస్‌తో మొదలు ఒక్కో తరగతికి ఐబీ సిలబస్ అమలు చేస్తాం. ఆ విధంగా 10 ఏళ్లలో.. అంటే 2035లో ఇక్కడి ప్రభుత్వ స్కూళ్ల పిల్లలు, పదో తరగతిని ఐబీ సిలబస్‌తో పూర్తి చేస్తారు. ఆ సిలబస్‌తోనే పరీక్ష రాస్తారు. వారికి ఐబీ సర్టిఫికెట్ కూడా వస్తుంది. దీనివల్ల వారు ప్రపంచంలో పోటీని సమర్థవంతంగా ఎదుర్కోగలరు. నాణ్యతతో (క్వాలిటీ) కూడిన విద్య లేకపోతే మన పిల్లలు పోటీ ప్రపంచంలో నిలబడలేరు. వారు జీవితంలో ఎదగలేరు. క్వాలిటీ ఎడ్యుకేషన్ ఉంటేనే వారు ఈ దేశంలోనే కాకుండా ప్రపంచంతో పోటీ పడగలరు. అయితే ఈ అవకాశం కేవలం ధనికుల పిల్లలు.. ప్రైవేటు స్కూళ్లలో చదువుకున్న వారికే కాకుండా, నిరుపేద పిల్లలకు కూడా ఉండాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఇవన్నీ చేస్తోంది.

? రాజ్‌దీప్: 8వ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థికి మీరు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు ఇచ్చారు. ఇకపై కూడా ఇది కొనసాగుతుందా?

■ **సీఎం జగన్:** రాష్ట్రంలో ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8, 9 తరగతి పిల్లలందరి వద్ద ట్యాబ్‌లు ఉన్నాయి. ఇప్పటికే రెండుసార్లు ఇచ్చాం. నా పుట్టిన రోజు సందర్భంగా నేను స్వయంగా స్కూళ్లకు వెళ్లి, పిల్లలకు ట్యాబ్‌లు ఇస్తున్నాను. అది నాకెంతో ఇష్టం, సంతోషం కలిగిస్తోంది. ఇది ప్రతి ఏటా కొనసాగుతుంది.

? రాజ్‌దీప్: మీరు ఆశిస్తున్నట్లు ఆ పిల్లలను ఆ స్థాయిలో తీర్చి దిద్దేలా టీచర్లలో నైపుణ్యం, సామర్థ్యం ఉందా?

■ **సీఎం జగన్:** ఐబీ, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశలో కలిసి పని చేస్తున్నాయి. వారు మాతో కలిసి పనిచేసేలా ఐబీ డైరెక్టర్ జనరల్‌తో నేను స్వయంగా మాట్లాడాను. వారు రాష్ట్ర ఎస్సీఈఆర్టీతో ఒప్పందం చేసుకుని, వారితో భాగస్వామ్యం అయ్యాక.. మాతో పూర్తి స్థాయిలో కలిసి పని చేస్తారు. వారు ఇక్కడ పూర్తి స్థాయిలో అధికారికంగా ఆఫీస్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఆ స్థాయిలో ఇక్కడ వారి భాగస్వామ్యం వస్తుంది కాబట్టి మేము లక్ష్యంగా పెట్టుకున్నట్లుగా 2035 నాటికి మా పిల్లలు (గవర్నమెంట్ స్కూళ్ల విద్యార్థులు) 10వ తరగతి పరీక్షలు ఐబీ సిలబస్‌లో రాస్తారు. తొలి ఏడాది టీచర్ల నైపుణ్యం, సామర్థ్యం పెంచుతాం. ఆ తర్వాత ఒకటో తరగతి నుంచి మొదలుపెట్టి, ఒక్కో ఏడాది ఒక్కో తరగతిలో ఐబీ సిలబస్ ప్రారంభించి, ఆ పిల్లలు 10వ తరగతి చేరే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.

? రాజ్‌దీప్: ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్నది కదా? అందుకు తగిన నిధులు ఉన్నాయా?

■ **సీఎం జగన్:** ఇది ప్రభుత్వ ప్రాజెక్టు, మా లక్ష్యం ఏమిటన్నది ఐబీకి కూడా స్పష్టంగా తెలుసు. అందుకే వారు మాతో భాగస్వామ్యం అవుతున్నారు. అందుకే వారు వ్యాపార ధోరణితో కాకుండా, మా లక్ష్య సాధనలో మాతో కలిసి పని చేస్తున్నారు. ఆ మేరకే అవగాహనకు వచ్చాం. అందుకే ఖరీదైన స్కూళ్ల మాదిరిగా, మేము ఐబీకి రాయల్టీ వంటివి చెల్లించడం లేదు. నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా ఐబీ సిలబస్‌తో చదివి పోటీ ప్రపంచంలో దీటుగా నిలబడాలన్న మా ప్రభుత్వ లక్ష్య సాధనలో, ఐబీ కూడా పూర్తి భాగస్వామి అవుతోంది. ఇక నిధులకు సంబంధించి చూస్తే.. ఇప్పటికే స్కూళ్లలో పూర్తి మౌలిక సదుపాయాల కల్పన మొదలైంది. మొత్తం రూ.14 వేల కోట్ల అంచనాతో మొదలు పెట్టిన ఈ కార్యక్రమంలో ఇప్పటికే రూ.8,300 కోట్లు ఖర్చు చేశాం. రాష్ట్రంలో 44 వేల స్కూళ్లు ఉండగా, నాడు–నేడు తొలి దశలో ఇప్పటికే 15,575 స్కూళ్లలో పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించాం. నాడు–నేడు రెండో దశలో 16 వేలకు పైగా స్కూళ్లలో పనులు సాగుతున్నాయి. వచ్చే మార్చి నాటికి ఆ పనులు పూర్తవుతాయి. దీంతో రాష్ట్రంలో రెండో వంతు స్కూళ్లలో పూర్తి మౌలిక వసతులు ఏర్పడతాయి. మిగిలిన స్కూళ్లలో వచ్చే ఏడాదిలో పనులు చేపట్టి పూర్తి చేస్తాం.

? రాజ్‌దీప్: తమిళనాడులో పిల్లలకు మ్యాంగో షేక్ ఇస్తున్నారు. ఇక్కడ మీరు వారంలో రోజుకో మెనూతో పథకం అమలు చేస్తున్నామంటున్నారు. ఇది నిజమా? మా రిపోర్టర్లు స్కూళ్లకు వెళ్లి చెక్ చేయొచ్చా?

■ **సీఎం జగన్:** నిరభ్యంతరంగా వెళ్లొచ్చు. ఎక్కడికైనా వెళ్లి చూడొచ్చు. గోరుముద్దలో ఏమేం ఇస్తున్నామో చూడొచ్చు. పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను కూడా ప్రోత్సహిస్తున్నాం. నీటి సదుపాయంతో కూడిన టాయిలెట్స్, 6వ తరగతి నుంచి క్లాస్‌రూమ్‌లో ఐఎఫ్‌పీ ప్యానెల్స్, పిల్లలకు పరిశుభ్రమైన మంచినీరు, స్కూళ్లకు అవసరమైన మరమ్మతులు, పెయింటింగ్.. ఇలా 10 రకాల మార్పులు చేస్తున్నాం.

? రాజ్‌దీప్: విద్య అనేది ఉద్యోగ, ఉపాధి కల్పన దిశలో ఉండాలనేది కూడా ఒక సవాల్. ఈ పరిస్థితిని మీరెలా మార్చగలుగుతారు?

■ **సీఎం జగన్:** రాష్ట్రంలో మా ఫోకస్ కేవలం స్కూళ్ల మీదనే కాదు.. ఉన్నత విద్యా రంగంలో కూడా చాలా మార్పులు చేశాం. ఉద్యోగ, ఉపాధి కల్పన దిశగా కరికులమ్‌లో మార్పులు చేశాం. మూడేళ్ల డిగ్రీ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేశాం. వేసవి సెలవులు కూడా ఉపయోగించుకుని, ఇంటర్న్‌షిప్ చేసేలా అవకాశం కల్పిస్తున్నాం. అన్ని డిగ్రీ కోర్సులను ఆనర్స్‌గా మార్చి, నాలుగేళ్లు చేస్తున్నాం. కరిక్యులమ్‌లో భాగంగా ఆన్‌లైన్ వర్టికల్స్ ప్రారంభిస్తున్నాం. ఇంటర్న్‌షిప్, కరిక్యులమ్‌లో మార్పులు.. మా లక్ష్య సాధనకు మార్గం వేస్తున్నాయి. ఎడెక్స్‌తో కూడా వచ్చే నెలలో ఒప్పందం చేసుకోబోతున్నాం. మనకు 1,800 సబ్జెక్ట్స్ ఉన్నాయి. ఈ కోర్సులు అందించడం కోసం ఎడెక్స్‌తో ఒప్పందం చేసుకోబోతున్నాం. కరిక్యులమ్‌ను కూడా మారుస్తున్నాం. హార్వర్డ్, ఎల్లెస్సీ వంటి ప్రీమియమ్ సంస్థలను ఎడెక్స్ ద్వారా కోర్సులను ఆన్‌లైన్‌లో ఆఫర్ చేసేలా చర్యలు చేపడుతున్నాం.

? రాజ్‌దీప్: ఇది రాష్ట్రంలో ప్రతిచోటా అమలవుతోందా?

■ **సీఎం జగన్:** ఇక్కడ మానిటరింగ్ వ్యవస్థ పక్కాగా ఉంది. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు మాత్రమే కాకుండా.. నా స్థాయిలో నేను కూడా స్వయంగా ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తున్నాను. సీఎం స్థాయిలో ఈ ప్రక్రియలో పాలుపంచుకుని, పనిచేస్తున్నప్పుడు.. మిగిలిన యంత్రాంగం కూడా ఎలా పనిచేస్తుందో తెలుసు కదా?

? రాజ్‌దీప్: దానికి సంబంధించి ఉదాహరణ చెప్పగలరా?

■ **సీఎం జగన్:** ఉదాహరణకు.. బీకామ్ కోర్సు తీసుకోండి. ఆ కోర్సు విద్యార్థులు కూడా ఎసెట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలు నేర్చుకునే విధంగా అవకాశం కల్పిస్తున్నాం. అవన్నీ పాఠ్య ప్రణాళికలో భాగం చేస్తున్నాం. పశ్చిమ దేశాల్లో మాత్రమే కనిపించే అంశాలను, ఇక్కడ కరికులమ్‌లో చేరుస్తూ.. పిల్లలను ఆ స్థాయిలో తీర్చిదిద్దే చర్యలు చేపడుతున్నాం. ఎడెక్స్ ఒప్పందం ద్వారా ఆన్‌లైన్ విద్యా బోధన ద్వారా.. ప్రతిష్టాత్మకమైన ఎల్లెసీ, హార్వర్డ్ సంస్థలు.. సర్టిఫికెట్ ఇస్తాయి. ఇది మా పిల్లలకు ఎంతో ప్రయోజనకారిగా నిలుస్తుంది.

? రాజ్‌దీప్: ఇక్కడ సీఎం జగన్ అక్షరాస్యత వృద్ధి, విద్యా రంగ అభివృద్ధి కోసం ఎంతో చేస్తున్నారు. అలాగే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ గవర్నమెంట్ స్కూళ్లను అభివృద్ధి చేశారు. ఇవన్నీ మిమ్మల్ని ఎన్నికల్లో మళ్లీ గెలిపిస్తాయని అనుకుంటున్నారా?

■ **సీఎం జగన్:** రాజకీయాలు వేరు. పిల్లలు, విద్యార్థులు ఓటర్లు కారు కాబట్టి, వారి గురించి ఎవరూ పట్టించుకోరు. ఇది దురదృష్టకరం. అయితే పిల్లలు మంచి విద్యావంతులైతేనే, వారికి నాణ్యతతో కూడిన విద్యను అందిస్తేనే.. సమాజంలో పేదరికం పోతుంది. పిల్లలకు ప్రాథమిక స్థాయి నుంచే అత్యున్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తే.. వచ్చే 10, 15 ఏళ్లలో వారు ఎంతో వృద్ధి చెందుతారు. పోటీ ప్రపంచంలో ధైర్యంగా నిలబడగలరు. తద్వారా సమాజం కూడా మారుతుంది.

రాజ్‌దీప్: మీ స్పష్టమైన విజన్‌ను అందరూ అభినందించాల్సిందే. మీ విజన్ సఫలమైతే విద్యా రంగంలో మీరు ఆంధ్రా మోడల్‌ను ఆవిష్కరించిన వారవుతారు. (అందరూ చప్పట్లతో అభినందించారు)

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం..

- 'వైఎస్సార్ ఆసరా' కింద అక్కచెల్లెమ్మల బ్యాంక్ ఖాతాల్లో రూ.25,570 కోట్ల జమ
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: మన ప్రభుత్వంలో వైఎస్సార్ ఆసరా పథకం చివరి విడత నగదును పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేసి, వారికి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా రూ.25,570 కోట్లను అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమచేశాం. ప్రతి కుటుంబంలోనూ ఆధునిక భారతీయ మహిళ ఆవిర్భవించాలనే లక్ష్యంతో మన ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దేశంలో మరే రాష్ట్రంలో లేని విధంగా మహిళా సాధికారత, మహిళా సంక్షేమం కోసం అర్థతే ప్రామాణికంగా మన ప్రభుత్వం ప్రతి పథకాన్నీ అమలు చేస్తోందని చెప్పేందుకు గర్వపడుతున్నాను' అంటూ బుధవారం సీఎం జగన్ ట్వీట్ చేశారు.

ఏపీలో విద్యా ప్రమాణాలు భేష్

- వివిధ రాష్ట్రాల విద్యా శాఖాధికారుల ప్రశంస
- ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతుల కల్పనపై అభినందనలు



తరగతి గదిలో విద్యా బోధనను పరిశీలిస్తున్న వివిధ రాష్ట్రాల విద్యాశాఖాధికారులు

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య అందుతుండటం రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి నిదర్శనమని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యాశాఖాధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ఆధునిక విద్యాబోధన, మౌలిక వసతుల కల్పనను పరిశీలించేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యాశాఖాధికారులు తిరుపతి వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం వీరందరూ ఎస్వీజేఎస్ఎం నగరపాలక ఉన్నత పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న ఆధునిక విద్యాబోధన, డిజిటల్ బోర్డులు, ట్యాబ్ ద్వారా విద్యా బోధన, తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో సిస్టమ్, రన్నింగ్ వాటర్‌తో కూడిన టాయిలెట్లు, పాఠశాల ఆవరణలోని ఆహ్లాదకర వాతావరణం తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నాడు–నేడు ద్వారా తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల ద్వారా విద్యార్థుల్లో పెరిగిన విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలను వారికి ప్రిన్సిపల్ సెక్రటరీ, నగరపాలక సంస్థ కమిషనర్ హరితలు వివరించారు. పాఠశాల నోటీసు బోర్డులో ఏర్పాటు చేసిన యూనిఫాం, బూట్లు, నోటు, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీ, జగనన్న విద్యా కానుక కిట్‌ను పరిశీలించి ప్రశంసించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యే కాకుండా ఆధునికతతో కూడిన మౌలిక వసతుల కల్పనపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

విదేశీ విద్యా దీవెన సమాచార బుక్‌లెట్ ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు యునైటెడ్ నేషన్స్ లక్ష్యాలకు చేరువలో ఉన్నాయని ఐక్యరాజ్య సమితి స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ ఉన్నవ షకిన్ కుమార్ చెప్పారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విద్యా సంస్కరణలు, జగనన్న విదేశీ విద్యాదీవెన పథకంపై షకిన్ కుమార్ రూపొందించిన సమగ్ర సమాచార బుక్‌లెట్‌ను బుధవారం తిరుపతిలో జరిగిన ఇండియా టుడే ఎడ్యుకేషన్ సదస్సులో సీఎం వైఎస్ జగన్ ఆవిష్కరించారు. గత సెప్టెంబర్‌లో పది మంది పేద విద్యార్థులను ఐక్యరాజ్యసమితికి తీసుకువెళ్లడంపై షకిన్ కుమార్‌ను సీఎం జగన్ అభినందించారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని షకిన్ పేర్కొన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం, అర్హతలు, దరఖాస్తు విధానం, అందించే కోర్సులు, డాక్యుమెంట్స్ చెక్‌లిస్ట్, అప్లికేషన్ స్టేటస్ చెకింగ్, అక్రిడేషన్, యూనివర్సిటీల జాబితా వంటి సమస్త సమాచారం ఈ పుస్తకంలో పొందుపరిచినట్టు వివరించారు. ఈ పథకం పేద, ప్రతిభావంతమైన విద్యార్థులకు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు రూ.కోటిన్నరకు పైగా స్కాలర్‌షిప్ రూపంలో ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని చెప్పారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం జగన్, రూపకర్త షకిన్ కుమార్

వీధి వ్యాపారులకు సాయంలో ఏపీ భేష్

కేంద్ర పథకాల అమలులో దేశంలోనే మొదటి స్థానంలో ఏపీ

సాక్షి, అమరావతి: పట్టణాల్లోని వీధి వ్యాపారులను గుర్తించడంలోను, వారికి సాయం అందించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం విజయం సాధించింది. దేశంలోనే వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులను అందించి, వారికి పీఎం స్వనిధి సాయాన్ని నూరు శాతం అందించడంలో ఏపీ ముందు నిలిచింది. ఏపీ పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలోని సిబ్బంది 110 పట్టణ ప్రాంతాల్లో సర్వే చేసి 3,21,449 మంది వీధి వ్యాపారులను గుర్తించడమే కాకుండా, వారందరికీ గుర్తింపు కార్డులను సైతం అందించారు. పీఎం స్వనిధి కింద రూ.10 వేల చొప్పున వారందరికీ అందించడంతో పాటు, స్వనిధి రుణాలు అందించడంలో మెప్మా రికార్డు సృష్టించింది. లబ్ధిదారులకు పీఎం స్వనిధి కింద మొదటి విడతగా రూ. 10 వేలు తీసుకుని 11 నెలల్లో తిరిగి చెల్లించాలి. గడువులోగా రుణం చెల్లించిన వారికి రెండో విడతగా రూ. 20 వేలు అందిస్తారు. ఈ మొత్తాన్ని 26 నెలల్లో వాయిదాలుగా చెల్లించాలి. తర్వాత మూడో విడతగా రూ. 50 వేలు తీసుకోవచ్చు. రాష్ట్రంలో రెండో విడతలో 92,850 మంది, మూడో విడతలో 13,333 మందికి రుణాలు అందించడం గమనార్హం. ఇటీవల మెప్మా మరో అడుగు ముందుకేసి స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్స్‌లో కూడా స్ట్రీట్ ఫుడ్‌ను ప్రోత్సహించి, వీధి వ్యాపారులు ఆర్థికంగా బలపడేందుకు తోడ్పాటునందించింది. ఈ విభాగంలో 320 మంది వీధి వ్యాపారులు చేరడంతో పాటు ప్రతినెలా రూ.10 లక్షల వ్యాపారం చేయడం గమనార్హం. పట్టణాల్లోని నిరుపేద వీధి వ్యాపారుల కుటుంబాలకు కేంద్రం అందిస్తున్న పథకాలను అందించడంలోనూ ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉండటం విశేషం.

అత్యధిక పథకాల అమలు ఇక్కడే..

గుర్తింపు కార్డులు పొందిన పీఎం స్వనిధి రుణాలు అందించడంతో పాటు కుటుంబీకుల్లో ఇతర పనులు చేసుకునేవారి కోసం కేంద్రం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అందించడంలోనూ దేశంలోనే ఏపీ ముందుంది. మాతృవందనం, జనని సురక్ష, నిర్మాణ రంగ కార్మికుల రిజిస్ట్రేషన్, పీఎం శ్రమయోగి మన్‌ధన్ యోజన, వన్ నేషన్ వన్ రేషన్ కార్డు, పీఎం జన్‌ధన్ యోజన, జీవన జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన కోసం 10,36,625 మందిని మెప్మా గుర్తించి 8,34,803 మందికి పథకాలను అందించారు.

'ఆసరా'.. నవ్వే మనసారా

రాష్ట్రవ్యాప్తంగా ఆసరా సంబరాలు బుధవారం అంబరాన్నంటాయి. అక్కచెల్లెళ్ల మోముల్లో నవ్వుల సిరులు కురిశాయి. పలు చోట్ల ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు చెక్కులను అట్టహాసంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కచెల్లెమ్మలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. సంక్షేమ రేడుకు మనసారా కృతజ్ఞతలు చెప్పారు. కర్నూలు జిల్లా పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో మహిళలు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



కర్నూలు జిల్లా మద్దికెర డీపీఏపీ కమ్యూనిటీ హాలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి, మహిళలు

పాన్ షాపు పెట్టుకున్నా



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలను పూర్తిగా మాఫీ చేశారు. మహిళలకు ఆర్థిక ఆసరా కల్పించారు. నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.30 వేలు వచ్చింది. సున్నా వడ్డీ ద్వారా మరో రూ.50 వేలు రుణం మంజూరైంది. ఈ సొమ్ముతో ఊరిలో పాన్‌షాపు పెట్టుకున్నా. జీవనానికి ఇబ్బంది లేదు. పేదలకు ఆర్థిక భరోసా కల్పించిన ప్రభుత్వానికి అండగా నిలుస్తాం.

– జనని, డ్వాక్రా మహిళ, బుదతనాపల్లి గ్రామం, విజయనగరం జిల్లా

మా గ్రూపునకు రూ.8 లక్షలు మాఫీ అయింది



వైఎస్సార్ ఆసరా ద్వారా మా సంఘానికి ఉన్న రూ.8 లక్షల అప్పు మొత్తం తీరిపోయింది. ఒక్కో సభ్యురాలికి రూ.80 వేల వరకు లబ్ధి కలిగింది. రుణమాఫీ, సున్నా వడ్డీ, స్త్రీనిధి, ఉన్నతి తదితర పథకాలతో మహిళలకు ఎంతో మేలు చేశారు. జగనన్నకే మా మద్దతు ఉంటుంది.

– వెంకటరమణమ్మ, ప్రశాంతి గ్రామం, శ్రీసత్యసాయి జిల్లా

అంచెలంచెలుగా ఎదిగారు



ఈ చిత్రంలో ఉన్న ఈమె పేరు వమరవల్లి దుర్గ. ఊరు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నియోజకవర్గం పోలాకి గ్రామం. స్వయం శక్తి సంఘం గ్రూపు లీడర్‌గా ఉన్నారు. ఈమె గ్రూపునకు ఆసరా ద్వారా రూ.4.80 లక్షలు మాఫీ వర్తించింది. ఒక్కో సభ్యురాలికి ఒక్కో విడతలో రూ.12 వేలు మాఫీ నిధులు వచ్చాయి. ఏటా వచ్చే ఈ నిధులను వ్యాపారానికి వెచ్చించి దుర్గ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. మొదట్లో టీ షాపు పెట్టారు. రెండోసారి నిధులతో బడ్డీకొట్టు పెట్టారు. మూడో సారి నిధులతో ఫినాయిల్ తయారు చేయడం నేర్చుకుని అమ్మకాలు చేస్తున్నారు. ఇప్పుడు వచ్చే రూ.12 వేలతో జిరాక్స్ మిషన్ కొని వ్యాపారం అభివృద్ధి చేసుకుందామని భావిస్తున్నారు.

ఆసరా 'భాగ్య'మయ్యే



ఈమె పేరు బట్టా భాగ్యలక్ష్మి. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన ఈమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిరుపేద కుటుంబం. భార్యాభర్తలిద్దరూ కూలి పనులకు వెళ్తూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించుకుంటున్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా ఇప్పటి వరకు రూ.2,46,507 వచ్చింది. దీంతో కూరగాయల వ్యాపారం ప్రారంభించి కూలి పనులకు వెళ్లే బాధల నుంచి విముక్తి పొందారు.

కా'పాడి'న జగనన్న



ఈమె పేరు పి.ముత్యాలక్ష్మి. సూళ్లూరుపేట పట్టణంలోని వట్రపాళెం సమాఖ్య గ్రూపులో సభ్యురాలిగా ఉన్నారు. ఈమెకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రూ.3,15,128 ఇప్పటి వరకు వచ్చాయి. ఈ డబ్బులతో మూడు గేదెలను కొనుక్కుని వాటి ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గతంలో కూలి పనులకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ తిప్పలు తప్పాయి. ఇదంతా సీఎం జగన్ చలువ వల్లే సాధ్యమైందని ఆమె తెలిపారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



మాది పూజిత పొదుపు సంఘం. మా సంఘంలో 13 మంది సభ్యులు ఉన్నారు. వైఎస్సార్ ఆసరా ద్వారా ఒక్కొక్క సభ్యురాలికి రూ.18 వేలు వచ్చింది. ఇప్పటికే గతంలో ప్రభుత్వం జమచేసిన రూ.80 వేల నగదుతో ఇంటి వద్ద చిల్లర దుకాణం పెట్టుకున్నా. ఇప్పుడు జమచేసిన నగదుతో మరిన్ని సరుకులు తెచ్చుకుని విక్రయించి కుటుంబ ఆదాయాన్ని పెంచుకునేందుకు దోహదపడుతుంది. సీఎం వైఎస్ జగనన్నకు, ఈ ప్రభుత్వానికి మా కుటుంబం జీవితాంతం రుణపడి ఉంటుంది.

– మాధవి, వికృతమాల, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా

30న ఏలూరులో ఎన్నికల సన్నాహక సభ

- చంద్రబాబు ట్రాప్‌లో షర్మిల పడ్డారు
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి



మాట్లాడుతున్న మిథున్‌రెడ్డి

ఏలూరు టౌన్: ఏలూరులో ఈ నెల 30న మధ్యాహ్నం 2 గంటలకు ఎన్నికల సన్నాహక సభను నిర్వహించనున్నామని, ఈ సభలో పార్టీ నేతలు, కార్యకర్తలకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి చెప్పారు. ఏలూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నానితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలకు సంబంధించి సన్నాహక సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సభను వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు విజయవంతం చేయాలని కోరారు. సీఎం జగన్ సోదరిగా షర్మిల అంటే తమకు గౌరవం ఉంది అని, అయితే, ఆమె చంద్రబాబు ట్రాప్‌లో పడ్డారని చెప్పారు. చంద్రబాబు ఏవిధంగా ప్రభుత్వాన్ని విమర్శలు చేస్తున్నారో ఆమె కూడా అదే లైన్‌లో ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆళ్ల నాని మాట్లాడుతూ ఎంత మంది కలిసి కుట్రలు చేసినా మళ్లీ విజయం సాధించి సీఎంగా జగన్ అధికారం చేపడతారని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సీఎం వైఎస్ జగన్ వెంటే ముస్లిం మైనార్టీలు

ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు షేక్ నాగూల్ మీరా

సాక్షి, అమరావతి: ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ముస్లిం మైనారిటీలను అభివృద్ధి చేసింది వైఎస్సార్‌సీపీ మాత్రమేనని యావత్ ముస్లిం సమాజం విశ్వసిస్తుందని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా తెలిపారు. ఆయన బుధవారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి నాలుగు శాతం రిజర్వేషన్లు ఇవ్వడం, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ప్రవేశపెట్టడం వల్ల ముస్లిం యువతలో వేలాది మంది నేడు పలు రంగాల్లో స్థిరపడి సామాజికంగా అభివృద్ధి చెందారన్నారు. అందుకే ఆ మహానేత వైఎస్సార్‌ని ముస్లిం సమాజం గుండెల్లో పెట్టుకుందని, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్ వెంట ఎప్పటికీ నడుస్తుందని స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో ముస్లింలకు ఐదు సీట్లు ఇచ్చి, నాలుగు ఎమ్మెల్సీ పదవులు ఇచ్చి, శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించి రుణం తీర్చుకోవాలని నాగుల్ మీరా కోరారు.

షర్మిలది రహస్య అజెండా

మంత్రి ఆదిమూలపు సురేష్



సింగరాయకొండ: ఏపీసీసీ ప్రెసిడెంట్ షర్మిల రహస్య అజెండాతో వస్తున్నారని, ప్రజలే ఆమెకు బుద్ధి చెబుతారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం-ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విశ్వసనీయతకు, క్రమశిక్షణకు వైఎస్ జగన్ ప్రభుత్వం మారు పేరని, అందుకే ప్రజలు ఆదరించారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ స్వార్థప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని విభజించిందని, రాష్ట్రంలో కాంగ్రెస్ ఉనికిని కాపాడటంతోపాటు రాష్ట్ర ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని స్థాపించుకున్న వైఎస్సార్‌పై అవినీతి ఆరోపణలు చేస్తూ ఆయన పేరును కుటిల బుద్ధితో ఎఫ్ఐఆర్‌లో చేర్చిన దుర్మార్గమైన పార్టీ కాంగ్రెస్ అని మంత్రి సురేష్ మండిపడ్డారు.

కాకినాడ జిల్లాలో నారా భువనేశ్వరి పర్యటన

పెద్దాపురం/తుని రూరల్/జగ్గంపేట: కాకినాడ జిల్లాలో చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం పర్యటించారు. చంద్రబాబు అరెస్ట్ సమయంలో మృతిచెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి చెక్కులను అందజేశారు. పెద్దాపురం మండలంలోని కాండ్రకోటలో బుద్దాల సుబ్బారావు (72), తుని మండలం ఎర్రకోనేరులో ఇసరపు నూకరాజు (53), జగ్గంపేట మండలం గుర్రంపాలేనికి చెందిన పడాల వీరబాబు కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, మాజీ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప తదితరులు ఉన్నారు.

భీమిలి నుంచి వైఎస్సార్‌సీపీ ఎన్నికల శంఖారావం

- 27న సంగివలసలో ఉత్తరాంధ్ర రీజియన్ సభ
- నాయకులకు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేయనున్న సీఎం జగన్
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి వెల్లడి



సీఐని అడిగి వివరాలు తెలుసుకుంటున్న వైవీ సుబ్బారెడ్డి, గుడివాడ అమర్‌నాథ్ తదితరులు

సాక్షి, విశాఖపట్నం/తగరపువలస(విశాఖ): వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజియన్ పరిధిలోని నాయకులు, ప్రజాప్రతినిధులను రానున్న ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ఈ నెల 27వ తేదీన భీమిలి నియోజకవర్గంలోని సంగివలసలో సభ నిర్వహించనున్నట్లు పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సభలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని నాయకులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేయడం ద్వారా భీమిలి నుంచి ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుడతారని వెల్లడించారు. సంగివలసలో జాతీయరహదారి పక్కన ఎంపిక చేసిన సభా స్థలాన్ని బుధవారం మధ్యాహ్నం మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి వైవీ సుబ్బారెడ్డి పరిశీలించారు. సభాస్థలం, పార్కింగ్, హెలీప్యాడ్ వద్ద ఏర్పాట్ల గురించి భీమిలి సీఐ డి.రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు మరోసారి తెలియజేసి వారిని ఉత్తేజితులను చేయడమే ఈ సభ ఉద్దేశమని చెప్పారు. ఈ సభలో ఉత్తరాంధ్రలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 5 వేలు చొప్పున 2లక్షల మంది వరకు ప్రజాప్రతినిధులు, గృహ సారథులకు స్థానం కల్పించనున్నట్లు తెలిపారు. ఇలాంటి సభలే రాష్ట్ర వ్యాప్తంగా మరో నాలుగుచోట్ల నిర్వహిస్తామన్నారు. సీఎం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, పెన్మత్స సురేష్, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, రీజనల్ యూత్ కో–ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ కె.వెంకటరెడ్డి, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు. తొలుత విశాఖ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, డీసీపీ శ్రీనివాస్, ఏడీసీపీ జాన్ మనోహర్, ఏసీపీ జి.శ్రీనివాసరావు, భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి, ట్రాఫిక్ సీఐ ఎస్.కాంతారావు సభా స్థలాన్ని పరిశీలించారు.

ఉత్తరాంధ్రలో అభివృద్ధి షర్మిలకు కనిపించడం లేదా?

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని షర్మిలకు చూపించడానికి మంత్రులు, తాను సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఆయన బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాట్లాడుతూ 'ఉత్తరాంధ్రలో పర్యటించిన షర్మిలకు వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి కనిపించలేదా? ఉద్దానంలో రూ.700 కోట్లతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించిందెవరో తెలియదా? అక్కడ రూ.85 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేసింది సీఎం జగన్ కాదా?' అని ప్రశ్నించారు. 14 ఏళ్ల పాటు సీఎంగా చేసిన చంద్రబాబు పరిష్కరించలేని ఎన్నో సమస్యలకు సీఎం జగన్ పరిష్కారం చూపించారని చెప్పారు. ఏదైనా రాజ్యాంగ బద్ధమైన పదవికి రాజీనామా చేసే ముందు ఆలోచన చేయాలే తప్ప మీడియా ముందు ఆర్భాటాలకు పోయి నటన చేయకూడదని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు వైవీ సుబ్బారెడ్డి హితవు పలికారు. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేసి ఇప్పుడు గగ్గోలు పెడితే ఎలా..? అని గంటాను ఆయన ప్రశ్నించారు.

తగ్గిన పేదరికం కనిపించట్లేదా?

- సీఎం జగన్ పాలనకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారు
- మీరేమో వైఎస్సార్ కుటుంబాన్ని వేధించిన కాంగ్రెస్‌తో కలిశారు
- చంద్రబాబు కోసం సొంత అన్నపైనే విమర్శలు చేస్తున్నారు
- షర్మిలపై మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ధ్వజం



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: 'రాష్ట్ర ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ పాలనకు నీరాజనాలు పడుతుంటే.. మీరు మాత్రం వైఎస్సార్ కుటుంబాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన కాంగ్రెస్ పార్టీతో చేయి కలిపి అన్నను సైతం వ్యంగ్యంగా మాట్లాడతారా?' అని షర్మిలను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రశ్నించారు. రాష్ట్రంలో తగ్గిన పేదరికం మీకు కనిపించడం లేదా? అని నిలదీశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో బుధవారం క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన పాస్టర్ల సత్కార సభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథాన పయనిస్తోందన్నారు. టీడీపీ హయాంలో 11 శాతంగా ఉన్న పేదరికం సీఎం జగన్ పాలనలో 6 శాతానికి తగ్గిందని వివరించారు. జీడీపీలో టాప్‌లో ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలో చదువుల విప్లవం వచ్చిందని.. నాడు–నేడు ద్వారా స్కూళ్ల రూపురేఖలు మారిపోయాయని.. ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఇలా ప్రతి రంగంలోనూ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కానీ ఇవేమీ చూడకుండా.. చంద్రబాబుకు మద్దతుగా షర్మిల తన సొంత అన్నపై కూడా విమర్శలు చేస్తున్నారంటే వైఎస్సార్ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి విమలారెడ్డికి విశాఖ రుషికొండలో భూములు కేటాయించారంటూ ఎల్లో మీడియాలో వచ్చిన కథనాలను మంత్రి కారుమూరి ఖండించారు. అది నిజమని టీడీపీ నాయకులు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. సీఎం జగన్‌కు వెన్నంటి ఉంటున్న వారందరినీ టార్గెట్ చేస్తూ టీడీపీ నాయకుల డైరెక్షన్‌లో ఎల్లో మీడియా తప్పుడు కథనాలు రాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాస్టర్లను మంత్రి కారుమూరి ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సోదరి డాక్టర్ విమలారెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

షర్మిలా.. మీకిది తగదు

1,214వ రోజు రిలే దీక్షల్లో బహుజన నేతల హితవు



రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: అమరావతి పేరిట గ్రాఫిక్స్ మాయాజాలంతో మోసం చేసిన చంద్రబాబును ప్రశ్నించకుండా.. పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంపై నిందలు వేయడం తగదని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు బహుజన పరిరక్షణ సమితి నాయకులు హితవు పలికారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం 1,214వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ మూడేళ్లకు పైగా పక్క రాష్ట్రంలో రాజకీయాలు చేసి.. పార్టీని కాంగ్రెస్‌కు తాకట్టు పెట్టి రాత్రికి రాత్రి ఏపీ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన షర్మిలకు ఇక్కడ పరిస్థితులపై ఏం అవగాహన ఉంటుందని ప్రశ్నించారు. ఎల్లో మీడియాలో చిలువలు పలువలుగా రాస్తున్నారని చెప్పి.. ఏది పడితే అది మాట్లాడడం తగదని చెప్పారు. వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి సాధ్యమని నిపుణుల కమిటీలు ఇచ్చిన నివేదికల ఆధారంగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకుని ముందుకెళుతున్నారని వివరించారు. ఏపీలో అధికారం కోసం కులవాద, ప్యాకేజీ పార్టీలన్నీ ఏకమై ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఆ కుట్రలను, కుతంత్రాలను తిప్పికొట్టడానికి బహుజనులు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో కుమ్మక్కు రాజకీయాలు: షర్మిల

దాబాగార్డెన్స్/తుమ్మపాల: ఏపీలో కుమ్మక్కు రాజకీయాలు నడుస్తున్నాయని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. బీజేపీతో టీడీపీ, వైఎస్సార్‌సీపీ కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. విశాఖ, అనకాపల్లిలలో బుధవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాల్లో ఆమె మాట్లాడారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయిన వెంటనే ఏపీకి ప్రత్యేక హోదా పైన తొలి సంతకం చేస్తారని చెప్పారు. ఉత్తరాంధ్రను టీడీపీ, వైఎస్సార్‌సీపీ మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. తనకు ఎంపీలను ఇస్తే ప్రత్యేక హోదా తెస్తానని గతంలో వైఎస్ జగన్ చెప్పారని, తీరా అధికారం వచ్చిన తరువాత ఒక్క రోజు కూడా ఉద్యమం చేయలేదని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఓ కుట్రగా అభివర్ణించారు. వైఎస్సార్ హయాంలో నష్టాల్లో ఉన్న కంపెనీలను కేంద్ర ప్రభుత్వ కంపెనీల్లో విలీనం చేశారని గుర్తుచేశారు. విశాఖకు రైల్వే జోన్ మంజూరు చేసినా ఇంకా అమలు కాలేదని, మెట్రో రైల్ ప్రాజెక్ట్ పత్తా లేదని అన్నారు. ఆంధ్రాలో కనీసం లక్ష ఉద్యోగాలు కూడా లేవన్నారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు ఏది కావాలంటే అది జరిగేదని, అందుకే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, బీజేపీకి తొత్తులుగా ఉన్న టీడీపీ, వైఎస్సార్‌సీపీని ఓడించాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు ఎస్.రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.



నీకు నీ దారి ఉంది. నాకు నా దారి ఉంది.
సరైన దారి, కచ్చితమైన దారి, ఒకే ఒక్క దారి
అనేది మాత్రం ఉనికిలో లేదు.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి

గురువారం, 25 జనవరి 2024

కనువిప్పు కలిగించే కోత!

కెనడాతో మరో తంటా వచ్చి పడింది. సెప్టెంబర్‌లో మొదలయ్యే కొత్త విద్యా సంవత్సరం నుంచి విదేశీ విద్యార్థులకు ఇచ్చే స్టూడెంట్ పర్మిట్లపై రెండేళ్ళ పాటు పరిమితులు విధిస్తున్నట్టు ఆ దేశం సోమవారం ప్రకటించింది. వీసాల సంఖ్య తగ్గిందంటే, కాలేజీ డిగ్రీ కోసం అక్కడకు వెళ్ళే భారతీయ విద్యార్థుల సంఖ్య కూడా తగ్గనుందన్న మాట. ఈ వీసాల కోత అన్ని దేశాలకూ వర్తించేదే అయినా, మనవాళ్ళ విదేశీ విద్యకు కెనడా ఓ ప్రధాన కేంద్రం కావడంతో భారతీయ విద్యార్థి లోకం ఒక్క సారిగా ఉలిక్కిపడింది. కెనడా గడ్డపై ఓ ఖలిస్తానీ తీవ్రవాది హత్య వెనుక భారత్ హస్తం ఉందంటూ ఆ దేశం చేసిన ఆరోపణలతో ఇప్పటికే భారత – కెనడా దౌత్య సంబంధాలు చిక్కుల్లో పడ్డాయి. ఆ కథ కొలిక్కి రాకముందే, విదేశీ స్టూడెంట్ వీసాలకు కెనడా చెక్ పెట్టడం ఇంకో కుదుపు రేపింది.

ఇటీవల కెనడాకు వెళ్ళి చదువుకొంటున్న అంతర్జాతీయ విద్యార్థుల్లో అతి పెద్ద వర్గాలలో ఒకటి భారతీయ విద్యార్థి వర్గం. 2022లో 2.25 లక్షల పైచిలుకు మంది మన పిల్లలు అక్కడకు చదువులకు వెళ్ళారు. వివరంగా చెప్పాలంటే, ఆ ఏడాది కెనడా ఇచ్చిన మొత్తం స్టడీ పర్మిట్లలో 41 శాతానికి పైగా భారతీయ విద్యార్థులకే దక్కాయి. ఇక, 2023 సెప్టెంబర్ నాటి కెనడా సర్కార్ గణాంకాల ప్రకారం అక్కడ చదువుకు అనుమతి పొందిన అంతర్జాతీయ విద్యార్థుల్లో 40 శాతం మంది భారతీయులే. 12 శాతంతో చైనీయులు రెండో స్థానంలో ఉన్నారు. తీరా ఇప్పుడీ కొత్త నిబంధనలు అలా కెనడాకు వెళ్ళి చదవాలనుకుంటున్న వారికి అశనిపాతమే. వారంతా ఇతర దేశాల వంక చూడాల్సిన పరిస్థితి.

2023లో కెనడా 10 లక్షలకు పైగా స్టడీ పర్మిట్లిచ్చింది. దశాబ్ది క్రితంతో పోలిస్తే ఇది 3 రెట్లు ఎక్కువ. తాజా ప్రతిపాదనతో ఈ ఏడాది ఆ పర్మిట్ల సంఖ్య 3.64 లక్షలకు తగ్గనుంది. అంటే, 35 శాతం కోత పడుతుంది. విదేశీ విద్యార్థుల స్టడీ పర్మిట్లపై పరిమితి ప్రధానంగా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకే వర్తిస్తుంది. గ్రాడ్యుయేట్, మాస్టర్స్ డిగ్రీలు, పీహెచ్‌డీలకు ఇది వర్తించకపోవడం ఊరట. అయితే, పోస్ట్ గ్రాడ్యుయేట్ వర్క్ పర్మిట్లకు షరతులు వర్తిస్తాయి. గతంలో కెనడాలో పీహెచ్‌డీ, మాస్టర్స్ కోర్సులు చేస్తుంటే మూడేళ్ళ వర్క్ పర్మిట్ దక్కేది. ఆ దేశంలో శాశ్వత నివాసం సంపాదించడానికి ఈ పర్మిట్లు దగ్గరి దోవ. ప్రధానంగా పంజాబీలు కెనడాలో చదువుతూనే, లేదంటే తాత్కాలిక ఉద్యోగాల్లో చేరుతూనే జీవిత భాగస్వామిని వీసాపై రప్పిస్తుంటారు. ఇక ఆ వీలుండదు.

స్టడీ పర్మిట్లలో కోతతో విదేశీ విద్యార్థులకే కాదు... కెనడాకూ దెబ్బ తగలనుంది. పెద్దయెత్తున విదేశీ విద్యార్థుల్ని ఆకర్షించడానికి కెనడాలోని పలు విద్యాసంస్థలు తమ ప్రాంగణాలను విస్తరించాయి. తాజా పరిమితితో వాటికి ఎదురుదెబ్బ తగలనుంది. అంతర్జాతీయ విద్యార్థుల వల్ల కెనడా ఆర్థిక వ్యవస్థకు ఏటా 1640 కోట్ల డాలర్ల మేర ఆదాయం వస్తోంది. కోతలతో ఇప్పుడు దానికి గండి పడనుంది. అలాగే, జీవన వ్యయం భరించగలమంటూ ప్రతి విదేశీ విద్యార్థీ 20 వేల కెనడా డాలర్ల విలువైన 'గ్యారెంటీడ్ ఇన్వెస్ట్‌మెంట్ సర్టిఫికెట్' (జీఐసీ) తీసుకోవడం తప్పనిసరి. అలా కొత్త విద్యార్థుల వల్ల కెనడా బ్యాంకులు సైతం ఇంతకాలం లాభపడ్డాయి. తాజా నిబంధనలతో వాటికీ నష్టమే. అలాగే, దాదాపు లక్ష ఖాళీలతో కెనడాలో శ్రామికశక్తి కొరత ఉంది. విదేశీ విద్యార్థులు ఆ లోటును కొంత భర్తీ చేస్తూ వచ్చారు. గడచిన 2023లో ఒక్క ఆహారసేవల రంగంలో 11 లక్షల మంది కార్మికులుంటే, వారిలో 4.6 శాతం మంది ఈ అంతర్జాతీయ విద్యార్థులే. ఆ లెక్కలన్నీ ఇక మారిపోతాయి. శ్రామికశక్తి కొరత పెరుగుతుంది. అయినా, కెనడా ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నట్టు?

కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీసుకున్న ఈ కోత నిర్ణయం వెనుక అనివార్యతలు అనేకం. చదువు పూర్తి చేసుకొని, అక్కడే వర్క్ పర్మిట్లతో జీవనోపాధి సంపాదించడం సులభం గనక విదేశీ విద్యకు కెనడా పాపులర్ గమ్యస్థానం. అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య పెరిగేసరికి, అద్దెకు అపార్ట్‌మెంట్లు దొరకని పరిస్థితి. నిరుడు కెనడా వ్యాప్తంగా అద్దెలు 7.7 శాతం పెరిగాయి. గృహవసతి సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. దాంతో ట్రూడో సర్కారుపై ఒత్తిడి పెరిగింది. విదేశీయుల వలసల్ని అతిగా అనుమతించడమే ఈ సంక్షోభానికి కారణమని కెనడా జాతీయుల భావన. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనుండడంతో ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీకి ఇది లాభించింది. పైగా, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ట్రూడో ఓటమి పాలవుతారని ప్రజాభిప్రాయ సేకరణల మాట. ఈ పరిస్థితుల్లో స్వదేశీయుల్ని సమాధానపరిచి, వలస జీవుల అడ్డుకట్టకై ట్రూడో సర్కార్ ఈ వీసాల కోతను ఆశ్రయించింది. విద్యార్థుల సంఖ్యను వాటంగా చేసుకొని, కొన్ని సంస్థలు కోర్సుల నాణ్యతలో రాజీ పడుతున్న వైనానికి అడ్డుకట్ట వేసేందుకు ఈ చర్య చేపట్టామని కెనడా మాట.

తాజా పరిణామం భారత్‌కు కనువిప్పు. కెనడాలో పలు ప్రైవేట్ సంస్థలు ట్యూషన్ ఫీజులేమో భారీగా వసూలు చేస్తూ, నాణ్యత లేని చదువులు అందిస్తున్నాయి. అయినా భారతీయ విద్యార్థులు కెనడాకో, మరో విదేశానికో వెళ్ళి, ఎంత ఖర్చయినా పెట్టి కోర్సులు చేసి, అక్కడే స్థిరపడాలనుకుంటున్నారంటే తప్పు ఎక్కడున్నట్టు? మన దేశంలో ఉపాధి అవకాశాలు ఏ మేరకు ఉన్నట్టు? ఇది పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన విషయం. 2025 నాటికి భారతీయ కుటుంబాలు పిల్లల విదేశీ చదువులకై ఏటా 7 వేల కోట్ల డాలర్లు ఖర్చుచేస్తాయని అంచనా. చిన్న పట్నాలు, బస్తీల నుంచీ విదేశీ విద్య, నివాసంపై మోజు పెరుగుతుండడం గమనార్హం. నాణ్యమైన ఉన్నత విద్య, ఉపాధి కల్పనలో మన ప్రభుత్వాల వైఫల్యాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. ఈ వాస్తవాలు గ్రహించి, ఇప్పటికైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. లేదంటే, అమెరికాలో ఉద్యోగాలకు, కెనడాలో వీసాలకు కోత పడినప్పుడల్లా దిక్కుతోచని మనవాళ్ళు మరో దేశం దిక్కు చూడాల్సిన ఖర్మ తప్పదు!

దౌత్య సంబంధాల్లో సహనం ముఖ్యం

సందర్భం



శ్యామ్ శరణ్

మాల్దీవుల్లోని ప్రస్తుత ప్రభుత్వం 'ఇండియా ఔట్' నినాదంతో గెలిచింది. భారత సైన్యాన్ని తమ దేశం నుంచి ఉపసంహరించుకోవాలని కోరింది. దీనికి తోడు లక్షదీవులు వర్సెస్ మాల్దీవుల సోషల్ మీడియా వివాదం చెలరేగింది. ఈ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో భారత్ వైఖరి ఎలా ఉండాలి? సోషల్ మీడియాకు ప్రతిస్పందనగా విదేశాంగ విధానం ఉండకూడదు. అభ్యంతరకరమైన ట్వీట్‌లకు కారణమైన ముగ్గురు మంత్రులను మాల్దీవుల ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయాన్ని మనం విస్మరించకూడదు. అలాగే మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ ఇండియాకు అనుకూలం. ఈ ముఖ్యమైన వర్గాన్ని చీకాకు పెట్టేలా భారతీయ కార్యకలాపాలు ఉండకూడదు. విదేశాంగ విధానం అనేది ఎప్పటికప్పుడు ముగిసిపోయేది కాదు. అది స్థిరంగా కొనసాగాలి.

2023 నవంబర్‌లో జరిగిన మాల్దీవుల అధ్యక్ష ఎన్నికల్లో పీపుల్స్ నేషనల్ కాంగ్రెస్ నాయకుడు మొహమ్మద్ ముయిజ్జు 'ఇండియా ఔట్' (భారత్ వెళ్లిపో) అనే ప్రజాకర్షక నినాదంతో గెలిచినప్పుడే భారత్–మాల్దీవుల సంబంధాలు మళ్లీ దెబ్బతింటాయని అందరూ భావించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే, తమ దేశం నుంచి భారత రక్షణ సిబ్బందిని ఉపసంహరించుకోవాలని ముయిజ్జు భారత్‌ను కోరారు. మాల్దీవులలోని వెయ్యికి పైగా ద్వీపాలు విస్తారమైన సముద్ర ప్రాంతంలో వ్యాపించి ఉన్నాయి. అక్కడి అతిపెద్ద ప్రత్యేక ఆర్థిక మండలి (ఈఈజెడ్) భద్రత, దీవుల్లో విపత్తు సహాయ కార్యకలాపాలపై నిఘా కోసం భారత్ బహుమతిగా ఇచ్చిన డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్, హెలికాప్టర్లను 75 మంది భారత సైనికులు నడుపుతున్నారు. మాల్దీవులు వ్యవస్థాపక సభ్యదేశంగా ఉన్న 'కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్'లో భాగంగా సముద్ర భద్రతను ప్రోత్సహించడానికి ఈ ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగానే దేశంలోని అతిపెద్ద ఆర్థిక మండలిలో భూజలాధ్యయన సర్వేను భారత్ నిర్వహించాల్సి ఉంది. కానీ ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించడానికి కూడా కొత్త ప్రభుత్వం నిరాకరించింది. దీనిమీద భారత్ నుంచి ఎలాంటి అధికారిక స్పందన లేదు. కానీ తమ అభ్యర్థనలను భారత్ అంగీకరించిందని ముయిజ్జు చెబుతున్నారు.

జనవరి 8న చైనాలో నాలుగు రోజుల అధికారిక పర్యటనకు ముయిజ్జు వెళ్లారు. అదే సందర్భంలో ఆయన ప్రభుత్వంలోని ముగ్గురు ఉప మంత్రులు సోషల్ మీడియాలో ప్రత్యేకంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ గురించీ, మొత్తంగా భారతీయుల గురించీ అవమానకరమైన వ్యాఖ్యలను పోస్ట్ చేయడంతో ఒక వికారమైన వివాదం చెలరేగింది. ప్రధాని మోదీ ఇటీవల లక్షద్వీప్ దీవులను సందర్శించిన ఫోటోలను పోస్ట్ చేశారు. లక్షద్వీప్‌కు దక్షిణంగా ఉన్న ఈ దీవులు మాల్దీవుల కంటే మరింత ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా ఆవిర్భవించగలవని కొందరు సోషల్ మీడియాలో వాదనలు మొదలుపెట్టారు. వాటికి వ్యతిరేకంగానే మాల్దీవుల మంత్రులు ప్రతిస్పందించినట్లు కనబడింది. ఆ తర్వాత మాల్దీవులను బహిష్కరించాలని కొందరు భారతీయ ప్రముఖులు పిలుపునివ్వడంతో సోషల్ మీడియా యుద్ధం చెలరేగింది. కొన్ని సంవత్సరాలుగా, మాల్దీవులను సందర్శించేవారిలో భారతీయుల వాటా అత్యధికం. తాజా పరిణామంతో మాల్దీవులను సందర్శించాలనుకున్న భారతీయులు తమ హోటల్, విమాన బుకింగ్‌లను రద్దు చేసుకున్నారు. ఇది ఆ దేశ పర్యాటక పరిశ్రమను దెబ్బతీసింది. అయితే ఒకటి మర్చిపోకూడదు. కోవిడ్–19 మహమ్మారికి ముందు, ఈ పర్యాటకుల రాకపోకలలో చైనా మొదటి స్థానంలో ఉండేది. అన్ని ప్రయాణ ఆంక్షలను చైనా ఎత్తివేస్తే ఆ స్థానాన్ని తిరిగి ఆ దేశమే పొందే అవకాశం ఉంది.

ముయిజ్జు చైనా పర్యటన సందర్భంగా, రెండు దేశాల మధ్య 'సమగ్ర వ్యూహాత్మక సహకార భాగస్వామ్యాన్ని' ప్రకటించే సంయుక్త పత్రికా ప్రకటన వెలువడింది. గ్లోబల్ సివిలైజేషన్ ఇనిషియేటివ్, గ్లోబల్ సెక్యూరిటీ ఇనిషియేటివ్, గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్ (జీడీఐ) అనే మూడు కీలకమైన చైనా ప్రాజెక్టులలో పాల్గొనడానికి మాల్దీవులు సుముఖంగా ఉన్నట్లు ఈ ప్రకటన సూచిస్తోంది. 'గ్రూప్ ఆఫ్ ఫ్రెండ్స్ ఆఫ్ ద జీడీఐ'లో మాల్దీవులు చేరింది. చైనీస్ బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ కింద ప్రాజెక్టులను స్వాగతించింది. మాల్దీవుల ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారానికి ప్రామాణికమైన చైనా మద్దతు ఉంది. మాల్దీవుల అంతర్గత వ్యవహారాలలో ఏదైనా బాహ్య జోక్యాన్ని చైనా వ్యతిరేకిస్తోంది. ఈ విషయంలో పేరు ఎత్తని గురి ఇండియానే అని చెప్పనక్కరలేదు.



దుబాయ్‌లో జరిగిన కాప్ సమావేశాల్లో నరేంద్ర మోదీతో మహమ్మద్ ముయిజ్జు

అయితే చైనా, మాల్దీవుల ఉమ్మడి ప్రకటనలో రెండు ముఖ్యమైన మినహాయింపులు ఉన్నాయి. 2017లో అప్పటి మాల్దీవుల అధ్యక్షుడు అబ్దుల్లా యామీన్ బీజింగ్‌లో పర్యటించారు. చైనాకు అత్యంత అనుకూలమైన స్థానాన్ని ఇచ్చేలా, ఇరు దేశాల మధ్య కుదిరిన వివాదాస్పద స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద అమలు గురించి ఉమ్మడి ప్రకటనలో ఏ ప్రస్తావనా లేదు. అప్పటినుంచి అది సుప్తచేతనలో ఉంది. దాని పునరుద్ధరణ కోసం మాలేలోని చైనా రాయబారి ఒత్తిడి చేస్తున్నారు. హిందూ మహాసముద్రంలో సముద్ర ట్రాఫిక్‌ను పర్యవేక్షించడానికి తమకు అనుకూలమైన స్థానాన్ని ఇచ్చే పరిశీలనా కేంద్ర ఏర్పాటు కోసం చైనా ప్రతిపాదించిన ప్రాజెక్ట్ గురించి కూడా ఉమ్మడి ప్రకటనలో ప్రస్తావన లేదు. ఇవి సాపేక్షంగా భారత్‌కు సానుకూలాంశాలు. ఈ పరిణామాలను భారత్ గమనించాలి. (దీవుల్లో పరిశోధన కోసం చైనా నౌక చేరుకుందన్న వార్తలు వచ్చాయి. అది ఫిబ్రవరిలో రానుందనీ, కానీ పరిశోధన కోసం మాత్రం కాదనీ మాల్దీవులు చెబుతోంది.)

2023 డిసెంబర్ 7న మారిషస్‌లో జరిగిన కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్‌కు మాల్దీవులు గైర్హాజరవడం ఒక ఎదురుదెబ్బ. భారత్ 2011లో శ్రీలంక, మాల్దీవులతో ఈ త్రైపాక్షిక సముద్ర భద్రతా వేదికను ప్రారంభించింది. సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం, మానవ అక్రమ రవాణా, సైబర్ భద్రతతో కూడిన ఎజెండాపై, ఈ దేశాల మధ్య సహకారాన్ని పెంపొందించడంలో ఈ వేదిక ముఖ్యమైన పాత్ర పోషించింది. 2020లో మారిషస్ ఈ కూటమిలో చేరింది. ఇటీవలి మారిషస్ సమావేశంలోనే, సీషెల్స్, బంగ్లాదేశ్ పరిశీలకులుగా చేరాయి. తర్వాత ఇవి పూర్తి సభ్య దేశాలు కావచ్చు. చైనా మెప్పు కోసం మాల్దీవులు ఈ సమావేశానికి హాజరుకాలేదని అనుకోవచ్చు.

ఈ ప్రతికూల పరిణామాల నేపథ్యంలో భారత్ వైఖరి ఎలా ఉండాలి? ఒకటి, సోషల్ మీడియాకు ప్రతిస్పందనగా విదేశాంగ విధానం ఉండకూడదు. మాల్దీవుల ప్రభుత్వం అధికారికంగా క్షమాపణ చెప్పనప్పటికీ, అభ్యంతరకరమైన ట్వీట్‌లకు కారణమైన ముగ్గురు మంత్రులను సస్పెండ్ చేయడంతోపాటు, తమ మంత్రుల చర్యలను తీవ్రంగా ఖండించిన విషయాన్ని మనం విస్మరించకూడదు.

రెండు, మాల్దీవులలోని పార్లమెంట్‌లో ఇండియాకు అనుకూలంగా ఉండే మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ ఆధిపత్యం చలాయిస్తోంది. దీని ప్రతినిధులు మోదీ వ్యతిరేక ట్వీట్‌లను తీవ్రంగా ఖండించారు, అధికారికంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పైగా దీర్ఘకాలంగా మాల్దీవులకు భారత్ ఇస్తున్న మద్దతు, సద్భావన గురించి గొప్పగా మాట్లాడాలని డిమాండ్ చేశారు. మాలెలో ఇటీవల జరిగిన మేయర్ ఎన్నికల్లో ఈ పార్టీ సునాయాసంగా విజయం సాధించింది. ముయిజ్జు అధ్యక్షుడు కావడానికి ముందు రాజధాని మేయర్‌గా ఉన్న విషయం తెలిసిందే. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో భారత అనుకూల రాజకీయ శక్తులు విజయం సాధించే అవకాశం ఉంది. భారత్ పట్ల సానుకూల భావాలను కలిగి ఉన్న ఈ బలమైన, ముఖ్యమైన వర్గాన్ని చికాకు పెట్టేలా మన కార్యకలాపాలు ఉండకూడదు. భారత విదేశాంగ మంత్రి ఇటీవలి ప్రకటన, రెండు దేశాల మధ్య బలమైన ప్రజా సంబంధాలను సమర్థించడంలోని ప్రాముఖ్యతను సూచిస్తోంది. అదే సమయంలో, మాల్దీవుల వ్యతిరేక సోషల్ మీడియా వ్యాఖ్యల వరదలకు ఆయన ప్రకటన ఒక ముఖ్యమైన దిద్దుబాటుగా వెలువడింది.

విదేశాంగ విధానం ఎప్పటికప్పుడు ముగిసే ఉపకథలా ఉండకూడదు. పొరుగు దేశాలలోని రాజకీయాలు అనుకూలంగా లేనప్పుడు కూడా స్థిరంగా, బలమైన ఒప్పందలతో కొనసాగాలి. భారత్‌కు మాల్దీవులు వ్యూహాత్మకంగా ముఖ్యమైనది. అక్కడి పరిణామాలపై తన మాటలు, చేతలను భారత్ జాగ్రత్తగా బేరీజు వేసుకోవాలి. అంతిమంగా సహనమే ఫలితాన్ని ఇస్తుందని మరచి పోకూడదు.

వ్యాసకర్త విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బలవంతపు స్వేచ్ఛ



చివరిసారి యూఎస్, యూకే 'స్వేచ్ఛా వాణిజ్యాన్ని కాపాడటానికి' యుద్ధానికి వెళ్లింది 'ఓపియమ్ వార్స్' సందర్భంలో! ఎందుకంటే, తమ జనానికి తేరగా నల్లమందు అమ్మడానికి చైనా చక్రవర్తి వారిని అనుమతించలేదు. బలప్రయోగం లేకుండా 'స్వేచ్ఛా' వాణిజ్యం అనేది ఉండదు. గుర్తుంచుకోండి, ఈస్ట్ ఇండియా కంపెనీ కూడా ఇండియాకు ముందు వచ్చింది వ్యాపారుల్లాగే!

– శేఖర్ కపూర్, దర్శకుడు

మూర్ఖులు పెరిగారు!



నేను ఇంతకుముందు 90 శాతం భారతీయులు, 95 శాతం పాకిస్తానీలు మూర్ఖులు అన్నాను. ఆ 5 శాతం అదనపు మార్కులు పాకిస్తానీలకు ఎందుకు ఇచ్చానంటే, పాకిస్తాన్‌ను వాళ్లు ఇస్లామిక్ రాజ్యంగా ప్రకటించుకున్నారు కాబట్టి! ఇప్పుడు వాస్తవంలో ఇండియా కూడా హిందూ రాజ్యం అయింది కాబట్టి, భారతీయులకు కూడా పాకిస్తానీయులకు ఇచ్చిన శాతమే ఇస్తాను.

– మార్కండేయ ఖట్జూ, మాజీ న్యాయమూర్తి

జీవితంలో ముఖ్యమైనవి



బాగా బతకడానికి భౌతిక వస్తువులను పోగేసుకోవడమే సరిపోదు. ఎందుకంటే జీవితం మనకు ఉన్న వస్తువుల మీదే ఆధారపడివుండదు. దేవుడితోనూ, ఇతరులతోనూ, తక్కువ కలిగినవారితోనూ మంచి సంబంధాలు ఉండటం మీద జీవితం ఆధారపడి ఉంటుంది.

– పోప్ ఫ్రాన్సిస్, క్రైస్తవ మతగురువు

మునిగే 'ఇండియా'



ఇది ఇంతకు ముందు ఎన్నోసార్లు చెప్పాను, మళ్లీ చెబుతాను. ఇండియా కూటమి ఒక విఫలయత్నం. అది ఎప్పుడో మునిగిపోయింది. ఇదెలా ఉంటుందంటే: ఆపరేషన్ సక్సెస్, కానీ పేషెంట్ పోయాడు.

– సుహేల్ సేఠ్, నటుడు

నమ్మలేని మనిషి



ట్రంప్ (అమెరికా మాజీ అధ్యక్షుడు) నోరు మూసుకుని ఉండలేడు. ఉండగలడా? అవన్నీ పక్కనపెట్టినా, జాతీయ రహస్యాలకు సంబంధించిన విషయాల్లో ఆయన నమ్మదగిన మనిషి కాడు.

– స్టీఫెన్ కింగ్, రచయిత

ఇన్ బాక్స్

ప్రజాస్వామ్యానికి ఊతం

ఓటు హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆయువుపట్టు. మనదేశంలో స్థానిక సంస్థల నుండి అసెంబ్లీ, లోక్ సభ, రాజ్యసభ, రాష్ట్రపతి ఎన్నికల వరకూ... ఓటరు ఎవరైనా, ఓటే కీలకం. అయితే ఏ స్థాయి ఎన్నికలైనా నేడు అత్యధికులు ప్రలోభాలకు లొంగిపోయి ఓటు వేయడం, కొందరు అసలు ఓటు హక్కును వినియోగించుకోక పోవడం కనిపిస్తోంది. నిజాయితీగా రాష్ట్ర, దేశ భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని మంచి, చెడు ఆలోచించి ఓటు వేసే వారి సంఖ్య నానాటికి తగ్గిపోతోంది. దీనివల్ల నిజాయితీపరులూ, నిజంగా ప్రజాసేవ చేద్దామనుకునే వారూ రాజకీయాల్లోకి రావడం లేదు.

ఎన్నికల రోజున ఓటరు సౌకర్యార్థం ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినా... నగరాలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు చాలామంది చదువుకున్న వారు, మేధావులు ముందుకు రావడం లేదు. అందుకు హైదరాబాద్ నగరంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలే నిదర్శనం. కారణం ఏదైనా ఓటు హక్కు వినియోగించుకోకపోవడం ప్రజాస్వామ్య హననమే కాదు, బాధ్యతారాహిత్యం కూడా. వీరి వల్ల గెలుపు, ఓటములు తారుమారవుతాయి. ఇప్పటికే మద్యం, డబ్బు గెలుపు ఓటమిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. పోలింగ్‌కు రాని వారి ఓట్లను మరొకరు వేసుకుంటున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఓటర్‌కు మరింత బాధ్యత ఉంది. ఓటు వజ్రాయుధం. ప్రజాస్వామ్య పరిపాలనకు పునాది. ప్రముఖ కవి కాళోజి 'అభ్యర్థి ఏ పార్టీ వాడని కాదు. ఏ పాటి వాడో చూడు. ఎన్నుకుంటే వెలగ బెట్టడం కాదు. ఇప్పటిదాకా ఏం చేశాడో చూడు' అన్నారు. కాబట్టి ఓటరు అభ్యర్థుల గుణగణాలనూ, చరిత్రనూ పరిగణనలోకి తీసుకొని ఓటు వెయ్యాలి. రాష్ట్రం, దేశ భవిష్యత్తు గురించి సీరియస్‌గా ఆలోచించాల్సిన తరుణం ఆసన్నమైంది. ప్రతి ఒక్క ఓటరు తన ఓటు ప్రాధాన్యతను గుర్తించాలి. ఓటు హక్కు ఉంటేనే చాలదు. సక్రమంగా వినియోగించుకుంటేనే రాష్ట్రాన్ని, దేశాన్ని రక్షించుకోగలం.

– డాక్టర్ టి. సేవకుమార్ । 75697 02090
(నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

కడుపుమంటే ఈ విమర్శలకు కారణం!

అభిప్రాయం



డా॥ పూనూరు గౌతమ్ రెడ్డి

రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న తరుణంలో విషపు కోరలు చాచిన పచ్చ పత్రికోన్మాదం కూడా పతాక స్థాయికి చేరుకుంటోంది. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అంశాన్ని కొన్ని మీడియా సంస్థలు చిత్రించిన తీరు ఇందుకు మరో ఉదాహరణగా నిలిచింది. పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నారంటూ గావు కేకలు పెట్టే ఈ మీడియా సంస్థలు... ఆ హక్కును తమకు సంక్రమింపజేసిన ఒక మహానుభావుడి విగ్రహ ఏర్పాటు, ఆవిష్కరణలకు రాజకీయ రంగు పులుముతూ తమ ఇష్టానుసారం రాతలు రాయడం శోచనీయం. తామేది రాసినా ప్రజలు నమ్ముతారని అనుకుంటున్న ఆ మీడియా సంస్థలు ఇప్పుడు అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులను అనుభవిస్తూ ఆయన్నే అవమానించే విధంగా ప్రవర్తిస్తున్నాయి. ఇది ఇప్పుడు అన్ని వర్గాలు ఆక్షేపిస్తున్న అంశం.

పక్క రాష్ట్రంలో కూడా గతంలో అధికారంలో ఉన్న ఒక ప్రభుత్వం ఇదే బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఒక పండుగ వాతావరణంలో ఆవిష్కరించింది. మరి అప్పుడు కానరాని, వినపడని, స్ఫురణకు రాని అంశాలు ఇప్పుడే ఇక్కడ ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు వస్తున్నాయన్నది ఇక్కడ చర్చించాల్సిన అంశం. తాడిత, పీడిత, బడుగు, బలహీన వర్గాలు, అణగారిన వర్గాలకు అండగా నిలుస్తూ, వారి కష్టాల్లో పాలుపంచుకుంటున్న ఒక ముఖ్యమంత్రిని అత్యంత దారుణంగా, హేయంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేనివాడిగా చిత్రించడం గర్హనీయం. అమరావతిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని చెప్పి, ఆ ఊసే ఎత్తని గత ప్రభుత్వ పెద్దను ప్రస్తావించడం మరచిన ఆ మీడియా... బెజవాడ నడిబొడ్డులో మొత్తం 206 అడుగుల ఎత్తున్న విగ్రహాన్ని ఏర్పాటుచేసిన జగన్‌ను విమర్శించడమే విడ్డూరం. భారత సామాజిక న్యాయ రూపకర్త అయిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పీడిత, తాడిత వర్గాల హృదయాల్లో జగన్ నిలిచి పోతున్నారన్న కడుపు మంటతోనే పచ్చ మీడియా అనేక కువిమర్శలకు దిగింది.

నడుములు విరిగేలా రూ. 10 లక్షల కోట్లు అప్పుచేశారంటూ జగన్‌ను మళ్లీ విమర్శించారు. ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వం, పార్లమెంట్ ఏపీ వాస్తవ అప్పుల గురించి పదే పదే ఇచ్చిన సమాచారాన్ని గుర్తుచేసుకుంటే ఈ విమర్శ ఎంత పచ్చి అబద్ధమో అర్థమవుతుంది. అప్పు తీసుకున్న వారు అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయకూడదంటున్న ధోరణి వారి విమర్శల్లో కనిపిస్తోంది. అలాంటప్పుడు 2014–19 మధ్య ఇదే చంద్రబాబు అప్పులు చేశారు. ఆయన కూడా అమరావతిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తామంటూ మాయ మాటలు చెప్పారు. అది ఆయనకు వర్తించదా అన్న దానికి కూడా వారు సమాధానం చెప్పాలి.



భారీ పారిశ్రామిక సంస్థలను తీసుకురాలేకపోగా, పారిశ్రామిక వేత్తలను భయాందోళనలకు గురిచేశారని ఆరోపిస్తున్నారు. విశాఖ సమ్మిట్‌లో జగన్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు కార్యారూపం దాలుస్తున్నాయన్న అక్కసు వల్లనే ఇటువంటి విమర్శలకు దిగుతున్నారని అర్థం చేసుకోవాలి. ఆంధ్ర రాష్ట్రంలో పారిశ్రామిక రాయితీలకు తిలోదకాలు వదిలిన ఘనుడు చంద్రబాబు. ఏపీకి ప్రత్యేక హోదాకు బదులు ప్యాకేజీకి ఒప్పుకున్నందువల్లనే పారిశ్రామిక రాయితీలు ఎగిరిపోయాయి. పారిశ్రామిక వేత్తలు వెనక్కు వెళ్లారు.

మాతృభాషను మృత భాషగా మార్చడానికి కంకణం కట్టుకున్నారనీ, చిన్నతనంలోనే ఆంగ్ల మాధ్యమంలో బోధన చేస్తూ వారి భవిష్యత్‌కు అన్యాయం చేశారంటూ వల్లెవేశారు. ప్రముఖ సామాజికవేత్త కంచె ఐలయ్య చెప్పిన రెండు మాటలు ఇక్కడ ప్రస్తావించాలి. వచ్చే ఎన్నికల్లో జగన్ ఓడిపోతే జగన్‌కు ఏమీ నష్టం లేదు. ఇంగ్లీషు మీడియంలో చదివే పిల్లలు నష్ట పోతారని అన్నారు. అంతేకాకుండా చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఇంగ్లీషు మీడియం పెట్టించాలి అని అడిగిస్తే మా పార్టీ పేరే తెలుగుదేశం, ఇంగ్లీషు మీడియం ఎలా పెడతామంటూ అపహాస్యంగా మాట్లాడారని చెప్పారు. మన పిల్లలు ఈరోజు ఐక్య రాజ్యసమితిలో ఇంగ్లీషులో అనర్గళంగా మాట్లాడుతున్నారంటే దానికి కారణం మన ఇంగ్లీష్ మీడియం చదువులే. ఐబీటీ, టోఫెల్, ఐఎఫ్‌పీ, సీబీఎస్‌ఈ సిలబస్‌లతో నిరుపేదల పిల్లలు చదువుతున్నారు. బట్టలు, పుస్తకాలు, ట్యాబ్‌లు, మంచి ఆహారం, పాఠశాలల్లో ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, మంచి బెంచీలు, నీట్నెన టాయిలెట్స్ ఇలా 'నాడు–నేడు' పేరుతో విద్యా వ్యవస్థలో వినూత్న విధానాలకు తెరతీశారు. అలాగే వైద్య రంగంలోనూ వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని – సచివాలయ వ్యవస్థ ద్వారా నిజం చేశారు.

ప్రతిపక్షాలకు చెందినవారి ఓట్లను దొంగ ఓట్ల పేరుతో తొలగించారనీ, కుట్రలు పన్నారనీ పెద్ద పెద్ద మాటలు మాట్లాడారు. ఇదీ అవాస్తవమే. అసలు ఈ రాతలు రాసిన పత్రికాధీశుడు తెలంగాణలో జరిగిన ఎన్నికల్లో ఓటేశాడేమో చెప్పాలి. తెలంగాణలో ఓటేసిన వారందరూ ఏపీలో ఓటేసేలా ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని హైదరాబాద్‌లో బ్యానర్లు ఏర్పాటుచేసి పిలుపునిచ్చిందెవరు? ఇది నేరం అని తెలియదా?

ఇలా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ఎక్కుపెట్టే విమర్శలూ, రాస్తున్న రాతల్లోని డొల్లతనం పేద ప్రజలు గ్రహించారు. అందుకే కొత్తగా అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణపై చేస్తున్న కువిమర్శలకు వ్యతిరేకంగా రోడ్డెక్కుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు దిగుతున్నారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో సామాన్యుడి కడుపు మంట ఓటు రూపంలో ప్రతిఫలించబోతోంది. జగన్ మోహన్ రెడ్డికి పేదలంతా ఐక్యంగా మరోమారు ముఖ్యమంత్రి పీఠాన్ని కట్టబెట్టబోతున్నారు. ఇది వాస్తవం.

వ్యాసకర్త వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు । 98481 05455

సత్యవాక్పాలనం

పుణ్యమే పుణ్యం చేసుకున్నవారిని కాపాడుతుంది. కనుకనే చేసుకున్న పుణ్యం ప్రాణదాత అనబడుతుంది. ఎన్ని విధాలుగానైతే ధర్మాచరణాన్ని పాటించే అవకాశం ఉంటుందో అన్ని విధాలుగానూ పాటించడం వలన ఏమీ నష్టం జరగదు, మాట పడాల్సిన పరిస్థితి రాదు. తాను ప్రమాదంలో పడతానని గ్రహించి కూడా ధర్మాచరణాన్ని కొనసాగించేవాడు ధర్మాత్ములలో ఉత్తముడు. ధర్మాచరణంలో ప్రమాదకరమైన పరిస్థితులు తలెత్తడమే ధర్మాత్ముల పాలిటి విపత్కర పరిస్థితి అవుతుంది కాని మరొకటి కాదు. సూర్యుడు, చంద్రుడు, వాయువు, అగ్ని, అంతరిక్షము, భూమి, నీరు, హృదయం, యమధర్మరాజు, పగలు, రాత్రి, ఇరు సంధ్యలు, ధర్మము – ఈ అన్నీ కూడా మనిషి ప్రతి నిత్యం ఆచరించే పాప పుణ్య వ్యవహారాలను గురించి తెలిసినవిగా ఉంటాయి/ఉంటారు అని గ్రహించాలి.



జ్యోతిర్మయం

అసత్యానికి ఎప్పుడూ దూరంగా ఉంటూ జీవనం సాగించే సాధు పురుషుల దృష్టిలో, ధర్మం ఒక్కటే మానవకోటికి మంచిని చేసేదిగా ఉంటుంది. ధర్మం ఎప్పుడూ ఎవరికీ దుఃఖాన్ని కలిగించేదిగా ఉండదు. పాపకర్మాసక్తుడై పాపం చేసేవాడు తనను ఎవ్వరూ చూడడం లేదని అనుకోవడం పరిపాటి. అలా ఆలోచించడం ఎంతో మూర్ఖమైనదని అతడికి తోచదు. సకల దేవతలు, అంతర్యామి పరమాత్మ చూడలేని, చూడని పని అంటూ జగత్తులో ఏదీ ఉండదు. ఒక వ్యక్తి చేసే పనులకు, ఆచరించే విధులకు ఆ వ్యక్తి హృదయంలోనే దాగివుండి వీక్షించే కర్మసాక్షియైన పరమాత్ముడు సంతృప్తుడుగా ఉన్నప్పుడు, ఆ వ్యక్తికి విధివశాత్తు ఏవైనా పాపాలు సంక్రమిస్తే వాటిని సూర్యపుత్రుడైన యమధర్మరాజు నష్టపరుస్తాడు లేక పోగొడతాడు అని పూర్వులు చెప్పిన మాట. వెయ్యి యాగాలను చేయగా సమకూరిన ఫలాన్ని త్రాసులో ఒకవైపు, సత్యవాక్పాలనతో సమ కూరిన ఫలాన్ని మరొక వైపు ఉంచి తూస్తే, సత్యవాక్పాలన వలన సమకూరిన ఫలమే బరువైనదిగా తేలుతుందన్నది కూడా పూర్వులు చెప్పిన విలువైన మాటలలో ఒకటి.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** పౌర్ణమి రా.10.31 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** పునర్వసు ఉ.8.09 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** సా.4.45 నుండి 6.25 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.10.20 నుండి 11.08 వరకు, తదుపరి ప.2.51 నుండి 3.39 వరకు, **అమృత ఘడియలు:** రా.3.02 నుండి 4.45 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.48.

‘ఆర్టీసీ ప్రగతిలో డ్రైవర్లదే కీలక పాత్ర’

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ప్రగతిలో డ్రైవర్లది కీలక పాత్రని రవాణా శాఖ ముఖ్యకార్యదర్శి పి. ప్రద్యుమ్న అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ డిపోల్లో బుధవారం డ్రైవర్స్ డే నిర్వహించారు. విజయవాడలోని ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ‘డ్రైవర్స్ డే’ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలు చేర్చేందుకు ఆర్టీసీ డ్రైవర్లు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. డ్రైవర్లు క్రమశిక్షణకు ప్రాధాన్యమివ్వాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

ఇక పక్కాగా వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు

సెన్సార్లు, ఆటోమేటెడ్ టెస్టింగ్ ట్రాక్‌లతో ఫిట్‌నెస్ పరీక్షలు

- రాష్ట్రంలో 26 ఏటీసీలు నెలకొల్పుతున్న ప్రభుత్వం
- విశాఖపట్నంలో పూర్తి కావచ్చిన తొలి ఏటీసీ
- తొలిదశలో 15 ఏటీసీల నిర్మాణానికి టెండర్లు

సాక్షి, అమరావతి: రోడ్డు ప్రమాదాల నివారణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. అందుకోసం వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు సక్రమంగా నిర్వహించే దిశగా కార్యాచరణకు ఉపక్రమించింది. రోడ్డు ప్రమాదాలకు కారణాల్లో వాహనాలు తగిన ఫిట్‌నెస్‌తో లేకపోవడం ఒకటని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటివరకు రవాణా శాఖ అధికారులు వాహనాలను స్వయంగా పరిశీలించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. సరైన ఫిట్‌నెస్ లేకపోయినా సర్టిఫికెట్లు జారీ చేస్తున్న ఉదంతాలు కోకొల్లలుగా ఉంటున్నాయి. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తూ పూర్తిగా ఆటోమేటెడ్ విధానంలో వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసే వ్యవస్థను నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం పూర్తిగా ఆటోమేటెడ్ వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలో 26 ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్లు (ఏటీసీ)లు ఏర్పాటుకు ఉపక్రమించింది. పుణెలోని ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ) ప్రమాణాల మేరకు ఈ ఏటీసీలను డిజైన్ చేశారు.

విశాఖపట్నంలో పైలట్ ప్రాజెక్ట్: రాష్ట్రంలో మొదటి ఏటీసీని విశాఖపట్నంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ఏర్పాటు చేశారు. రూ.18.50 కోట్లతో అక్కడ ఏటీసీ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. మిగిలిన 25 జిల్లా కేంద్రాల్లో ఏటీసీల నిర్మాణానికి రవాణా శాఖ టెండర్ల ప్రక్రియ చేపట్టింది. మొదటి దశలో 15 ఏటీసీల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. వాటిలో శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం, మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం ఏటీసీల నిర్మాణానికి త్వరలోనే బిడ్లను ఖరారు చేయనున్నారు. మిగిలిన జిల్లా కేంద్రాల్లో ఏటీసీల నిర్మాణానికి ఫిబ్రవరి మొదటివారం నాటికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని రవాణా శాఖ భావిస్తోంది. ఏటీసీల టెండర్లు ఖరారు అయిన తరువాత ఏడాదిలోగా వాటిని ప్రారంభించాలన్నది రవాణా శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించడమే లక్ష్యంగా ఏటీసీలను ప్రభుత్వం నెలకొల్పుతోంది. తద్వారా వాహనాల ఫిట్‌నెస్‌ను శాస్త్రీయంగా పరీక్షించి సర్టిఫికెట్లను జారీ చేస్తారు. ఏడాదిలోగా ఈ సెంటర్లు అందుబాటులోకి రానున్నాయి. – ఎంకే సిన్హా, రవాణా శాఖ కమిషనర్



ఏటీసీల స్వరూపం ఇలా..

జిల్లా కేంద్రానికి గరిష్టంగా 30 కి.మీ. దూరంలో ఏటీసీలను నెలకొల్పుతారు. కనీసం 3 వేల చ.గజాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తారు. అధునాతన సెన్సార్లు, కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక డ్రైవింగ్ ట్రాకులను నిర్మిస్తారు. విశాఖపట్నంలో పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన ఏటీసీలో నాలుగు లేన్లతో కూడిన డ్రైవింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేశారు. భారీ వాహనాలకు రెండు ట్రాక్‌లు, లైట్ వెహికిల్స్‌ను రెండు డ్రైవింగ్ ట్రాక్‌లను కేటాయించారు. కాగా మిగిలిన 25 జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసే ఏటీసీలలో రెండేసి చొప్పున డ్రైవింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేస్తారు. హెవీ వెహికిల్స్‌కు ఒక ట్రాక్, లైట్ వెహికిల్స్‌కు ఒక ట్రాక్‌ను కేటాయిస్తారు. ఫిట్‌నెస్‌కు వచ్చే వాహనాలు ఆ డ్రైవింగ్ ట్రాక్‌లలో ప్రయాణిస్తే... సెన్సార్ల ద్వారా వాటి ఫిట్‌నెస్‌ను పరీక్షిస్తారు. బ్రేకుల పనితీరు, ఇంజిన్ కండిషన్, ఇతర ప్రమాణాలను ఆటోమేటెడ్ విధానంలో నిర్ధారిస్తారు. దాంతో ఎలాంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను జారీ విధానాన్ని అమలులోకి తీసుకువస్తారు.

మార్కెటింగ్ శాఖలో 133 మందికి పదోన్నతులు

- సీనియార్టీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ప్రమోషన్లు
- ఐదేళ్లలో రెండు సార్లు.. సిబ్బందిలో హర్షాతిరేకాలు

సాక్షి, అమరావతి: మార్కెటింగ్ శాఖలో సీనియార్టీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన 133 మందికి పదోన్నతులు కల్పించారు. గతంలో ఏళ్ల తరబడి పదోన్నతులకు నోచుకోని వారికి గడిచిన నాలుగున్నరేళ్లలో రెండుసార్లు పదోన్నతులు కల్పించడంతో మార్కెటింగ్ శాఖ సిబ్బందిలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా రికార్డు స్థాయిలో 133 మందికి పదోన్నతి కల్పించారు. వీరిలో యూడీసీ, అసిస్టెంట్ సెక్రటరీ స్థాయి నుంచి ఏడీ స్థాయి వరకు ఉన్నారు. యూడీసీ, సూపర్‌వైజర్లుగా పనిచేస్తున్న 22 మందికి జోన్–1లో అసిస్టెంట్ సెక్రటరీలుగా పదోన్నతి కల్పించారు. జోన్ 1, 2లలో అసిస్టెంట్ సెక్రటరీలుగా పనిచేస్తున్న 37 మందికి గ్రేడ్–3 సెక్రటరీలుగా అవకాశం కల్పించారు. అలాగే జోన్–1,2లలో గ్రేడ్ 3 సెక్రటరీలుగా పనిచేస్తున్న 28 మందికి గ్రేడ్ 2 సెక్రటరీలుగా పదోన్నతి కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రేడ్ 2 సెక్రటరీలుగా పనిచేస్తున్న 13 మందికి గ్రేడ్ వన్ సెక్రటరీలుగా, గ్రేడ్ వన్ సెక్రటరీలుగా పనిచేస్తున్న 16 మందికి స్పెషల్ గ్రేడ్ సెక్రటరీలుగా పదోన్నతి కల్పించారు. ముగ్గురు సెంట్రల్ మార్కెట్ ఫండ్ సర్వీస్ సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్ హోదా కల్పించారు. కాగా, ముగ్గురు అసిస్టెంట్ డైరెక్టర్లను డీడీఎంలుగా, నలుగురు డీఈఈలను డీపీసీలుగా, ఆరుగురు సీనియర్ మార్కెటింగ్ అసిస్టెంట్లను ఏడీఎంలుగా, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ హోదాలో పనిచేస్తున్న ఒకర్ని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ కేడర్ డీపీసీగా పదోన్నతి కల్పించాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. సిఫార్సులకు తావులేకుండా సీనియార్టీ ప్రాతిపదికన రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ పదోన్నతులు కల్పించామని మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే ‘సాక్షి’కి తెలిపారు.

నేడు శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి

గరుడ వాహనంపై దర్శనమివ్వనున్న స్వామివారు

తిరుమల: తిరుమలలో గురువారం శ్రీరామకృష్ణ తీర్థ ముక్కోటి వైభవంగా జరుగనుంది. పుష్యమి నక్షత్రంతో కూడిన పౌర్ణమినాడు ఈ తీర్థ ముక్కోటిని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఈ పర్వదినం నాడు ఉదయం 7.30 గంటలకు శ్రీవారి ఆలయ అర్చకులు మంగళవాయిద్యాలతో ఆలయ మాడ వీధుల గుండా పూలు, పండ్లు, స్వామివారి ప్రసాదాలు తదితర పూజా సామగ్రిని శ్రీరామకృష్ణ తీర్థానికి తీసుకెళతారు. అక్కడున్న శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు. అలాగే పుష్యమాస పౌర్ణమి సందర్భంగా అదే రోజు రాత్రి గరుడసేవ జరుగనుంది. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడునిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

నేటి నుంచి ఐఆర్ఐఏ జాతీయ సదస్సు

- సీకే కన్వెన్షన్ సెంటర్లో నాలుగు రోజుల పాటు నిర్వహణ
- వివిధ రాష్ట్రాల నుంచి హాజరుకానున్న 3,500 మంది రేడియాలజిస్టులు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌ప్రసాద్

లబ్బీపేట(విజయవాడ తూర్పు): ఇండియన్ రేడియాలజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్(ఐఆర్ఐఏ) 76వ జాతీయ సదస్సును గురువారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆ సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ జీవీ మోహన్‌ప్రసాద్ తెలిపారు. విజయవాడలోని హోటల్ వివంతలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళగిరి సమీపంలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించే ఈ సదస్సులో దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన 3,500 మంది ప్రతినిధులు హాజరు కానున్నట్లు చెప్పారు. మరో 330 మంది ఫ్యాకల్టీ వస్తున్నారని, వారిలో వంద మంది విదేశాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. రేడియాలజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలపై చర్చలు జరుగుతాయన్నారు. రేడియాలజిస్ట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులుగా విజయవాడకు చెందిన డాక్టర్ వీఎన్ వరప్రసాద్ గురువారం బాధ్యతలు తీసుకుంటారని, ఇది మన రాష్ట్రానికే గర్వకారణంగా పేర్కొన్నారు. సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వీఎన్ వరప్రసాద్ మాట్లాడుతూ గూగుల్ సంస్థకు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సైంటిస్టులు కూడా సదస్సులో పాల్గొని, రేడియాలజీలో పేషంట్ కేర్ నందు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం గురించి వివరిస్తారన్నారు. ఈ సమావేశంలో సదస్సు వైస్ చైర్మన్ డాక్టర్ వి.సురేష్, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ డాక్టర్ దండమూడి శ్రీనివాస్, కోశాధికారి డాక్టర్ బి.ఎస్.ఆర్.ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

మానవీయతే భారతీయత

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు
- వివేకానంద జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం



అనపర్తి: మానవీయతే భారతీయత అని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అనపర్తి మండలంలోని దుప్పలపూడిలో స్వామి వివేకానంద జయంత్యుత్సవం–2024ను బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ముఖ్య అతిథులు బెలూన్లు గాల్లోకి ఎగురవేసి వేడుకలను ప్రారంభించారు. సమితి అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ సర్వలోక శ్రేయస్సు, సర్వ జీవ క్షేమాన్ని కాంక్షించే గొప్ప సంస్కృతి, సంప్రదాయం కలిగినది భారతదేశమేనన్నారు. రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి పరిజ్ఞేయానందజీ మహరాజ్ మాట్లాడుతూ యువ భారత ప్రగతికి స్వామి వివేకానంద చుక్కానిగా నిలుస్తారన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ యిమ్మణ్ణి దీపావెంకట్ ప్రసంగించారు. అనంతరం సమాజానికి సేవలందిస్తున్న బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ గోలి వెంకట రామారావు, హైకోర్టు సీనియర్ న్యాయవాది నల్లమిల్లి శివారెడ్డిలకు స్వామి వివేకానంద జీవన సాఫల్య పురస్కారాలు, యిమ్మణ్ణి దీపావెంకట్‌కు స్వామి వివేకానంద ఎక్స్‌లెన్స్ అవార్డును అందజేశారు.

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ చెస్ జట్టు ఎంపిక



చెస్ జట్టుతో రిజిస్ట్రార్ రాధికారెడ్డి తదితరులు

విజయవాడ స్పోర్ట్స్: దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల పురుషుల చదరంగం పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్లు విశ్వవిద్యాలయం క్రీడా విభాగ కార్యదర్శి డాక్టర్ ఇ.త్రిమూర్తి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యుత్తమ క్రీడానైపుణ్యం ప్రదర్శించిన బి.దీపక్ (ప్రభుత్వ వైద్య కళాశాల, అనంతపురం), పి.స్నేహిత్ (డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల, చినఅవుటపల్లి), బి.గణేష్ (డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాల, చినఅవుటపల్లి), సీహెచ్.నవీన్ (సెయింట్ జోసఫ్ దంత కళాశాల, ఏలూరు), ఆర్.శ్రీను రంగభాను (ఆంధ్రా వైద్య కళాశాల, విశాఖపట్నం), జి.హితేశ్వర్‌నాయక్ (డాక్టర్ ఎ.ఆర్.ప్రభుత్వ హోమియో వైద్య కళాశాల, రాజమండ్రి) జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ విశ్వవిద్యాలయంలో జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని పేర్కొన్నారు. జట్టు బృందాన్ని వర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి వర్సిటీ ప్రాంగణంలో బుధవారం అభినందించారు.

బాలిక కడుపులో బద్దె పురుగులు

ఆపరేషన్ చేసి బయటకు తీసిన రుయా వైద్యులు

రేణిగుంట (తిరుపతి జిల్లా): ఎల్లమండ్యం పంచాయతీ మర్రిగుంటకి చెందిన ఓ 11 ఏళ్ల బాలిక కడుపులో ఉన్న బద్దె పురుగులను రుయా వైద్యులు ఆపరేషన్ చేసి బయటకు తీశారు. వివరాల్లోకి వెళితే.. మర్రిగుంటకు చెందిన బాలికకు కడుపునొప్పి రావడంతో ఈ నెల 17వ తేదీన రేణిగుంట పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. దీంతో వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్‌రెడ్డి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు పంపించారు. తిరుపతి రుయాలో బాలిక కడుపులో ప్లాటిహెల్మింథిస్ వర్గానికి చెందిన రెండు మీటర్ల పొడవైన బద్దెపురుగులు (టేప్ వార్మ్స్) ఉన్నట్లు అక్కడి వైద్యులు గుర్తించారు. చిన్నపిల్లల వార్డు డాక్టర్ కిరీటి, డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో ఆపరేషన్ చేసి కడుపులో ఉన్న బద్దె పురుగులను తొలగించారు. మందులు ఇక్కడ లభించకపోవడంతో చెన్నై నుంచి ప్రత్యేకంగా తెప్పించి బాలిక ప్రాణాలు కాపాడారు.

పరోక్షసేవగా రాహుకేతు పూజలు



శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): శ్రీకాళహస్తీశ్వరాలయానికి నేరుగా వచ్చి రాహుకేతు పూజలు చేసుకోలేని భక్తుల కోసం దేవస్థానం బుధవారం నుంచి పరోక్షసేవను ప్రారంభించింది. ఆన్‌లైన్‌లో రూ.300 చెల్లించి రోజూ రాహుకాల సమయంలో పూజచేసుకునే విధంగా అవకాశం కల్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు srikalahastitemple.com వెబ్‌సైట్‌ను చూసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని పేర్కొన్నారు.

టాటా స్టీల్ నిర్మాణ సేవా కేంద్రం ప్రారంభం

కృష్ణాజిల్లా మల్లవల్లి మోడల్ పారిశ్రామిక పార్కులో ఏర్పాటు



హనుమాన్‌జంక్షన్ రూరల్: దేశంలో అభివృద్ధి చెందుతున్న నిర్మాణ పరిశ్రమకు మరింత బలమైన ఉత్పత్తులు, పరిష్కారాలను అందించే లక్ష్యంతో పూర్తి ఆటోమేటెడ్ నిర్మాణ సేవా కేంద్రాన్ని మల్లవల్లి మోడల్ పారిశ్రామికపార్కులో ఏర్పాటు చేసినట్లు టాటా స్టీల్ లాంగ్ ప్రొడక్ట్స్ వైస్ ప్రెసిడెంట్ ఆశిష్ అనుపమ్ తెలిపారు. బాపులపాడు మండలం మల్లవల్లిలోని సామ్రాట్ ఐరన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టాటా స్టీల్ ఆటోమేటెడ్ నిర్మాణ సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. దేశంలోనే ఇప్పటి వరకు కటక్, ఘజియాబాద్ తర్వాత విజయవాడ (మల్లవల్లి పారిశ్రామికవాడ)లో మూడో పూర్తి ఆటోమేటెడ్ నిర్మాణ సేవా కేంద్రాన్ని టాటా స్టీల్ ఏర్పాటు చేసినట్లు వైస్ ప్రెసిడెంట్ ఆశిష్ అనుపమ్ చెప్పారు. ఈ కేంద్రం నెలకు మూడు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కప్లర్ థ్రెడింగ్, కట్ అండ్ బెండ్ టిస్కాన్ టీఎంటీ ఐరన్ బార్లు ఉత్పత్తి చేస్తుందని వివరించారు. దాదాపు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో నిర్మాణ రంగానికి సమగ్ర పరిష్కారాలను అందిస్తుందని పేర్కొన్నారు. త్వరలో ఇక్కడ పోర్ట్‌ఫోలియోను వెల్డెడ్ వైర్ మెష్, బోర్ పైల్ కేజ్‌లను ఉత్పత్తి చేసేందుకు విస్తరించనున్నట్లు తెలిపారు. తద్వారా వన్–స్టాప్ డౌన్‌స్ట్రీమ్ కన్‌స్ట్రక్షన్ సర్వీస్ సెంటర్‌గా స్థిరపడుతుందని చెప్పారు. 2025 నాటికి దేశవ్యాప్తంగా ఇలాంటి 10 కేంద్రాలను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు తెలిపారు. టాటా స్టీల్ లాంగ్ ప్రొడక్ట్స్ మార్కెటింగ్ అండ్ సేల్స్ చీఫ్ రాహుల్ మిశ్రా, సామ్రాట్ ఐరన్స్ ఎండీ రాజా జైన్ పాల్గొన్నారు.

పెద్ద పులి దాడిలో ఎద్దు మృతి

బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం మారుమూల అటవీ ప్రాంతం కోపల్లి సమీపంలో అడవికి మేతకు వెళ్లిన ఎద్దుపై పెద్దపులి దాడి చేసింది. ఈ దాడిలో ఎద్దు మృతి చెందింది. పులి దాడి సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు బుధవారం ఎద్దు మృతి చెందిన ప్రదేశానికి వెళ్లి పరిసరాలను పరిశీలించి.. అది పులి దాడేనని నిర్ధారించారు. అయితే ఎద్దు మృతి ఘటన సమాచారం గ్రామస్తులకు ఇచ్చినా ఎవ్వరూ రాలేదని ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.కృష్ణకుమారి తెలిపారు. అయితే ఎద్దుపై పులి దాడి చేసిన ప్రదేశానికి అది మళ్లీ వచ్చే అవకాశం ఉన్నందున ఫారెస్ట్ అధికారులు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. కోపల్లి పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారులు సూచించారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

రేషన్ డీలర్ల సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లీలా మాధవరావు

కృష్ణలంక (విజయవాడతూర్పు): రాష్ట్రంలోని అల్పాదాయ కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం నిర్వాహణదారుల (రేషన్ డీలర్లు) సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడ గవర్నర్‌పేటలోని ఎంబీ భవన్‌లో బుధవారం జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం నిర్వాహణదారుల సంక్షేమ సమాఖ్య రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. రిటైర్డ్ కమిషనర్ డి.వరప్రసాద్‌ను రాష్ట్ర సమాఖ్య సలహాదారునిగా ఎన్నుకున్నారు. సమాఖ్య జనరల్ సెక్రటరీ అడపా వెంకట రమణ, ట్రెజరర్ ఆర్.గంగాధర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాసరావు, సెక్రటరీ ఎం.సి.హెచ్.కాశీం, అడ్వైజర్లు బి.ఫణికుమార్, కందుల బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

వేల ఏళ్ల పురాతనమైన వినాశకర వైరస్‌ల విజృంభణ!

ఆర్కిటిక్ మంచు కరగడంతో బయటికొస్తున్న పురాతన వైరస్‌లు

వాషింగ్టన్: రాజులు, సంపన్నులు దాచిన గుప్తనిధులు, లంకెబిందెలు వందల ఏళ్లకు ఇంకెవరికో దొరికితే సంబరమే. కానీ అందుకు భిన్నంగా జరిగితే?. అలాంటి ఉపద్రవమే ముంచుకు రావొచ్చని జీవశాస్త్రవేత్తలు మానవాళిని హెచ్చరిస్తున్నారు. 48,500 సంవత్సరాలపాటు మంచుమయ ఆర్కిటిక్ ఖండంలో మంచు ఫలకాల కింద కూరుకుపోయిన వినాశకర వైరస్‌లు పర్యావరణ మార్పులు, భూతాపం కారణంగా మంచు కరిగి బయటికొస్తున్నాయని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఇన్ని వేల సంవత్సరాలు గడిచినా ఆ వైరస్‌లకు ఇప్పటికీ ఇంకొక జీవికి సోకే సాంక్రమణ శక్తులు ఉండొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. రష్యాలోని సైబీరియా ప్రాంతంలో యకూచి అలాస్ సరస్సులో తవ్వితీసిన నమూనాల్లో పురాతన వ్యాధికారక వైరస్‌లను ఇటీవల జీవశాస్త్రవేత్తల బృందం కనుగొంది. వాటిలో కొన్ని రకాలకు జాంబీ(దెయ్యం)వైరస్‌లుగా వర్గీకరించారు. నిద్రాణ స్థితిలో ఉన్నప్పటికీ ఇంకో జీవికి సంక్రమించే సత్తా ఇంకా వీటికి ఉందో లేదో పరీక్షిస్తున్నట్లు ఎయిక్స్-మార్సెల్లీ విశ్వవిద్యాలయంలో జన్యు శాస్త్రవేత్త జీన్ మైఖేల్ క్లావెరీ చెప్పారు. ''ఆర్కిటిక్ ఖండం ఉపరితలంలో 20 శాతం భూభాగం శాశ్వతంగా మంచుతో కప్పబడి ఉంది. అత్యంత చల్లని, ఆక్సిజన్‌రహిత, ఘనీభవించిన ఈ ప్రదేశంలో పెరుగును పడేస్తే అలా పాడవ్వకుండా అలాగే ఉంటుంది. ఒక 50వేల సంవత్సరాల తర్వాత సైతం తినేయొచ్చు' అని క్లావెరీ అన్నారు. నెదర్లాండ్స్‌లోని రోటర్డామ్ ఎరాస్మస్ మెడికల్ సెంటర్‌లోని వైరాలజీ శాస్త్రవేత్త మేరియాన్ కూప్‌మెన్స్ మరికొన్ని వివరాలు చెప్పారు. '' ఈ మంచు ఫలకాల కింది వైరస్‌లు బయటికొచ్చి వ్యాప్తి చెందితే ఎలాంటి రోగాలొస్తాయో ఇప్పుడే చెప్పలేం. అయితే 2014లో సైబీరియాలో మేం ఇదే తరహా వైరస్‌లను పరీక్షించగా వాటికి ఏకకణ జీవులకు సోకే సామర్థ్యం ఉందని తేలింది. 2015లోనూ ఇదే తరహా పరీక్షలు చేశాం. ల్యాబ్‌లో అభివృద్ధిచేసిన జీవులకూ ఈ వైరస్‌లు సోకాయి. ఆర్కిటిక్ ప్రాంతంలో మానవసంచారం పెరగనంతకాలం వీటితో ప్రమాదం ఏమీ లేదు. శతాబ్దాల క్రితం లక్షలాది మందిని పొట్టనబెట్టుకున్న పురాతన పోలియో వ్యాధికారక వైరస్‌లకు ఇప్పటికీ ఆ సంక్రమణ శక్తి ఉండొచ్చు. మనుషుల రాకపోకలతో అంటువ్యాధులను వ్యాపింపజేసే వైరస్‌లు ఆర్కిటిక్ ప్రాంతం దాకా వ్యాపిస్తే అవి, ఇవీ అన్నీ కలసి కొత్తరకం ఊహించని వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాం'' అని మేరియాన్ కూప్‌మెన్స్ విశ్లేషించారు.

ఇండియా కూటమికి బీటలు

బెంగాల్లో ఒంటరి పోరు: మమత | కాంగ్రెస్‌తో పొత్తుండదని ప్రకటన

- రాహుల్ జోడో యాత్రకూ దూరం
- పంజాబ్‌లోనూ ఒంటరి పోరే: ఆప్
- 'ఇండియా' కూటమికి జంట షాకులు
- విపక్షాలకిది చావుదెబ్బే: బీజేపీ

కోల్‌కతా/చండీగఢ్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మోదీ సారథ్యంలోని అధికార బీజేపీ కూటమికి గట్టి పోటీ ఇవ్వాలన్న విపక్షాల ప్రయత్నాలకు ఆదిలోని హంసపాదు! కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష 'ఇండియా' కూటమికి భాగస్వామ్య పార్టీలు తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ బుధవారం రెండు భారీ షాకులిచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని తృణమూల్ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించింది. పంజాబ్‌లోనూ తమది ఒంటరి పోరేనని ఆప్ నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర బెంగాల్లోకి ప్రవేశించడానికి ఒక రోజు ముందు జరిగిన ఈ పరిణామంతో ఆ పార్టీ ఒక్కసారిగా కంగుతిన్నది. వెంటనే నష్ట నివారణ చర్యలకు రంగంలోకి దిగింది. మమత లేని విపక్ష కూటమిని ఊహించలేమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. తృణమూల్‌తో పొత్తు చర్చలింకా సాగుతున్నాయని, బెంగాల్లో కలిసే పోటీ చేస్తామని ఆశాభావం వెలిబుచ్చారు. కానీ ఆ వ్యాఖ్యలను మమత నిర్ద్వంద్వంగా ఖండించారు. పొత్తుపై కాంగ్రెస్‌తో ఎలాంటి చర్చలూ జరగడం లేదని స్పష్టం చేశారు. ఈలోపే, సీట్ల కోసం తృణమూల్‌ను వేడుకోబోమంటూ కాంగ్రెస్ అగ్ర నేత, బెంగాల్ పీసీసీ చీఫ్ అధీర్ రంజన్ చౌధరి చేసిన వ్యాఖ్యలు మరింతగా మంటలు రేపాయి. 28 విపక్ష పార్టీలతో కూడిన ఇండియా కూటమికి కీలక సమయంలో బీటలు పడుతుండటం కాంగ్రెస్‌ను కుంగదీసే పరిణామమేనని అంటున్నారు. బెంగాల్లో కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తూ ఉండబోదని మీడియాతో మమత కుండబద్దలు కొట్టారు. ఆ పార్టీ మొండి వైఖరి వల్లే ఒంటరి పోరు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. సీట్ల సర్దుబాటుపై తన ప్రతిపాదనలను కాంగ్రెస్ పరిశీలించను కూడా లేదని ఆమె ఆరోపించారు. అంతేగాక బెంగాల్లో క్షేత్ర స్థాయి వాస్తవాలను పరిగణనలోకి తీసుకోకుండా కాంగ్రెస్ ఆచరణసాధ్యం కాని డిమాండ్లు తమ ముందుంచినట్టు తృణమూల్ వర్గాలు మండిపడ్డాయి.

ఆది నుంచీ అంతంతే...

విపక్ష ఇండియా కూటమికి మమత దూరంగానే మెలుగుతూ వస్తున్నారు. ఇటీవలి వర్చువల్ భేటీకి కూడా డుమ్మా కొట్టారు. బెంగాల్లో ఆగర్భ శత్రువులైన తృణమూల్, లెఫ్ట్ ఫ్రంట్ రెండూ ఇండియా కూటమి భాగస్వాములే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 42 స్థానాలకు గాను తృణమూల్ 22 సీట్లు నెగ్గగా బీజేపీ ఏకంగా 18 స్థానాలు సొంతం చేసుకుంది. కాంగ్రెస్ కేవలం 2 సీట్లతో సరిపెట్టుకుంది. ఈసారి పొత్తులో భాగంగా అవే రెండు సీట్లు కాంగ్రెస్‌కు ఇస్తామని మమత ప్రతిపాదించడంతో కాంగ్రెస్ అవాక్కైనట్టు చెబుతున్నారు. అన్ని తక్కువ స్థానాలతో సరిపెట్టుకునేందుకు ససేమిరా అనడంతో చిర్రెత్తుకొచ్చిన దీదీ మొత్తానికే అడ్డం తిరిగారని సమాచారం. పొత్తులో భాగంగా లెఫ్ట్ ఫ్రంట్‌కు కూడా కొన్ని సీట్లు వదులుకోవాల్సి రావడం కూడా ఆమెకు రుచించలేదని తృణమూల్ వర్గాలు వివరించాయి. బెంగాల్లో 2001, 2011 అసెంబ్లీ ఎన్నికలతోపాటు 2009 లోక్‌సభ ఎన్నికల్లో కూడా తృణమూల్, కాంగ్రెస్ జట్టుగా పోటీ చేశాయి.

పంజాబ్‌లో ఒంటరి పోరే | సీఎం భగవంత్ మాన్ వెల్లడి



పంజాబ్‌లో మొత్తం 13 సీట్లలోనూ ఆప్ ఒంటరిగానే పోటీ చేస్తుందని పార్టీ నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో పొత్తుండబోదని స్పష్టం చేశారు. నిజానికి లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ, పంజాబ్, హరియాణా, గోవా, గుజరాత్‌ల్లో పొత్తు దిశగా కాంగ్రెస్, ఆప్ మధ్య చర్చలింకా జరుగుతూనే ఉన్నాయి. పైగా త్వరలో జరగనున్న చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్, ఆప్ కలిసి పోటీ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాన్ ప్రకటన కాంగ్రెస్‌లో కలకలం రేపింది. ఆ పార్టీతో పొత్తు ప్రతిపాదనను పంజాబ్ ఆప్ నేతలంతా వ్యతిరేకిస్తున్నారని మాన్ మీడియాకు స్పష్టం చేశారు. మొత్తం 13 లోక్‌సభ స్థానాలకూ ఆప్ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇప్పటికే చురుగ్గా సాగుతోందని తెలిపారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పంజాబ్‌లో 13 స్థానాలకు గాను కాంగ్రెస్ 8 నెగ్గింది. అకాలీదళ్, బీజేపీ చెరో రెండు, ఆప్ ఒక స్థానంలో గెలిచాయి.

కూటమిపై ఎవరికీ పెత్తనముండదు | మమత నర్మగర్భ వ్యాఖ్యలు



బెంగాల్లో పొత్తు లేకపోయినా జాతీయ స్థాయిలో మాత్రం విపక్ష ఇండియా కూటమికి తృణమూల్ కట్టుబడి ఉంటుందని మమత ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం విశేషం. ''కావాలంటే కాంగ్రెస్‌ను దేశవ్యాప్తంగా 300 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయమనండి. మిగతా 243 స్థానాల్లో ప్రాంతీయ పార్టీలు బరిలో దిగుతాయి. కానీ బెంగాల్లో మాత్రం కాంగ్రెస్ వేలు పెడతానంటే ఒప్పుకునే ప్రసక్తే లేదు'' అంటూ ఆమె కుండబద్దలు కొట్టారు. జాతీయ స్థాయిలో విపక్షాల వ్యూహం ఎలా ఉండాలో కూడా లోక్‌సభ ఎన్నికల తర్వాతే నిర్ణయించుకుంటామని చెప్పుకొచ్చారు. ''బీజేపీని సమష్టిగా ఎదుర్కొనే విషయంలో ప్రాంతీయ పార్టీలన్నీ ఒక్క తాటిపై ఉంటాయి. దాన్ని ఓడించేందుకు అవసరమైన అన్ని ప్రయత్నాలూ చేస్తాం'' అని స్పష్టం చేశారు. అయితే, విపక్ష కూటమి ఏ ఒక్క పార్టీకో చెందబోదంటూ కాంగ్రెస్‌పై నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. రాహుల్ యాత్ర శుక్రవారం బెంగాల్లోకి ప్రవేశించనున్నా కనీసం మర్యాద కోసమన్నా దానిపై కాంగ్రెస్ తనకు సమాచారం కూడా ఇవ్వలేదని దీదీ ఆరోపించారు. మమత ప్రకటన బహుశా ఇండియా కూటమి వ్యూహంలో భాగమై ఉండొచ్చని మరో భాగస్వామ్య పార్టీ ఎన్సీపీ (శరద్ పవార్) అభిప్రాయపడింది!

పెళ్లికి ముందే విడాకులు: బీజేపీ

మమత ప్రకటనను విపక్ష ఇండియా కూటమికి చావుదెబ్బగా బీజేపీ అభివర్ణించింది. ''విపక్షాలది కేవలం కాగితపు కూటమేనని మరోసారి రుజువైంది. వాటి రాజకీయ వివాహం పూర్తిగా జరగక ముందే విడాకుల దాకా వెళ్లింది'' అంటూ ఎద్దేవా చేసింది. మమత ప్రకటన ఆమెలో నిరాశా నిస్పృహలకు కూడా అద్దం పట్టిందని పేర్కొంది.



బుధవారం అసోంలోని బొంబైగావ్‌లో ఓ చిన్నారితో రాహుల్ ముచ్చట్లు

పాతిక కేసులు పెట్టుకోండి: రాహుల్

బార్పేట(అస్సాం): అస్సాంలో హిమంత బిశ్వ శర్మ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ తనపై మోపిన కేసులకు భయపడేది లేదని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. నాగాలాండ్ నుంచి అస్సాంలోని గువాహటిలోకి భారత్ జోడో న్యాయ్ యాత్ర అడుగుపెట్టకుండా పోలీసులు అడ్డుకున్నపుడు జరిగిన ఘర్షణలకు రాహుల్ కారకుడంటూ హిమంత సర్కార్ కేసులు పెట్టడం తెల్సిందే. అస్సాంలో ఏడు రోజుల యాత్ర బర్‌పేటా జిల్లా కేంద్రంలో బుధవారం ప్రారంభించిన సందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన తొలి బహిరంగ సభలో సీఎంపై రాహుల్ విమర్శలు ఎక్కుపెట్టారు. ''కేసులు పెట్టి నన్ను బయపెట్టొచ్చన్న ఐడియా హిమంతకు ఎందుకు వచ్చిందో నాకైతే తెలీదు. మీరు(హిమంత, పోలీసులు) ఎన్ని కేసులు పెడతారో పెట్టండి. మరో పాతిక తప్పుడు కేసులు బనాయించండి. నేను అస్సలు భయపడను. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ నన్ను భయపెట్టలేవు'' అని అన్నారు. హిమంతను అతిపెద్ద అవినీతి సీఎంగా అభివర్ణించారు. '' మీరు ఆయనతో మాట్లాడుతుంటే ఆలోపు మీ భూమి కొట్టేస్తారు. మీరు వక్కపలుకులు నమిలినంత తేలిగ్గా ఆయన సుపారీ బిజినెస్ కానచ్చేస్తారు. మీ జేబులో డబ్బు నొక్కేస్తారు. ఏకంగా కజిరంగా నేషనల్ పార్క్ స్థలాలనే సీఎం ఆక్రమించారు. సీఎంతో జాగ్రత్త' అని జనాన్ని అప్రమత్తం చేశారు.

ఎన్నికలయ్యాక లోపలేస్తాం: సీఎం

మంగళవారం నాటి ఘర్షణలకు సంబంధించిన కేసులో రాహుల్‌ను లోక్‌సభ ఎన్నికల తర్వాత అరెస్ట్ చేస్తామని సీఎం హిమంత చెప్పారు.

కొనసాగుతున్న భక్తుల వరద

అయోధ్యకు లక్షలాదిగా రాక
- నియంత్రణకు సర్కారు చర్యలు
- బస్సుల రాకపోకలపై నిషేధం

అయోధ్య/లఖ్‌నవూ: అయోధ్యకు భక్తుల వరద కొనసాగుతూనే ఉంది. బుధవారం కూడా మధ్యాహ్న సమయానికే దాదాపు 3 లక్షల మంది బాలక్ రామ్ దర్శనం చేసుకున్నట్టు శ్రీరామ జన్మభూమి ట్రస్టు వర్గాలు తెలిపాయి. మంగళవారం తొలి రోజు 5 లక్షల మందికి పైగా దర్శనాలు చేసుకున్న విషయం తెలిసిందే. బుధవారం కూడా తెల్లవారుజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. వణికిస్తున్న చలిని కూడా లెక్కచేయకుండా క్యూ లైన్లలో భారీగా బారులు తీరారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు. వారికి తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. మరోవైపు, అయోధ్యకు దారితీసే హైవేలు, ప్రధాన రహదారులన్నీ వాహనాలతో కిటకిటలాడుతున్నాయి. రానున్న రెండు మూడు రోజుల్లో భక్తుల ప్రవాహం మరింత పెరిగేలా ఉండటంతో ఉత్తరప్రదేశ్ సర్కారు రంగంలోకి దిగింది. భక్తుల సంఖ్యను నియంత్రించేందుకు పలు చర్యలు చేపడుతోంది. వాటిలో భాగంగా అయోధ్యకు యూపీ రోడ్డు రవాణా సంస్థ బస్సుల రాకపోకలను తాత్కాలికంగా నిలిపేసింది. నగరానికి ప్రైవేటు బస్సుల రాకపోకలపైనా నిషేధం విధించారు. వీఐపీలు అయోధ్య సందర్శనను వీలైనంత కాలం వాయిదా వేసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

గర్భాలయంలోకి వానరం
హనుమ ఆశీర్వాదమే: ట్రస్టు

అయోధ్య రామాలయంలో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం ఆరు గంటల వేళ ఓ వానరం దక్షిణ ద్వారం గుండా గర్భాలయంలోకి ప్రవేశించింది. లోపల కలియదిరిగింది. రామ్ లల్లా ఉత్సవ విగ్రహం చెంతకు వెళ్లింది. విగ్రహాన్ని పడేస్తుందేమోనని లోనికొచ్చిన భద్రతా సిబ్బందిని చూస్తూ నింపాదిగా తూర్పు ద్వారం గుండా బయటికి వెళ్లింది. బారులు తీరిన భక్తుల కేసి చూస్తూ వెళ్లిపోయింది. దీనికి సంబంధించిన వీడియోను క్షేత్ర ట్రస్టు ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఆ వానరం తీరు అచ్చం మనిషినే తలపించిందని భద్రతా సిబ్బంది గుర్తు చేసుకున్నారు. బహుశా హనుమంతుడే బాలక్ రామ్ దర్శనార్థం వచ్చినట్టుందని వారు అభిప్రాయపడ్డారు.

మంత్రులూ, ఫిబ్రవరిలో వెళ్లొద్దు: మోదీ

భక్తులు పోటెత్తుతున్న నేపథ్యంలో ఫిబ్రవరిలో అయోధ్య సందర్శన యోచన మానుకోవాల్సిందిగా కేంద్ర మంత్రులను ప్రధాని మోదీ కోరినట్టు సమాచారం. బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ భేటీ ఇందుకు వేదికైంది. ఇప్పటికిప్పుడు వారు అయోధ్యలో పర్యటిస్తే ప్రొటోకాల్స్ తదితరాలతో భారీగా వస్తున్న సాధారణ భక్తులకు ఇబ్బందికరంగా మారవచ్చని అభిప్రాయపడ్డారు. అయోధ్య రామ మందిర ప్రారంభం, రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠపై భక్తుల ఫీడ్‌బ్యాక్ గురించి మంత్రులను అడిగి తెలుసుకున్నారు.

అయోధ్యలో హెలికాప్టర్ దర్శనాలు

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్య సందర్శనార్థం యూపీలో పలు నగరాల నుంచి హెలికాప్టర్ సర్వీసులను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. గోరఖ్‌పూర్, వారణాసి, లక్నో, మథుర, ఆగ్రా, ప్రయాగ్‌రాజ్ నుంచి ఈ సేవలుంటాయి. ఆయా నగరాల నుంచి వచ్చే హెలికాప్టర్ల ల్యాండింగ్ కోసం అయోధ్యలో సరయూ నదీ తీరంలో నూతన హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. అయోధ్య, హనుమాన్ గఢి, సరయూ నదీ ప్రాంతాల విహంగ వీక్షణంకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ ఏరియల్ టూర్‌కు ఒక్కొక్కరికి రూ.3,539 వసూలు చేస్తారు. ఏరియల్ టూర్ ఒకేసారి ఐదుగురు చూడొచ్చు.

జన నాయకుడు మోదీ

కేంద్ర కేబినెట్ ప్రశంసలు
- అయోధ్యలో రామ మందిర ప్రతిష్టాపనతో నూతన శకానికి నాంది పలికారు
- జాతి శతాబ్దాల కలను సాకారం చేశారు
- ప్రధానికి కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం


న్యూఢిల్లీ: అయోధ్యలో రామాలయ ప్రారంభ కార్యక్రమాన్ని జయప్రదంగా నిర్వహించినందుకు ప్రధాని నరేంద్ర మోదీపై కేంద్ర కేబినెట్ ప్రశంసల వర్షం కురిపించింది. ఆ సందర్భంగా దేశ ప్రజలు మోదీపై కనబరచిన ప్రేమ, ఆప్యాయతలు ఆయన నిజమైన జననాయకుడని మరోసారి నిరూపించాయని పేర్కొంది. ''రామ మందిరం కోసం ప్రజలంతా కలసికట్టుగా ఉద్యమించిన తీరు కొత్త తరానికి తెర తీసింది. ఇదంతా మోదీ దార్శనికతతోనే సాధ్యపడింది'' అని పేర్కొంది. భరత జాతి శతాబ్దాల కలను సాకారం చేసినందుకు మోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ కేబినెట్ ఈ సందర్భంగా తీర్మానం చేసింది. తీర్మాన ప్రతిని బుధవారం జరిగిన కేబినెట్ భేటీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చదివి వినిపించారు. ''1947లో దేశానికి భౌతికంగా మాత్రమే స్వాతంత్ర్యం వచ్చింది. దాని ఆత్మకు మాత్రం ఇన్నేళ్ల తర్వాత 2024 జనవరి 22న రామ్ లల్లా విగ్ర ప్రతిష్టాపన ద్వారా ప్రాణప్రతిష్ఠ జరిగింది. ప్రజలు కనబరిచిన ప్రేమాభిమానాల ద్వారా మీరు జననాయకునిగా సుప్రతిష్ఠితులయ్యారు. రామ మందిర ప్రతిష్టాపన ద్వారా కొత్త తరానికి తెర తీసిన దార్శనికుడయ్యారు'' అంటూ మోదీపై తీర్మానం ప్రశంసలు కురిపించింది. ''ప్రజల్లో ఇంతటి ఐక్యత గతంలో దేశంలో ఎమర్జెన్సీ విధించిన సందర్భంగా కన్పించింది. అది ఒక నియంతను ఎదిరించేందుకు జరిగిన ఉద్యమం. ఇదేమో దేశంలో నూతన శకానికి అయోధ్య రాముని సాక్షిగా నాంది పలికిన చరిత్రాత్మక క్షణాలకు సాక్షిగా నిలిచిన ఐక్యత'' అని పేర్కొంది. ఈ సందర్భంగా కేబినెట్ భేటీలో ఆసాంతం భావోద్వేగాలు ముప్పిరిగొన్నాయని ఒక మంత్రి తెలిపారు. రాముని ప్రాణప్రతిష్ఠకు సాక్షిగా నిలిచిన మంత్రివర్గంలో భాగస్వాములుగా ఉండటం గర్వకారణమని కేబినెట్ సభ్యులంతా అభిప్రాయపడ్డట్టు చెప్పారు. ఇది కొన్ని జన్మలకు ఒకసారి మాత్రమే లభించే అరుదైన అవకాశమన్నారు.

ఆ ప్రాజెక్టులకు రూ.8,500 కోట్లు


రసాయనాల ఉత్పత్తిని దేశీయంగా పెంచడం ద్వారా వాటి దిగుమతిని తగ్గించుకునే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు రూ.8,500 కోట్ల ఆర్థిక సాయం అందజేయాలని నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో బుధవారం జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశం ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. అలాగే కోల్ ఇండియా, గెయిల్ భాగస్వామ్యంలో రూ.13,052 కోట్ల కోల్-ఎస్ఎన్‌జీ (సింథటిక్ నేచురల్ గ్యాస్), సీఐఎల్, బీహెచ్ఈఎల్ భాగస్వామ్యంలో రూ.11,782 కోట్ల కోల్-అమ్మోనియం నైట్రేట్ ప్రాజెక్టుల ఏర్పాటుకు కూడా ఆమోదం తెలిపింది.

ప్రైమరీలో ట్రంప్‌కు మరో గెలుపు

న్యూ హ్యాంప్‌షైర్ రాష్ట్ర ప్రైమరీలోనూ నిక్కీ హేలీకి చుక్కెదురు



ట్రంప్



నిక్కీ హేలీ

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం కోసం జరుగుతున్న ప్రైమరీల్లో డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఇప్పటికే అయోవా ప్రైమరీలో గెల్చిన ఆయన బుధవారం న్యూ హ్యాంప్‌షైర్ ప్రైమరీలోనూ నెగ్గారు. అయితే భారతీయ అమెరికన్ నాయకురాలు నిక్కీ హేలీ ఆయనకు గట్టిపోటీ ఇచ్చారు. ట్రంప్‌కు 55 శాతానికి పైగా ఓట్లు రాగా ఆమె 44 శాతం సాధించారు. న్యూ హ్యాంప్‌షైర్ ప్రైమరీని మూడుసార్లు గెలిచిన తొలి రిపబ్లికన్ ప్రైమరీ అభ్యర్థిగా ట్రంప్ చరిత్ర సృష్టించారు.

ట్రంప్‌కిస్తే గెలుపు బైడెన్‌దే: హేలీ

తాజా ఫలితాలపై నిక్కీ హేలీ మాట్లాడారు. 'హ్యాంప్‌షైర్‌లో గెల్చిన ట్రంప్‌కు శుభాకాంక్షలు. అయినా ఇంకా డజన్ల కొద్దీ రాష్ట్రాల ప్రైమరీ ఎన్నికలు జరగాల్సే ఉంది. పార్టీ ఓటర్ల అంతిమ తీర్పు వెలువడటానికి ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. ఈ పోటీలో నేను చిట్టచివరిదాకా పోరా డతా. రేస్‌లో కొనసాగుతా. ఈ పోరు మొదలైనప్పుడు రేసులో మొత్తం 14 మంది ఉండేవాళ్లం. నాకు రెండు శాతం ఓట్లు వచ్చేవి. ఇప్పుడు ట్రంప్‌కు గట్టి పోటీ ఇస్తున్నది నేను మాత్రమే' అని హేలీ ప్రసంగించారు. ''ట్రంప్‌కు రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిత్వం దక్కాలని డెమొక్రాట్లు కోరుకుంటున్నారు. ట్రంప్‌ను అయి తే తేలిగ్గా ఓడించవచ్చని వారి ఆశ. నిజంగా ట్రంప్‌కు అభ్యర్థిత్వం దక్కి తే బైడెన్, కమలా హ్యారిస్‌ల విజయం తథ్యం'' అని హేలీ అన్నారు. మరోవైపు, ''ఈ రోజు హేలీకి కాళరాత్రి. అయినా తానే గెల్చినట్లు ప్రసంగాలు దంచేస్తోంది'' అని ట్రంప్ ఎద్దేవా చేశారు. సౌత్ కరోలినాలో డెమొక్రటిక్ పార్టీ ప్రైమరీలో అధ్యక్షుడు బైడెన్ నెగ్గారు.

మమతకు త్రుటిలో తప్పిన ప్రమాదం

రోడ్డు ప్రమాదంలో తలకు స్వల్ప గాయం

బర్ధమాన్(పశ్చిమబెంగాల్): అధికారిక పర్యటన ముగించుకుని తిరుగుపయనమైన పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ త్రుటిలో రోడ్డు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో తలకు చిన్న గాయమైంది. వేరే వాహనంలో ఆమెను కోల్‌కతాకు తరలించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మమత బుధవారం పశ్చిమబెంగాల్‌లోని పుర్బా బర్ధమాన్ పట్టణంలో పరిపాలనా సంబంధ సమీక్ష సమావేశంలో పాల్గొని కోల్‌కతాకు పయనమయ్యారు. కాన్వాయ్ కారు ముందు సీటులో కూర్చున్నారు. సీఎం కాన్వాయ్‌లోకి హఠాత్తుగా గుర్తు తెలియపి వాహనం అడ్డుగా రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో మమత ముందు అద్దానికి గుద్దుకున్నారు. దీంతో తలకు స్వల్ప గాయమైంది. వెంటనే ఆమెను వేరే వాహనంలో తరలించామని, ప్రమాదమేమీ లేదని అధికారులు తెలిపారు.

ఫిబ్రవరి 16న భారత్ బంద్

వాణిజ్య, రవాణా రంగాలూ కలిసి రావాలన్న రాకేశ్ తికాయత్

నోయిడా: రైతు సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ఫిబ్రవరి 16వ తేదీన భారత్ బంద్‌ను పాటించనున్నట్లు రైతు సంఘాలు ప్రకటించాయి. పంటలకు కనీస మద్దతు ధర సంబంధ చట్టం అమలుసహా రైతాంగ కీలక సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త బంద్ పాటించాలని భారతీయ కిసాన్ యూనియన్(బీకేయూ) జాతీయ అధికార ప్రతినిధి రాకేశ్ తికాయత్ పిలుపునిచ్చారు. మంగళవారం ముజఫర్‌నగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. '' సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం)సహా దేశంలోని అన్ని రైతు సంఘాలు ఆ రోజు భారత్ బంద్‌లో పాల్గొంటాయి. ఆ రోజు రైతులు తమ పొలం పనులకు వెళ్లకండి. ఒక్క రోజు పనులకు సమ్మె పాటించండి. పొలాల్లో అమావాస్య రోజున రైతులు పనులకు వెళ్లరు. అలాగే ఫిబ్రవరి 16 కూడా రైతులకు అమావాస్యే. వర్తకసంఘాలు, రవాణా సంస్థలు ఆరోజు వ్యాపార కార్యకలాపాలు నిలిపేయాలని కోరుకుంటున్నా. దుకాణాలను మూసేయండి. రైతులు, కార్మికులకు మద్దతుగా నిలబడండి'' అని తికాయత్ విజ్ఞప్తిచేశారు.

సౌదీలో తొలి మద్యం దుకాణం

ముస్లిమేతర దౌత్యాధికారులకు మాత్రమే

రియాద్: మద్యపాన నిషేధాన్ని పాటించే సౌదీ అరేబియాలో మొట్టమొదటి సారిగా ఆల్కాహాల్ విక్రయ కేంద్రం తెరుచుకోనుంది. ముస్లిమేతర దౌత్యవేత్తల వినియోగం కోసం ఈ మద్యం స్టోర్‌ను తెరవనున్నారు. సంబంధిత మొబైల్ యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న మద్యం ప్రియులు మాత్రమే అక్కడ మద్యం కొనుగోలుచేసేందుకు అర్హులు. సౌదీ అరేబియా విదేశాంగ శాఖ దీనిని అనుమతులు ఇస్తుంది. నెలవారీ కోటా పరిమితి ప్రకారమే వినియోగదారులకు మద్యాన్ని విక్రయిస్తారు. పర్యాటకం, వాణిజ్యం ఊపందుకునేందుకు వీలుగా రియాద్ నగరంలో మద్యం అమ్మకాలు పెరగాలన్న సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ఆదేశాల మేరకే ఈ స్టోర్ ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. రియాద్‌లో వివిధ దేశాల ఎంబసీలు, రాయబార కార్యాలయాలకు నిలయమైన ప్రాంతంలో ఈ స్టోర్‌ను మరి కొద్ది వారాల్లో ప్రారంభించనున్నారు.

యువత 'కర్పూరి' బాటన సాగాలి: మోదీ

న్యూఢిల్లీ: ఈసారి గణతంత్ర పరేడ్ మహిళా శక్తికి అద్దం పట్టడం ద్వారా ప్రత్యేకతను చాటనుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఎన్‌సీసీ కేడెట్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఆయన బుధవారం ముచ్చటించారు. ''బిహార్ మాజీ సీఎం దివంగత కర్పూరీ ఠాకూర్ జీవితం గురించి తెలుసుకోండి. ఆయన ఆచరించి చూపిన మానవీయ విలువలను పుణికిపుచ్చుకోండి. ఆయన ఆదర్శాలను జీవితంలో భాగంగా మలచుకోండి. తద్వారా మీ వ్యక్తిత్వం ఆకాశమంత ఎదుగుతుంది'' అని యువతకు సూచించారు. దేశం ముందనే భావనతో సాగాలని పేర్కొన్నారు. దుర్భర దారిద్ర్యంలో జన్మించినా మొక్కవోని కృషి, పట్టుదలతో ఠాకూర్ సీఎం స్థాయికి ఎదిగారని మోదీ చెప్పారు.



బిహార్ దివంగత సీఎం కర్పూరి ఠాకూర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం పోస్టల్ స్టాంపు విడుదల చేస్తున్న అమిత్ షా

నిరుపేదలకు గౌరవం: అమిత్ షా

న్యూఢిల్లీ: బిహార్ దివంగత సీఎం కర్పూరి ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడం దేశంలోని కోట్లాది మంది నిరుపేదలు, వెనకబడ్డ వర్గాలు, దళితులకు నిజంగా గొప్ప గౌరవమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కొనియాడారు. అయోధ్యలో రామ్ లల్లా విగ్రహ ప్రతిష్టాపన ద్వారా వందలాది ఏళ్ల నిరీక్షణకు తెర దించిన ప్రధాని నరేంద్ర మోదీ, ఆ మర్నాడే ఈ నిర్ణయం తీసుకోవడం నిజంగా అభినందనీయమన్నారు. బుధవారం ఇక్కడ ఠాకూర్ శతజయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. కర్పూరి స్ఫూర్తితో అన్ని వర్గాలనూ సమాదరిస్తూ మోదీ ప్రభుత్వం సాగుతోందన్నారు. ముఖ్యంగా ఓబీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. కేంద్ర మంత్రివర్గంలో 27 మంది ఓబీసీలేనన్నారు.

చైనాలో అగ్ని ప్రమాదం.. 39 మంది బలి

బీజింగ్/నాన్‌చాంగ్: తూర్పు చైనాలోని జియాంగ్జీ ప్రావిన్స్‌లో బుధవారం ఒక దుకాణసముదాయంలో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. గ్జిన్‌యూ నగరంలోని ఈ భవన సమదాయంలో ఇంకా కొందరు చిక్కుకున్నారని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారిక గ్జియాన్ హువా వార్తాసంస్థ తెలిపింది. ఈ ఘటనలో తొమ్మిది మంది గాయపడ్డారు.

సహచరులపైకి సైనికుని కాల్పులు

ఆరుగురిని గాయపరిచి ఆత్మహత్య

ఇంఫాల్: అసోం రైఫిల్స్‌కు చెందిన సైనికుడు మణిపూర్‌లో సహచర సైనికులపైకి కాల్పులకు తెగబడ్డాడు. ఆరుగురిని గాయపరిచి తనను తాను కాల్చుకుని చనిపోయాడు. ఈ విషాద ఘటన సజిక్ తంపక్ ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. మణిపూర్‌లో కొనసాగుతున్న జాతుల హింసతో దీనికి సంబంధం లేదన్నారు. ''గాయపడ్డ వారు ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. వారి పరిస్థితి నిలకడగా ఉంది'' అని తెలిపారు.

రష్యాలో విమానం కూలి 74 మంది మృతి

65 మంది ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలున్నారు: రష్యా

ఖైదీల్లేరు... క్షిపణులున్నాయి: ఉక్రెయిన్

మాస్కో: రష్యాలో బెల్గొరోడ్ రీజియన్‌లో బుధవారం సైనిక విమానం కుప్పకూలింది. ఉక్రెయిన్‌తో యుద్ధ ఖైదీల మార్పిడి కోసం ఆ దేశ సైనికులను తీసుకెళ్తుండగా దాడి జరిగిందని రష్యా ఆరోపించింది. ''65 మంది ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలు, ఆరుగురు విమాన సిబ్బంది, ముగ్గురు సహాయకులు దుర్మరణం పాలయ్యారు. సొంత సైనికులనే ఉక్రెయిన్ పొట్టనబెట్టుకుంది'' అని ఆరోపించింది. విమానంలో యుద్ధ ఖైదీల్లేరని, తమపై దాడికి క్షిపణులను తరలిస్తున్నందుకే కూల్చేశామని ఉక్రెయిన్ పేర్కొంది.

యుద్ధానికి 700 రోజులు: ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి 700 రోజులు పూర్తయింది. ఉక్రెయిన్ దాడుల్లో రష్యా ఎన్నో సైనిక విమానాలను కోల్పోయింది. విపరీతమైన చలి కారణంగా ప్రస్తుతం వైమానిక దాడులకే రెండు దేశాలు ప్రాధాన్యతనిస్తున్నాయి. రష్యా క్షిపణి దాడులపై దృష్టి పెట్టడంతో గగనతల రక్షణ వ్యవస్థను పటిష్టపరుచుకుంటామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. ఉక్రెయిన్‌కు సీ కింగ్ ఎంకే41 బహుళ ప్రయోజన యుద్ధ హెలికాప్టర్లను పంపుతున్నట్లు జర్మనీ బుధవారం ప్రకటించింది.

క్లుప్తంగా...

ఎన్జీ రంగా వర్సిటీలో పరిశోధనలు భేష్

- మా విద్యార్థులనూ ఇక్కడికి పంపుతాం
- నెల్లూరు శాస్త్రవేత్తలను ప్రశంసించిన అమెరికా ప్రొఫెసర్లు



నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన క్షేత్రాన్ని పరిశీలిస్తున్న అమెరికా ప్రొఫెసర్లు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధనా క్షేత్రంలోని పరిశోధనలు చాలా బాగున్నాయని, అమెరికాలోని టెన్నెసీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్స్ దిలీప్ నందు వాణి, ప్రొఫెసర్ జాన్ రికార్డ్స్ ప్రశంసించారు. నెల్లూరు నగరంలోని పరిశోధనా క్షేత్రాన్ని బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానాలను తాము పరిశీలించామని, అన్నిచోట్ల చాలా బాగున్నాయని కొనియాడారు. అదేవిధంగా నెల్లూరులో ఉన్న ఎన్జీ రంగా పరిశోధనా క్షేత్రంలో పరిశోధనలు తమకు ఎంతో సంతృప్తినిచ్చాయని వివరించారు. తమ ప్రాంతంలో ఉన్న విద్యార్థులను కూడా నెల్లూరులోని పరిశోధనా క్షేత్రానికి పంపి ఇక్కడి స్థితిగతులను తెలుసుకునేలా చేస్తామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కోదండరామిరెడ్డి, డాక్టర్ గురవారెడ్డి, డాక్టర్ సి.రమణ, ప్రధాన శాస్త్రవేత్త వినీత ఈ బృందానికి క్షేత్రంలో చేస్తున్న పరిశోధనలను వివరించారు. ప్రధానంగా కొత్త వంగడాలు, తెగుళ్ల నివారణపై కూలంకషంగా వివరించారు.

ఆరోగ్య సంరక్షణ నాయకులుగా ఉండాలి

వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ బాబ్జీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ బాబ్జీ

సాక్షి, అమరావతి: మన వైద్య విద్యార్థులు దేశ, విదేశాల్లో ఆరోగ్య సంరక్షణ నాయకులుగా ఉండాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ కోరుకొండ బాబ్జీ ఆకాంక్షించారు. మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఆరో వ్యవస్థాపక దినోత్సవం బుధవారం నిర్వహించారు. గౌరవ అతిథి డాక్టర్ బాబ్జీ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అవయవ మార్పిడి సేవలను ప్రారంభించాలని సూచించారు. జన్యు చికిత్సతో సహా అధునాతన పరిశోధనలోనూ ఎయిమ్స్ కీలక పాత్ర పోషించాలన్నారు. ఎయిమ్స్ డీన్ (అకడమిక్) డాక్టర్ శ్రీమంతకుమార్ దాస్, ఎయిమ్స్ ప్రెసిడెంట్ డాక్టర్ రవికుమార్, డైరెక్టర్, సీఈవో మధబానందకర్ పాల్గొన్నారు.

29 నుంచి అంబేడ్కర్ వర్సిటీ 'బీఈడీ' కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) ప్రవేశాల కౌన్సెలింగ్‌ను ఈ నెల 29, 30న నిర్వహిస్తున్నట్లు వర్సిటీ అభ్యాసక సహాయ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి తెలిపారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వారు హైదరాబాద్‌లోని వర్సిటీ ప్రాంగణంలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు. 29న విజువల్ ఇంపారిమెంట్ (వీఐ), హియరింగ్ ఇంపారిమెంట్ (హెచ్ఐ), 30న ఇంటలెక్చువల్ డిజేబిలిటీ (ఐడీ) అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఆయా కేంద్రాల్లోని సీట్లను 15% అన్ని ప్రాంతాల వారికి మెరిట్ ఆధారంగా కేటాయించడంతో పాటు మిగిలిన సీట్లు స్థానికులకు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ చేసుకోని వారు కౌన్సెలింగ్‌లో రూ.500 చెల్లించవచ్చన్నారు. ఏ ప్రత్యేకాంశంలోనైనా సీట్లు మిగిలిపోతే ఇతర ప్రత్యేకాంశాన్ని ఎంపిక చేసుకున్న వారు కూడా మార్చుకుని అడ్మిషన్ పొందే అవకాశం కల్పిస్తున్నామన్నారు. వివరాలకు www.braouonlin.in, www.braou.ac.inను సందర్శించాలని కోరారు.

నిరంతరాయంగా ఆరోగ్యశ్రీ సేవలు

ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం



సాక్షి, అమరావతి: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సేవలను యథావిధిగా ప్రజలకు అందిస్తామని, సేవలు నిలిపివేస్తున్నట్లు జరుగుతోన్న ప్రచారంతో తమకు ఏ సంబంధం లేదని ఏపీ ఆరోగ్యశ్రీ ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తమ అసోసియేషన్ పరిధిలో రాష్ట్ర వ్యాప్తంగా 1,150 ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయని వాటిల్లో సేవలు నిరంతరాయంగా అందుతాయని చెప్పారు. ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సేవలు నిలిపివేస్తున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. సీఎం జగన్ ప్రభుత్వం పథకానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రొసీజర్‌లను భారీగా పెంచడమే కాకుండా, రోగులకు మెరుగైన సేవలు అందించడానికి ఏ మాత్రం రాజీ లేకుండా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

తెలుగు తమ్ముళ్ల తన్నులాట

శ్రీకాకుళం నడిబొడ్డున టీడీపీ మూకల వీరంగం.. ప్రధాన రహదారిపై రెండు గ్రూపుల ఘర్షణ

- టికెట్ విషయంలో ఇరువర్గాలను రెచ్చగొడుతున్న టీడీపీ అధిష్టానం
- బాహాబాహీకి దిగిన టికెట్ ఆశావహుల అనుచరులు
- భయాందోళనకు గురైన స్థానిక ప్రజలు



శ్రీకాకుళంలోని ప్రధాన పాలకొండ రహదారిపై గొడవ పడుతున్న శంకర్ అండ్‌కో, గుండ లక్ష్మీదేవి అనుచరులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: 'నువ్వెవడివి? నువ్వు ఎక్కడోడివి? నీకిక్కడేం పని? నువ్వు ఇన్‌చార్జివా? ఇన్‌చార్జి లేకుండా కార్యక్రమం ఏంటి? వేషాలు వేయకండి. తమాషా చేస్తున్నారా.. ఎక్కువ చేస్తే తరిమి తరిమి కొడతాం.' ఇదీ శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ నాయకుల భాష. శ్రీకాకుళం నగరంలోని టీడీపీలోని రెండు గ్రూపులు పాలకొండ రోడ్డుపై న్యూసెన్స్ చేశాయి. ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు నడిరోడ్డుపైనే బాహాబాహీకి దిగారు. ఒకరినొకరు తోసుకుని నువ్వెంతంటే నువ్వెంత అని ఘర్షణ పడ్డారు. నియోజకవర్గ టికెట్ ఆశిస్తున్న గొండు శంకర్‌పై మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అనుచరులు దాడికి దిగారు. బలవంతంగా తోసేసి అక్కడి నుంచి వెళ్లగొట్టారు. గంటకు పైగా ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేశారు.

ఐదేళ్లుగా వర్గపోరు..

శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీలో రెండు గ్రూపులు ఉన్నాయి. ఒక గ్రూపునకు మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి నాయకత్వం వహించగా, మరో గ్రూపునకు రూరల్ నాయకుడు గొండు శంకర్ నేతృత్వం వహిస్తున్నారు. వీరిద్దరి మధ్య ఐదేళ్లుగా వర్గపోరు నడుస్తోంది. పలుమార్లు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుని పోలీసు స్టేషన్‌ల వరకు వెళ్లారు. తాజాగా శ్రీకాకుళం కేంద్రంగా మరోసారి రోడ్డెక్కారు. రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇరువురు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. అధిష్టానం కూడా స్పష్టత ఇవ్వకుండా ఇద్దర్ని రెచ్చగొడుతోంది. టికెట్ తమకే అంటూ ఇద్దరూ ఆశతో కార్యక్రమాలు చేసుకుంటున్నారు.

నడిరోడ్డుపైనే వీరంగం..

ఈక్రమంలో బుధవారం ఉదయం శ్రీకాకుళం నగరంలోని రెల్లివీధిలో గొండు శంకర్ తన వర్గీయులతో కలిసి ఇంటింటికీ శంకరన్న కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఈ సమయంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండ లక్ష్మీదేవి అనుచరులైన పట్టణ టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, వార్డు ఇన్‌ఛార్జిలు కళ్యాణి వెంకటరావు, జలగడుగుల జగన్, కవ్వాడి సుశీల తదితరులు అక్కడికొచ్చి గొండు శంకర్‌ను అడ్డుకున్నారు. అతను పట్టించుకోకుండా ముందుకెళ్లడంతో గుండ లక్ష్మీదేవీ వర్గీయులు రెచ్చిపోయారు. గొండు శంకర్‌ను అక్కడి నుంచి నెట్టేశారు. ఆయన అనుచరులను తోసేశారు. ఈ తోపులాట ప్రధాన రహదారిపైకి వచ్చేసింది. ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. ఇరు వర్గాల వీరంగంతో అక్కడున్న ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అధికారంలో లేనప్పుడు వీరింత అలజడి సృష్టిస్తున్నారంటే.. ఒకవేళ అధికారమిస్తే ఇంకెంత రెచ్చిపోతారోనని స్థానికులు చర్చించుకున్నారు.

విద్యను వ్యాపారంగా మార్చింది బాబే

గజపతినగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: పేద కుటుంబాల బిడ్డలకు విద్యను అందుబాటులోకి తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తెచ్చుకోవాలని విజయనగరం జిల్లా గజపతినగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. విద్యను వ్యాపారంగా మార్చేసిన చంద్రబాబు మాటలు నమ్మి ఓటును దుర్వినియోగం చేస్తే పేదింటి బిడ్డల భవిష్యత్తు మళ్లీ అంధకారమే అవుతుందన్నారు. వైఎస్సార్ ఆసరా వారోత్సవాల్లో భాగంగా బుధవారం విజయనగరం జిల్లా గంట్యాడ మండలం కొఠారుబిల్లి కూడలి, పూసపాటిరేగ మండలం వెంకటసీతారామ డిగ్రీ కళాశాల ఆవరణలో లబ్ధిదారులకు నాలుగో విడత చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గంట్యాడ మండలంలోని 1,368 స్వయం సహాయక సంఘాలకు చెందిన 14,935 మంది మహిళలకు రూ.9.23 కోట్ల మొత్తానికి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయా మహిళలంతా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ తెచ్చుకోవడానికి తామంతా సిద్ధమంటూ చేతులెత్తి మద్దతు ప్రకటించారు. పూసపాటిరేగ మండలంలోని 1,575 స్వయం సహాయక సంఘాలకు చెందిన 17,635 మంది మహిళలకు రూ.12.33 కోట్ల మేర చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, రఘురాజు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రామంటున్న జనం.. టీడీపీలో కలవరం

టీడీపీ 'రా కదలిరా' సభలు కొన్ని రద్దు.. మరికొన్ని వాయిదా



సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఇటీవల 'రా కదలిరా' పేరిట ప్రారంభించిన సభలు అర్ధంతరంగా ఆపేస్తున్నారా... అంటే తమ్ముళ్లనుంచి ఔననే సమాధానం వస్తోంది. ఎంత ప్రయత్నించినా జనం రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. జనం ఏమాత్రం సానుకూలంగా లేకపోవడం... టీడీపీ నేతలు, క్యాడర్ ఆసక్తి చూపకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ముక్కుతూ మూలుగుతూ ఇప్పటివరకు 10 సభలు నిర్వహించినా మిగిలిన జిల్లాల్లో వాటిని నిర్వహించడం కష్టమని చెబుతున్నారు. నెలాఖరులోగా ఎలాగోలా కొన్ని చోట్ల సభలు నిర్వహించి.. మరికొన్ని చోట్ల రద్దు చేసి.. మరో కార్యక్రమం తలపెట్టాలని భావిస్తున్నారు. ఈ నెల 5వ తేదీన ఒంగోలుతో మొదలుపెట్టి 29వ తేదీ వరకూ షెడ్యూల్ ప్రకటించినా... జనం నుంచి స్పందన లేకపోవడంతో కొన్ని సభలు నిలిచిపోయాయి. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని జీడీ నెల్లూరు సభ, బుధవారం జరగాల్సిన రాజంపేట పార్లమెంటు పరిధిలోని పీలేరు, అనంతపురం పార్లమెంటు పరిధిలోని ఉరవకొండ సభలు వాయిదా పడ్డాయి. ఈ నెల 27న రాజమహేంద్రవరం పార్లమెంటు పరిధిలోని గోపాలపురంలో సభ నిర్వహించాల్సి వున్నా అక్కడ రద్దు చేసి 29న రాజమండ్రిలో నిర్వహించాలని నిర్ణయించారు.

సభలన్నీ అట్టర్ ఫ్లాపే

ఇప్పటివరకు నిర్వహించిన సభలన్నీ విఫలమవడంతో టీడీపీలో నైరాశ్యం నెలకొంది. తిరువూరు, కనిగిరి, ఆచంట, ఆళ్లగడ్డ, గుడివాడ తదితర సభలు జనం లేక వెలవెలబోయాయి. సభలు విజయవంతమైనట్లు ఎల్లోమీడియా ఎంతగా బూస్టప్ ఇచ్చినా వాస్తవానికి అవన్నీ ఫ్లాపేనని ఆ పార్టీ నేతలే అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. అరకులో పెట్టిన సభ తర్వాత ఇక నిర్వహించకపోవడమే మంచిదన్న అభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తోంది. చంద్రబాబు ప్రసంగంలో సీఎం జగన్‌పై ఈర్ష్య, ద్వేషంతో తిట్టిపోయడం తప్ప తాను అధికారంలో ఉన్నప్పుడు ఏమిటి చేశారో చెప్పలేకపోవడంతో జనం విసిగెత్తిపోతున్నారు. బాబు ప్రతి ఎన్నికల్లోనూ హామీలివ్వడం అధికారంలోకి వచ్చాక దానిని బుట్టదాఖలు చేయడంతో ప్రజలు ఈసారి హామీలను ఏమాత్రం నమ్మడం లేదు.

కార్యక్రమాలన్నీ విఫలమే...

బాబు ఏ కార్యక్రమం చేపట్టినా విఫలమవుతూనే ఉన్నాయి. బాదుడే బాదుడు,, ఆయన కుమారుడు లోకేశ్ నిర్వహించిన పాదయాత్ర ఈ కోవలోకే వస్తాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టయ్యాక ఆయన సతీమణి భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో నిర్వహించిన కార్యక్రమానికీ సరైన ఆదరణ లభించలేదు.

బాబుపై నమ్మకం పోయింది

జనం తనను నమ్మడం లేదని చంద్రబాబు కూడా గుర్తించారు. అందుకే జనసేనతో కలిసి వారిని నమ్మించాలనే ప్రయత్నం చేస్తున్నా అది కూడా ఆశించిన ఫలితాన్నివ్వలేదు. రా కదలిరా సభలకు పవన్ కల్యాణ్ హాజరుకాకపోవడం దీనికి నిదర్శనం. సీట్లు ఖరారు కాకుండా సభలకు ఎందుకెళ్లాలని పవన్ వెనుకడుగు వేస్తున్నట్లు చెబుతున్నారు. అందుకే రా కదలిరా సభలకు ఇక ఫుల్‌స్టాప్ పెట్టనున్నారు. త్వరలో మరో కొత్త పేరుతో, కొత్త కార్యక్రమం చేపట్టాలని యోచిస్తున్నా... అసలు జనాన్నిఆకర్షించలేకపోవడంతో ఏ పేరుతో కార్యక్రమం నిర్వహించినా ఉపయోగం ఏమిటనే అభిప్రాయాలు పార్టీలోనే వ్యక్తమవుతున్నాయి.

ఓర్వలేకే కుట్రపూరిత రాతలు

చంద్రబాబు కోసం రామోజీరావు కుట్రలు చూస్తే అసహ్యం వేస్తోంది

నా రాజకీయ భవిష్యత్తును దెబ్బతీసేందుకే తప్పుడు కథనాలు

అవాస్తవాలు రాసిన ఆ పత్రికపై పరువు నష్టం దావా

ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ఈనాడు కథనాలు అవాస్తవాలని వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: అబద్ధాల పునాదులపై నిలబడ్డ ఈనాడు దినపత్రిక అవాస్తవాలు ప్రచురిస్తూ, అమాయకుల వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా చేస్తున్న కుట్రలు చూస్తుంటే అసహ్యం వేస్తోందని శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. ప్రజల్లో తనకు వస్తున్న ఆదరాభిమానాలను చులకన చేసి, రాజకీయ భవిష్యత్తును దెబ్బతీసే విధంగా నిరాధార కథనాలు రాస్తున్న ఈనాడు అంతు చూస్తానని, పరువు నష్టం దావా వేసి చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. బుధవారం ధర్మవరం మండలం దర్శినమల గ్రామంలో వెంకటరామిరెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఈనాడు కథనంలో పేర్కొన్న అంశాలన్నీ అవాస్తవాలంటూ ఆధారాలతో సహా వివరించారు. ప్రతిరోజూ 'గుడ్‌మార్నింగ్ ధర్మవరం' పేరిట తాను నియోజకవర్గంలో తిరుగుతూ ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ వారిలో ఒకడిగా మమేకం అవుతున్నానని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని 2008 సంవత్సరం నుంచి తాను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్నప్పటి నుంచి చేస్తున్నానన్నారు. దీన్ని ఓర్వలేక స్థలాలు, భూములు కబ్జా చేసేందుకు తిరుగుతున్నానంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అలాగైతే రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేసిన నారా లోకేశ్, నియోజకవర్గంలో పాదయాత్ర చేసిన పరిటాల శ్రీరామ్, వరదాపురం సూరి ఎన్ని ఎకరాలు కబ్జా చేశారో చెప్పాలన్నారు. తనపై ఏ ఒక్క బాధితుడైనా ఫిర్యాదు చేశారా అని ప్రశ్నించారు. చంద్రబాబును గద్దె ఎక్కించేందుకు రామోజీరావు ఎంతటి నీచానికైనా దిగజారుతారని విమర్శించారు. గతంలోనూ తాను ఈనాడులో రాసిన కథనాలు తప్పుడు రాతలని కోర్టులో నిరూపించానన్నారు. పదేపదే తప్పుడు రాతలతో తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసి, రాజకీయంగా ఇబ్బందులకు గురి చేయాలని చూస్తే సహించేది లేదని, తగిన బుద్ధి చెబుతానని ఆయన హెచ్చరించారు.

మా పాఠశాలంటే ప్రభుత్వ పాఠశాల

ధర్మవరం పట్టణంలోని కార్పొరేట్ స్కూళ్లపై ఫిర్యాదులు రాగా.. నిబంధనల ప్రకారం నడుచుకునేందుకు తొమ్మిది నెలల సమయం ఇచ్చామని ఎమ్మెల్యే చెప్పారు. అప్పటికీ వారి తీరు మారకపోవడంతో కార్పొరేట్ పాఠశాలలు మూసివేయడం జరిగిందన్నారు. అంతేతప్ప టీడీపీ వాళ్లలాగా ఏ ఒక్కరితోనూ లాలూచీ పడలేదన్నారు. తాను 'గుడ్‌మార్నింగ్ ధర్మవరం'లో తిరుగుతున్నప్పుడు విద్యార్థులు ఎదురైతే 'మా స్కూల్లో చదవండి' అని చెబుతానని, మా స్కూల్ అంటే ప్రభుత్వ పాఠశాల అని వివరించారు. దీంతో తనకేవో పాఠశాలలున్నాయంటూ ఈనాడు తప్పుడు కథనాలు రాసిందన్నారు.

అలాగైతే శ్రీరాం, సూరి రూ. 200 కోట్ల పనులు చేసేవారా?

తన క్వారీలోనే కంకర కొనాలని ప్రజలను బెదిరిస్తున్నారనడం అవాస్తవమన్నారు. అదే నిజమైతే తన నియోజకవర్గంలో పరిటాల శ్రీరామ్‌కు చెందిన సిద్ధార్థ కంపెనీ, బీజేపీ నేత సూరికి చెందిన నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ రూ. 200 కోట్ల వరకూ విలువైన రైల్వే, బైపాస్‌రోడ్డు పనులు చేసేవా అని ప్రశ్నించారు. ఏ ఒక్కరైనా తన వద్ద కంకర కొనడం గానీ, పర్సంటేజీలు గానీ ఇచ్చారా అని ఆయన నిలదీశారు.

కబ్జా చేసినట్లు ఒక్క ఆధారమైనా ఉందా?

నియోజకవర్గంలో ఎక్కడైనా తాను సెంటు భూమి కబ్జా చేసినట్లు ఒక్కరైనా ఆరోపించారా అని వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. తాను రైతుల నుంచి భూమి కొనుగోలు చేసి తుంపర్తి వద్ద ఫాంహౌస్ కట్టుకున్నానని తెలిపారు. దాన్ని కూడా వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. తన ఫాంహౌస్‌లో ఆక్రమణలు లేవంటూ రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు ఇచ్చిన రిపోర్టును ఆయన ఈ సందర్భంగా చూపించారు. నియోజకవర్గంలో ఇసుకను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తుంటే ఇందులో ఎమ్మెల్యేకు ఏం సంబంధముందని ప్రశ్నించారు. గతంలో గరుడంపల్లి వద్ద సోలార్ కంపెనీని ఏర్పాటు చేయడానికి ఢిల్లీకి చెందిన వారు వస్తే.. అప్పటి ఎమ్మెల్యే వరదాపురం సూరి డబ్బులు భారీగా డిమాండ్ చేయడంతో ఆ కంపెనీ ఏర్పాటు చేయకుండానే వారు పారిపోయారన్నారు. ఆ తర్వాత వేరే ప్రైవేట్ కంపెనీ ఢిల్లీ వారి నుంచి భూములు కొనుగోలు చేసిందని, ఏడాది తర్వాత తాను మార్కెట్ ధర చెల్లించి ఆ భూములు కొన్నానని వివరించారు. ఇందులో తప్పేముందని ప్రశ్నించారు.

పేదలకు ఇళ్ల స్థలాల్లో సరికొత్త చరిత్ర

▶ మొదటి పేజీ తరువాయి

భారీ ఎత్తున మొదలు కానుంది. ఇందుకు సంబంధించిన ఆర్డినెన్స్ నేడో, రేపో జారీ కానుంది. ఈ లోపు రిజిస్ట్రేషన్లు చేసేందుకు రెవెన్యూ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం కింద వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో 31.19 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చింది. ఇందుకోసం 17 వేలకుపైగా వైఎస్సార్ జగనన్న కాలనీలు నిర్మించింది. గతంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినా వాటిపై పేదలకు హక్కులు దక్కేవి కాదు. డి-పట్టాలు కావడంతో అనుభవించడం మినహా వాటిపై సర్వ హక్కులు లేకపోవడంతో పేదలు వాటిని అవసరానికి వినియోగించుకునే అవకాశం ఉండేది కాదు. అందుకే ఇళ్ల పట్టాలు పొందిన పదేళ్ల తర్వాత వాటిపై లబ్ధిదారులు సర్వ హక్కులు పొందేలా ప్రభుత్వం అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించింది. ఇప్పుడు దాని ప్రకారమే 30 లక్షల ఇళ్ల స్థలాలకు సంబంధించిన యజమానులకు కన్వేయన్స్ డీడ్‌లు అందించనుంది. అంటే పట్టాలు పొందిన వారికి ఆ స్థలాలను రిజిస్టర్ చేయనుంది. దీంతో వారికి సర్వ హక్కులు లభిస్తాయి. ఈ పట్టాలు పదేళ్ల గడువు ముగిశాక ఆటోమేటిక్‌గా సేల్ డీడ్‌లుగా మారతాయి. నేరుగా ఆ స్థలాలను అమ్ముకోవడానికి, ఇతర ప్రయోజనాల కోసం వినియోగించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

పేదలు ఇబ్బంది పడకూడదనే..

చాలా ఏళ్ల క్రితం ఇచ్చిన డి-పట్టాలను క్రమబద్ధీకరించుకోవడం ప్రస్తుతం ఎంత కష్టమో తెలిసిన విషయమే. దానికి రెవెన్యూ శాఖ ఎన్‌ఓసీ ఇవ్వడం, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ శాఖ దాన్ని మార్చే ప్రక్రియ ఎంతో క్లిష్టంగా ఉంది. పేదలు అలా ఇబ్బందులు పడకుండా ఆ స్థలాలను వారి పేరుతోనే ఇప్పుడు ప్రభుత్వం రిజిస్టర్ చేసి కన్వేయన్స్ డీడ్‌లు ఇస్తోంది. పదేళ్ల తర్వాత అవి సేల్ డీడ్‌లుగా మారతాయి. ఇళ్ల పట్టాల చరిత్రలోనే ఇది గొప్ప ముందడుగు.

యుద్ధప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు..

ఈ నెల 27 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. ప్రభుత్వం తరఫున వీఆర్‌వో పేదలకు రిజిస్ట్రేషన్ చేస్తారు. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. పంచాయతీ కార్యదర్శులు, వార్డు పరిపాలన కార్యదర్శులు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా వ్యవహరించనున్నారు. సీఎం జగన్ ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన ఈ పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం మంగళవారం రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే నెల 9 కల్లా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు ఆయా మండలాల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల డేటా, లబ్ధిదారుల వివరాలు, వారికి కేటాయించిన ప్లాట్లు, వాటి నంబర్లు, హద్దులు పరిశీలించి రిజిస్ట్రేషన్లకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలిచ్చారు. జాయింట్ కలెక్టర్లు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలను సందర్శించి క్షేత్ర స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించింది. పేదలకిచ్చే కన్వేయన్స్ డీడ్‌లు సరిగా ఉన్నాయా లేదా, అందులో కచ్చితమైన డేటా ఉందా లేదా చూడడంతో పాటు రిజిస్ట్రేషన్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని ఆదేశించింది. రిజిస్ట్రేషన్ పూర్తవగానే అర్హులకు కన్వేయన్స్ డీడ్‌లను పంపిణీ చేయాలని స్పష్టం చేసింది. అవసరమైన ప్రింటింగ్ ఏర్పాట్లనూ పూర్తి చేసింది. ఈ కార్యక్రమం సజావుగా జరిగేందుకు అన్ని జిల్లా కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయనుంది. అక్కడి నుంచి జేసీలు గంట గంటకు రిజిస్ట్రేషన్ల కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆదేశించింది.

మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయం

- ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ఇప్పుడు విపక్షాల కూటమి పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి
- ఎవరెన్ని కుట్రలు పన్నినా వైఎస్ జగన్ వెంటే రాష్ట్ర ప్రజలు
- అట్టహాసంగా ఏపీడీడీసీఎఫ్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి బాధ్యతల స్వీకారం



సుధీర్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కాకాణి

సాక్షి, అమరావతి/ తాడేపల్లి రూరల్: త్వరలో జరిగే ఎన్నికల్లో మరోసారి ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. 2009లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌ను ఓడించేందుకు చంద్రబాబు నాయకత్వంలో విపక్షాలన్నీ ఏకమై మహా కూటమిగా తలపడితే ఫలితం ఏమైందో ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. అదే సీన్ 2024 ఎన్నికల్లో రిపీట్ కాబోతుందన్నారు. ఆ మహానేత తనయుడు సీఎం వైఎస్ జగన్‌ను ఓడించేందుకు మళ్లీ చంద్రబాబు నాయకత్వంలో విపక్షాలన్నీ కూటమి కడుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా సీఎం వైఎస్ జగన్ వెంట రాష్ట్ర ప్రజలు ఉన్నారని, వారే స్టార్ క్యాంపైనర్స్‌గా ఆయన తరఫున ఇంటింట ప్రచారం చేస్తారన్నారు. ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్‌గా చిల్లకూరు సుధీర్‌రెడ్డి బుధవారం మంగళగిరి ఏపీఐఐసీ భవన్‌లోని ఏపీడీడీసీఎఫ్ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి కాకాణి మాట్లాడుతూ.. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీలో తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు. జెండా మోసిన సామాన్య కార్యకర్తలు ఎంతో మంది ఈ నాలుగున్నరేళ్లలో గ్రామ సర్పంచ్ నుంచి పార్లమెంటు సభ్యుని వరకు అత్యున్నత పదవులు అధిరోహించగలిగారంటే అది ఒక్క వైఎస్సార్‌సీపీలో మాత్రమే సాధ్యమన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి అత్యున్నత పదవులు కట్టబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాల్లో విప్లవాత్మక మార్పులు

నాలుగున్నరేళ్లలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని మంత్రి కాకాణి వెల్లడించారు. జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అమూల్ రాకతో రాష్ట్రంలో ప్రైవేట్ డెయిరీల అడ్డగోలు దోపిడికి అడ్డుకట్ట పెడిందన్నారు. ప్రైవేట్ డెయిరీలకు పాలుపోసే వారికి సైతం ప్రతీ రైతుకు లీటర్‌పై రూ. 15 నుంచి రూ. 20 వరకు అదనంగా లబ్ధి పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీడీసీఎఫ్ ఎండీ అహ్మద్ బాబుతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అసమానతల నిర్మూలనకు సీఎం జగన్ కృషి



డైరీని ఆవిష్కరిస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు

- పేదలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి
- ప్రభుత్వ సలహాదారు సజ్జల
- ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం డైరీ ఆవిష్కరణ

లబ్బీపేట (విజయవాడ తూర్పు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక అసమానతలు రూపుమాపేందుకు సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. రాజకీయాలు, ఓట్ల కోసం కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2024 డైరీ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం విజయవాడలో జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సజ్జల మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరినీ ఉన్నత విద్యావంతులుగా.. సంపన్నులతో పోటీ పడేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో నాలుగున్నరేళ్లలో రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకూ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వెచ్చించినట్లు చెప్పారు. తద్వారా పేదల్లో కూడా కొనుగోలు శక్తి పెరిగేలా చేయగలిగామన్నారు. గత ఎన్నికల్లో నవరత్నాల పేరుతో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామన్నారు. విజయవాడలో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాల నుంచి ఏపీకి వచ్చిన వారు సైతం సందర్శించేలా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ మేధావులుగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. అధికారులు సైతం అట్టడుగున ఉన్న వారి ఎదుగుదలకు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. నవరత్నాల ద్వారా దళితులకు అనేక పథకాలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ రమణ, ఎం.సునీల్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎరన్న, డైరీ కమిటీ చైర్మన్ సీహెచ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పాలనలో దేశం కలలు సాకారం

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి మురళీధరన్



సబ్బవరం(అనకాపల్లి): ప్రధాని మోదీ పాలనలో భారతదేశం కన్న కలలను సాకారం చేసుకోనుందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి మురళీధరన్ తెలిపారు. మండలంలోని సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు సామాన్యులకు అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకే ఈ వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు భారతదేశం ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. మన దేశం ఆహార భద్రతతో పాటు, వైద్య రంగంలో ఎంతో వృద్ధి సాధించిందని చెప్పారు. ప్రతి ఒక్కరి సహకారంతో అభివృద్ధి సాధించడం లక్ష్యంగా మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. దేశం మొత్తంతో పాటు రాష్ట్రంలో అనేక జాతీయ రహదారులను ఈ ప్రభుత్వం అభివృద్ధి చేసిందని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ముందుగా జిల్లా కలెక్టర్ రవిపఠాన్ శెట్టితో కలిసి కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రదర్శన స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం ఉజ్వల పథకంలో మహిళా లబ్ధిదారులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి, ఎంపీపీ సూర్యకుమారి, సర్పంచ్ ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

విశాఖ టీడీపీలో 'పశ్చిమ' లొల్లి

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): విశాఖ తెలుగుదేశం పార్టీలో ముసలం మొదలైంది. నిన్న..మొన్నటి వరకు చెట్టాపట్టాల్ వేసుకుని తిరిగిన వారంతా ఇప్పుడు తిరగబడుతున్నారు. అందుకు నిదర్శనమే బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో కొంతమంది టీడీపీకి చెందిన నేతలు పశ్చిమ నియోజకవర్గం టికెట్ గణబాబుకి ఇవ్వొద్దని డిమాండ్ చేయడమే. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్, టీడీపీ చోడవరం పరిశీలకుడు మూర్తి యాదవ్‌తో పాటు ఆ నియోజకవర్గ నాయకులు పెంటకోట త్రినాథ్, చిన్నా యాదవ్, సూర్య ప్రకాశ్, అప్పలరాజు, టీడీపీ మాజీ ప్రధాన కార్యదర్శి పాండ్రంగి జయరాజు మీడియా సమావేశంలో ఎమ్మెల్యే గణబాబుపై వ్యతిరేకత చూపారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గణబాబు పార్టీ పరంగా ప్రజల సమస్యలపై పని చేయడం లేదని విమర్శించారు. ఎల్‌జీ పాలిమర్స్ ఘటన సమయంలో చంద్రబాబు వస్తే కనీసం స్వాగతం పలకలేదన్నారు. కార్యకర్తలను గణబాబు పూర్తిగా గాలికి వదిలేశారని, చంద్రబాబు అరెస్టుపై కనీసం ఆందోళన చేయక పోగా బయటకు కూడా రాలేదని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ–జనసేన కూటమి గెలుపు ఖాయమన్నారు.

పొత్తులపై నిర్ణయం అగ్రనాయకత్వానిదే

బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి

సాక్షి, అమరావతి: బీజేపీ అగ్రనాయకత్వం పొత్తుల విషయంపై నిర్ణయం తీసుకుంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. బుధవారం జాతీయ పార్టీ సూచించిన 'గాంవ్‌లో అభియాన్' (గ్రామాల్లో కార్యకర్తలతో ముఖాముఖి) పేరుతో నిర్వహించతలపెట్టిన కార్యక్రమంపై విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రసంగించారు. 'ఎన్నికలు ఎంతో దూరంలో లేవు. మరో రెండు నెలలలోనే ఎన్నికలను ఎదుర్కోబోతున్నాం. పొత్తుల విషయం మన అగ్రనాయకత్వం ఆలోచిస్తోంది. క్షేత్ర స్థాయిలో మన పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కార్యకర్తలంతా పొత్తుల విషయం పక్కనపెట్టి పార్టీని ఎలా బలోపేతం చేసుకుంటూ ముందుకు వెళ్లాలనే విషయంపై దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం ఉంది' అంటూ దిశానిర్దేశం చేశారు. ఎన్నికలన్నవి బూత్ స్థాయిలో జరిగేవి కాబట్టి బూత్ స్థాయి, గ్రామ, మండలస్థాయిలో పార్టీ కమిటీలు బలంగా ఏర్పాటు చేసుకోవాలని అగ్రనాయకత్వం పదేపదే చెబుతూ ఉందని పురందేశ్వరి వివరించారు. రాష్ట్రంలో ప్రజలను అధికార పార్టీ భయభ్రాంతులకు గురిచేస్తున్నదని, గ్రామాల్లో పర్యటించి ప్రజలకు వాస్తవాలు వివరించాలని ఆమె సూచించారు.

రాజీనామా ఆమోదంపై న్యాయ పోరాటం

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): తన శాసనసభ సభ్యత్వానికి చేసిన రాజీనామాను ఆమోదించడంపై న్యాయ పోరాటం చేస్తానని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం విశాఖ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 2021, ఫిబ్రవరి 12న ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశానని తెలిపారు. అప్పుడు చేసిన రాజీనామాను ఇప్పుడు కుట్ర కోణంలో ఆమోదించారని విమర్శించారు. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో నా రాజీనామాను నిబంధనలకు విరుద్ధంగా ఆమోదించారని ఆరోపించారు. ఉద్యోగులు, నిర్వాసితులతో మాట్లాడి స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ పోరాటం భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

మా గుర్తు గాజు గ్లాసే

జనసేన పార్టీ ప్రకటన

సాక్షి, అమరావతి: కేంద్ర ఎన్నికల సంఘం తమకు గాజుగ్లాసు గుర్తును కేటాయించినట్లు జనసేన పార్టీ తెలిపింది. గాజు గ్లాసు గుర్తును ఖరారు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) జారీ చేసిన ఉత్తర్వులు తమకు ఈ–మెయిల్ ద్వారా అందినట్లు జనసేన పార్టీ బుధవారం ప్రకటన విడుదల చేసింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తును కేటాయించవలసిందిగా ఏపీ ఎన్నికల ప్రధానాధికారికి సీఈసీ ఆ ఆదేశాల్లో సూచించినట్లు పేర్కొంది. 2019లో అప్పటికి తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తోన్న జనసేనకు సీఈసీ గ్లాస్ గుర్తును కేటాయించినప్పటికీ ఆ ఎన్నికల్లో జనసేన నిబంధనల మేరకు ఓట్ల శాతం, సీట్లు గెలుచుకోలేదు. దీంతో ఆ పార్టీకి కేటాయించిన గ్లాస్ గుర్తును సీఈసీ తొలగించి, దానిని ఇండిపెండెంట్‌గా పోటీ చేసే వారికి కేటాయించే 'ఫ్రీ సింబల్స్' కేటగిరిలో ఉంచిన విషయం తెలిసిందే.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: దేశంలోనూ, రాష్ట్రంలోనూ మత ఉద్రిక్తతలు సృష్టించేందుకు బీజేపీ కుట్ర చేస్తున్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. బుధవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. అయోధ్యను మోడీమయం చేశారన్నారు. దేశంలో మతం పేరుతో జరుగుతున్న కుట్ర బయట దేశస్తులు, ఉగ్రవాదులు చేస్తున్నది కాదని, అధికారంలో ఉన్న బీజేపీ, ప్రధాని మోడీ చేస్తున్నదేనని విమర్శించారు. ఇంత పెద్ద ఎత్తున విద్వేషాలు పెంచుతూ కుట్రలు చేస్తున్నప్పటికీ రాష్ట్రంలోని అధికార, విపక్షాలు నోరెత్తకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

మేలు జరిగుంటేనే నాకు ఓటేయండి

మా పాలనలో మంచి జరిగిందని భావిస్తేనే అండగా నిలబడమని ప్రజలను కోరుతున్నా

ఇండియా టుడే విద్యా సదస్సులో సీఎం వైఎస్ జగన్

- అవినీతికి తావులేకుండా డీబీటీ ద్వారా రూ.2.53 లక్షల కోట్లు అందించాం
- విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, పరిపాలనా రంగాల్లో విప్లవాత్మక మార్పులు
- అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి
- మేనిఫెస్టోలో 99 శాతం హామీల అమలు
- ఏ ఒక్క రాజకీయ పార్టీ, నాయకుడు దీనిని కాదనలేరు
- ప్రజల్లో మా ప్రభుత్వానికున్న విశ్వసనీయతకు ఇదే నిదర్శనం
- చంద్రబాబు నేరం చేశారు కాబట్టే కోర్టు జైలుకు పంపింది
- రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్ మళ్లీ నీచ రాజకీయాలు చేస్తోంది
- వైఎస్సార్ కుటుంబంపై విభజించు-పాలించు ప్రయోగం
- కాంగ్రెస్ చేసిన పనులకు తగిన ఫలితం అనుభవించక తప్పదు



సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్‌తో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

> అదే ప్రభుత్వం.. అదే బడ్జెట్. గత ప్రభుత్వంతో పోల్చి చూస్తే.. ఇప్పుడే అప్పులు తక్కువ. ఇక్కడ మారిందల్లా సీఎం మాత్రమే. ఈ ప్రభుత్వం ఇన్ని చేయగలిగినప్పుడు.. గతంలో ఎందుకు చేయలేదన్నది ప్రజలు ఆలోచిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ఇదే నాంది. - సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో తన సంక్షేమాభివృద్ధి పాలనే గీటురాయిగా వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదాన్ని కోరుతున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను అమలు చేయడమే కాకుండా.. ఆ మేనిఫెస్టోను ప్రజల దగ్గరకు తీసుకెళ్లి ఆమోదం పొందుతున్నట్టు చెప్పారు. గ్రామ/వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజల చెంతకే పాలనను తీసుకెళ్లడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. అర్హతే ప్రామాణికంగా, అవినీతికి తావులేకుండా రూ.2.53 లక్షల కోట్లు డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. దీనికి తోడు విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారతలో విప్లవాత్మక మార్పులతో ప్రజల జీవన ప్రమాణాలను పెంచామని చెప్పారు. 56 నెలల పాలనలో తన శాయశక్తులా, చిత్తశుద్ధితో ప్రజల కోసం పని చేశానని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నానన్నారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్ మళ్లీ నీచ రాజకీయాలు మొదలుపెట్టిందన్నారు. విభజించు.. పాలించు విధానాన్ని రాష్ట్రంలోనే కాకుండా వైఎస్సార్ కుటుంబంలోనూ అమలు చేస్తోందన్నారు. తిరుపతిలో రెండో రోజు బుధవారం జరిగిన 'ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్'లో సీఎం వైఎస్ జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ అడిగిన పలు ప్రశ్నలకు సీఎం సమాధానం ఇచ్చారు.

రాజ్‌దీప్: వచ్చే ఎన్నికల్లో మీ ఐదేళ్ల పాలన చూపి ఓట్లు అడగడం సులభంగా ఉంటుందా? లేక 2019కి ముందు ప్రతిపక్షంలో యాత్ర చేసి ఓట్లు అడిగారు.. గెల్చారు. రెండింటిలో ఏది బాగుందని అనుకుంటున్నారు?

సీఎం జగన్: వాస్తవం కంటే విశ్వాసం అనేది ఎప్పటికైనా బలమైంది. నా విషయంలో నేను ఏం చెప్పాను? ఏ హామీలు ఇచ్చాను? ఏం చేశాను? అన్నదే ముఖ్యం. మేనిఫెస్టోలో ప్రకటించిన వాటిలో 99 శాతం అమలు చేశాం. అంతటితో ఆగకుండా ఆ మేనిఫెస్టోను తీసుకెళ్లి ప్రజలకు చూపించి వారి ఆమోదం పొందుతున్నాం. ప్రజల్లో ఇదే మా ప్రభుత్వంపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంచుతోంది. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో విప్లవాత్మక పాలనకు శ్రీకారం చుట్టాం. ప్రతి 2 వేల జనాభాకు ఒక సచివాలయం, ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను ఇంటికే అందజేస్తున్నాం. మా పాలనలో ఎక్కడా వివక్ష చూపడం లేదు. అర్హతే ప్రామాణికంగా ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేస్తున్నాం. అత్యంత పారదర్శకంగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా సాయం అందిస్తున్నాం.

రాజ్‌దీప్: మేనిఫెస్టో అమలు, అవినీతికి తావు లేకుండా డీబీటీ ద్వారా పథకాల పంపిణీ.. ఇవే మీ ప్రచార అంశాలా?

సీఎం జగన్: మొత్తం మార్పులో డీబీటీ ఒక భాగం మాత్రమే. నిజం చెప్పాలంటే.. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో చాలా మార్పులు తీసుకొచ్చాం. ప్రభుత్వ పనితీరు మారింది. మహిళా సాధికారత పెరిగింది. వీటన్నింటికీ తోడుగా డీబీటీ పేదల జీవన పరిస్థితులను మెరుగు పర్చింది. ఇందులో ఎక్కడా వివక్ష, అవినీతికి తావు లేకుండా చేశాం. ఇవన్నీ మా ప్రభుత్వాన్ని నిలబెడతాయనే దృఢమైన విశ్వాసం మాకుంది.

రాజ్‌దీప్: మీరు చేసిన మంచే మిమ్మల్ని గెలుపిస్తుందని అంటున్నారు. కానీ, విపక్షాలు మాత్రం మీ ప్రభుత్వం హామీలు అమలు చేయలేదని, అవినీతి పెరిగిందని ఆరోపిస్తున్నాయి.. దీనికి మీ సమాధానం?

సీఎం జగన్: ఏ పార్టీ కూడా మేము ఇచ్చిన హామీలు అమలు చేయలేదని చెప్పలేదు. ఏ ఒక్క నాయకుడు కూడా మేము అవినీతి చేశామని చూపలేరు. ఎందుకంటే ఈ 56 నెలల్లో వివిధ పథకాల ద్వారా నేరుగా ప్రజల ఖాతాల్లో పూర్తి పారదర్శకంగా రూ.2.53 లక్షల కోట్లు డీబీటీ విధానంలో జమ చేశాం. ఇలా గతంలో ఎందుకు చేయలేదన్నది ప్రజలు ఆలోచిస్తున్నారు.

రాజ్‌దీప్: 2024లో మీ ప్రధాన రాజకీయ ప్రత్యర్థి పార్టీలు ఎవరని భావిస్తున్నారు?

సీఎం జగన్: రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీలు నామమాత్రమే. కాంగ్రెస్, బీజేపీకి ఇక్కడ బలం లేదు. కాబట్టి సహజంగానే ఇక్కడ మా వైఎస్సార్ సీపీకి, తెలుగుదేశం–జనసేన కూటమితో పాటు, వారికి మద్దతు ఇచ్చే వారితోనే పోటీ ఉంటుంది.

రాజ్‌దీప్: చంద్రబాబు బీజేపీకి సన్నిహితంగా ఉన్నారు కాబట్టే రామ మందిరం ప్రారంభోత్సవానికి వెళ్లారనిపిస్తుంది? మీరు ఇష్యూ ఆధారంగా బీజేపీకి సపోర్టు చేస్తూ వచ్చారు? ఆంధ్రా పార్టీలను బీజేపీ, మోదీల విషయంలో ఎలా చూడాలి?

సీఎం జగన్: మాకు తొలి నుంచి ఒక స్పష్టమైన విధానం ఉంది. మాకు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. అందుకే రాష్ట్ర ప్రయోజనాల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రంతో సయోధ్య కొనసాగిస్తున్నాం.

రాజ్‌దీప్: 2009లో ఎంపీగా రాజకీయాల్లోకి వచ్చిన జగన్‌కు.. ఇప్పటి సీఎం జగన్‌కు మధ్య మార్పు ఏమిటి?

రాజ్‌దీప్: మాజీ సీఎం చంద్రబాబు జైలుకు వెళ్లాడు. దీనిని ప్రతీకార రాజకీయంగా విపక్షాలు ఆరోపిస్తున్నాయి? సీఐడీని దుర్వినియోగం చేశారనడం నిజమేనా?

సీఎం జగన్: చంద్రబాబు అవినీతి ఆరోపణలపై అరెస్ట్ అయ్యారు. అందుకు పూర్తి ఆధారాలు ఉన్నాయి కాబట్టే.. కోర్టు జైలుకు పంపింది. అలాంటప్పుడు ఎవరైనా అది ప్రతీకార రాజకీయమని ఎలా అంటారు? ఎవరైనా కూడా ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయలేరు. ఎందుకంటే, ఏం చేసినా కోర్టుల్లో లిట్మస్ టెస్ట్ ఉంటుంది కదా? ఆధారాలు లేకపోతే, ఆరోపణల్లో వాస్తవాలు లేకపోతే, కేసులు కోర్టుల్లో నిలబడవు కదా? ఆధారాలు ఉన్నాయని కోర్టులు కన్విన్స్ అయితే తప్ప, నిర్ణయాలు తీసుకోవు కదా? పైగా ఇక్కడ హైప్రొఫైల్ కేసు. త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఏ సీఎం కూడా, అలాంటి చర్యలకు దిగరు. కచ్చితమైన ఆధారాలు ఉంటే తప్ప.. కేసు బలంగా ఉంటే తప్ప.. అలాంటివి జరగవు కదా!

రాజ్‌దీప్: మీ పార్టీలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలను మారుస్తున్నారు. కొందరు బయటకు వెళ్తున్నారు. ఇది వ్యతిరేకతను పెంచదా?

సీఎం జగన్: ఎన్నికల సమయంలో ప్రతి రాజకీయ పార్టీ స్వయంగా సర్వే నిర్వహిస్తుంది. దాని ప్రకారం వ్యూహ రచన ఉంటుంది. మేము ప్రజలకు మనస్ఫూర్తిగా చాలా మేలు చేశాం. ఇదే మా ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకాన్ని పదిలం చేసింది. కానీ స్థానికంగా కొందరు నాయకుల తీరు, ప్రజలతో మమేకం కాకపోవడం, వారిపై వ్యతిరేకత కారణాలతో మార్పులు, చేర్పులు అనివార్యం అయ్యింది. మాకు సంబంధించి.. ఎన్నికలు మరో 70, 80 రోజుల్లో ఉన్న పరిస్థితుల్లో ఆఖరి క్షణం వరకు ఆగి అప్పుడు మార్పులు చేస్తే లేనిపోని గందరగోళం సృష్టించినట్టు అవుతుంది. దానికి బదులు ముందుగా చేస్తే అందరికీ క్లారిటీ ఉంటుంది.

రాజ్‌దీప్: మీ చెల్లెలు షర్మిలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించింది? ఇది వైఎస్సార్ లెగసీలో చీలకతేవడం కాదా? వైఎస్సార్ వల్లే కదా 2004, 2009లో యూపీఏ అధికారంలోకి వచ్చింది.. కానీ, కాంగ్రెస్ మీ విషయంలో చేస్తున్నదానికి కోపం లేదా?

సీఎం జగన్: రాష్ట్రంలో కాంగ్రెస్ నీచ రాజకీయాలు చేస్తోంది. వారి స్వార్థం కోసం ఆనాడు రాష్ట్రాన్ని అన్యాయంగా విడగొట్టారు. విభజించు- పాలించు అన్నది రాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా, మా కుటుంబంలో కూడా చేశారు. నేను కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిలబడినప్పుడు నా సొంత బాబాయిని మంత్రిగా చేశారు. తర్వాత మా పార్టీ అభ్యర్థిపైనే పోటీకి నిలబెట్టారు. ఆ విధంగా కాంగ్రెస్ ఎప్పుడూ విభజించు–పాలించు అన్న రాజకీయాలే చేసింది. ఇప్పుడు కూడా అదే చేశారు. నా కుటుంబాన్ని విడగొట్టారు. మా చెల్లిని తీసుకొచ్చి, ఏకంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిని చేశారు. కానీ, వారొక విషయాన్ని మర్చిపోతున్నారు. పైన దేవుడనే వాడున్నాడు. ఎవరికి ఎప్పుడు, ఎలా గుణపాఠం చెప్పాలో ఆయనకు బాగా తెలుసు. నాకు ఆ నమ్మకం ఉంది. కాంగ్రెస్ చేసిన పనులకు తగిన ఫలితం అనుభవించక తప్పదు.

సీఎం జగన్: రాజకీయాల్లో నా ప్రస్థానం, నాలో మార్పులను నా కంటే మీరే (రాజ్‌దీప్) ఇంకా బాగా చెప్పగలరు. ఈ 56 నెలల పాలనలో నా వంతుగా నేను శాయశక్తులా, చిత్తశుద్ధితో పని చేశా. దాన్ని ఆత్మ విశ్వాసంతో చెప్పగలను. కొన్ని కోట్ల మంది ప్రజల హృదయాలు తాకాను. అది నాకెంతో తృప్తినిస్తోంది. అన్ని బహిరంగ సభల్లో నేను ఒకటే చెబుతున్నాను. నేను మీకు మంచి చేశానని అనుకుంటే, మీకు మేలు జరిగిందని భావిస్తే.. నాకు తోడుగా నిలవమని ప్రజలను కోరుతున్నాను.

సైకిల్‌కు 'చెయ్యి'చ్చేస్తారట!

- టీడీపీని వీడాలనే యోచనలో 'కోట్ల' దంపతులు!
- కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయం
- ఇప్పటికే మల్లికార్జున ఖర్గేతో ఫోన్‌లో చర్చలు
- ఆశించిన సీట్లపై టీడీపీ నుంచి హామీ లేకపోవడమే కారణం

సాక్షి ప్రతినిధి, కర్నూలు: కర్నూలు టీడీపీలో కీలక పరిణామం చోటు చేసుకోనుంది. కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్యప్రకాశ్‌రెడ్డి కుటుంబం ఆ పార్టీకి షాక్ ఇవ్వనున్నట్టు సమాచారం. సైకిల్ దిగి కాంగ్రెస్ పార్టీతో రాజకీయ ప్రయాణం చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీలో కర్నూలు జిల్లా రాజకీయాలను శాసించిన కోట్ల కుటుంబం ఇప్పుడు టీడీపీలో టికెట్ల కోసం తంటాలు పడాల్సిన దుస్థితి తలెత్తింది. కుటుంబానికి ఒకే టికెట్ అనడం, అందులోనూ ఆశించిన సీటు కాకుండా పార్టీ నిర్దేశించిన స్థానం నుంచి బరిలో నిలవాలని సూచించడం వంటి పరిణామాలతో టీడీపీపై కినుక వహించిన కోట్ల కుటుంబం ఆ పార్టీకి రాజీనామా చేయాలని భావించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో ఇప్పటికే చర్చలు కూడా జరిపినట్లు సమాచారం.

ఎమ్మిగనూరు ఆశించిన సూర్యప్రకాశ్‌రెడ్డి

కోట్ల కుటుంబం కర్నూలు జిల్లా రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలుగా క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేశారు. సూర్యప్రకాశ్‌రెడ్డి కేంద్రమంత్రిగా పని చేశారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో కాంగ్రెస్ పార్టీ నుంచి కర్నూలు ఎంపీగా పోటీ చేసి ఘోరంగా ఓడిపోయారు. ఆపై టీడీపీ తీర్థం పుచ్చుకుని 2019లో మళ్లీ బరిలోకి దిగి ఘోరమైన ఫలితం చవిచూశారు. ఈక్రమంలోనే ఈసారి ఎమ్మిగనూరు అసెంబ్లీ బరిలో నిలవాలని ఆశించారు.

నిరాశ మిగిల్చిన టీడీపీ

ఎమ్మిగనూరు టీడీపీ ఇన్‌చార్జ్ జయనాగేశ్వరరెడ్డితో సంబంధం లేకుండా ఏడాదిన్నర కిందటే అక్కడ పార్టీ కార్యాలయాన్ని సూర్యప్రకాశ్‌రెడ్డి ప్రారంభించి కార్యకలాపాలు సాగిస్తున్నారు. దీంతో జయనాగేశ్వరరెడ్డి పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత లోకేశ్ పాదయాత్ర సందర్భంగా సూర్యప్రకాశ్‌రెడ్డి ఫొటోలు లేకుండా నాగేశ్వరరెడ్డి ఫ్లెక్సీలు వేయించడంతో కోట్ల అలిగారు.



ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పాదయాత్ర జరిగినన్ని రోజులు గైర్హాజరయ్యారు. ఆపై తన మనసులోని కోరికను పార్టీ పెద్దల ముందుంచారు. ఆలోచిద్దామని చెప్పిన అధిష్టానం చివరికి కుటుంబంలో ఒకరికి మాత్రమే టికెట్ ఇస్తామని, డోన్ బరిలో నిలవాలని సూచించినట్లు తెలుస్తోంది. ఆలూరు టికెట్ కోట్ల సుజాతమ్మకు ఇవ్వలేమని, బోయలను నిలిపే యోచనలో ఉన్నట్టు చెప్పారని సమాచారం.

బాబువి గాలిమాటలేనా?!

డోన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ధర్మవరం సుబ్బారెడ్డిని ఏడాది కిందటే చంద్రబాబు ప్రకటించారు. తాజాగా సూర్యప్రకాశ్‌రెడ్డిని డోన్‌లో పోటీ చేయాలని పార్టీ సూచించడం చూస్తే బాబువి గాలిమాటలేననే భావనలో సుబ్బారెడ్డి, ఆయన అనుచరవర్గం ఉంది. డోన్ సీటు సూర్యప్రకాశ్‌రెడ్డికి ఇస్తే టీడీపీని వీడే యోచనలో సుబ్బారెడ్డి ఉన్నట్టు తెలుస్తోంది.

గౌరవం లేనిచోట ఉండలేకే..

కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు నలుగురికి టికెట్లు ఇప్పించే స్థాయిలో ఉన్న సూర్యప్రకాశ్‌రెడ్డి టీడీపీలో తన కుటుంబానికీ సీట్లు దక్కని పరిస్థితి ఉండడంతో మనస్తాపం చెందారు. ఆలూరు టికెట్ ఇవ్వకపోతే తెలుగుదేశంలో తాను కొనసాగనని సుజాతమ్మ తేల్చిచెప్పినట్లు తెలిసింది. డోన్ నియోజకవర్గాన్ని ఊహించని స్థాయిలో అభివృద్ధి చేసిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని ఢీకొట్టడం సాధ్యం కాదని సూర్యప్రకాశ్‌రెడ్డి భావిస్తున్నారు. ఈ దఫా ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాల్సిన అనివార్యస్థితి ఎదురవుతుందనే యోచనతో కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఈమేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో ఫోన్‌లో చర్చించినట్లు సమాచారం. టీడీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు మంచిరోజు కోసం వేచి ఉన్నట్లు తెలుస్తోంది.

'పొత్తు' కడుపులో కత్తులు!

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రబాబును కలిసినప్పుడు తమ పార్టీ కోరే సీట్ల జాబితాను అందజేశారు. జనసేన పార్టీ వర్గాల సమాచారం ప్రకారం.. సీట్ల కేటాయింపు తెలుగుదేశం పార్టీ బాగా బలంగా ఉన్న స్థానాలనూ జనసేనకు కేటాయించారన్న అభిప్రాయం కలిగించేలా ఉండాలని బాబుకు పవన్ స్పష్టం చేశారని తెలుస్తోంది. దీంతోపాటు మరో రెండు కీలక ప్రతిపాదనలు చేసినట్టు సమాచారం. 68 అసెంబ్లీ స్థానాల జాబితాను ఇచ్చి వాటిలో 45 సీట్లకు తగ్గకుండా కేటాయించాలని, 2019లో టీడీపీ గెలిచిన 23 అసెంబ్లీ స్థానాల్లో కనీసం రెండైనా తప్పనిసరిగా ఇవ్వాలని పవన్ ప్రతిపాదించారని సమాచారం. 2009లో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ప్రజారాజ్యం పార్టీ గెలిచిన లేదా అత్యధిక ఓట్లు సాధించిన స్థానాలతోపాటు 2019 ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీకి కలిపి ఎక్కువ ఓట్లు వచ్చిన స్థానాలను గుర్తించి జాబితాను టీడీపీ ముందుంచినట్టు తెలుస్తోంది. దీనికి తోడు.. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతోపాటు రాయలసీమ జిల్లాల్లో టీడీపీకి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండేవే జనసేనకు కేటాయించాలని పవన్ కోరినట్టు సమాచారం. ఈ ప్రతిపాదనలు క్షేత్రస్థాయిలో రెండు పార్టీల మధ్య చిచ్చురేపుతున్నాయి.

బీజేపీ పేరు చెప్పి వేచి చూద్దామన్న బాబు

పొత్తులో భాగంగా బీజేపీని కూడా కలుపుకోవాలని తొలి నుంచి యోచిస్తున్న నేపథ్యంలో మరికొద్ది రోజులు వేచి చూద్దామని చంద్రబాబు పవన్‌కు సూచించినట్టు తెలుస్తోంది. మరో పది పదిహేను రోజుల్లో బీజేపీ జాతీయ నాయకత్వం పొత్తుపై ఒక ప్రకటన చేసే అవకాశం ఉందని, అప్పటిదాకా రెండు పార్టీల మధ్య రాష్ట్ర స్థాయిలోనూ, నియోజకవర్గాల స్థాయిలోనూ సీట్ల అంశంలో ఎలాంటి ప్రకటనలు, విభేదాలు లేకుండా చూద్దామని చెప్పినట్టు జనసేన వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో సీట్ల పంపకాలపై ప్రస్తుతానికి ప్రతిష్టంభన కొనసాగుతోంది.

పలుచోట్ల రచ్చకెక్కిన విభేదాలు

- ▲ రాజమండ్రి రూరల్ నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి అసలు ఈ నియోజకవర్గాన్ని జనసేన ఎలా అడుగుతుందని అక్కడి జనసేన నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో జనసేన నేతలు తమ రాష్ట్ర పార్టీ కార్యాలయానికి ఫిర్యాదు చేసినట్టు సమాచారం.
- ▲ పెందుర్తి నియోజకవర్గంలో అక్కడి టీడీపీ నాయకుడు బండారు సత్యానందరావు, స్థానిక జనసేన నేత పంచకర్ల రమేష్‌ల మధ్య యుద్ధం జరుగుతోంది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది.
- ▲ కాకినాడ రూరల్, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లో టికెట్ రేసులో ఉన్న టీడీపీ నాయకులు తమ స్థానాలను జనసేనకు కేటాయిస్తే తమ దారి తాము చూసుకుంటామని బహిరంగంగానే హెచ్చరికలు చేస్తున్నారు.
- ▲ పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ – జనసేన నాయకుల మధ్య సమన్వయ కమిటీ సమావేశం జరిగిన సమయంలో ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్న సంగతి తెలిసిందే. కాగా, ఈ తరహా అసంతృప్తులను కట్టడి చేసేందుకు బీజేపీని బూచిగా చూపి జనసేనను శాంతపరుస్తున్నారని ఆ పార్టీలో చర్చ సాగుతోంది.

పవన్‌కళ్యాణ్ ప్రతిపాదించిన నియోజకవర్గాల జాబితా ఇదీ..

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా: ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పలాస

ఉమ్మడి విజయనగరం జిల్లా: విజయనగరం, నెల్లిమర్ల.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా: పెందుర్తి, యలమంచిలి, చోడవరం, విశాఖపట్నం దక్షిణం, విశాఖపట్నం ఉత్తరం, భీమిలి, అనకాపల్లి, గాజువాక

ఉమ్మడి తూర్పు గోదావరి: పిఠాపురం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్, ముమ్మిడివరం, రాజమండ్రి రూరల్, రాజానగరం, కొత్తపేట, అమలాపురం, రామచంద్రాపురం, రాజోలు, పి.గన్నవరం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా: నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నిడదవోలు, ఉంగుటూరు, ఏలూరు, గోపాలపురం, కొవ్వూరు, పోలవరం, ఆచంట

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలో..: విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, విజయవాడ తూర్పు, అవనిగడ్డ, పెడన, నూజివీడు, మచిలీపట్నం, కైకలూరు, పెనమలూరు, తెనాలి, గుంటూరు వెస్ట్, పెదకూరపాడు, తాడికొండ, పొన్నూరు, వేమూరు, గుంటూరు తూర్పు

ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు రాయలసీమ జిల్లాల్లో: దర్శి, గిద్దలూరు, నెల్లూరు సిటీ, కోవూరు, కావలి, తిరుపతి, మదనపల్లి, చిత్తూరు, నగరి, ఆళ్లగడ్డ, నంద్యాల, గుంతకల్లు, బద్వేలు, రైల్వే కోడూరు, రాజంపేట, పుట్టపర్తి, ధర్మవరం.

'మండపేట'లో చంద్రబాబు రేపిన 'చిచ్చు'

- టీడీపీ ఎమ్మెల్యే జోగేశ్వరరావుపై అసమ్మతి జ్వాల
- రాజమహేంద్రవరంలో అసంతృప్త వాదుల సమావేశం

సాక్షి అమలాపురం: పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు.. మండపేట సభలో స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును మరోసారి గెలిపించాలని ఇచ్చిన పిలుపు మొన్న జనసేనలోనూ.. ఇప్పుడు టీడీపీలోనూ అసంతృప్తి చిచ్చు రగిల్చింది. ఎమ్మెల్యే వ్యతిరేకవర్గం రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో బుధవారం సమావేశమై తమ అసంతృప్తిని బహిరంగంగా వ్యక్తం చేసింది. జనసేనతో సీట్ల సర్దుబాటు కాకున్నా.. గత శనివారం మండపేటలో జరిగిన టీడీపీ 'రా.. కదలిరా' సభలో చంద్రబాబు మాట్లాడుతూ వేగుళ్ల జోగేశ్వరరావును మరోసారి గెలిపించాలని కోరారు. దీంతో అక్కడే ఉన్న జనసేన మండపేట ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ కంగుతున్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు సైతం బాబు ప్రకటనపై మండిపడ్డారు. టీడీపీ కార్యక్రమాలకు వెళ్లొద్దని సామాజిక మాధ్యమాలలో జనసేన నాయకులు దాడికి దిగారు. మండపేట నియోజకవర్గానికి చెందిన టీడీపీ అసంతృప్త వాదులు సిట్టింగ్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు వ్యతిరేకంగా బుధవారం రాజమహేంద్రవరంలోని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. తమతో సంప్రదించకుండా మండపేట స్థానానికి ఎమ్మెల్యే జోగేశ్వరరావు పేరును చంద్రబాబు ఏకపక్షంగా బహిరంగ సభలో ప్రకటించడాన్ని వ్యతిరేకించారు. అభ్యర్థిని నిర్ణయించే ముందు పార్టీలో సీనియర్ నేతల నిర్ణయం కూడా తీసుకోవాలని, లేదంటే పార్టీ నష్టపోతుందని వారు అభిప్రాయపడ్డారు. పార్టీ సీనియర్ నేత, ఆర్టీసీ విజయనగరం జోనల్ మాజీ చైర్మన్ నెక్కంటి బాలకృష్ణ ఆధ్వర్యంలో అసంతృప్తి వాదులు ఈ సమావేశాన్ని నిర్వహించారు.

'వెన్నుపోటు'కే వెనుక దెబ్బ!

సంకటస్థితిలో తెలుగుదేశం పార్టీ.. బాపట్ల జిల్లాలో వర్గపోరుతో సతమతం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వెన్నుపోటుతో ఎదిగిన చంద్రబాబు తెలుగుదేశం పార్టీకి బాపట్ల జిల్లాలో వెనుక దెబ్బలు తప్పేలా లేవు. ఇప్పటివరకు తమను పార్టీ వాడుకుని వదిలేసిందన్న భావనతో ఉన్న నాయకులు ఈ ఎన్నికల్లో దెబ్బతీసేందుకు సిద్ధమయ్యారు. ఫలితంగా బాపట్ల, చీరాల నియోజకవర్గాల్లో ఆ పార్టీ వర్గపోరుతో సతమతమవుతోంది.

కొండయ్య.. మొండయ్యేనా

ప్రస్తుతం చీరాల నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జిగా ఎం.ఎం.కొండయ్య ఉన్నారు. ఆయనను తప్పించి చేనేత సామాజికవర్గానికి టికెట్ ఇవ్వాలని టీడీపీ అధిష్టానం భావిస్తోంది. ఇన్నాళ్లూ వాడుకున్న పార్టీ ఇప్పుడు తనను తప్పించేందుకు చూడడంపై కొండయ్య ఆగ్రహంగా ఉన్నారు. ఆయన యాదవ సామాజికవర్గానికి చెందిన వారు. నియోజకవర్గంలో 25 వేలపైచిలుకు ఓట్లున్న తమ సామాజిక వర్గానికి చెందిన కొండయ్యను తప్పిస్తే సహించేది లేదని, ఎన్నికల్లో దెబ్బతీసేందుకు వెనుకాడబోమని ఆ వర్గం టీడీపీకి అంతర్గతంగా అల్టిమేటం జారీ చేస్తోంది. ఇదిలా ఉంటే యాదవ సామాజికవర్గానికి చెందిన మరో డీఎస్పీ కూడా చీరాల టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది.

'యడం'గా ఉన్నా.. గుర్రు

చీరాలలో కొండయ్యకు ముందు యడం బాలాజీ టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేశారు. ఆయన అమెరికాలో ఉండి పెద్దగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించలేదన్న సాకుతో ఆయనను పార్టీ తప్పించింది. బాలాజీ కాపు సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఆ వర్గం కూడా టీడీపీపై గుర్రుగా ఉంది. వెనుక దెబ్బతీసేందుకు సిద్ధంగా ఉంది.

'అన్నం'త పనీ చేస్తారా!

బాపట్ల టీడీపీ ఇన్‌చార్జిగా వేగేశ్న నరేంద్రవర్మకు వెనుకదెబ్బలు తప్పేలా కనిపించడం లేదు. ఇప్పటికే చాలామంది మండల, గ్రామస్థాయి నేతలు వర్మ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కర్‌రావు, మాజీ ఎంపీపీ మానం విజేత టికెట్ పోరులో నిలిచినట్టు తెలుస్తోంది. 2014, 2019 ఎన్నికల్లో బాపట్ల టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన అన్నం సతీష్ ప్రభాకర్ ఓటమికి వర్మ పని చేశారని సతీష్ వర్గం గుర్రుగా ఉంది. కొద్దికాలం కిందట సతీష్ బీజేపీలో చేరారు. బాపట్ల టికెట్ టీడీపీ వర్మకు కేటాయిస్తే ఓడించేందుకు సతీష్ వర్గం కృషి చేయనుంది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం। 25। జనవరి। 2024



రామలింగేశ్వరుని సేవలో మంత్రి జోగి
పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామిని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బుధవారం దర్శించుకున్నారు.



డైరీ ఆవిష్కరణ
లబ్బీపేట: ఏపీ ఎస్సీ, ఎస్టీ గజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ -2024 డైరీని ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డి విజయవాడలో ఆవిష్కరించారు.



ఉజ్వల భవిత కోసమే క్రీడాపోటీలు
ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను బుధవారం నందిగామ పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు ప్రారంభించారు. -10లో▸

న్యూస్‌రీల్

జాతీయ సమైక్యత ఉట్టిపడేలా గణతంత్ర వేడుకలు

విజయవాడస్పోర్ట్స్: జాతీయ సమైక్యత ఉట్టిపడేలా గణతంత్ర వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ బుధవారం పరిశీలించారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ఈ వేడుకల్లో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు ఇతర న్యాయమూర్తులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రధాన వేదిక, వీవీఐపీ, వీఐపీ గ్యాలరీలలో ప్రొటోకాల్ మేరకు సీటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శకటాలను ముందుగానే సిద్ధం చేయాలని సమాచార శాఖ అధికారులను ఆదేశించారు. వేడుకల విశేషాలను ఎప్పటికపుడు అందించే వ్యాఖ్యాతలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌ను పరిశీలించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా జనరేటర్లను అందుబాటులో ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను, వైద్య శిబిరాలను, అంబులెన్స్‌లను సిద్ధం చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఉన్నారు. అనంతరం పలు కంటింజెట్లు చేసిన మాక్ డ్రిల్‌ను పరిశీలించారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 9వ తేదీన జిల్లాలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక బుధవారం తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఈ లోక్‌అదాలత్ ఉంటుందని చెప్పారు. రాజీపడదగిన క్రిమినల్, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద క్లెయిమ్‌లు, అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు న్యాయవాదులను సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మచిలీపట్నం, విజయవాడ, గుడివాడ, నూజివీడు, నందిగామ, అవనిగడ్డ, కైకలూరు, గన్నవరం, తిరువూరు, జగ్గయ్యపేట, బంటుమిల్లి, మైలవరం, ఉయ్యూరు, మొవ్వ కోర్టుల ఆవరణలో ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తామన్నారు.


అధిష్టాన నిర్ణయమే శిరోధార్యం

– కార్యకర్తలకు తేల్చి చెప్పిన సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పార్టీ అధిష్టానం నిర్ణయమే తనకు శిరోధార్యమని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తేల్చి చెప్పారు. బుధవారం రాత్రి విజయవాడ సత్యనారాయణపురంలోని గాయత్రి ఫంక్షన్ హాలులో వైఎస్సార్ సీపీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ అధిష్టాన నిర్ణయానికి అనుగుణంగా పని చేయాలని స్పష్టం చేశారు. తనకు పదవులు ముఖ్యం కాదని, ప్రజాసేవే ముఖ్యమని కార్యకర్తలతో చెప్పి పార్టీ కోసం పని చేయాలని సూచించారు. ఆయన తన మనసులో మాటను వెల్లడించి కొద్ది రోజులుగా సెంట్రల్ నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో నెలకొన్న సందిగ్ధతకు తెరదించారు.

దేశంలో సీటు ఫైట్ !

- విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో పోస్టర్ల కలకలం
- బొండా ఉమా, వంగవీటి రాధా మధ్య కోల్డ్‌వార్
- పెనమలూరు, పెడనలోనూ లుకలుకలు
- జగ్గయ్యపేటలో పొడచూపుతున్న విభేదాలు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: టీడీపీలో వర్గ విభేదాలు పతాక స్థాయికి చేరాయి. పార్టీ టికెట్లు కేటాయించక ముందే గ్రూపుల మధ్య గొడవలు రోడ్డున పడుతున్నాయి. విజయవాడ సెంట్రల్‌లో వంగవీటి రాధా, బొండా ఉమా వర్గాల మధ్య సోషల్ మీడియా వేదికగా వార్ సాగుతోంది. రోజురోజుకు ఇరువర్గాల మధ్య విభేదాలు ముదురు పాకాన పడుతున్నాయి. ఇటీవల బొండా ఉమా, వంగవీటి రాధాలకు సంబంధించి ఐవీఆర్‌ఎస్ సర్వే నిర్వహించింది. దీంతో ఇప్పటివరకు తమదే టికెట్టు అని ధీమాగా ఉన్న బొండా ఉమా వర్గీయుల్లో కలకలం రేపింది.

నియోజకవర్గాల్లో అసంతృప్తుల గోల..

✦ పెనమలూరు టీడీపీలో సైతం అసంతృప్తుల గోల అధిష్టానానికి తలనొప్పిగా మారింది. అక్కడ బోడే ప్రసాద్‌తోపాటు పలువురు నేతలు టికెట్టు కోసం పట్టుపడుతున్నారు.

✦ పెడన నియోజకవర్గంలో కాగిత కృష్ణప్రసాద్, బూరగడ్డ వేదవ్యాస్ వర్గాల మధ్య సఖ్యత లేకపోవటం, ఇరువర్గాలు టికెట్టు కావాలని కోరుతుండటంతో అధిష్టానానికి ఎటూ పాలు పోవటం లేదు.

✦ మైలవరంలో దేవినేని ఉమాకు టికెట్ లేదని ఇప్పటికే చెప్పడంతో, అక్కడ దేవినేని ఉమా, బొమ్మసాని సుబ్బారావు, గన్నే ప్రసాద్ ఇలా గ్రూపులుగా విడిపోయారు.

✦జగ్గయ్యపేటలో పార్టీ అభ్యర్థిగా శ్రీరాం తాతయ్యను ప్రకటించినా, అక్కడ మాజీ మంత్రి నెట్టెం రఘురాం, బొల్లా రామకృష్ణలు మాత్రం సహకరించటంలేదు. వీరు ప్రచారానికి సైతం దూరంగా ఉంటున్నారు.

✦గుడివాడలో పార్టీ అభ్యర్థిగా వెనిగండ్ల రామును ప్రకటించినా అక్కడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరావు, పిన్నమనేని బాబ్జి వంటి వారు అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇలా టీడీపీలో పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతోంది. ఇప్పటికే పాతాళానికి కుంగిన పార్టీ ఎన్నికలు సమీపించే కొద్దీ మరింత లోతుకు కూరుకుపోతోందని టీడీపీ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

మూడు రోజులుగా ట్రోలింగ్....

వంగవీటి రాధా టార్గెట్‌గా నగరంలో ‘ఇవే రాధాను టీడీపీ నమ్మకపోవటానికి కారణాలు’ అంటూ సోషల్ మీడియా వేదికగా ఏడు కారణాలు ప్రస్తావిస్తూ మూడు రోజుల క్రితం ట్రోల్ చేశారు. ఇది సెంట్రల్ నియోజకవర్గం టీడీపీలో తీవ్ర చర్చకు దారితీసింది. ఆ పోస్టుల వెనుక బొండా ఉమా వర్గీయులే ఉన్నారని రాధా వర్గం ఆరోపిస్తోంది. దీనికి ప్రతిగా బొండా ఉమాను టార్గెట్ చేస్తూ వంగవీటి రాధా వర్గీయులు ‘నమ్మాలంటే ఏమి చేయాలి... దేవుడి పేరుతో చందాలు పోగు చేయాలా, స్థలాలు కబ్జా చేయాలా, కాల్‌మనీ నిందితులకు కొమ్ము కాయాలా... నమ్మకానికి ఇవేనా ప్రామాణికాలు..? అంటూ పెట్టిన పోస్టులు ఇప్పుడు సెంట్రల్ నియోజకవర్గంలో కలకలం రేపుతున్నాయి. ఇద్దరు నాయకులు ఒకరినొకరు టార్గెట్ చేసుకుంటూ పెడుతున్న సంచలన పోస్టులు హాట్ టాపిక్‌గా మారాయి. వీరిద్దరి బలహీనతలు బహిర్గతం చేసే విధంగా పోస్టులు పెట్టడంతో విభేదాలు రోడ్డెక్కాయి.

విజయవాడ వెస్ట్‌లో గందరగోళం....

విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలోనూ గందరగోళం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, బుద్దా వెంకన్న, నాగుల్‌మీరా, ఎంకేబేగ్ లాంటి వారు తమకు తామే పోటీ చేస్తామని ప్రకటించుకున్నారు. నియోజకవర్గంలో అంతంతమాత్రంగా ఉన్న టీడీపీ, ఎంపీ కేశినేని నాని వైఎస్సార్ సీపీలో చేరికతో మరింత బలహీనపడింది. ఇక్కడ టీడీపీ నేతల మధ్య సయోధ్య లేక పోవడంతో పార్టీ అధినేత తలపట్టుకుంటున్నారు. దీనికితోడు జనసేన సైతం పొత్తులో సీటు తమకు వస్తుందని, అక్కడ నుంచి పోటీ చేస్తామని చెబుతుండటంతో గందరగోళం నెలకొంది.

ఎన్నికల విధులపై పూర్తిస్థాయి అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు వేదికపై జేసీ సంపత్‌కుమార్ తదితరులు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైన ఎన్నికలకు సంబంధించిన విధులపై పూర్తిస్థాయి అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రతిదశలోనూ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఆర్వో, ఏఆర్వో , అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్స్ (ఏఎల్‌ఎంటీ)కు బుధవారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమాన్ని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ పోలింగ్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఐటీ వేదికలు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్‌తో నిర్వహిస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సందేహాలుంటే ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, వివిధ రకాల రిజిస్టర్లు, ఫారాలు, పోలింగ్ స్టేషన్, ఈవీఎం తదితరాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. అప్‌డేటెడ్ హ్యాండ్‌బుక్‌లను ఉపయోగించుకోవాలని చెప్పారు. సరళమైన భాషలో అత్యంత నాణ్యమైన శిక్షణను పీవోలు, ఏపీవోలు తదితరులకు అందించాలన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల విధుల నిర్వహణకు నిబద్ధత, అవగాహన తప్పనిసరి అన్నారు. జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ బాలకృష్ణారెడ్డి.. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈవీఎం-బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌లకు సంబంధించిన సమాచారాన్ని వీడియోల ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్‌వీ నాగేశ్వరరావు, ట్రైనీ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓలు పి.సాయిబాబు, కె.మాధవి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఓటే వజ్రాయుధం

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం మహిళలకు రంగోలి పోటీలు నిర్వహించారు. ఓటు ప్రాధాన్యంపై పలువురు మహిళలు వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. పెనమలూరుకు చెందిన బి.భాగ్యం వేసిన ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమెకు ప్రథమ బహుమతి దక్కేలా చేసిన రంగోలి ఇది. – పెనమలూరు

బాలికలు ఆత్మ విశ్వాసంతో అడుగేయాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఇతర అధికారులు

కలెక్టర్ ఢిల్లీరావు

పటమట(విజయవాడతూర్పు): ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని బాలికలు ఆత్మ విశ్వాసంతో అడుగులు వేయాలని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విజయవాడలోని మేరీ స్టెల్లా కాలేజీలో, బిషప్ అజరయ్య, స్కూల్లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, పోలీసు శాఖలతో పాటు ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో బుధవారం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అతిథిగా కలెక్టర్ ఢిల్లీరావు పాల్గొని ప్రసంగించారు. లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, లింగ వివక్ష, మానవ అక్రమ రవాణా నిర్మూలనకు సమష్టి భాగస్వామ్యం అవసరమని చెప్పారు. అన్ని రంగాల్లో ఆడపిల్లలకు ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తమ హక్కుల గురించి తెలుసుకొని బాగా చదువుకొని ఉన్నత కెరీర్‌ను సొంతం చేసుకోవాలని సూచించారు. మేరీ స్టెల్లా కళాశాలలో ప్రాజెక్టు ఆధారిత విద్యా విధానానికి ప్రాధాన్యం ఇవ్వడం మంచి పరిణామం అన్నారు. బాలికల సమస్యల పరిష్కారానికి సంబంధించిన ప్రాజెక్టులపైనా దృష్టి సారించి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలకు సహకారం అందించాలని కోరారు. ఓటు హక్కు నమోదు, ఓటు హక్కు వినియోగం, ఎథికల్ ఓటింగ్‌పైనా మాట్లాడారు. వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి బాలికా దినోత్సవం, బాలికల హక్కుల పోస్టర్లను ఆవిష్కరించారు. బాలికలకు, మహిళలకు బాసటగా నిలిచేలా ప్రతిజ్ఞ చేయించారు. స్టెల్లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ రేఖ మాట్లాడుతూ అమ్మాయిలు తమ భవిష్యత్ ప్రణాళిక, హక్కులతో పాటు జీవితంలో ఎదురయ్యే అవరోధాలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. చైల్డ్ హెల్ప్‌లైన్-1098, పోలీస్-100/112, ఉమెన్ హెల్ప్‌లైన్-181పైనా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి జి.ఉమాదేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, దిశ పోలీస్ ఇన్‌స్పెక్టర్ వాసవి, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా సమన్వయకర్త ఎ.రమేష్, బర్డ్స్ ఎన్‌జీవో ప్రతినిధి కె.ప్రకాష్ కుమార్, కళాకారులు ఆర్.పిచ్చయ్య, కరస్పాండెంట్ డాక్టర్ లీన క్వాడ్రాస్, సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ సిస్టర్ సహాయ మేరీ, సిస్టర్ లావణ్య, ఉషా కుమారి, డాక్టర్ లిటిల్ ఫ్లవర్, స్వప్న, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

నాన్నకు ప్రేమతో...

మచిలీపట్నంలో పార్కును ప్రారంభించిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి

మచిలీపట్నంటౌన్: తండ్రిపై ఉన్న ప్రేమతో ఆయన జ్ఞాపకార్థం పార్కును ఏర్పాటు చేయాలనుకున్నానని... ఆ కల నేటికి నెరవేరిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీలక్ష్మి అన్నారు. నగరంలోని 46వ డివిజన్ పంచాయతీ రాజ్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన యర్రా నాగేశ్వరరావు స్మారక పార్కును ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), కలెక్టర్ పి.రాజాబాబు, మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ తన తండ్రి మచిలీపట్నం హిందూ ఉన్నత పాఠశాల, కాలేజీలో చదువుకున్నారని.. అనంతరం ఇండియన్ రైల్వేలో ఐఆర్‌ఎస్‌గా రిటైర్ అయ్యారని చెప్పారు. ఉద్యోగ రీత్యా దేశంలోని వివిధ ప్రాంతాల్లో నివసించినప్పటికీ తమతో ఎప్పుడూ మచిలీపట్నం గురించి చెబుతూ ఉండేవాడని తెలిపారు. ఆయన స్మారకార్థం ఇక్కడ పార్కును అభివృద్ధి చేయాలనుకున్నానని పేర్కొన్నారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే పేర్ని నాని సహకారంతో 1.5 ఎకరాల పార్కు స్థలంలో ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్, అమృత్, నగరపాలక సంస్థ నిధులు రూ. 2.18 కోట్ల వ్యయంతో పార్కును ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ పార్కు నిర్వహణను తానే చూసుకుంటానని స్పష్టం చేశారు. పార్కులో ఆమె కలియ తిరిగారు. నెట్ క్రికెట్ విభాగాన్ని పరిశీలించి బ్యాటింగ్ చేశారు. స్థానికులు పార్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమె సోదరుడు యర్రా సుబ్బారావుతో కలిసి పార్కు ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన తండ్రి నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్కు ఆవరణలో వేప, రావి మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ బి.రాజశేఖర రెడ్డి, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మీ, శీలం భారతి, ఎంయూడీఏ చైర్మన్ బొర్రా దుర్గాభవాని, ఎంయూడీఏ వీసీ కె.రాజ్యలక్ష్మీ, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, నగర కమిషనర్ జి.చంద్రయ్య, బందరు ఆర్డీవో ఎం.వాణి, తహసీల్దార్ శ్రీవిద్య, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా తదితరులు పాల్గొన్నారు.



పార్కులో నెట్ క్రికెట్ ఆడుతున్న వై.శ్రీలక్ష్మి

మహిళల ఆర్థికాభివృద్ధే జగనన్న లక్ష్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక
- వైఎస్సార్ ఆసరా చెక్కు లబ్ధిదారులకు పంపిణీ
- ఆనందోత్సాహాల్లో మహిళలు



చినగొల్లపాలెంలో ఆసరా చెక్కులు పంపిణీలో ఉప్పాల రాము, జెడ్పీచైర్ పర్సన్ ఉప్పాల హారిక

కృత్తివెన్ను: మహిళలను మహారాణులు చేసి వారి మోముల్లో చిరునవ్వు చూడాలన్నదే జగనన్న సంకల్పమని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తెలిపారు. చినగొల్లపాలెం దీవిలో డ్వాక్రా మహిళలకు జగనన్న ఆసరా చెక్కుల పంపిణీ బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో హారిక మాట్లాడుతూ జగనన్న చేస్తున్న సంక్షేమ పాలన చూసి కొందరు ఓర్వలేక నిజాన్ని అబద్ధంగాను, అబద్ధాన్ని నిజంగాను ప్రచారం చేయాలని పడుతున్న ఆరాటాన్ని ప్రజలంతా గమనిస్తున్నారని చెప్పారు. పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఉప్పాల రాము మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. మనస్సులో ఎటువంటి కల్మషం లేకుండా ప్రతి పేదవాడు సంతోషంగా జీవించాలన్న తపనతో స్వచ్ఛమైన పాలన అందిస్తున్నారన్నారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మన దేశంలోనే ఎక్కడా లేవన్నారు. పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనపై నమ్మకముంచి జగనన్న పంపించాడని తెలిపారు. ఆయన నమ్మకాన్ని ఓట్ల రూపంలో వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అనంతరం ఆసరా చెక్కులను రాముతో కలసి హారిక మహిళలకు అందించారు. మండల వ్యాప్తంగా 1012 స్వయం సహాయక మహిళా సంఘాలకు గాను 10,439 మంది సభ్యులకు నాల్గవ విడత ఆసరా నిధులు రూ.10.6 కోట్లు అందిస్తున్నట్లు ఏపీ కనకారావు తెలిపారు. ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పిన్నెంటి మహేష్, ఎంపీపీ కూనసాని గరుడప్రసాద్, జెడ్పీటీసీ మైల రత్నకుమారి, సర్పంచ్ పెనుమాల సునీల్, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు, స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ జల్లా భూపతిరాజు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ కొక్కిలిగడ్డ బాపూజీ, పార్టీ నాయకులు బన్ను, ఏపీఎం పరశురామయ్య, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఎందరో మహానుభావులు..



కీర్తనలు గానం చేస్తున్న కళాకారులు (ఫైల్)

- 29 నుంచి త్యాగరాజస్వామి ఆరాధన సంగీతోత్సవాలు
- వారం రోజులపాటు నిర్వహణ
- దేశ విదేశాల నుంచి విద్వాంసులు రాక

విజయవాడ కల్చరల్: సంగీత సన్మండలి ఆధ్వర్యంలో నగరంలో వారం రోజులపాటు త్యాగరాజస్వామి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. తమిళనాడులోని తిరువయ్యార్ తర్వాత సద్గురు త్యాగరాజస్వామి ఆరాధన సంగీతోత్సవాలు అంతే వైభవంగా విజయవాడలో నిర్వహిస్తారు. 1995లో ప్రారంభమైన సంగీత సన్మండలి నాటి నుంచి 29 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా జనవరి నెలలో త్యాగరాజస్వామి కృతులకు పెద్దపీట వేస్తూ ఉత్సవాలు నిర్వహిస్తోంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లబ్ధప్రతిష్టులైన సంగీత విద్వాంసులు, యువ సంగీత కళాకారులు పాల్గొనటం అదృష్టంగా భావిస్తారు. దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత కళాశాలలో సంగీత సన్మండలి, శ్రీనివాస ప్రసాద్ ఇంటర్ నేషనల్ ఫౌండేషన్ ఫర్‌వార్మింగ్ ఆర్ట్స్, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సంగీత ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 29వ తేదీ సాయంత్రం ఉత్సవాలను ఇంటెలిజెన్స్ డీజీ పి.సీతారామాంజనేయులు ప్రారంభిస్తారు. ఫిబ్రవరి 4వ తేదీ నిర్వహించే ఆంజనేయ ఉత్సవంతో కార్యక్రమాలు ముగుస్తాయి. వారం రోజులపాటు చేపట్టే ఉత్సవంలో కేవలం త్యాగరాజస్వామి కృతులనే గానం చేయడం విశేషం.

వైభవంగా నగర సంకీర్తన....

30 వ తేదీ ఉదయం 8 గంటలకు త్యాగరాజ స్వామి, ఆంజనేయ స్వామి విగ్రహాలతో నగర సంకీర్తన నిర్వహిస్తారు. సంగీత కళాశాలలో ప్రారంభమై బీఆర్‌టీఎస్ రోడ్డు, సత్యనారా యణపురం ప్రాంతాల మీదుగా తిరిగి కళాశాలకు చేరుకుంటుంది. త్యాగరాజ స్వామి రచించిన ఉత్సవ సంప్రదాయ కీర్తనలు గానం చేస్తారు. ఫిబ్రవరి 4 వ తేదీ త్యాగరాజ స్వామి రచించిన పంచరత్న కృతుల గోష్ఠిగానం ఉంటుంది. 200 మందికి పైగా సంగీత విద్వాంసులు ఏక కాలంలో అద్భుతంగా గంటసేపు కృతులను గానం చేస్తారు. ఈ కార్యక్రమాన్ని విజయవాడ ఆకాశవాణి కేంద్రం ప్రసారం చేస్తుంది. కేవీఎస్ గోవిందరాజన్, మల్లాది సూరిబాబు, కె.శశిధర్, మల్లాది సోదరులు, అయ్యగారి శ్యామసుందర్, పోపూరి గౌరీనాథ్, వేమూరి విశ్వనాథ్, అంజనా సుధాకర్, డీవీ మోహనకృష్ణ, విష్ణుభొట్ల సోదరీమణులు వంటి ఎందరో విద్వాంసులు పాల్గొంటారు.

విలువలతో కార్యక్రమాలు



సంగీత సన్మండలి ప్రారంభించి 29 సంవత్సరాలైంది. సంగీత విద్వాంసులు, సంగీత కళాశాల అధ్యాపకులు పెమ్మరాజు సూర్యారావు, కేవీ రెడ్డి, సీఎస్ రంగస్వామి సన్మండలిని ప్రారంభించారు. నాటి నుంచి విలువలతో కూడిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సంగీత విద్వాంసులు ప్రతిఫలం ఆశించకుండా ఉత్సవంలో పాల్గొనడం విశేషం. సమయపాలన సంగీత సన్మండలి ప్రత్యేకం.

– మోదుమూడి సుధాకర్
సంగీత సన్మండలి అధ్యక్షుడు

క్లుప్తంగా

అధ్యాపకుల సంఘం డైరీ ఆవిష్కరణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీజీసీజీటీఏ డైరీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి, అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు డాక్టర్ కేఆర్‌జీ శేషకుమార్ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కాలేజియేట్ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్(ఏపీజీసీజీటీఏ) డైరీని ముద్రించి అధ్యాపకులకు పంపిణీ చేయటం అభినందనీయం అన్నారు. అధ్యాపకులు సమన్వయంతో పనిచేసి మెరుగైన విద్యాబోధన చేయాలని సూచించారు. అసోసియేషన్ కోశాధికారి నాగపద్మావతి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సుధాకరరావు, జిల్లా కార్యదర్శి కేఎస్ ప్రసాద్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

28న ఆంధ్ర లయోల కళాశాలలో జాబ్ మేళా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నగరంలోని ఆంధ్ర లయోలా డిగ్రీ కాలేజీ నందు 28వ తేదీ ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రారంభమవుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. ఈ జాబ్ మేళా కి వచ్చిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. రిజిస్ట్రేషన్, పూర్తి వివరాలకు 96033 68324, 9347779032, 70959 91379, 93912 54464 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

వీరులపాడు: తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం మండలం దెందులూరు నుంచి తొండలగోపవరం వెళ్లే రహదారిపై ఆటో, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వీరులపాడు మండలం జయంతి గ్రామానికి చెందిన గూడూరు శ్రీనివాసరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు.. శ్రీనివాస రెడ్డి రోజూ మాదిరిగానే పెనుగంచిప్రోలు నుంచి వడ్రంగి పనికి వెళ్లి రాత్రికి తిరిగి స్వగ్రామానికి ఆటోలో తిరిగి వస్తుండగా.. ట్రాక్టర్ ఎదురుగా రావడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరెడ్డి చేయి పూర్తిగా తెగి పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో హుటాహుటిన మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉజ్వల భవిష్యత్ కోసమే క్రీడాపోటీలు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నైపుణ్యం ఉన్న క్రీడాకారులను గుర్తించి వారికి ఉజ్వల భవిష్యత్‌ను అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలంటూ వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్ మోహనరావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గ్రామీణ ప్రాంత క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో నైపుణ్యం ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక జాతీయ, అంతర్జాతీయ వేదికలలో జరిగే పోటీల్లో పాల్గొనలేకపోతున్నారన్నారు. ఈ పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత క్రీడాకారులు సైతం జాతీయ, అంతర్జాతీయ వేదికలపై జరిగే పోటీల్లో రాణించేలా కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న క్రీడా పోటీలను క్రీడాకారులను సద్వినియోగం చేసుకున్న ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, నాయకులు అనుమోలు పార్థసారధి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాసరావు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల సంరక్షణ అందరి బాధ్యత

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు



విజేతకు చెక్కు, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు చిత్రంలో ఎస్పీ జాషువా

చిలకలపూడి(మచిలీపట్నం): ఆడబిడ్డలను రక్షించటం, చదువుకునేలా ప్రోత్సహించటం తల్లిదండ్రులతో పాటు సమాజం బాధ్యత అని కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆడపిల్లలు, మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు, చట్టాలు రూపొందించి అమలు చేస్తున్నాయన్నారు. గర్భస్థపిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించకూడదన్నారు. బాలికల హక్కులు, సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చేసినప్పుడే వారికి బంగారు భవిష్యత్తును అందించగలమన్నారు. బాలికలపై వేధింపులు జరిగినప్పుడు హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. బాలిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలో ఎండీ సహాన, ఎస్. జశ్వితసిరి, కె. నాగరమ్యజయశ్రీ, వక్తృత్వ పోటీలో జి. కోమలవల్లి, టి. హంశిక ఫణిదేవి, ఎ. దివ్యసాయిషాలిని, చిత్రలేఖనం పోటీలో డి. దీక్షిత, కె. వంశీ, బి. శరణ్య వరుసగా ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలు సాధించారు. వీరికి నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను ఎస్పీ పి. జాషువా, ఆరో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్. చినబాబులతో కలసి కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో జి. గీతాబాయి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్‌కుమార్



రాజ్యాంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జేసీ సంపత్‌కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగం కల్పించిన హక్కులు, విలువల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో రాజ్యాంగ విలువలు–నేటి రాజకీయాలు అనే అంశంపై సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ హక్కులు తెలుసుకోకపోవడమే వెనుకబాటుకు కారణమని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణను ప్రతి ఒక్కరూ గురుతర బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యబద్ధంగా వినియోగించుకోవాలన్నారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ ఝాన్సీ గెడ్డం మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులపై మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ చేతుల మీదుగా రాజ్యాంగ పుస్తకం(సంక్షిప్తంగా) ఆవిష్కరించారు. సదస్సులో రిటైర్డ్ ఐఆర్ఎస్ శివ భాగ్యారావు, ఆల్ తెలుగు ప్రజాపార్టీ జాతీయ అధ్యక్షుడు జేసు రత్నకుమార్, సరస్వతి అయ్యర్, ప్రొఫెసర్ సంజా అంబేద్కర్ పాల్గొన్నారు.





ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ ప్రారంభం

జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. దేశ వ్యాప్తంగా జరిగే ఈ పరీక్షలు బుధవారం నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకూ ఆయా షెడ్యూల్స్‌లో నిర్వహించనున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే ఈ పరీక్షను టీసీఎల్ సంస్థ ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తోంది. విద్యార్థులు వారికి కేటాయించిన కేంద్రాల వద్దకు నిర్ణీత సమయానికంటే ముందుగానే చేరుకుని క్రమపద్ధతిలో పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లారు. నిబంధనలకు అనుగుణంగా హాల్ టికెట్, పరీక్ష సామగ్రి మినహా ఎటువంటి వస్తువులు, గ్యాడ్జెట్లు పరీక్ష హాలులోకి అనుమతించలేదు. విజయవాడ వన్‌టౌన్‌లోని పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాల వద్ద పరీక్ష రాయడానికి లోపలికి వెళ్తున్న విద్యార్థులను చిత్రాల్లో చూడొచ్చు.

– వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)







జాతీయ వర్సిటీల క్రాస్ కంట్రీ పోటీలకు పవన్



పవన్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

విజయవాడస్పోర్ట్స్: అఖిల భారత విశ్వవిద్యాలయాల క్రాస్ కంట్రీ(10కే) పోటీలకు పీబీ సిద్ధార్థ ఆర్ట్స్, సైన్స్ కాలేజీ విద్యార్థి బి.పవన్ ఎంపికయ్యాడు. ఇటీవల ఉయ్యూరులోని ఏజీ, ఎస్‌జీ సిద్ధార్థ కాలేజీలో జరిగిన కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల క్రాస్ కంట్రీ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించాడు. అనంతరం అదే కళాశాల ప్రాంగణంలో జరిగిన కృష్ణా వర్సిటీ జట్టు ఎంపిక పోటీల్లోనూ అత్యుత్తమ క్రీడా నైపుణ్యం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. త్వరలో చెన్నైలో జరిగే అఖిల భాతర విశ్వవిద్యాలయాల క్రాస్ కంట్రీ పోటీలకు కృష్ణా వర్సిటీ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు. జాతీయ పోటీలకు ఎంపికైన పవన్‌ను పీబీ సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, డైరెక్టర్ వి.బాబూరావు, డీన్ రాజేష్ సి. జంపాల, వ్యాయాల అధ్యాపకుడు ఎ.చిన బాబు కాలేజీ ప్రాంగణంలో బుధవారం అభినందించారు.

తిరుపతమ్మకు రూ.1.70 కోట్లకు పైగా ఆదాయం

పెనుగంచిప్రోలు: స్థానిక తిరుపతమ్మవారి ఆలయం వద్ద వివిధ వ్యాపారాలు నిర్వహించుకునేందుకు బుధవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.1,70,63,000 ఆదాయం సమకూరినట్లు ఈవో కె. రమేష్‌నాయుడు తెలిపారు. ఏడాది పాటు ఆలయం వద్ద నిమ్మకాయలు, వాహన పూజ వద్ద పూజాసామగ్రి విక్రయించుకునే లైసెన్స్‌ను రూ.6,15,000(యడ్ల గంగరాజు)కు దక్కించుకున్నారు. అలాగే దీపారాధన ప్రమిదలు విక్రయించుకునే లైసెన్స్‌ను రూ.10,50,000(కోయ శ్రీనివాసరావు), దేవస్థానం వారు సూచించిన ప్రదేశంలో ఫొటోలు విక్రయించుకునే లైసెన్స్‌ను రూ.4.62,000(నూతలపాటి రాంబాబు), పప్పులు, పాలు, బియ్యం ప్రోగుచేసుకునే హక్కును రూ.3,70,000(తమ్మిశెట్టి సోమయ్య), టెంట్ హౌస్ నిర్వహణను రూ.7,00,000(చంద్రకంటి వెంకట పుల్లారావు), ఆలయ ప్రాంగణంలో చాపలు భక్తులకు అద్దెకిచ్చే లైసెన్స్‌ను రూ.1,10,000 (యడ్ల గంగరాజు), ఆలయ ప్రాంగణంలో మిఠాయి, బొంగుబియ్యం విక్రయించుకునే హక్కును రూ.5,06,000(యడ్ల గంగరాజు), భక్తులచే సమర్పించే వస్త్రాలు పోగు చేసుకునే హక్కును రూ.56,30,000(పెద్ది నారాయణ), దేవస్థానం సత్రాల నిర్వహణ హక్కును రూ.33,90,000(భవనారి సుబ్బారావు), వాహనాల పార్కింగ్ రుసుం వసూలు చేసుకునే హక్కును రూ.42,00,000(కాకాని వీరవర ప్రసాద్)కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, దేవదాయ శాఖాధికారి ఫణికుమార్ పాల్గొన్నారు.

రోజువారీ విధుల్లో హిందీ తప్పనిసరి

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది రోజువారీ విధుల్లో హిందీ ఉపయోగించడం తప్పనిసరి అని విజయవాడ డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పేర్కొన్నారు. విజయవాడ రైల్వే ఆడిటోరియంలో పట్టణ అధికార భాష అమలు కమిటీ సమావేశం (టీఓఎల్ఐసీ) బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన టీఓఎల్ఐసీ చైర్మన్, డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో రాజభాష వినియోగం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. విజయవాడ కేంద్రంగా గత డిసెంబర్ 11 నుంచి 18 వరకు కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగులకు నిర్వహించిన హిందీ న్యూస్ రీడింగ్, నోటింగ్, డ్రాఫ్టింగ్, కవితలు, వ్యాస రచన, ఉపన్యాసం, క్విజ్, అంత్యాక్షరి తదితర పోటీల విజేతలుగా నిలిచిన 72 మంది డివిజన్ ఉద్యోగులకు డీఆర్ఎం చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం.శ్రీకాంత్, రాజభాష అధికారి మహేష్‌కుమార్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆధారాలు లేని రూ. 19 లక్షలు స్వాధీనం



రాష్ట్ర చెక్ పోస్ట్ వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

ఉంగుటూరు: ఆధారాలు లేకుండా రూ.10లక్షల నగదును తీసుకువెళ్తున్న నలుగురు వ్యక్తులను ఆత్కూరు పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పొట్టిపాడు టోల్ ప్లాజా వద్ద హనుమాన్ జంక్షన్ సీఐ నవీన్ నరసింహ మూర్తి, ఆత్కూరు ఎస్ఐ సూర్య శ్రీనివాస్‌లు సిబ్బందితో కలిసి వాహన తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో విజయవాడ నుంచి ఏలూరు వెళ్తున్న వాహనంలో రూ.10లక్షల నగదును గుర్తించారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించి విచారించగా వారు ఓ రియల్‌ఎస్టేట్ పని మీద ఏలూరు వెళ్తున్నామని చెప్పారు. ఆధారాలు లేని నగదును ఆ వ్యక్తులను తదుపరి విచారణ నిమిత్తం తహసీల్దార్ వద్దకు పంపించారు. అదేవిధంగా గోవాకి చెందిన 8 మద్యం సీసాలను తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెక్ పోస్ట్ వద్ద మరో రూ. 9 లక్షలు..

నందిగామ: నందిగామ మండలం జొన్నలగడ్డ సమీపంలోని రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద పోలీసులు బుధవారం రాత్రి రూ. 9 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ హనీష్ తెలిపిన సమాచారం ప్రకారం తెలంగాణ రాష్ట్రం మధిర వైపు నుంచి కారులో తీసుకొస్తున్న నగదును జొన్నలగడ్డ చెక్ పోస్ట్ వద్ద తనిఖీ చేస్తున్న సమయంలో గుర్తించామన్నారు. సంబంధిత నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నగదు ఎక్కడ నుంచి ఎక్కడికి వెళుతుంది? ఎందుకు వెళుతుంది? అనే అంశాలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు.


డిజిటల్ మార్కెటింగ్‌లో ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ (డిజిటల్ మార్కెటింగ్) కోర్సులో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయసారథి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) తమ కళాశాల సంయుక్తంగా ఈ శిక్షణను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంటర్, డిప్లొమా, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగిన వారు ఈ శిక్షణలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి సర్టిఫికెట్‌తో పాటుగా ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని తెలియజేశారు. ఆసక్తి, అర్హతలు ఉన్న వారు ఫిబ్రవరి 2వ తేదిలోగా విద్యార్హతా పత్రాలు, ఆధార్ కార్డు, ఈ మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌తో విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ఇతర వివరాలకు 93477 79032, 80087 42842లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

పెనమలూరు: కానూరులో యువకుడు ఆత్మహత్య చేసుకోవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సినీ పోలీస్ పవర్ మాల్‌లో సోల్ ఆఫ్ సౌత్ రెస్టారెంట్ ఉంది. పురమా మహేష్ రెస్టారెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. హైదరాబాద్‌లో రెండో రెస్టారెంట్ ప్రారంభించాలనే ఆలోచనతో నలుగురు వ్యక్తులు జార్కండ్‌కు చెందిన వహిద్‌ఆలీ(21), సందీప్‌కుమార్, చైతన్య, వెంకట్‌కు కానూరు సినీపోలీస్‌లో ఉన్న రెస్టారెంట్‌లో ట్రెనింగ్ ఇస్తున్నారు. వీరు కానూరు సిరినగర్‌లోని రూమ్‌లో అద్దెకు ఉంటున్నారు. కాగా మంగళవారం వహిద్‌ఆలి మినహా అందరూ ట్రెనింగ్‌కు వచ్చారు. రాత్రి అయినా వహిద్‌ఆలి ట్రెనింగ్‌కు రాకపోయే సరికి మేనేజర్ ఫోన్ చేయగా వహిద్‌ఆలి ఫోన్ ఎత్తలేదు. దీంతో రూమ్‌లో అతనితో ఉండే చైతన్యను వెళ్లి చూసిరమ్మని మేనేజర్ పంపాడు. చైతన్య రూమ్ వద్దకు వెళ్లి కిటికీలో నుంచి చూడగా వహిద్‌అలి రూమ్‌లో ఫ్యాన్ కొక్కానికి టవల్‌తో ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. రూమ్ తలుపు పగులకొట్టి లోనికి వెళ్లి చూడగా వహిద్‌అలి మృతి చెంది ఉన్నాడు. రెస్టారెంట్ మేనేజర్ మహేష్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కింద పడి వ్యక్తి బలవన్మరణం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు కింద తలపెట్టి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్పీ) బుధవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణానదిపై రైల్వే బ్రిడ్జి మొదట్లో గుర్తు తెలియని వ్యక్తి తల, మొండెం వేర్వేరుగా పడి ఉండటాన్ని గుర్తించిన సిబ్బంది రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ పార్థసారథి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, ఒంటిపై తెలుపు గడుల చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, ఇతర ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు విజయవాడ జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా పోలీసులు కోరారు.

ప్రజలకు మంచి చేయాలన్నదే ఆశయం

వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్



నెహ్రూనగర్‌లో పర్యటిస్తున్న దేవినేని అవినాష్, ఇతర నేతలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రజలకు మంచి చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయమని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. 'గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ' పేరుతో నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమం బుధవారం డివిజన్‌లోని శిఖామణిసెంటర్, నెహ్రూనగర్ ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఆయన పర్యటనకు స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ.. ప్రజలకు మంచి చేయాలనేది వైఎస్ జగన్ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వం పేదలపై చిన్నచూపు చూసిందని, ఇళ్ల పట్టాల పేరుతో మోసం చేసిందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే బాడవపేట, ఉడ్‌పేట, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు రెగ్యులర్ చేసినట్లు తెలిపారు. ప్రతిపక్ష పార్టీల ముసుగులో ఉన్న ఎల్లో మీడియాకు మాత్రమే ప్రభుత్వ వ్యతిరేకత కనిపిస్తోందని దుయ్యబట్టారు. ప్రతిక విలువలకు తిలోదకాలు ఇచ్చి, ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలపై విషపు రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించిన కాంగ్రెస్‌తో చంద్రబాబు కుమ్మక్కయ్యారని విమర్శించారు. వారి అజెండా అధికారం చేజిక్కించుకోవడమేనని, ప్రజల సంక్షేమం కాదని పేర్కొన్నారు. వెన్నుపోటు రాజకీయాలు చేయడంలో చంద్రబాబు సిద్ధహస్తుడని, వాటిలో ఆయనది 40 ఏళ్ల అనుభవమని ఎద్దేవాచేశారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, స్థానిక కార్పొరేటర్ మెరకనపల్లి మాధురి, కలపాల అంబేడ్కర్ పాల్గొన్నారు.

ఇతర డివిజన్లలో...

ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని వివరిస్తూ దేవినేని అవినాష్ సతీమణి దేవినేని సుధీర మూడో డివిజన్ రామచంద్రానగర్ కాలనీలో, సోదరి దేవినేని క్రాంతి 11వ డివిజన్ బాగయ్య బజార్, అచ్చం బజార్‌లో, బావ వై.సిద్ధార్థ్ 14వ డివిజన్ దర్శిపేట డొంకరోడ్డులో పర్యటించి, ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదలకు వరం

వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



ఆరోగ్య సురక్ష కార్డును అందజేస్తున్న దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల జీవితాలకు ఒక వరంలా మారిందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఏడో డివిజన్ 89వ వార్డు సచివాలయం పరిధిలోని వారికి మధు చౌక్‌లో ఉన్న చైతన్య స్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని అవినాష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకాన్ని తరువాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆరోగ్య శ్రీ పథకాన్ని పునః ప్రారంభించి పటిష్టంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. వైద్య పరీక్షలు చేయించుకోడానికి కూడా డబ్బులు లేని పేదవారికి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వేల రూపాయలు ఖర్చయ్యే వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తారని తెలిపారు. వారి ఆరోగ్య సమస్యలు పూర్తిగా నయమయ్యేంత వరకు వైద్య ఆరోగ్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారని వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి సచివాలయం పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో నిలిచి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఏడో డివిజన్ కార్పొరేటర్ ఎం.మాధురి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బుర్రి జగజ్జీవన్ రామ్, క్లస్టర్ ఇంచార్జి ఉదయ్‌తో పాటు పలువురు డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి నగరంలో 144 సెక్షన్

విజయవాడస్పోర్ట్స్: శాంతి భద్రతలను పరిరక్షించేందుకు విజయవాడ సిటీ పరిధిలోని ప్రాంతాల్లో గురువారం నుంచి 50 రోజుల పాటు 144(2) సీఆర్‌పీసీ కింద నిషేధాజ్ఞలను అమలు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు ఇబ్రహీంపట్నం, భవానీపురం, వన్ టౌన్, టూ టౌన్, సత్యనారాయణపురం, అజిత్‌సింగ్‌నగర్, నున్న, గవర్నర్‌పేట, సూర్యారావుపేట, కృష్ణలంక, మాచవరం, గుణదల, పటమట పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. నలుగురు, అంతకు మించి వ్యక్తులు ఒకే ప్రదేశంలో గూమిగూడినా, కర్రలు, ఇతర మారణాయుధాలతో సంచరించినా, నిబంధనలను అతిక్రమించినా శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇన్నర్ రింగ్ రోడ్డు పరిశీలన



ఇన్నర్‌రింగ్ రోడ్డును పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని ఇన్నర్ రింగ్ రోడ్డును మరింత అభివృద్ధి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం అజిత్‌సింగ్ నగర్‌లోని ఇన్నర్‌రింగ్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రింగ్‌రోడ్డును మరింత శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు వీఎంసీ ఆధ్వర్యంలో ప్రాజెక్టుకు శ్రీకారం చేయబోతున్నామని తెలిపారు. రోడ్డు సుందరీకరణకు, అభివృద్ధికి ఆర్అండ్‌బీ, వీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం కలిసి భౌగోళిక స్థితిగతులను బట్టి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. స్థానికంగా చేపట్టాల్సిన జంక్షన్లు అభివృద్ధికి సంబంధించి నివేదికను తనకు సమర్పించాలని సూచించారు. ఈ పర్యటనలో వీఎంసీ సర్కిల్-2 ఈఈ శ్రీనివాస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్‌బాబు, ఆర్అండ్‌బీ డీఈ శశి భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి శోభాయాత్ర



తిరువూరులో సీతారాముల నగరోత్సవం

తిరువూరు: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథంలో ఉంచి బుధవారం తిరువూరు పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ భక్త బృందం ఆధ్వర్యంలో రాజుపేట నుంచి ప్రధాన వీధుల్లో రామనామ సంకీర్తనతో ఊరేగింపు జరిపారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ వేదోక్త నిర్వాహకులు, స్థానాచార్యులు కేయీఎస్ సాయి ఆధ్వర్యంలో జరిగిన శోభాయాత్రలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు దేవిశెట్టి బాలకృష్ణ, కోదండ రామాలయం, రంగనాయకస్వామి ఆలయం, వేంకటాచలస్వామి దేవాలయాల పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు రాజుపేట శ్రీరస్తు కన్వెన్షన్ హాల్లో సీతారామ కల్యాణం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా గ్యార్వీ షరీఫ్ పండుగ

ఏ.కొండూరు: చీమలపాడు ఏఏఎంటీకే దర్బార్ పీఠాధిపతి మహమ్మద్ ఖాజా మొయిద్దీన్ షా తాజ్ ఖాదరి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి గ్యార్వీ షరీఫ్ పండుగ వైభవంగా జరిగింది. అంతర్జాతీయ సూఫీ పీఠాధిపతి హాఫీముద్దీన్ జిలాని పాల్గొని బాబా దివ్య సమాధి వద్ద చాదర్, పూలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన మాట్లాడుతూ చీమలపాడు బాబా సూఫీ మొహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరి బాబా అస్తమయం తర్వాత దర్గాను సందర్శించడం ఇదే మొదటిసారి అని అన్నారు. బాబా వారి దీవెనలు ఎప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం వేలాది మందికి అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో దర్బార్ పీఠాధిపతి ఎండీ ఖలీల్‌బాబు, ఎండీ జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్‌బాబు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ నీడన పచ్చందాలు

బెంజిసర్కిల్ తూర్పువైపు ఫ్లై ఓవర్ కింది ప్రాంతంలో పచ్చదనం కనువిందు చేస్తోంది. ఒకటో ఫిల్లర్ నుంచి ఆంజనేయస్వామి గుడి వరకు అందమైన మొక్కలను నాటారు. డివైడర్ మధ్యలోని వాకింగ్‌ట్రాక్‌కు రెండు వైపులా ఆకట్టుకునే మొక్కలను నాటారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు పచ్చందాలను తిలకిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా కడియం నుంచి ఈ మొక్కలను తీసుకొచ్చి నాటామని కాంట్రాక్టర్ శేషగిరి తెలిపారు.

– ఆటోనగర్(విజయవాడతూర్పు)









క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా రామలింగేశ్వరనగర్ ఉపకేంద్రం, 11 కేవీ కళానగర్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి. సుధాకర్ బుధవారం తెలిపారు. నాగేంద్ర నగర్, 10 ఎంజీడీ రోడ్డు, కళానగర్, ఎలిసమ్మ హోటల్ ప్రాంతంతో పాటు పూర్ణచంద్రనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, భద్రతా ప్రమాణాలు పాటించే దిశగా ప్రజల నుంచి సలహాలు, సూచనలు, ఫిర్యాదులు స్వీకరించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం చేపట్టినట్లు గవర్నర్‌పేట-1 డిపో మేనేజర్ కె.బసవయ్య బుధవారం తెలిపారు. ప్రయాణికులు గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య 99592 25455 నంబరుకు ఫోన్ చేసి తమ సలహాలు, సూచనలు, ఫిర్యాదులు తెలియజేయాలని కోరారు.

దేవినేని నెహ్రూ ట్రస్ట్ ద్వారా పేద ప్రజలకు సహాయం

ఆటోనగర్(విజయవాడతూర్పు): మాజీ మంత్రి దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అన్నివర్గాల పేదలకు విస్తృతంగా సహాయ సహకారాలు అందిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పునియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ తెలిపారు. రామలింగేశ్వరనగర్ పడవలరేవు సెంటరులో ఎనిమిది నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి కోసం రూ.2.50 లక్షల విలువైన ఇస్త్రీపెట్టెలు, తోపుడు బండ్లు, సైకిళ్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. 15వ డివిజన్ రామలింగేశ్వర నగర్‌కు చెందిన పేదలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈ సాయం చేశామని పేర్కొన్నారు. వారంతా తమ సమస్యలను గతంలో ఈ డివిజన్‌లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తన దృష్టికి తీసుకురావడంతో ఈ సహాయం చేసినట్టు చెప్పారు. ఈ డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు, డివిజన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, వి.బి.రెడ్డి, డాక్టర్ ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ ఎస్ఐల బదిలీ



రాజవర్ష



శ్రీరచన

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐలుగా పని చేస్తున్న ఎల్.రాజవర్ష, ఇ.శ్రీరచన డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. మూడేళ్ల పాటు వీరిద్దరూ సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. హోం శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో డీజీపీ కార్యాలయంలోని సీఐడీ వింగ్‌కు బదిలీ అయ్యి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు.

212 మందికి వైద్య పరీక్షలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక ఆరో డివిజన్ పరిధిలోని బెల్లపు శ్రీరాములు మునిసిపల్ స్కూల్ ఆవరణలో దీపక్ మల్టిస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం బుధవారం జరిగింది. వైద్యులు వెంకట నారాయణ, జ్యోతి, పి.ప్రశాంత్ పాల్గొని 212 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగరు, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. స్థానిక కార్పొరేటర్ అమర్ పాల్గొని రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. తమ ఆస్పత్రిలో ఓపీ ఉచితమని, వైద్య పరీక్షలపై రాయితీ ఇస్తున్నామని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ సురేష్ తెలిపారు.

సోడా బుడ్డితో మహిళపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): షాపు తాళాలు పగలగొట్టి సామగ్రిని చోరీ చేయడమే కాక ప్రశ్నించిన మహిళపై సోడాబుడ్డితో దాడి చేసి గాయపరిచిన యువకుడిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన ఎం.ధనలక్ష్మి తన బ్లాక్ వద్ద కిళ్లీ షాపు నడుపుతూ జీవనం సాగిస్తోంది. అదే ప్రాంతానికి చెందిన యువకుడు కుక్కల సాయి కిళ్లీ షాపు తాళాలు పగలగొట్టి సామగ్రిని చోరీ చేయడమే కాకుండా అడిగిన ధనలక్ష్మి తలపై సోడాబుడ్డితో దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

192 మద్యం బాటిళ్లు స్వాధీనం

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్ నగర్ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వద్ద 192 మద్యం బాటిళ్లను అక్రమంగా కలిగివున్న వ్యక్తిని నున్న పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల కథనం మేరకు.. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన కోన గిరిష్‌బాబు (33) అనుమతులు లేకుండా 192 మద్యం బాటిళ్లను ద్విచక్ర వాహనంపై తీసుకొస్తుండగా ఎస్ఐ గోవిందు, పోలీసు సిబ్బంది పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతను ఇచ్చిన వాంగ్మూలం మేరకు కండ్రికకు చెందిన శీతు రామకృష్ణను కూడా అదుపులోకి తీసుకొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

తాగునీటి సరఫరాలో లోపాలు లేకుండా చూడాలి



హెడ్‌వాటర్ వర్క్స్‌లో నీటి శుద్ధిని పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

పటమట(విజయవాడతూర్పు): నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి లోపాలూ లేకుండా అధికారులు నిరంతర పర్యవేక్షణ ఉండాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన బుధవారం భవానీపురంలోని హెడ్ వాటర్ వర్క్స్ పనితీరును పరిశీలించారు. నీటిని శుద్ధి చేసే ఫిల్ట్రేషన్ బెడ్లను తరచుగా శుభ్రపరచి, స్వచ్ఛ నీటిని ప్రజలకు అందించాలని ఆదేశించారు. కృష్ణా నది నుంచి వచ్చే నీళ్లలో ఆలేగ్ ఎక్కువగా ఉంటుందని, ఫిల్టర్ బెడ్లను తరచుగా శుభ్రపరచి నీటిని మరింత శుద్ధి చేయాలని అధికారులకు సూచించారు. ఫిల్టర్ బెడ్లను శుభ్రపరిచే క్రమంలో అవసరమైతే కార్మికులను మరింత మందిని పెంచాలని ఆదేశించారు. వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, ఎస్ఈ (ప్రాజెక్ట్స్) రామ్మోహన రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



కల్యాణ వేడుకను నిర్వహిస్తున్న అర్చకులు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీ వెంకటేశ్వరుని కల్యాణ్యాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూర్ణానందంపేట ఏలూరు లాకుల వద్ద ఉన్న శ్రీ కొదండరామ, శ్రీ దాసాంజనేయస్వామి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ వెంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేసి 36 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం ఆలయంలో శ్రీనివాసుని కల్యాణాన్ని అంగరంగా వైవభంగా నిర్వహించారు. శ్రీవారి కల్యాణాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చరణ మధ్య శ్రీలక్ష్మి, శ్రీనివాసుని కల్యాణం కనుల పండువగ సాగింది. తొలుత స్వామి వార్లకు అర్చకులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామిని పెండ్లి కుమారుడిగా, అమ్మవారిని పెళ్లి కుమార్తెగా అలంకరించి, కనుల పండువగా కల్యాణ వేడుకను జరిపించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పులిపాటి వెంకట సాయిరాం, ఉషారాణి, వెంకట ప్రసాద్, అర్చకులు సూర్యనారాయణ, గోపి, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు యువత దూరంగా ఉండాలి



అజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): యువత ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని ప్రముఖ న్యాయవాది చలసాని అజయ్‌కుమార్ సూచించారు. పీబీ సిద్ధార్థ కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో బుధవారం సదస్సు జరిగింది. అజయ్ కుమార్ మాట్లాడుతూ పాశ్చాత్యదేశాల నాగరికత ప్రభావంతో ఈ ర్యాగింగ్ మహమ్మారి మన దేశంలోకి ప్రవేశించిందన్నారు. కళాశాలకు చేరిన ఉత్సాహంలో తెలియక ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థుల జీవితం జైలు పాలవుతారని, వారి కుటుంబ పరువు ప్రతిష్టలు బజారుపాలవుతాయని హెచ్చరించారు. ప్రతి విద్యార్థీ ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్ జరగకుండా చూడాల్సిన బాధ్యత కళాశాల యాజమాన్యాలపైనే ఉందన్నారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల మాట్లాడుతూ.. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందిన సమయంలో ఇంకా తోటి విద్యార్థులను ర్యాగింగ్‌కు పాల్పడటం అంటే అనాగరిక సమాజంలో బతుకుతున్నట్లేనని అన్నారు. అక్షరాస్యులైన యువత ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.శ్రీనివాసరావుతో పాటుగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం అజయ్ కుమార్‌ను కళాశాల ప్రతినిధులు సత్కరించారు.

శ్రీ రామచంద్రుడు ధర్మరక్షకుడు



సుందరకాండ విశేషాలను వివరిస్తున్న డాక్టర్ ప్రోలాప్రగడ శ్రీనివాస్

విజయవాడ కల్చరల్: శ్రీ రామచంద్రమూర్తి ధర్మరక్షకుడని ఆధ్యాత్మికవేత్త డాక్టర్ ప్రోలాప్రగడ శ్రీనివాస్ అన్నారు. సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని కళాపీఠం వేదికపై నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సుందరకాండ పారాయణం భక్తులను భక్తపారవశ్యంలో ఓలలాడిస్తోంది. బుధవారం నాటి కార్యక్రమంలో శ్రీ రామచంద్రుడి వ్యక్తిత్వం గురించి ప్రోలాప్రగడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. భక్తులకు రాముడు నిరంతరం అండగా ఉంటాడన్నారు. రామరాజ్యం, రామబాణం, రామనామం ఈ జగత్తుకు చాలా అవసమన్నారు. సీతారాములు ఆదర్శ దంపతులని పేర్కొన్నారు. వారి జీవిత విధానాన్ని నేటి దంపతులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సుందర కాండలోని సన్నివేశాలను వివరిస్తూ హనుమంతుడు వంటి కార్యశూరుడు మనకు కనిపించరని పేర్కొన్నారు. సుందర కాండలోని ప్రధాన ఘట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ కళాశాలల అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డాక్టర్ సుధారాణి, పాలడుగు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



కేతనకొండ ఎంపీపీ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న బాలికలు, ఉపాధ్యాయులు

మైలవరం: విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఐసీసీ ప్రిసైడింగ్ ఆఫీసర్ డాక్టర్ పి.శోభారాణి అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐసీసీ, సహేలీ గరల్స్ క్లబ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సహేలీ గరల్స్ క్లబ్ మెంటర్ డాక్టర్ కె.రాణీరుద్రమ మాట్లాడుతూ బాలికలు, మహిళల హక్కుల రక్షణ, పోషకాహార లోపం కలిగే ఇబ్బందులు, లింగ ఆధారిత హింస నుంచి రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీసీ, సహేలీ గరల్స్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.హరిప్రసాద్, కో–ఆర్డినేటర్స్ పాల్గొన్నారు.

• **కేతనకొండ(ఇబ్రహీంపట్నం):** స్థానిక ఎంపీపీ పాఠశాలలో బాలికలతో కేక్ కట్ చేయించి స్వీట్లు పంచారు. ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్‌పాషా మాట్లాడుతూ ఆడపిల్ల పుడితే బాధపడే స్థితి నుంచి ఆడపిల్ల పట్టాలని కోరుకునే స్థితికి సమాజం చేరిందన్నారు. సామాజిక, విద్య, ఆరోగ్య అంశాల్లో బాలికలకు అవగాహన పెంచేందుకు 2008 జనవరి 24 నుంచి బాలికా దినోత్సవం జరుపుకొంటున్నామని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్ఎం నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు అనూరాధ, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆటో చోరీ కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు

విజయవాడస్పోర్ట్స్: విద్యాధరపురం ఐరన్ యార్డ్ వద్ద ఆటోను చోరీ చేసిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.రాజశేఖర్ బుధవారం తీర్పు చెప్పారు. ఆటోను యార్డ్ ఎదుట పార్క్ చేసిన యజమాని.. యార్డ్ లోనికి వెళ్లి వచ్చే సరికి ఆ వాహనం కనిపించలేదు. 2023 జూలై తొమ్మిదో తేదీన జరిగిన ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడుకు చెందిన కారం నరేష్‌ను నిందితుడిగా గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణకిషోర్ కోర్టులో వాదనలు వినిపించారు. ముగ్గురు సాక్షులను విచారించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు నరేష్‌కుపై విధంగా శిక్ష విధించారు.


దివ్యాంగురాలైన ధనుష్‌రామ్‌కు సహాయం అందించాలని సీఎం జగన్‌కు విజ్ఞప్తి చేస్తున్న తల్లి


బ్రెయిన్‌ స్ట్రోక్‌తో బాధపడుతున్న తన సోదరుడు బాల గురవయ్య గురించి వివరిస్తున్న సోదరి


కదలలేని స్థితిలో ఉన్న తనకు సాయం అందించాలని కోరుతున్న రాఘవేంద్ర


ఆరోగ్య సమస్యలు వివరిస్తున్న మస్కులర్‌ డిస్ట్రోఫీతో బాధపడుతున్న మణికంఠ


అనారోగ్యంతో బాధపడుతూ సీఎం జగన్‌కు సాయం కోసం విజ్ఞప్తి చేస్తున్న షేక్‌ బాబా ఫక్రుద్దీన్‌


అనారోగ్య సమస్యల గురించి సీఎంకు వివరిస్తున్న ఆనంద్‌ గైలాన్‌


బెళుగుప్ప మండలం అవులన్న గ్రామానికి చెందిన ఉప్పర నరసింహులు అనారోగ్యం గురించి సీఎం జగన్‌కు వివరిస్తున్న కుటుంబ సభ్యులు


ధనుష్‌రామ్‌కు రూ.లక్ష చెక్కు అందిస్తున్న కలెక్టర్‌ గౌతమి


రూ.2 లక్షల చెక్కు అందుకుంటున్న గురవయ్య సోదరి


రూ.2 లక్షల చెక్కు అందుకుంటున్న రాఘవేంద్ర బంధువు


రూ.లక్ష చెక్కు అందుకుంటున్న గుర్రం మణికంఠ


రూ.2 లక్షల చెక్కు అందుకుంటున్న ఫక్రుద్దీన్‌


రూ.5.20 లక్షల చెక్కు అందుకుంటున్న ఆనంద్‌ బంధువు


రూ.12 లక్షల చెక్కు అందుకుంటున్న నరసింహులు కుటుంబ సభ్యురాలు

సావధానంగా విన్నారు.. సాయమందించారు..

అనంతపురం ఎడ్యుకేషన్‌/అనంతపురం అర్బన్‌/ఉరవకొండ: ఒక్కొక్కరిదీ ఒక్కో సమస్య. స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని కలసి విన్నవించుకోవాలనుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం అనంతపురం జిల్లాలోని ఉరవకొండ పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌ను స్థానిక జూనియర్‌ కళాశాలలోని హెలిప్యాడ్‌ వద్ద కలిసి తమ బాధలు చెప్పుకున్నారు. వారి సమస్యలను ఓపిగ్గా విన్న ముఖ్యమంత్రి.. నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. వెంటనే ప్రభుత్వం తరఫున బాధితులకు సాయం చేయాలని కలెక్టర్‌ ఎం.గౌతమిని ఆదేశించారు. దీంతో కలెక్టర్‌ మంగళవారం రాత్రి అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏడుగురు బాధితులకు చెక్కులు అందజేశారు.

తెలంగాణ

హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్‌.. అవినీతి ‘రూ.500 కోట్లు!

సాక్షి, హైదరాబాద్‌: భవన అనుమతులు, టౌన్‌ప్లానింగ్‌లో అడ్డగోలుగా అవినీతికి పాల్పడి, వందల కోట్లు అక్రమంగా కూడబెట్టిన తిమింగలం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కింది. హైదరాబాద్‌ నగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) మాజీ డైరెక్టర్, ప్రస్తుతం హైదరాబాద్‌ మెట్రోరైల్‌ లిమిటెడ్‌ (హెచ్‌ఆర్‌ఎంఎల్‌) డైరెక్టర్‌గా ఉన్న శివ బాలకృష్ణ నివాసం, కార్యాలయాలు, ఆయన బంధువుల ఇళ్లలో ఏసీబీ అధికారులు బుధవారం విస్తృతంగా సోదాలు చేపట్టారు. ఆయన తన పదవిని, ఓ సీనియర్‌ ఐఏఎస్‌ అధికారితో సన్నిహిత పరిచయాన్ని అడ్డుపెట్టుకుని ఏకంగా రూ.500 కోట్ల వరకు అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టుగా అంచనా వేస్తున్నారు. బుధవారం సాయంత్రం వరకు స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువే బహిరంగ మార్కెట్లో రూ.వంద కోట్లకుపైగానే ఉంటుందని చెప్తున్నారు. ఇంకా నిర్ధారించి, విలువ తేల్చాల్సిన ఆస్తులు భారీగానే ఉన్నాయని అంటున్నారు. హెచ్‌ఎండీఏ డైరెక్టర్‌గా పనిచేసిన సమయంలో శివ బాలకృష్ణ భారీగా అవినీతికి పాల్పడి, అక్రమ ఆస్తులు కూడబెట్టినట్టుగా ఫిర్యాదులు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

20 ఏళ్లు ఏం చేశారు?

బీఆర్‌ఎస్‌కు భూ కేటాయింపు పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్‌: బీఆర్‌ఎస్‌ పార్టీకి 2004లో బంజారాహిల్స్‌లో భూమిని కేటాయించడాన్ని సవాల్‌ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో పిటిషనర్‌ తీరును హైకోర్టు తప్పుబట్టింది. 20 ఏళ్ల క్రితం భూమి కేటాయిస్తే ఇప్పటివరకు ఎందుకు పిటిషన్‌ వేయలేదు అని ప్రశ్నించింది. కారణాలు తెలుపుతూ పిటిషన్‌ను మళ్లీ దాఖలు చేయాలని ఆదేశించింది. కేసు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. 2004లో బీఆర్‌ఎస్‌ పార్టీకి తక్కువ ధరకు ఎకరం స్థలం కేటాయించారని, దానిని తిరిగి స్వాధీనం చేసుకునేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్‌) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ అలోక్‌ అరాధే, జస్టిస్‌ అనిల్‌ కుమార్‌ జూకంటి ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది.

‘ఎమ్మెల్సీ’ల నియామకంపై గవర్నర్‌కు ఆదేశాలు ఇవ్వలేం

ప్రస్తుతం స్టే ఇవ్వడం చట్టప్రకారం సాధ్యం కాదు: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్‌: గవర్నర్‌ కోటా ఎమ్మెల్సీల నియామకంపై న్యాయస్థానంలో కేసు తేలేవరకు స్టే ఇవ్వాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని హైకోర్టు తోసిపుచ్చింది. అలా గవర్నర్‌కు ఆదేశాలు ఇవ్వడం కుదరదని తేల్చిచెప్పింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 8వ తేదీకి వాయిదా వేస్తూ.. ఆ రోజు అందరి వాదనలు వింటామని తెలిపింది. గవర్నర్‌ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలంటూ గత ప్రభుత్వం పలువురు అభ్యర్థుల పేర్లతో రాజ్‌భవన్‌కు ప్రతిపాదనలు పంపగా.. గవర్నర్‌ తమిళిసై తిరస్కరించిన విషయం తెలిసిందే. రాజ్యాంగంలోని ఆర్టికల్‌ 171 (5) ప్రకారం గవర్నర్‌కు ఉన్న విస్తృత అధికారాల మేరకు తిరస్కరిస్తున్నట్టు గవర్నర్‌ స్పష్టం చేశారు. దీనిని సవాల్‌ చేస్తూ దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ అలోక్‌ అరాధే, జస్టిస్‌ సురేపల్లి నందా ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ నిర్వహించింది. పిటిషనర్ల తరఫున సీనియర్‌ న్యాయవాదులు ఆదిత్య సోందీ, మయూర్‌రెడ్డి, గవర్నర్‌ కార్యదర్శి తరఫున సీనియర్‌ న్యాయవాది ఎస్‌.అశోక్‌ ఆనంద్‌కుమార్, ప్రభుత్వం తరఫున అడ్వొకేట్‌ జనరల్‌ సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. అసలు ఈ పిటిషన్ల విచారణార్హత తేలుస్తామని ధర్మాసనం గత విచారణలో చెప్పిన నేపథ్యంలో న్యాయవాదులు ఈ అంశంపై వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. కానీ ధర్మాసనం అందరి వాదనలు ఒకేరోజున వింటామంటూ.. విచారణను వచ్చే నెల 8కి వాయిదా వేసింది.

పాపాఘ్ని నది వెంబడి ఎలాంటి మైనింగ్‌ జరగడం లేదు

- హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆ వివరాలతో అఫిడవిట్‌ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశం

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లాలో పాపాఘ్ని నది వెంబడి ఎలాంటి మైనింగ్‌ కార్యకలాపాలు జరగడం లేదని రాష్ట్ర ప్రభుత్వం బుధవారం హైకోర్టుకు నివేదించింది. ఇప్పటి వరకు ఎలాంటి మైనింగ్‌ కార్యకలాపాలకు అనుమతులు కూడా ఇవ్వలేదని వివరించింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, పూర్తి వివరాలతో ఓ అఫిడవిట్‌ దాఖలు చేయాలని రెవెన్యూ, గనుల శాఖ అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 7కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ధీరజ్‌ సింగ్‌ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్‌ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. పాపాఘ్ని నది వెంబడి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని, అలా తవ్వి తీసిన ఇసుకను పొరుగు రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారని, అయినా కూడా అధికారులు పట్టించుకోవడం లేదంటూ అన్నమయ్య జిల్లా, పెద్దతిప్ప సముద్రం మండలం, జంబుకాని పల్లి గ్రామానికి చెందిన డి.వెంకటరమణ, మరో ఇద్దరు హైకోర్టులో పిల్‌ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్‌ న్యాయవాది, టీడీపీ లీగల్‌ సెల్‌ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ నది వెంబడి విచక్షణ రహితంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి అనుమతులు కూడా తీసుకోలేదన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. వేటి ఆధారంగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని చెబుతున్నారని ప్రశ్నించింది. పత్రికా కథనాల ఆధారంగానని పోసాని చెప్పారు. వాటిని పరిశీలించాలని కోరారు. ఈ వాదనలను ప్రభుత్వ న్యాయవాదులు పోతిరెడ్డి సుభాష్‌రెడ్డి, కామిరెడ్డి నవీన్‌కుమార్‌లు తోసిపుచ్చారు. పిటిషనర్లు చెబుతున్న విధంగా ఎలాంటి మైనింగ్‌ కార్యకలాపాలు జరగడం లేదని సుభాష్‌ చెప్పారు. ఎక్కడో తవ్వి తీసిన ఇసుక తాలుకు ఫొటోలను పాపాఘ్ని వెంబడి జరిగినట్టు చూపుతున్నారని చెప్పారు. ఇసుక తవ్వకాలకు గనుల శాఖ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని నవీన్‌ తెలిపారు.



వారం రోజుల్లో మహా కుంభాభిషేక ముహూర్తం ఖరారు చేయండి

- ఆ వివరాలను కోర్టు ముందుంచండి
- శ్రీశైలం దేవస్థానంలో మహాకుంభాభిషేకంపై కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: శ్రీశైలం దేవస్థానంలో మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ముహూర్తం వారం రోజుల్లో నిర్ణయించాలని హైకోర్టు దేవదాయశాఖ కమిషనర్, దేవస్థానం ఈవోలను బుధవారం ఆదేశించింది. మహాకుంభాభిషేకం, ఇతర కార్యక్రమాల నిర్వహణ ముహూర్తం నిర్ణయించేందుకు ఏడు నెలలు సమయం తీసుకోవడంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. ఇంత జాప్యం ఎందుకు జరిగిందని ప్రశ్నించింది. వారంలోపు ముహూర్తం ఖరారు చేసి ఆ వివరాలను తమ ముందుంచాలని కమిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ధీరజ్‌ సింగ్‌ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్‌ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. షెడ్యూల్‌ ప్రకారం మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాలన్నింటినీ జరిపేలా దేవస్థానం అధికారులను ఆదేశించాలని కోరుతూ అఖిల భారతి వీరశైవ ధర్మిక ఆగమ పరిషత్‌ చైర్మన్‌ సంగాల సాగర్‌ గత ఏడాది హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్‌) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. మహా కుంభాభిషేకం, ఇతర కార్యక్రమాల నిర్వహణ విషయంలో గరిష్టంగా ఆరు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని గతంలో తామిచ్చిన ఆదేశాలను అమలు చేయనందుకు స్వయంగా తమ ముందు హాజరు కావాలన్న ఆదేశాల మేరకు దేవదాయ శాఖ కమిషనర్‌ సత్యనారాయణ కోర్టు ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మాసనం ఆయనను పలు ప్రశ్నలు అడిగింది. వారం రోజుల్లో తగిన ముహూర్తం ఖరారు చేసి, ఆ వివరాలను తమ ముందుంచాలని కమిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 7వ తేదీకి వాయిదా వేసింది.

తప్పులను సవరించే తుది జాబితా రూపొందించాం

- హైకోర్టుకు తెలిపిన సీఈసీ... పిల్‌ను మూసివేసిన ధర్మాసనం

సాక్షి, అమరావతి: ఓటర్ల తుది జాబితా విడుదల చేశామని కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) బుధవారం హైకోర్టుకు నివేదించింది. అన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, తప్పులు సవరించిన తరువాతే తుది జాబితా విడుదల చేశామని సీఈసీ తరఫున సీనియర్‌ న్యాయవాది అవినాశ్‌ దేశాయ్‌ హైకోర్టుకు వివరించారు. ఓటర్ల తుది జాబితా విడుదల చేసినప్పటికీ, ఈ జాబితా విషయంలో కూడా అభ్యంతరాలు తెలపవచ్చునని తెలిపారు. అభ్యంతరాల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని చెప్పారు. అభ్యంతరాల ఆధారంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులూ ఉంటాయని, చట్టంలో నిర్దేశించిన విధంగా అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, తుది ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే చట్ట ప్రకారం వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లవచ్చునని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా మచిలీపట్నంలో ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ ఇమదాబత్తుల దిలీప్‌కుమార్‌ దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు మూసివేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ధీరజ్‌ సింగ్‌ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్‌ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులిచ్చింది.

జనుపల్లి శ్రీనివాసరావు బెయిల్‌ పిటిషన్‌పై ముగిసిన వాదనలు

- తీర్పు వాయిదా వేసిన ధర్మాసనం
- మీడియా ముందు మాట్లాడకుండా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించిన ఎన్‌ఐఏ

సాక్షి, అమరావతి: విశాఖ ఎయిర్‌పోర్టులో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో తనకు బెయిల్‌ మంజూరు చేయాలని కోరుతూ జనుపల్లి శ్రీనివాసరావు దాఖలు చేసిన వ్యాజ్యంలో వాదనలు ముగిశాయి. వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వ్‌ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్‌ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్‌ మండవ కిరణ్మయి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నం విమానాశ్రయంలో 2018 అక్టోబర్‌ 25న అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిపై జనుపల్లి శ్రీనివాసరావు హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. దీనిపై హైకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు జరిపిన జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)... హత్య చేయాలన్న ఉద్దేశంతోనే పదునైన కత్తితో జగన్‌మోహన్‌రెడ్డిపై శ్రీనివాసరావు దాడి చేసినట్లు తేల్చింది. అందువల్ల శ్రీనివాసరావుకు బెయిల్‌ ఇవ్వొద్దని కోరింది. దీంతో ఎన్‌ఐఏ కోర్టు శ్రీనివాసరావుకు బెయిల్‌ నిరాకరించింది. ఈ నేపథ్యంలో బెయిల్‌ కోసం శ్రీనివాసరావు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై జస్టిస్‌ దుర్గాప్రసాదరావు ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ జరిపింది. శ్రీనివాసరావు తరఫు న్యాయవాది పిచ్చుక శ్రీనివాసులు వాదనలు వినిపిస్తూ... వైఎస్‌ జగన్‌కు అయింది స్వల్పగాయమేన్నారు. తీవ్రమైన గాయం గానీ, ప్రాణం పోయినప్పుడు మాత్రమే సివిల్‌ ఏవియేషన్‌ చట్టం–1982లోని సెక్షన్‌ 3(ఏ) వర్తిస్తుందన్నారు. అందువల్ల ఆ సెక్షన్‌ శ్రీనివాసరావుకు వర్తించదని తెలిపారు. ఎన్‌ఐఏ తరఫున అదనపు సొలిసిటర్‌ జనరల్‌ (ఏఎస్‌జీ) బి.నరసింహ శర్మ వాదనలు వినిపిస్తూ.. వైఎస్‌ జగన్‌పై కత్తితో దాడి చేయడం ద్వారా పిటిషనర్‌ శ్రీనివాసరావు తీవ్రమైన నేరానికి పాల్పడ్డారని చెప్పారు. ఇందుకు అతనికి జీవిత ఖైదు పడే అవకాశం ఉందన్నారు. శ్రీనివాసరావుకు ఎన్‌ఐఏ కోర్టు గతంలో బెయిల్‌ ఇచ్చిందని, అయితే అతను మీడియా ముందు ఇష్టమొచ్చినట్లు మాట్లాడటంతో బెయిల్‌ను రద్దు చేసిందని వివరించారు. ఆ తర్వాత హైకోర్టు సైతం శ్రీనివాసరావుకు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసిందని తెలిపారు. శ్రీనివాసరావు తరఫు న్యాయవాదులు కూడా మీడియా ముందు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఇది ఎన్‌ఐఏపై ఒత్తిడి పెంచుతోందన్నారు. కింది కోర్టులో జరుగుతున్న విచారణపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోందని తెలిపారు. అందువల్ల ఈ కేసు గురించి వారిని మీడియా ముందు మాట్లాడకుండా ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోర్టును కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వ్‌ చేస్తున్నట్లు ప్రకటించింది.

‘ఆర్‌టీవో కార్యాలయం’ నిలుపుదలకు హైకోర్టు నో

- ఎలా పడితే అలా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలను ఆపలేం
- తేల్చిచెప్పిన హైకోర్టు సీజే ధర్మాసనం

సాక్షి, అమరావతి: అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం చిన్నపొలమడ గ్రామంలోని సర్వే నంబర్‌ 3832లో 3.39 ఎకరాల్లో నిర్మించతలపెట్టిన ఆర్‌టీవో కార్యాలయ పనుల నిలుపుదలకు హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలను ఎలాపడితే అలా నిలుపుదల చేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. రియల్‌ ఎస్టేట్‌ కోసమే మరో ఆర్‌టీవో కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని పిటిషనర్లు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై పూర్తి వివరాలను కోర్టు ముందుంచాలని అధికారులను ఆదేశించింది. ఇందులో భాగంగా రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌లతో పాటు తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి, వ్యాపారి టి.నాగార్జునరెడ్డి తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ధీరజ్‌ సింగ్‌ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్‌ రావు రఘునందన్‌రావులతో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌టీవో కార్యాలయ నిర్మాణాన్ని సవాల్‌ చేస్తూ హైకోర్టులో రెండు పిల్స్‌ దాఖలైన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యాలపై తాజాగా సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తాండవ యోగేష్, గంటా శ్రీదేవి వాదనలు వినిపిస్తూ.. తాడిపత్రిలో ఇప్పటికే ఆర్‌టీవో కార్యాలయం ఉందన్నారు. ఇప్పుడు రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం కోసం మరో ఆర్‌టీవో ఆఫీసు నిర్మిస్తున్నారని తెలిపారు. ఆ ప్రాంతంలో ఎమ్మెల్యే బినామీలకు భూములున్నాయని, వాటి ధరలను పెంచుకునే ఉద్దేశంతోనే నిర్మిస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఆ కార్యాలయ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. పైపెచ్చు ఆ భూమి అసైన్డ్‌ భూమి అని, ఆ భూమిని చట్ట ప్రకారం తిరిగి స్వాధీనం చేసుకోకుండానే అందులో నిర్మాణాలు చేపడుతున్నారని వివరించారు. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని నిర్మాణాల నిలుపుదలకు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం నిర్మాణాల నిలుపుదలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని తేల్చిచెప్పింది.

బీఈడీ కౌన్సెలింగ్‌ ఎందుకు నిర్వహించలేదో చెప్పండి

సాక్షి, అమరావతి: ఎడ్‌సెట్‌ నిర్వహించి ఏడు నెలలు అవుతున్నా, ఇప్పటి వరకు బీఈడీ కౌన్సెలింగ్‌ నిర్వహించకపోవడంపై హైకోర్టు బుధవారం విద్యాశాఖ అధికారుల వివరణ కోరింది. బీఈడీ కౌన్సెలింగ్‌ను ఇప్పటి వరకు నిర్వహించకపోవడాన్ని సవాలు చేస్తూ ప్రోగ్రెసివ్‌ డెమొక్రటిక్‌ స్టూడెంట్‌ యూనియన్‌ (పీడీఎస్‌యూ) నేషనల్‌ కన్వీనర్‌ ఎం.రామకృష్ణ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్‌) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ధీరజ్‌ సింగ్‌ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్‌ రావు రఘునందన్‌రావు ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్‌ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... గత ఏడాది జూన్‌లో ఎడ్‌సెట్‌ నిర్వహించి, జూలైలో ఫలితాలు వెల్లడించారన్నారు. ఇప్పటి వరకు బీఈడీ కౌన్సెలింగ్‌ నిర్వహించలేదని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం బీఈడీ కౌన్సెలింగ్‌ను నిర్వహించకపోవడానికి గల కారణాలను తెలియజేయాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, ఉన్నత విద్యా మండలి చైర్మన్, ఎడ్‌సెట్‌ కన్వీనర్‌లకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది.

ఐ–టీడీపీ కార్యకర్త యశస్విని విచారించిన సీఐడీ

మళ్లీ వచ్చే నెల రెండో తేదీన విచారణ

సాక్షి, అమరావతి/నగరంపాలెం: ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులపై అసభ్యకరమైన పోస్టులు పెట్టిన కేసులో నిందితుడైన ప్రవాసాంధ్రుడు, టీడీపీ సోషల్‌ మీడియా విభాగం ఐటీడీపీ కార్యకర్త బొద్దులూరి యశస్విని సీఐడీ అధికారులు బుధవారం విచారించారు. గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారణ కొనసాగింది. యశస్వీ సోషల్‌ మీడియాలో పోస్టు చేసిన పలు వీడియోలను చూపిస్తూ సీఐడీ అధికారులు అయనను ప్రశ్నించారు. ఆయనకు 32 ప్రశ్నలను సీఐడీ అధికారులు సంధించినప్పటికీ ఒక్కదానికి కూడా సరైన సమాధానం ఇవ్వలేదని తెలుస్తోంది. వీడియో ఆధారాలతో చూపిస్తూ ప్రశ్నించినప్పటికీ వాటికి సమాధానాలు దాటవేసేందుకే ఆయన యత్నించారు. విచారణ అనంతరం యశస్వీ నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. తదుపరి విచారణ కోసం వచ్చే నెల 2న విజయవాడలోని సీఐడీ కార్యాలయానికి రావాలని ఆయనకు నోటీసులిచ్చారు. కాగా, యశస్వీ విచారణ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు సీఐడీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఏకంగా సీఐడీ అధికారులు, పోలీసులను తీవ్ర పదజాలంతో దూషించారు. పోలీసుల హెచ్చరికలను కూడా బేఖాతరు చేస్తూ గలాభా సృష్టించేందుకు యత్నించారు. దీంతో టీడీపీ కార్యకర్తలను పోలీసులు బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. అనంతరం యశస్వీ తరఫు న్యాయవాది కోటేశ్వరరావు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ సీఐడీ అధికారులు మధ్యవర్తుల సమక్షంలోనే ఆయనను విచారించారని తెలిపారు.

ఏయూ వీసీకి హైకోర్టు నోటీసులు

- పలువురు ఉన్నతాధికారులకు కూడా..
- కౌంటర్ల దాఖలుకు ఆదేశం..
- విచారణ ఫిబ్రవరి 21కి వాయిదా

సాక్షి, అమరావతి: ఆంధ్రా విశ్వవిద్యాలయం (ఏయూ) వైస్‌ ఛాన్సలర్‌ (వీసీ) పి.వి.జి.డి. ప్రసాదరెడ్డికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అధికార దుర్వినియోగంపై వివరణ ఇవ్వాలని ఆయన్ని ఆదేశించింది. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఉన్నత విద్యా మండలి సభ్య కార్యదర్శి, యూజీసీ సభ్య కార్యదర్శి, ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌లకు కూడా నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వీరిని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ధీరజ్‌ సింగ్‌ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్‌ రావు రఘునందన్‌రావు ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రసాదరెడ్డి గతంలో ఏయూ వీసీగా పనిచేసిన సమయంలో పలు అక్రమాలకు, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, దీనిపై విచారణకు ఆదేశించాలని కోరుతూ ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనారిటీ పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం కార్యదర్శి డాక్టర్‌ రమణ గత ఏడాది హైకోర్టులో పిల్‌ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్‌ తరఫు న్యాయవాది ఎం.పిచ్చయ్య వాదనలు వినిపిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రసాదరెడ్డిని మరోసారి ఏయూ వీసీగా నియమించిందనీ, గతంలో వీసీగా ఉన్న సమయంలో ఆయన పలు అక్రమాలకు, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రొఫెసర్ల నియామకం చేపట్టారనీ, పదవీ విరమణ చేసిన ప్రొఫెసర్లను ఇష్టానుసారంగా నియమించారన్నారు. ఇదే రీతిలో పలు నియామకాలు చేశారని తెలిపారు. వీటన్నింటిపై విచారణకు ఆదేశించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా ఉన్న ప్రసాదరెడ్డితో పాటు పలువురు అధికారులకు నోటీసులు జారీ చేసింది.

తిరుమలలో శారదాపీఠం నిర్మాణాలు ఆపాలి

- ‘పిల్‌’పై విచారణ సందర్భంగా హైకోర్టు ఆదేశం
- అతిక్రమణలను తేల్చేందుకు అడ్వొకేట్‌ కమిషనర్‌ నియామకం
- నిబంధనలు పాటిస్తున్నామని తెలిపిన శారదాపీఠం

సాక్షి, అమరావతి: తిరుమల గోగర్భం ప్రాంతంలో విశాఖ శారదాపీఠం నిబంధలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతోందని, ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్‌) దాఖలైంది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు, తదుపరి ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని పీఠం అధికారులను ఆదేశించింది. ఇప్పటికే జరిగిన నిర్మాణాల విషయంలో ఎలాంటి అతిక్రమణలు ఉన్నాయో తేల్చేందుకు అడ్వొకేట్‌ కమిషనర్‌ను నియమించింది. అదేవిధంగా ఈ నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని టీటీడీ ఈవో, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, టీటీడీ చీఫ్‌ ఇంజనీర్, శారదా పీఠం తిరుమల మేనేజర్‌లను ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 14కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్‌ ధీరజ్‌ సింగ్‌ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్‌ రావు రఘునందన్‌రావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమలలో శారదాపీఠం నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిందని, ఈ నిర్మాణాలను కూల్చివేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షుడు తుమ్మా ఓంకార్‌ హైకోర్టులో పిల్‌ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై బుధవారం సీజే ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్‌ తరఫు న్యాయవాది ఆదిత్య హర్షవర్ధన్‌ వాదనలు వినిపిస్తూ, ఎలాంటి సెట్‌బ్యాక్‌లు విడిచిపెట్టకుండా శారదాపీఠం నిర్మాణాలు చేపట్టిందన్నారు. శారదా పీఠం తరఫున సీనియర్‌ న్యాయవాది సత్యనారాయణ ప్రసాద్‌ వాదనలు వినిపిస్తూ, నిబంధనల మేరకే నిర్మాణాలు చేపట్టామన్నారు. సవరించిన ప్లాన్‌ ఆమోదం కోసం టీటీడీకి సమర్పించామన్నారు. క్రమబద్ధీకరణ ఫీజును కూడా చెల్లించామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థమే నిర్మాణాలు చేపట్టామన్నారు. తిరుమలలో తమదే కాకుండా అనేక మఠాలు ఉన్నాయని చెప్పారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, తదుపరి ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని మఠాన్ని ఆదేశించింది. క్షేత్రస్థాయిలో అతిక్రమణలను పరిశీలించేందుకు అడ్వొకేట్‌ కమిషనర్‌ను నియమించింది.

న్యూస్‌మేకర్



'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీలో ఓ దృశ్యం

జార్ఖండ్‌లో తన పదమూడేళ్ల కుమార్తెపై ముగ్గురు కుర్రాళ్లు దారుణంగా లైంగిక దాడి చేశారు. ఆమెను చంపడానికి చూశారు. ఆ అమ్మాయి కుంగిపోయింది. కాని తనకు జరిగిన అన్యాయంపై పోరాడాలనుకుంది. నిరుపేద గ్రామీణ తండ్రి అందుకు సిద్ధమయ్యాడు. ఊరు ఊరంతా వారికి వ్యతిరేకమైనా ఆ తండ్రీ కూతుళ్లు న్యాయం కోసం పోరాడారు. 'బాధితులు పోరాడాల్సిందే'ననే పిలుపునిస్తూ ఈ ఉదంతాన్ని 'టు కిల్ ఏ టైగర్' పేరుతో డాక్యుమెంటరీగా తీసింది నిషా పహూజా. 2024 సంవత్సరానికి ఆస్కార్‌కు నామినేట్ అయ్యింది 'టు కిల్ ఏ టైగర్'.

ఆస్కార్ బరిలో న్యాయ పోరాటం

'ఈసారి ఇటువైపు వస్తే నిన్ను చంపినా చంపుతాం' అని నిషా పహూజాతో జార్ఖండ్‌లోని ఆ గ్రామస్తులు అన్నారు. ఆరేళ్ల క్రితం జార్ఖండ్‌లోని ఒక గ్రామంలో 13 ఏళ్ల అమ్మాయిపై ముగ్గురు యువకులు లైంగిక దాడి చేశారు. దారుణంగా కొట్టారు. ఆ ఘటన తర్వాత అమ్మాయి, అమ్మాయి తండ్రి న్యాయ పోరాటానికి సంకల్పించారు. అక్కడి నుంచి ఆ గ్రామవాసులు తండ్రీ కూతుళ్లపై ఎలాంటి వొత్తిడి తెచ్చారు, అయినా సరే న్యాయం కోసం ఆ తండ్రీకూతుళ్లు ఎలా నిలబడ్డారు అని తెలిపే సంక్షిప్త చిత్రమే నిషా పహూజా దర్శకత్వం వహించిన 'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీ. గత సంవత్సరం మన దేశం నుంచి 'ది ఎలిఫెంట్ విష్పరర్స్' డాక్యుమెంటరీ ఆస్కార్ పొందింది. రేపు మార్చి 10, 2024న జరగనున్న ఆస్కార్ వేడుకలో 'టు కిల్ ఏ టైగర్' కూడా గెలిస్తే అది చాలా పెద్ద విశేషమే అవుతుంది.



నిషా పహూజా

బాధితులు పోరాడాల్సిందే

'భారతదేశంలో ప్రతి 20 నిమిషాలకు ఒక రేప్ నమోదు అవుతోంది. నమోదు కానివి ఎన్ని ఉన్నాయో లెక్క తెలియదు. నేరం నమోదు అయ్యాక కూడా కేవలం 30 శాతం కేసుల్లోనే నిందితులకు శిక్షలు పడుతున్నాయి. లైంగిక దాడులను ఎదుర్కొన్నవారు న్యాయం కోసం పోరాడినప్పుడే పెత్తందారీ స్వభావ ప్రతిఫలాలైన లైంగిక దాడులు తగ్గుతాయి' అంటుంది నిషా పహూజా. చత్తీస్‌గఢ్‌లోని 13 ఏళ్ల అమ్మాయి (ఇప్పుడు 19 సంవత్సరాలు) న్యాయ పోరాటాన్ని నిషా 2022లో డాక్యుమెంటరీగా తీసింది. అత్యాచార ఘటన జరిగిందని గ్రామస్తులు అంగీకరించినా తమ ఊరి కుర్రాళ్లపై కేసు నడవడం ఇష్టపడటం లేదు. అంతేకాదు ఇలా తమ ఊరు పరువు బజారున పడటం కూడా ఇష్టపడటం లేదు. దాంతో డాక్యుమెంటరీ యూనిట్‌ని బెదిరించారు. బాలికపై జరిగిన అత్యాచారాన్ని 'అదో ఆకతాయి చర్య' అని కొందరు అంటే 'ఆ ముగ్గురిలో ఎవరో ఒక కుర్రాణ్ణి అమ్మాయి పెళ్లి చేసుకుంటే సరి' అని మరికొందరు భావిస్తున్నారు. కాని బాధితురాలు మాత్రం 'చితికిపోయిన నా కలలను ఎవరు తిరిగి తెచ్చిస్తారు' అని ప్రశ్నిస్తోంది.

స్త్రీ సమస్యలే ఆమె ఇతివృత్తాలు

55 ఏళ్ల నిషా పహూజా తన నాలుగేళ్ల వయసులో ఢిల్లీ నుంచి కెనడా వలస వెళ్లింది. అక్కడే యూనివర్సిటీ ఆఫ్ టొరంటోలో ఆంగ్ల సాహిత్యం చదివింది. సీబీసీ (కెనడియన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్)లో రీసెర్చర్‌గా పని చేసి జాన్ వాకర్, అలీ కజిమి వంటి కెనడియన్ ఫిల్మ్ మేకర్స్ వద్ద డాక్యుమెంటరీ నిర్మాణ మెళకువలు గ్రహించింది. ఆపై తనే సొంతంగా డాక్యుమెంటరీలు తీయడం మొదలు పెట్టింది. భారతదేశంతో సంబంధాలు తెంచుకోకుండా తరచూ వచ్చి వెళ్లే నిషా ఇక్కడి స్త్రీల సమస్యలకే ఎక్కువ డాక్యుమెంటరీ రూపం ఇచ్చింది. 2002లో 'బాలీవుడ్ బౌండ్' పేరిట డాక్యుమెంటరీ తీసింది. నలుగురు భారతీయ కెనడియన్ వ్యక్తులు ముంబై మహానగరానికి వచ్చి బాలీవుడ్‌లో తమ అదృష్టాన్ని ఎలా పరీక్షించుకున్నారనేది అందులో మూలాంశం. 2012లో నిషా తీసిన 'ది వరల్డ్ బిఫోర్ హర్' డాక్యుమెంటరీ అంతర్జాతీయ ఖ్యాతి పొందింది. మిస్ ఇండియా కావాలని కలలు కనే భారతీయ యువతుల సంఘర్షణాయుతమైన తతంగాన్ని చూపుతూ ఈ చిత్రం తెరకెక్కింది. ప్రతిష్ఠాత్మక ఎమ్మీ పురస్కారాల్లో 'ఔట్‌స్టాండింగ్ కవరేజ్ ఆఫ్ ఎ కరెంట్ న్యూస్ స్టోరీ' విభాగంలో పురస్కారం అందుకుంది. 2022లో నిషా తీసిన డాక్యుమెంటరీయే 'టు కిల్ ఎ టైగర్'. 90 నిమిషాల ఈ డాక్యుమెంటరీ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. టొరంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో కెనడా టాప్–10 చిత్రంగా నిలిచింది. అనంతరం వివిధ వేదికలపై 19 పురస్కారాలు కైవసం చేసుకుంది. ఆస్కార్ గెలుచుకుంటే అదో విశిష్ట పురస్కారం అవుతుంది.

రెనీ జాయ్ ఢిల్లీలో కార్పొరేట్ అడ్వకేట్. రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్‌లాండ్‌కు వైస్‌ప్రెసిడెంట్. జీవితం నేర్పిన పాఠాలతో అలేఖ్ ఫౌండేషన్ పేరుతో పేద మహిళలు, పిల్లలకు ఉచితంగా వృత్తి విద్యాకోర్సులు నేర్పించి, వారి కాళ్లపై వారు నిలబడేలా సహాయం చేస్తోంది. అవసరమైనప్పుడు వారి కోసం న్యాయపోరాటాలు చేస్తుంది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రచారం చేస్తోంది. ఈ ప్రయాణంలో ఏదీ సవ్యంగా లేదని, ఒడిదొడుకులతో నడిచిన తన జీవితాన్ని, తిరిగి దిద్దుకున్న విధానాన్ని పరిచయం చేస్తోంది.

జీవితాన్ని దిద్దుకుంది... పేదల పక్షాన నిలిచింది



రెనీ జాయ్

"మా తాతగారు ఆర్మీ ఉద్యోగి. దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసి, చివరకు ఢిల్లీలో స్థిరపడ్డారు. మా అమ్మానాన్నలకు నేను ఒక్కదాన్నే సంతానం. నా చిన్నతనంలో మా అమ్మానాన్నలు విడివిడిగా ఉండేవారు. దీంతో నాన్న నుంచి ఎలాంటి సపోర్ట్, సాయం లభించలేదు. మా అమ్మానాన్నలు అంటే అమ్మమ్మ తాతయ్యలే. దీంతో కుటుంబం అసంపూర్తిగా ఉందని ఎప్పుడూ భావించలేదు. మా అమ్మానాన్నలు విడి విడిగా ఉన్న విషయం ఎవరికీ తెలియలేదు. ఆ రోజుల్లో విడాకులు తీసుకోవడం అనేది సమాజం దృష్ట్యా మంచిది కాదు అనే అభిప్రాయం ఉండేది. అందుకే వాళ్లు చాలా ఏళ్లు విడాకులు తీసుకోలేదు. నేను కాలేజీకి వెళ్లిన తర్వాత వారు చట్టబద్ధంగా విడిపోయారు. సమాజం ఇలా ఆలోచించడం వల్ల ఆ సమయంలో నా తల్లిదండ్రులు విడిపోయారని ఎవరికీ చెప్పుకోలేకపోయాను. ఎందుకంటే ఈ విషయం తెలిస్తే వెంటనే నా పట్ల వారి దృక్పథం మారిపోతుందనే భయం ఉండేది.

చిన్న వయసులోనే..

నా తల్లిదండ్రులు విడిపోవడానికి గల కారణాలన్నీ చూసిన తర్వాత, ఆడపిల్లలు తమ కాళ్లపై తాము నిలబడాలని నాకు చాలా చిన్న వయసులోనే అర్థమైంది. మా అమ్మమ్మ ఎప్పుడూ 'ఎంత సంపాదించినా, ఏ పని చేసినా ఫర్వాలేదు. కానీ, నీ కాళ్ల మీద నువ్వు నిలబడటమే ముఖ్యం' అనేది. కుటుంబంలో ఏ సమస్య వచ్చినా దానిని నివారించే ఉపాయాలను కనుక్కోమనేది. అలాంటి వాతావరణంలో పెరగడం వల్ల పెద్దయ్యాక మహిళల హక్కుల కోసం పోరాడాలని అనుకునేదాన్ని. చదువు తర్వాత బ్యాంకింగ్ రంగంలో సేల్స్ అండ్ మార్కెటింగ్ టీమ్‌లో చేరి, నా కెరీర్‌ను ప్రారంభించాను.

నష్టం తెచ్చిన కష్టాలు..

మా అమ్మ జాతీయ బ్యాంకులో పనిచేసేది. ఆ ఉద్యోగంలో ఒత్తిడి ఎక్కువ కాబట్టి బ్యాంకులో చేరవద్దని ఎప్పుడూ చెబుతుండేది. కానీ, మార్కెటింగ్ రంగంలో ఏదైనా చేయాలనుకున్నాను కాబట్టి బ్యాంకులో అవకాశం రాగానే వదలలేదు. ప్రతి పనినీ నేర్చుకున్నాను. పదకొండేళ్ల పాటు బ్యాంకులో పనిచేశాను. అక్కడ పనితీరుతో అతి పిన్నవయసులో బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్‌గా పదోన్నతి పొందాను. ఒకానొక సమయంలో ఉద్యోగంపై విసుగు అనిపించి స్టాక్ మార్కెట్‌లో కన్సల్టింగ్ పనిని ప్రారంభించాను. స్టాక్ మార్కెట్ క్రాష్ అయ్యి, తీవ్ర నష్టం చవిచూశాను. వ్యాపార భాగస్వాములు మోసం చేశారు. ఉద్యోగం మానేసిన ఏడాదిన్నర కాలం చాలా దారుణంగా గడిచింది. తిరిగి తక్కువ జీతం, ఎక్కువ పనిగంటలు చేసేలా బ్యాంక్ ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. అయితే, బ్యాంకింగ్ అనుభవాన్ని సద్వినియోగం చేసుకోవడానికి సీనియర్ల సలహాతో 'లా' చదివాను. అప్పటికి నా కూతురికి నాలుగేళ్లు. ఓ వైపు ఉద్యోగం, మరో వైపు చదువు, ఇంటి పని.. అంత తేలికయ్యేది కాదు.



మహిళలకు సహాయం చేస్తున్న రెనీ

స్త్రీల పనికి సమాజంలో అంత త్వరగా అంగీకారం లభించదు. ఎందుకంటే స్త్రీ సామర్థ్యాల పట్ల ప్రజల వైపు ఎప్పుడూ చిన్నచూపే ఉంటుంది. అటువంటి పరిస్థితుల్లో క్లయింట్స్‌ను ఒప్పించడానికి, వారిలో విశ్వాసం కలిగించడానికి నేను రెండు రెట్లు ఎక్కువ కష్టపడాల్సి వచ్చింది. నా దృక్పథాన్ని, పని విధానాన్ని మార్చుకున్నాను. నన్ను నేను ఉత్సాహపరచుకుంటూనే ఉన్నాను. మెల్లగా నా గమ్యం వైపు కదిలి ఈ రోజు ఈ స్థితికి చేరుకున్నాను.

అభిప్రాయ భేదాలు తలెత్తినా..

నా భర్తకు నాకు మధ్య అనేక విషయాల్లో అభిప్రాయ భేదాలు తలెత్తడంతో మేమిద్దరం విడిపోవాలనుకున్నాం. భార్యాభర్తలుగా కాకుండా స్నేహితులుగా మారడం ద్వారా మా సంబంధాన్ని మరింత మెరుగ్గా కొనసాగించవచ్చని భావించాను. నా కూతురికి మంచి పెంపకాన్ని అందించడానికి అన్ని ముఖ్యమైన నిర్ణయాలు కలిసి తీసుకుంటాం. కానీ, మేం విడిగానే ఉంటాం. మా కుటుంబంలో 'లా' చదివినవారు ఎవరూ లేరు. నేను చాలా కేసుల్లో మహిళల తరఫున నిలబడి న్యాయం చేశాను. ఈ రంగంలో లీగల్ అడ్వైజర్‌గా నాదైన ముద్ర వేయగలిగాను. 2015లో అలేఖ్ ఫౌండేషన్‌ను ప్రారంభించి మహిళల జీవితాలను మెరుగుపరిచే పనిని చేపట్టాను. లైంగిక వేధింపులకు గురైన పిల్లలు, మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తాను. ఫౌండేషన్ ద్వారా బాలికా విద్య, వృత్తి విద్యలలో నైపుణ్యాలకు సంబంధించిన కోర్సులు ఇవ్వడంలో కృషి చేస్తున్నారు. రొమ్ము క్యాన్సర్, పీరియడ్స్, శానిటేషన్ వంటి ఆరోగ్య సమస్యలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నాను.

పర్యావరణ పరిరక్షణ..

నిరుపేద బాలికల చదువుకు బాధ్యత తీసుకున్నాను. ఇటీవల నాగాలాండ్‌లో సౌండ్ ఇంజనీరింగ్ లో శిక్షణ ఇవ్వడానికి ఒక కాలేజీతో టై అప్ అయ్యాం. దీనికి అయ్యే ఖర్చులను ఫౌండేషన్ భరిస్తుంది. పర్యావరణానికి మేలు కలిగేలా అవగాహన, ప్రచారం నిర్వహిస్తున్నాను. వాతావరణ మార్పుల నుండి చెట్లను రక్షించడం, ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించడం, పేపర్‌లెస్ జీవనశైలిని ప్రోత్సహించడం చేస్తుంటాను" అని తన ప్రస్థానాన్ని వివరించింది రెనీ.

కిచెన్‌టిప్స్



- మండే స్వభావమున్న ఏ వస్తువులనూ స్టవ్‌కు దగ్గరగా ఉంచకూడదు. వంట చేసేహడావిడిలో కిచెన్ నాప్‌కిన్‌ను స్టవ్ దగ్గరే వదిలేయడం జరుగుతుంటుంది. అలాగే ఇంట్లో అన్ని కిటికీలకు, వాకిళ్లకూ కర్టెన్లు వేయాలన్న సరదా కూడా ప్రమాదాలకు హేతువవుతుంది. స్టవ్ వెలిగేటప్పుడు గాలికి కిటికీ కర్టెన్ పైకి లేచి అంటుకునే ప్రమాదంఉంది. అందుకే స్టవ్‌కు కనీసం మూడు లేదా నాలుగు అడుగుల దూరం వరకు త్వరగా మండడానికి అవకాశమున్న వాటిని ఉంచకూడదు.
- బాణలి, పెనం వంటి వాటిని వంట పూర్తయిన తర్వాత స్టవ్ మీద నుంచి తీసేసి వేడి తగ్గే వరకు కిచెన్ ప్లాట్‌ఫాం మీద ఒక పక్కగా పెడుతుంటాం. చిన్న పిల్లలున్న ఇంట్లో ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. కనిపించీ కనిపించకుండా ఉన్న ప్రతిదానినీ ముట్టుకుని, దగ్గరకు లాక్కుని చూడాలన్న తపన పిల్లలలో ఎక్కువగా ఉంటుంది.

గ్రీన్ ఫ్యూచర్

ఒక మంచి పని చేసినప్పుడు అభినందించే వారే కాదు అనుసరించే వారు కూడా ఉంటారు. సోషల్ మీడియాలో పాపులర్ అయిన కామ్నా గౌతమ్ విషయంలోనూ ఇలాగే జరిగింది. 'పర్యావరణహిత మార్గం వైపు ప్రయాణం మన ఇంటి నుంచే మొదలు కావాలి' అంటుంది కామ్నా గౌతమ్...

ప్రతి ఇంటి నుంచి పచ్చటి అడుగు



కామ్నా గౌతమ్



'పర్యావరణ సంరక్షణకు మన వంతుగా ఉడతాభక్తిగా చేయడానికి ఎంతో ఉంది. అందుకు మన ఇంటి నుంచే శ్రీకారం చుట్టాలి' అంటుంది కామ్నా గౌతమ్. తన ఇన్‌స్పైరింగ్ మాటలతో సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందిన కామ్నా న్యూట్రీషనిస్ట్. వేస్ట్ మేనేజ్‌మెంట్ టెక్నిక్‌లు, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం... మొదలైన వాటి గురించి విస్తృతంగా ప్రచారం చేస్తోంది కామ్నా గౌతమ్.

బేబీ–వియరింగ్, బ్రెస్ట్‌ఫీడింగ్‌లాంటి అంశాలకు సంబంధించి ఉపయోగకరమైన సమాచారం అందించడంతో కామ్న సోషల్ మీడియా జర్నీ మొదలైంది.

'నేను ఒక బిడ్డకు తల్లిని. బిడ్డ భవిష్యత్ బాగుండాలని ప్రతి తల్లీ కోరుకుంటుంది. అందుకే బిడ్డల బంగారుభవిష్యత్ కోసం పర్యావరణహిత మార్గాన్ని ఎంచుకున్నాను' అంటుంది కామ్న.

పర్యావరణ హిత మార్గంలో తన ఇంటి నుంచే తొలి అడుగు వేసింది. ఇంట్లో ప్లాస్టిక్ వస్తువులు కనిపించకుండా చేసింది. కుటుంబ సభ్యులను ఒప్పించింది. 'మన ఇంట్లో ప్లాస్టిక్ బాటిల్స్‌ను ఎందుకు ఉపయోగించడం లేదో తెలుసా?' అని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పింది.

'నేను ఇలా చేస్తున్నప్పుడు ఇతరులు కూడా చేయవచ్చు కదా. వారిలో ఎందుకు స్పందన కనిపించడం లేదు?' అంటూ బాధ పడేది కామ్నా. అయితే ఆ తరువాత మాత్రం ఒక్కరొక్కరుగా ఆమెను అనుసరించడం ప్రారంభించారు. ఇంటిని ఎన్విరాన్‌మెంట్–ఫ్రెండ్లీగా తీర్చిదిద్దడం మొదలు పెట్టారు.

ప్లాస్టిక్ బ్యాగులు కనిపించకుండా ఉండాలంటే ప్రతి ఇంట్లో క్లాత్‌బ్యాగులు ఉండాలి, డిస్పోజబుల్ వాటర్ బాటిల్ కాదు మీదైన సొంత వాటర్ బాటిల్ ఉండాలి, ట్రెండ్‌లను అనుసరిస్తూ పర్యావరణానికి హాని కలిగించే వస్త్రాలు లేదా వస్తువులకు ప్రాధాన్యత ఇవ్వకూడదు, ఇంట్లోని వ్యర్థాలను తడి, పొడి విభాగాలుగా వేరు చేయండి...ఇలాంటి విషయాలెన్నో చుట్టుపక్కల వారికి చెబుతున్నప్పుడు మొదట్లో వారి స్పందన ఎలా ఉండేదో తెలియదుగానీ ఆ తరువాత మాత్రం మార్పు కనిపించింది.

పురస్కారం

బంగారంలాంటి బిడ్డ



హెత్వి ఖిమ్సూరియా

గుజరాత్‌లోని వదోదరకు చెందిన హెత్వి ఖిమ్సూరియా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పీఎం నేషనల్ చైల్డ్ అవార్డ్ (ప్రధాన్‌మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్-పీఎంఆర్‌బిపి) అందుకుంది. వివిధ రంగాలలో పిల్లలు సాధించిన అద్భుత విజయాలకు గుర్తింపుగా ఇచ్చే పురస్కారం ఇది. పదమూడు సంవత్సరాల హెత్వి సెరిబ్రల్ పాల్సీని అధిగమించి పెయింటింగ్, పజిల్ సాల్వింగ్‌లో అసాధారణ ప్రతిభ చూపుతోంది. తనకు వచ్చే పెన్షన్‌ను దివ్యాంగుల సంక్షేమ నిధికి ఇస్తోంది. తన ఆర్ట్‌పై యూట్యూబ్ చానల్ నడుపుతోంది....

వడోదరలోని 8–గ్రేడ్ స్టూడెంట్ హెత్వి ఖిమ్సూరియాకు పురస్కారాలు కొత్త కాదు. ప్రశంసలు కొత్తకాదు. గత సంవత్సరం ఫ్రీహ్యాండ్ పెయింటింగ్, క్రాఫ్ట్, పజిల్ సాల్వింగ్‌లో చూపుతున్న ప్రతిభకు 'గుజరాత్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించింది. 'వరల్డ్స్ ఫస్ట్ సీపీ గర్ల్ విత్ ఎక్స్‌ట్రార్డినరీ స్కిల్స్' టైటిల్ సాధించింది. వంద ఎడ్యుకేషనల్ పజిల్స్ సాల్వ్ చేసిన ఫస్ట్ సీపీ గర్ల్‌గా ఆమెను 'ది లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' గుర్తించింది.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రధాన్‌మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ (పీఎంఆర్‌బిపి) అందుకుంటున్న హెత్వి ఖిమ్సూరియా

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు సాధించిన హెత్వి గీసిన చిత్రాలు యాభై ఆర్ట్ గ్యాలరీలలో ప్రదర్శితమయ్యాయి. చిత్రకళలపై పిల్లల్లో ఆసక్తి కలిగించడానికి 'స్పెషల్ చైల్డ్ ఎడ్యుకేషన్ యాక్టివిటీ–హెత్వి ఖిమ్సూరియా' అనే యూట్యూబ్ చానల్ ప్రారంభించింది.

హెత్వి విజయాల వెనుక ఆమె తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉంది.

కూతురు ప్రస్తావన వచ్చినప్పుడు 'అయ్యో! మీ అమ్మాయి' అంటూ ఎంతోమంది సానుభూతి చూపే సమయాల్లో 'బాధ పడాల్సిన అవసరం ఏముంది. మా అమ్మాయి బంగారం. భవిష్యత్‌లో ఎంత పేరు తెచ్చుకుంటుందో చూడండి' అనేవారు. ఆ మాట అక్షరాలా నిజమైంది.

చిన్నప్పటి నుంచి బిడ్డను కంటికి రెప్పలా చూసుకుంటున్నారు.

హెత్విని చూసుకోవడానికి ఆమె తల్లి ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసింది.

రంగులు, పజిల్స్‌తో బేసిక్స్ ప్రారంభించారు. రంగులు, పజిల్స్ అంటే హెత్విలో ఇష్టం ఏర్పడేలా చేశారు. బొమ్మలు వేస్తున్నప్పుడు, పజిల్స్ పరిష్కరిస్తున్నప్పుడు ఆ అమ్మాయి కళ్లలో శక్తి కనిపిస్తుంది. ఆ శక్తితో ఏదైనా సాధించవచ్చు అనే నమ్మకాన్ని తల్లిదండ్రులలో నింపింది.

హెత్వి మోములో ఎప్పుడూ చెరగని చిరునవ్వు కనిపిస్తుంది. ఆ చిరునవ్వే ఈ చిన్నారి బలం.

హెత్వి ఖిమ్సూరియా మర్నీ విజయాలు సాధించాలని ఆశిద్దాం.

బ్యూటిప్స్

ముత్యంలా మెరవాలంటే...



ఇంట్లో రోజూ వాడే వాటితోనే చేసుకోగలిగిన ట్రీట్‌మెంట్‌లు. ఇక్కడ ఇచ్చినవన్నీ ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేని హెర్బల్ ఫేస్ ప్యాక్‌లు.

- చందనం ముఖం మీద ఉన్న నల్లటి మచ్చలను తొలగించడంతో పాటు మొటిమలు, యాక్నేతో పాటు వేడితో చర్మం పొంగినప్పుడు వచ్చిన ఎర్రటి మచ్చలను కూడా తొలగిస్తుంది. చందనంలో పన్నీరు కలిపి ప్యాక్ వేస్తుంటే మంచి ఫలితాన్నిస్తుంది. ఎండకాలంలో ఈ ప్యాక్ వేస్తుంటే శరీరానికి చల్లదనాన్నిస్తుంది.
- బొప్పాయి చెక్కు, అరటి తొక్కలు కూడా సౌందర్య సాధనాలే. వీటిని లోపలి వైపు (గుజ్జు ఉండే వైపు) చర్మానికి అంటేలా రుద్ది పది నిమిషాల తర్వాత చన్నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేస్తుంటే క్రమంగా ముఖం స్వచ్ఛంగా ముత్యంలా మెరుస్తుంది.
- ఒక టేబుల్ స్పూన్ తేనెలో ఒక టీ స్పూన్ పాల పొడి కాని తాజా పాలు కాని కలిపి ముఖానికి అప్లయ్ చేసి ఐదు నిమిషాల సేపు మర్దన చేయాలి. ఇలా క్రమం తప్పకుండా ప్రతిరోజూ చేస్తుంటే రెండు వారాలకు ఇనుమడించిన చర్మ కాంతి స్పష్టంగా కనిపిస్తుంది.
- చర్మాన్ని నునుపుగా కాంతివంతంగా చేయడంలో కమలా, బత్తాయిపండ్లు బాగా పని చేస్తాయి. ఈ రెండింటిలో ఏదో ఒక రసాన్ని ఒక టేబుల్ స్పూన్ తీసుకుని ముఖానికి రాసి ఐదు నిమిషాల సేపు మర్దన చేయాలి. ఇవి ముఖాన్ని క్లియర్‌గా చేయడంతోపాటు స్కిన్ టోనర్‌గా కూడా పనిచేస్తాయి.



తెలుగు టైటాన్స్ జట్టుకు 14వ పరాజయం

ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ జట్టుకు 14వ పరాజయం ఎదురైంది. గచ్చిబౌలి స్టేడియంలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పవన్ సెహ్రావత్ కెప్టెన్సీలోని తెలుగు టైటాన్స్ 29-54తో తమిళ్ తలైవాస్ చేతిలో ఓడిపోయింది. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 35-32తో హరియాణా స్టీలర్స్‌పై గెలిచింది. బుధవారంతో హైదరాబాద్ అంచె పోటీలు ముగిశాయి. గురువారం విశ్రాంతి దినం. శుక్రవారం పట్నాలో జరిగే మ్యాచ్‌ల్లో బెంగాల్ వారియర్స్‌తో పట్నా పైరేట్స్; గుజరాత్ జెయింట్స్‌తో యు ముంబా తలపడతాయి.



తొలి రౌండ్‌లోనే శ్రీకాంత్ ఓటమి

ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ తొలి రౌండ్‌లోనే ఇంటి దారి పట్టగా... లక్ష్య సేన్, ప్రియాన్షు, కిరణ్ జార్జి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు. జకార్తాలో బుధవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో శ్రీకాంత్ 21-19, 14-21, 11-21తో లీ జి జియా (మలేసియా) చేతిలో... ప్రణయ్ 18-21, 21-19, 10-21తో లో కీన్ యె (సింగపూర్) చేతిలో ఓడిపోయారు.

భారత్‌ను ఇంగ్లండ్ ఆపతరమా!



నేటి నుంచి హైదరాబాద్‌లో తొలి టెస్టు
సొంతగడ్డపై పటిష్టంగా టీమిండియా
'బజ్‌బాల్'తో పోటీకి ఇంగ్లండ్ సిద్ధం

ఉదయం గం.9:30 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలలో ప్రత్యక్ష ప్రసారం

సొంతగడ్డపై భారత జట్టు 2012లో చివరిసారిగా, అదీ ఇంగ్లండ్ చేతిలో ఓడింది... అయితే ఆ తర్వాత ఏ ఒక్క టీమ్ కూడా మన జట్టుతో తలపడి పైచేయి సాధించలేకపోయింది. ఇంకా చెప్పాలంటే టీమిండియా వరుసగా 16 సిరీస్‌లలో విజయం సాధించగా ఇందులో 7 క్లీన్‌స్వీప్‌లు ఉన్నాయి. రెండుసార్లు ఆస్ట్రేలియా మాత్రమే సిరీస్‌ను 'డ్రా' చేసేందుకు కాస్త చేరువగా రాగలిగింది. నాటినుంచి ఇక్కడ ఆడిన 44 టెస్టుల్లో భారత్ మూడింటిలో మాత్రమే ఓడిందంటే మన బలం, బలగం ఏమిటో అర్థమవుతుంది.

ఇంగ్లండ్ కూడా ఇక్కడ ఆడిన గత రెండు టెస్టు సిరీస్‌లలో భారత్ చేతిలో 0-4, 1-3తో చిత్తుగా ఓడింది... ఇలాంటి స్థితిలో భారత జట్టు మరోసారి ప్రత్యర్థిని పడగొట్టేందుకు సిద్ధమవుతోంది. ఇటీవల మన మేనేజ్‌మెంట్ వ్యాఖ్యలు చూస్తే పూర్తి స్థాయిలో స్పిన్ పిచ్‌లే తయారు కావడం ఖాయం. మరోవైపు గత కొంతకాలంగా దూకుడైన ఆటతో 'బజ్‌బాల్' అంటూ సిద్ధమైన ఇంగ్లండ్ ఏమాత్రం పోటీనిస్తుందనేది చూడాలి. ఈ నేపథ్యంలో ఐదు టెస్టుల భారీ సిరీస్‌కు రంగం సిద్ధమైంది.

"గత దశాబ్దకాలంలో మా జట్టుకు ఇక్కడ అద్భుతమైన రికార్డు ఉన్నది వాస్తవమే అయినా అది ఈ సిరీస్ విజయానికి పనికి రాదు. పరిస్థితులకు తగినట్లుగా అత్యుత్తమ క్రికెట్ ఆడాల్సిందే. ఆఖరిసారిగా ఇంగ్లండే మమ్మల్ని ఇక్కడ ఓడించింది. మేం అజేయులం ఏమీ కాదు. అలాంటి భ్రమలేమీ లేవు. కాబట్టి ఏమాత్రం ఉదాసీనత కనబర్చినా ఓటమి ఎదురవుతుంది. ఎదుటివారి బలబలాలకంటే మన జట్టు వ్యూహం గురించి స్పష్టత ఉండాలి. దానిని అమలు చేయాలి కూడా. ఇలాంటి పరిస్థితుల్లో మేమందరం ఆడాం కాబట్టి ఎలా ఆడాలో సొంత ప్రణాళికలు కూడా రూపొందించుకోవాలి. టెస్టుల్లో ఒత్తిడిని అధిగమించడమే పెద్ద సవాల్. బరిలోకి దిగి పూర్తి సత్తాను ప్రదర్శించాలి. ఎప్పటికీ సీనియర్లపైనే ఆధారపడలేం కదా. కొత్త కుర్రాళ్లకు కూడా అవకాశం ఇవ్వాలి. లేదంటే వారు ఎప్పుడు ఆడతారు. అందుకే పటిదార్‌ను ఎంచుకున్నాం. -రోహిత్ శర్మ, భారత కెప్టెన్

సాక్షి, హైదరాబాద్: భారత గడ్డపై మరో పెద్ద జట్టుతో టెస్టు సిరీస్‌కు సమయం ఆసన్నమైంది. నేటి నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు టెస్టుల సిరీస్ జరగనుంది. ఇందులో భాగంగా గురువారం నుంచి ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో తొలి టెస్టులో ఇరు జట్లు తలపడతాయి. బలాబలాలు, రికార్డుపరంగా చూస్తే అన్ని విధాలా రోహిత్ శర్మ జట్టుదే పైచేయిగా కనిపిస్తుండగా... గత కొంతకాలంగా మార్పులతో కనిపిస్తూ వచ్చిన ఇంగ్లండ్‌ను పూర్తిగా తక్కువ చేయలేం. ఏ జట్టు గెలిచినా సిరీస్‌లో శుభారంభం చేస్తే ఆపై దాని ప్రభావం కనిపించడం ఖాయం.

కోహ్లి లేకుండా...

భారత్‌కు సంబంధించి తుది జట్టు విషయంలో ఎలాంటి సందిగ్ధత లేదు. దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్‌లో ఆడిన టీమ్ నుంచి సహజంగానే స్వదేశంలో మార్పులు ఖాయం. బౌలింగ్ విభాగంలో ఇద్దరు పేసర్ల స్థానాల్లో ఇద్దరు స్పిన్నర్లు వస్తున్నారు. సీనియర్ ఆటగాడు అశ్విన్ బరిలోకి దిగడం ఖాయం. అశ్విన్-జడేజాల స్పిన్ జోడీ చెలరేగితే ఇంగ్లండ్ ఏమాత్రం నిలబడగలదనేది ఆసక్తికరం. గత దశాబ్దకాలంలో వీరిద్దరు సొంతగడ్డపై ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టారు. మూడో స్పిన్నర్‌గా అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ మధ్య పోటీ ఉంది. కెప్టెన్ రోహిత్ కూడా దీనిపై స్పష్టత ఇవ్వకపోయినా బ్యాటింగ్‌ను దృష్టిలో పెట్టుకునే అక్షర్‌కే ప్రాధాన్యత ఉంది. ఇద్దరు పేసర్లు బుమ్రా, సిరాజ్ కొత్త బంతిని పంచుకుంటారు. కెరీర్‌లో 23 టెస్టులు ఆడిన సిరాజ్‌కు తన సొంత మైదానంలో ఇదే తొలి టెస్టు కావడం విశేషం. ఆరంభంలో వీరిద్దరు ప్రభావం చూపించగలరు. స్టార్ బ్యాటర్ కోహ్లి ఈ మ్యాచ్‌కు దూరం కావడం అభిమానులను నిరాశపర్చేదే. అయితే అతను లేకపోవడం వల్ల బ్యాటింగ్‌లో ఎంపిక సమస్య లేకుండా పోయింది. నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్, ఐదో స్థానంలో కేఎల్ రాహుల్ ఆడతారు. శుబ్‌మన్ గిల్ టెస్టుల్లో ఇంకా మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. కోహ్లి స్థానంలో స్పెషలిస్ట్ వికెట్ కీపర్‌గా ఆంధ్ర ఆటగాడు కోన శ్రీకర్ (కేఎస్) భరత్ జట్టులోకి వస్తాడు. రజత్ పటిదార్‌ను ఎంపిక చేసినా... తుది జట్టులో చోటు కష్టమే. మన బ్యాటర్లు భారీ స్కోరు అందిస్తే ఇంగ్లండ్ పని పట్టడం బౌలర్లకు పెద్ద కష్టం కాకపోవచ్చు.

పిచ్, వాతావరణం

ఉప్పల్ పిచ్ పొడిగా కనిపిస్తోంది. మరో మాటకు తావు లేకుండా స్పిన్‌కు అనుకూలించడం ఖాయం. అయితే అది ఎంత తొందరగా మొదలవుతుందనేదే ఆసక్తికరం. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్‌కే మొగ్గు చూపుతుంది.

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వి, గిల్, శ్రేయస్, కేఎల్ రాహుల్, జడేజా, భరత్, అశ్విన్, అక్షర్ పటేల్, బుమ్రా, సిరాజ్.
ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, వుడ్, రేహాన్, హార్లీ, లీచ్.

ముగ్గురు స్పిన్నర్లతో...

మ్యాచ్‌కు ముందు రోజే ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. స్పిన్ పిచ్‌ను దృష్టిలో ఉంచుకొని ముగ్గురు స్పిన్నర్లకు అవకాశమిచ్చి ఒకే ఒక పేసర్‌తో బరిలోకి దిగుతోంది. నాణ్యమైన స్పిన్నర్లు కాకపోయినా... అందుబాటులో ఉన్నవారి నుంచే ఎంచుకోక తప్పలేదు. 35 టెస్టుల అనుభవం ఉన్న లెఫ్టార్మ్ స్పిన్నర్ లీచ్ కొంత వరకు ప్రభావం చూపించవచ్చు. కానీ లెగ్‌స్పిన్నర్ రేహాన్ ఒకే ఒక టెస్టు ఆడగా, మరో లెఫ్టార్మ్ స్పిన్నర్ టామ్ హార్లీకి ఇదే తొలి టెస్టు కానుంది.

4 ఉప్పల్ స్టేడియంలో భారత జట్టు 5 టెస్టులు ఆడింది. న్యూజిలాండ్‌తో 2010లో జరిగిన తొలి టెస్టు 'డ్రా'గా ముగియగా... తర్వాతి నాలుగు మ్యాచ్‌లలో వరుసగా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, వెస్టిండీస్‌లపై భారీ విజయాలు సాధించింది.

అదనంగా జో రూట్ ఆఫ్ స్పిన్ కూడా వేయగలడు. ఇంగ్లండ్ స్పిన్నర్లు మన బ్యాటింగ్‌ను ఏమాత్రం నిలువరించగలరనేది సందేహమే అయినా... స్పిన్‌తో కనీసం ప్రయత్నమైనా చేసేందుకు ఆ జట్టు సిద్ధమైంది. సీనియర్ అండర్సన్‌ను కాకుండా మార్క్ వుడ్ రూపంలో ఏకైక ఫాస్ట్ బౌలర్‌గా ఎంచుకుంది. బ్యాటింగ్‌లో రూట్, బెయిర్‌స్టోలపై ప్రధానంగా ఆ జట్టు ఆధారపడుతోంది. ఓలీ పోప్ కూడా మెరుగైన బ్యాటరే అయినా... క్రాలీ, డకెట్ ఎలాంటి ఆరంభం ఇస్తారో చూడాలి. స్టోక్స్ బ్యాటింగ్‌లో ధాటిని ప్రదర్శించాలని జట్టు కోరుకుంటోంది. ముఖ్యంగా కోచ్ బ్రెండన్ మెకల్లమ్ ఆధ్వర్యంలో 'బజ్‌బాల్' అంటూ దూకుడైన తరహా శైలితోనే టీమ్ సఫలమైంది. అయితే పూర్తి భిన్నమైన భారత పిచ్‌లపై అలాంటి మంత్రం ఎలా పని చేస్తుందో చూడాలి. ఈ జోరులో జట్టు కుప్పకూలిపోయే ప్రమాదమూ ఉంది.

షోయబ్ బషీర్‌కు వీసా మంజూరు



లండన్: భారత వీసా లభించకపోవడంతో తొలి టెస్టుకు దూరమైన ఇంగ్లండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్‌కు ఊరట లభించింది. వీసా లేకపోవడంతో అతను జట్టుతో పాటు భారత్‌కు ప్రయాణించకుండా యూఏఈ నుంచి ఇంగ్లండ్‌కు వెనక్కి వెళ్లిపోయాడు. అయితే ఇప్పుడు బషీర్‌కు వీసా మంజూరైందని గురువారం ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ప్రకటించింది. 'బషీర్ తన వీసా అందుకున్నాడు. ఈ వారాంతంలో భారత్‌కు వచ్చి అతను జట్టుతో కలుస్తాడు. సమస్య పరిష్కారం కావడంతో సంతోషంగా ఉంది' అని ఈసీబీ వెల్లడించింది. ఇంగ్లండ్‌లో పుట్టినా... పాకిస్తాన్ మూలాలు ఉన్న కారణంగానే బషీర్ వీసాను భారత ప్రభుత్వం ఆలస్యం చేసిందని గత రెండు రోజులుగా విమర్శలు వచ్చాయి. ఇంగ్లండ్ ప్రభుత్వ అధికారి కూడా ఒకరు దీనిపై అసంతృప్తి వ్యక్తం చేయగా... ఇప్పుడు అంతా సుఖాంతమైంది. 20 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ బషీర్ ఇప్పటి వరకు ఒక్క టెస్టు కూడా ఆడలేదు.



భళా బోపన్న...

- 43 ఏళ్ల వయసులో వరల్డ్ నంబర్‌వన్
- ఈ ఘనత సాధించనున్న అతిపెద్ద వయస్కుడిగా రికార్డు

మెల్‌బోర్న్: తన కెరీర్ చరమాంకంలో భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న ఉన్నత శిఖరానికి చేరుకున్నాడు. అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో బోపన్న నంబర్‌వన్ ర్యాంక్ సొంతం చేసుకోవడం ఖరారైంది. ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ జంట 6-4, 7-6 (7/5)తో మాక్సిమో గొంజాలెజ్-ఆంద్రెస్ మోల్టెని (అర్జెంటీనా) జోడీపై గెలిచింది. దాంతో ఈనెల 29న విడుదలయ్యే ఏటీపీ తాజా ర్యాంకింగ్స్‌లో బోపన్న, ఎబ్డెన్ వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్ జోడీగా అవతరిస్తుంది. ఈ క్రమంలో టెన్నిస్ చరిత్రలోనే నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలవనున్న అతిపెద్ద వయస్కుడిగా రోహన్ బోపన్న (43 ఏళ్ల 330 రోజులు) రికార్డు నెలకొల్పనున్నాడు. పురుషుల డబుల్స్‌లో ప్రస్తుతం ఈ రికార్డు అమెరికా దిగ్గజం మైక్ బ్రయాన్ (41 ఏళ్ల 76 రోజులు; 2019లో) పేరిట ఉంది. మహిళల డబుల్స్‌లో అమెరికా ప్లేయర్ లీసా రేమండ్ (39 ఏళ్లు; 2012లో)... పురుషుల సింగిల్స్‌లో స్విట్జర్లాండ్ దిగ్గజం ఫెడరర్ (36 ఏళ్ల 320 రోజులు; 2018లో)... మహిళల సింగిల్స్‌లో అమెరికా స్టార్ సెరెనా విలియమ్స్ (35 ఏళ్ల 124 రోజులు; 2017లో) వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిన అతి పెద్ద వయస్కులుగా రికార్డు సృష్టించారు. 'నంబర్‌వన్ ర్యాంక్ అందుకోనుండటంతో గర్వంగా అనిపిస్తోంది. నా జీవితంలో ఇదో ప్రత్యేక క్షణం. ఈస్థాయికి చేరుకోవడానికి కోచ్‌లు, కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషుల పాత్ర ఎంతో ఉంది' అని బోపన్న వ్యాఖ్యానించాడు

4 లియాండర్ పేస్, మహేశ్ భూపతి, సానియా మీర్జా తర్వాత డబుల్స్ ర్యాంకింగ్స్‌లో వరల్డ్ నంబర్‌వన్‌గా నిలవనున్న నాలుగో భారతీయ ప్లేయర్‌గా బోపన్న గుర్తింపు పొందుతాడు.

24 ఇప్పటి వరకు బోపన్న సాధించిన డబుల్స్ టైటిల్స్. 37 టోర్నీలలో అతను రన్నరప్‌గా నిలిచాడు. 2017లో గాబ్రియేలా డబ్రౌస్కీ (కెనడా)తో కలిసి బోపన్న ఫ్రెంచ్ ఓపెన్‌లో మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ సాధించాడు. 2010లో ఐజామ్ ఖురేషీ (పాకిస్తాన్)తో యూఎస్ ఓపెన్‌లో... 2023లో ఎబ్డెన్‌తో యూఎస్ ఓపెన్‌లో బోపన్న రన్నరప్‌గా నిలిచాడు.

అల్‌కరాజ్‌కు షాక్

ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్) కథ ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 6-1, 6-3, 6-7 (2/7), 6-4తో అల్‌కరాజ్‌ను ఓడించి సెమీఫైనల్లో మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా)తో పోరుకు సిద్ధమయ్యాడు. మరో క్వార్టర్ ఫైనల్లో మెద్వెదెవ్ 7-6 (7/4), 2-6, 6-3, 5-7, 6-4తో తొమ్మిదో సీడ్ హుర్కాజ్ (పోలాండ్)పై గెలిచాడు. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో క్వాలిఫయర్ దయానా యాస్‌ట్రెమ్‌స్కా (ఉక్రెయిన్) 6-3, 6-4తో లిండా నొస్కోవా (చెక్ రిపబ్లిక్)పై... 12వ సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా) 6-7 (4/7), 6-3, 6-1తో అనా కలిన్‌స్కాయ (రష్యా)పై గెలిచి తమ కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

సూర్యకుమార్‌కు ఐసీసీ అవార్డు

వరుసగా రెండో ఏడాది 'టి20 ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపిక



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 2023 వార్షిక పురస్కారాల్లో భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్‌కు గుర్తింపు లభించింది. పురుషుల టి20 ఫార్మాట్‌లో సూర్యకుమార్ వరుసగా రెండో ఏడాది 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును గెల్చుకున్నాడు. గత ఏడాది సూర్య 18 మ్యాచ్‌లు ఆడి 155.95 స్ట్రయిక్‌రేట్‌తో 733 పరుగులు సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు, ఐదు అర్ధ సెంచరీలు ఉన్నాయి. 'టి20 ఫార్మాట్‌లో భారత మిడిలాఆర్డర్ వెన్నెముకగా సూర్య ఉన్నాడు. తన దూకుడైన ఆటతో పలుసార్లు భారత జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. కెప్టెన్సీ బాధ్యతల్లోనూ అతను ఒత్తిడికి లోనుకాకుండా నిలకడగా రాణించాడు' అని ఐసీసీ వ్యాఖ్యానించింది.



భారత హాకీ జట్టుకు రెండో గెలుపు

మస్కట్: మహిళల 'ఫైవ్స్' ప్రపంచకప్ హాకీ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. అమెరికాతో జరిగిన పూల్ 'సి' రెండో మ్యాచ్‌లో టీమిండియా 7-2 గోల్స్‌తో గెలిచింది. భారత్ తరఫున మరియానా (20వ, 22వ ని.లో), దీపిక (23వ, 25వ ని.లో) రెండు గోల్స్ చొప్పున చేయగా... ముంతాజ్ (27వ ని.లో), అజ్మీనా (29వ ని.లో), మహిమ (17వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. పోలాండ్‌తో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 5-4తో గెలిచింది.

సినిమా

వినూత్న పురుషోత్తముడు


● రాజ్ తరుణ్

రాజ్ తరుణ్, హాసినీ సుధీర్ జంటగా రామ్ భీమన దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పురుషోత్తముడు'. డా. రమేశ్ తేజావత్, ప్రకాష్ తేజావత్ నిర్మిస్తున్న ఈ చిత్రం టాకీ రాజమండ్రిలోని భారీ సెట్‌లో జరిపిన షెడ్యూల్‌తో పూర్తయింది. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రం డబ్బింగ్ జరుగుతోంది. "ఇప్పటివరకూ తెలుగులో రాని కథతో ఈ చిత్రాన్ని నిర్మించాం. వినూత్న కథ, గోపీ సుందర్ పాటలు, పీజీ విందా కెమెరా వర్క్.. ఇలా అన్నీ ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటాయి'' అన్నారు నిర్మాతలు.

రామ్ సైనికులకు అంకితం


● సూర్య, ధన్య

"'రామ్' మాకు తొలి సినిమా. మా చిత్రానికి తెగే ప్రతి టికెట్‌లో రూ. ఐదు నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు ఇస్తాం. దేశ సైనికులకు ఈ చిత్రాన్ని అంకితం చేస్తున్నాం'' అన్నారు నిర్మాత దీపికాంజలి. సూర్య అయలసోమయాజుల, ధన్యా బాలకృష్ణ జంటగా మిహిరామ్ వైనతేయ దర్శకత్వం వహించిన చిత్రం 'రామ్'. ఓఎస్ఎం విజన్‌తో కలిసి దీపికాంజలి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న రిలీజవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకకి నిర్మాతలు వివేక్ కూచిభొట్ల, బెక్కెం వేణుగోపాల్ అతిథులుగా హాజరై, 'రామ్' హిట్టవ్వాలన్నారు. "'రామ్' మంచి దేశభక్తి చిత్రం'' అన్నారు సూర్య అయలసోమయాజుల, ధన్యా బాలకృష్ణ. "దేశ సరిహద్దు లోపల ఉగ్రవాదుల దాడి నుంచి మనల్ని కాపాడే అన్‌సంగ్ హీరోల గురించి 'రామ్' తీశాం'' అన్నారు మిహిరామ్.

అయలాన్‌ని హాయిగా చూడొచ్చు
- శివ కార్తికేయన్



"యూనివర్సల్ కాన్సెప్ట్‌తో రూపొందిన చిత్రం 'అయలాన్'. సినిమాలా ఉండదు.. థీమ్ పార్క్‌లోకి వెళ్లినట్టు, జాలీ రైడ్‌లా ఉంటుంది. రెండున్నర గంటలు హాయిగా ఎంజాయ్ చేయొచ్చు. మా సినిమా తమిళనాడులో భారీ విజయం సాధించింది. తెలుగులోనూ సూపర్ హిట్టవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు హీరో శివ కార్తికేయన్. ఆర్. రవికుమార్ దర్శకత్వంలో శివ కార్తికేయన్, రకుల్ ప్రీత్‌సింగ్ జంటగా నటించిన చిత్రం 'అయలాన్'. కోటపాడి జె. రాజేష్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 12న తమిళంలో విడుదలైంది. తెలుగులో మహేశ్వర్ రెడ్డి ఈ నెల 26న రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో శివకార్తికేయన్ మాట్లాడుతూ- "'అయలాన్' షూటింగ్ కోవిడ్‌కి ముందే పూర్తి చేశాం. కరోనా వల్ల విజువల్ ఎఫెక్ట్స్ చేయడం కుదరలేదు. 'రోబో, 2.ఓ' సినిమాల్లో కన్నా ఎక్కువ విజువల్ ఎఫెక్ట్స్ ఉన్న చిత్రమిది. 'అయలాన్'లో నేనో హీరో అయితే ఏలియన్ మరో హీరో. అయలాన్' సీక్వెల్‌ని ఇంకా భారీగా చేస్తాం'' అన్నారు.


● శ్రుతీహాసన్

డిటెక్టివ్ అను

ఇంగ్లిష్ మూవీ 'చెన్నై స్టోరీ' కోసం డిటెక్టివ్‌గా అనుగా మారనున్నారు శ్రుతీహాసన్. 'ది అరేంజ్‌మెంట్స్ ఆఫ్ లవ్' నవల ఆధారంగా దర్శకుడు, 'బాఫ్తా' అవార్డు విజేత ఫిలిప్ జాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఓ ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీ నడిపే తమిళ మహిళ కథే ఈ చిత్రం. కనిపించకుండా పోయిన తన తండ్రిని కనుగొనే ప్రయత్నంలో ఓ వ్యక్తి (బ్రిటిష్ నటుడు వివేక్ కల్రా) వేల్స్ నుంచి చెన్నైలో అడుగుపెట్టి, డిటెక్టివ్ అను సహాయం కోరడం, ఆ తర్వాత అను ఏం చేసింది? అనేది కథాంశం. ప్రధానంగా ఇంగ్లిష్, కొంచెం తమిళ్, వేల్స్ భాషలతో ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం సాగుతుంది. కాగా, ఇండో-యూకే ప్రొడక్షన్ నిర్మించనున్న ఈ చిత్రానికి యూకేకి చెందిన బ్రిటిష్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఫండింగ్ చేయనుంది. "చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రానికి అంతర్జాతీయ భాగస్వామ్యం ఉండటం హ్యాపీగా ఉంది'' అన్నారు శ్రుతీహాసన్. కాగా ఈ సినిమాని సమంత చేయాల్సింది. కానీ కొన్నాళ్లు ఆమె సినిమాలకు గ్యాప్ ఇవ్వడంవల్ల ఈ చాన్స్ శ్రుతీ హాసన్‌కి దక్కింది.

ప్రేమ... యుద్ధం


● రణబీర్ కపూర్, ఆలియా భట్

భార్యాభర్తలు రణబీర్ కపూర్, ఆలియా భట్ ప్రేమికులుగా కనిపించనున్నారు. ఈ వెండితెర ప్రేమకు సంజయ్ లీలా భన్సాలీ దర్శకుడు. రణబీర్, ఆలియా జంటగా విక్కీ కౌశల్ ఓ హీరోగా ఈ చిత్రం రూపొందనుంది. ఒక పురాణ గాథ.. 'లవ్ అండ్ వార్' అంటూ ఈ చిత్రాన్ని ప్రకటించారు. యుద్ధం నేపథ్యంలో సాగే ప్రేమకథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు భన్సాలీ. వచ్చే ఏడాది క్రిస్మస్‌కి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు.

రెండు సార్లు గుండు చేయించుకున్నాను
- సుహాస్


● శివానీ నాగరం, సుహాస్

"'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మూవీ నాకెంతో స్పెషల్. ఈ సినిమా కోసం రెండు సార్లు గుండు చేయించుకున్నాను. బ్యాండ్ కొట్టడం నేర్చుకున్నాను. మా సినిమాకు ప్రేక్షకులు మంచి సక్సెస్ అందిస్తారని ఆశిస్తున్నా'' అని హీరో సుహాస్ అన్నారు. దుష్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. జీఏ2 పిక్చర్స్, మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 2న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్ విడుదల వేడుకలో దుష్యంత్ కటికనేని మాట్లాడుతూ- "కొన్ని వాస్తవ ఘటనలతో ఈ సినిమా తీశాం. లవ్ స్టోరీతో పాటు ఇంటెన్స్ డ్రామా ఉంటుంది'' అన్నారు. "ప్రేక్షకులు మా సంస్థకి 'బేబీ' వంటి బ్లాక్ బస్టర్ అందించారు. 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'తో మరో సూపర్ హిట్ ఇస్తారని ఆశిస్తున్నాం'' అన్నారు ధీరజ్ మొగిలినేని.

సినిమా అంతా ఒకటే పాత్ర ఉంటుంది


● బొమ్మక్ శివ

"'105 మినిట్స్' మంచి ప్రయోగాత్మక చిత్రం. సినిమా మొత్తం ఒకటే పాత్ర ఉంటుంది. కానీ, ఇంకో వాయిస్ వినిపిస్తుంది. పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ఓ బాలీవుడ్ నటుడి మాటలు వినిపిస్తుంటాయి'' అని నిర్మాత బొమ్మక్ శివ అన్నారు. హీరోయిన్ హన్సిక లీడ్ రోల్‌లో రాజు దుస్సా దర్శకత్వం వహించిన చిత్రం '105 మినిట్స్'. బొమ్మక్ శివ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 26న విడుదలవుతోంది. బొమ్మక్ శివ మాట్లాడుతూ- "నాకు రియల్ ఎస్టేట్, కన్వెన్షన్ సెంటర్స్ బిజినెస్‌లు ఉన్నాయి. సినిమాపై ప్యాషన్‌తో మొదటి ప్రాజెక్టుగా '105' మూవీ తీశాను. రాజు దుస్సా చక్కగా తీశాడు. హన్సికను ఈ మూవీలో కొత్తగా చూస్తారు. మైత్రీ మూవీస్ సంస్థ మా సినిమాని రిలీజ్ చేస్తుండటం హ్యాపీగా ఉంది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	690	71,060
నిఫ్టీ ▲	215	21,454

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,615	▲ 189
డోజోన్స్	38,027	▲ 121
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,528	▲ 42
డాక్స్	16,890	▲ 263
షాంఘై	2,821	▲ 50
నికాయ్	36,226	▽ 291

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	62,591	▲ 236
బంగారం (99.5 స్వచ్ఛత)	62,340	▲ 235
వెండి (కేజీ)	71,072	▲ 761

ఫారెక్స్ రేట్లు రూ.లలో			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.63	107.21
€	యూరో	ఎస్‌బీఐ	89.49	91.85
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.58	56.84
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.92	55.85
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.19	62.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.22	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.73	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.49	12.56

ఆర్థికమంత్రి హల్వా విందు...



2024 మధ్యంతర బడ్జెట్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇందుకు ప్రతీకాత్మకంగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థికశాఖ నార్త్‌బ్లాక్‌లో హల్వా విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంతో బడ్జెట్ పత్రాల ముద్రణ అధికారికంగా ప్రారంభమవుతుంది. లోక్‌సభలో ఫిబ్రవరి 1వ తేదీన ఆర్థికమంత్రి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టేంతవరకూ ముద్రణ ప్రక్రియలో పాల్గొనే అధికారులు అందరూ 'లాక్‌–ఇన్'లో ఉంటారు. బడ్జెట్‌కు ముందు సంప్రదాయంగా వస్తున్న ఈ హల్వా రుచుల ఆస్వాదన కార్యక్రమంలో ఆర్థికశాఖ సహాయమంత్రి కరాద్, ఫైనాన్స్ సెక్రటరీ టీవీ సోమనాథన్, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్, దీపమ్ సెక్రటరీ తుహిన్ కాంతా పాండే తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

లాభాల్లోకి టాటా స్టీల్

డిసెంబర్ క్వార్టర్‌లో రూ. 522 కోట్లు



న్యూఢిల్లీ: టాటా స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో నష్టాలను వీడి రూ. 522 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,502 కోట్ల నికర నష్టం ప్రకటించింది. ఈ ఏడాది క్యూ2(జూలై–సెప్టెంబర్)లోనూ రూ. 6,511 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 57,354 కోట్ల నుంచి రూ. 55,540 కోట్లకు క్షీణించింది. కాగా.. నికర రుణ భారం రూ. 77,405 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో టాటా స్టీల్ షేరు బీఎస్‌ఈలో 4% జంప్‌చేసి రూ. 135 వద్ద ముగిసింది.

మారుతీ ఫ్రాంక్స్ అమ్మకాలు @ లక్ష



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా కాంపాక్ట్ ఎస్‌యూవీ ఫ్రాంక్స్ లక్ష యూనిట్ల విక్రయాల మార్కును అధిగమించింది. రికార్డు సమయంలో 10 నెలల వ్యవధిలోనే దీన్ని సాధించినట్లు సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్, సేల్స్) శశాంక్ శ్రీవాస్తవ తెలిపారు. ఇది పరిశ్రమలో కొత్త బెంచ్‌మార్క్‌ను సృష్టించిందని ఆయన పేర్కొన్నారు. 2022లో ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో 10.4 శాతంగా ఉన్న తమ వాటాను 19.7 శాతానికి పెంచుకోవడంలో ఈ మోడల్ గణనీయంగా తోడ్పడిందని శ్రీవాస్తవ వివరించారు. 2023 ఏప్రిల్ 24న ఫ్రాంక్స్‌ను మారుతీ దేశీ మార్కెట్లో ప్రవేశపెట్టింది. దీన్ని లాటిన్ అమెరికా, మధ్యప్రాచ్యం, ఆగ్నేయాసియా మార్కెట్లకు కూడా ఎగుమతి చేస్తోంది. ఇప్పటివరకు 9,000 యూనిట్లను ఎగుమతి చేసింది.

బుల్ బౌన్స్ బ్యాక్

ముంబై: గత రెండు రోజులుగా అమ్మకాల ఒత్తిడితో తడబడిన బుల్ బుధవారం బౌన్స్‌బ్యాక్ అయ్యింది. ఇటీవల మార్కెట్ పతనంతో కనిష్టాలకు దిగివచ్చిన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూలతలను ఆసరాగా చేసుకొని ఇన్వెస్టర్లు కొనుగోళ్లు చేపట్టారు. ముఖ్యంగా నిఫ్టీ, బ్యాంక్ నిఫ్టీ ఇండెక్సుల్లో షార్ట్ కవరింగ్ చోటుచేసుకుంది. ఇండెక్సుల్లో అధిక వెయిటేజీ షేర్లైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2%, రిలయన్స్ ఒకశాతానికి మేర రాణించి సూచీల రికవరీకి తోడ్పడ్డాయి. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీలు అంతకు ముందు కోల్పోయిన కీలకమైన 71000, 21,450 స్థాయిలని తిరిగి అందుకున్నాయి. మెటల్, కమోడిటీ, టెలికం షేర్లకు భారీ డిమాండ్ నెలకొనడంతో సెన్సెక్స్ 690 పాయింట్లు పెరిగి 71,060 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 70,002 వద్ద కనిష్టాన్ని, 71,150 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 215 పాయింట్లు బలపడి 21,454 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 21,137 – 21,482 పరిధిలో కదలాడింది. సెన్సెక్స్ ఒక శాతం ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.42 లక్షల కోట్లు పెరిగి రూ.371.4 లక్షల కోట్లకు చేరింది.



గిఫ్ట్ సిటీ ఎక్స్చేంజీల్లో నేరుగా లిస్టింగ్

దేశీ సంస్థలకు ప్రభుత్వం అనుమతి



న్యూఢిల్లీ: దేశీ కంపెనీలు తమ షేర్లను గుజరాత్ గిఫ్ట్ ఐఎఫ్‌ఎస్‌సీలోని అంతర్జాతీయ ఎక్స్చేంజీల్లో నేరుగా లిస్ట్ చేసుకునేందుకు అనుమతినిస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్థిక శాఖలో భాగమైన ఆర్థిక వ్యవహారాల విభాగం (డీఈఏ) ఈ మేరకు విదేశీ మారక నిర్వహణ చట్ట నిబంధనలను సవరించి, నోటిఫై చేసింది. అటు కార్పొరేట్ వ్యవహారాల శాఖ కూడా ఇందుకు సంబంధించిన నిబంధనలను జారీ చేసింది. దీనితో విదేశీ పెట్టుబడుల రాకకు, వృద్ధి అవకాశాలకు ఊతం లభించగలదని, భారతీయ కంపెనీలకు మరింత మంది ఇన్వెస్టర్లు అందుబాటులోకి రాగలరని ఆర్థిక శాఖ ప్రకటన తెలిపింది.

కెనరా బ్యాంక్ లాభం జూమ్

క్యూ3లో రూ. 3,659 కోట్లు



ముంబై: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. నికర లాభం 27 శాతం జంప్‌చేసి రూ. 3,659 కోట్లను తాకింది. అధిక వడ్డీ ఆదాయం, తగ్గిన రుణ వ్యయాలు ఇందుకు సహకరించాయి. నికర వడ్డీ ఆదాయం 9 శాతం పైగా వృద్ధితో రూ. 9,417 కోట్లకు చేరింది. క్రెడిట్ వ్యయం 0.24 శాతం తగ్గి 0.97 శాతానికి చేరినట్లు బ్యాంక్ సీఈవో కె.సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.5 శాతం తగ్గి 3.39 శాతానికి, నికర ఎన్‌పీఏలు సైతం 0.64 శాతం మెరుగుపడి 1.32 శాతానికి దిగివచ్చినట్లు వెల్లడించారు.

ఫలితాల నేపథ్యంలో కెనరా బ్యాంక్ షేరు బీఎస్‌ఈలో 0.5% క్షీణించి రూ. 454 వద్ద ముగిసింది.

టెక్ మహీంద్రా లాభం డౌన్

రూ. 510 కోట్లకు పరిమితం



ముంబై: ఐటీ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా మూడో త్రైమాసికంలో నిరుత్సాహకర పనితీరు ప్రదర్శించింది. నికర లాభం 60 శాతం పతనమై రూ. 510 కోట్లకు పరిమితమైంది. లాభాల మార్జిన్లు దెబ్బతినడం ప్రభావం చూపింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,297 కోట్లు ఆర్జించింది. ఈ ఏడాది క్యూ2(జులై–సెప్టెంబర్)లో రూ. 494 కోట్ల లాభం మాత్రమే సాధించింది. సీజనల్‌గా క్యూ3 బలహీనమేకాకుండా టెలికం, హైటెక్, ఫైనాన్షియల్ సర్వీసుల విభాగాల్లో డిమాండ్ నీరసించడం ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. కాగా.. మొత్తం ఆదాయం 5 శాతం క్షీణించి రూ. 13,101 కోట్లకు పరిమితమైంది. గత క్యూ3లో రూ. 13,734 కోట్ల టర్నోవర్ సాధించింది. 38.1 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్ కుదుర్చుకుంది. ఈ ఏడాది క్యూ2(64 కోట్ల డాలర్లు)తో పోలిస్తే భారీగా క్షీణించాయి. ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు 17 శాతం నుంచి 10 శాతానికి దిగివచ్చింది. ఈ క్యూ2లో ఇది 11 శాతంగా నమోదైంది. త్రైమాసికవారీగా మొత్తం సిబ్బంది సంఖ్య 3 శాతం తగ్గి 1,46,250కు చేరింది.

టెక్ మహీంద్రా షేరు బీఎస్‌ఈలో 3% ఎగసి రూ. 1,408 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్‌–నెక్ / 100కు రూ.లలో)	
25-1-2024	
విశాఖ	565–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	560–00
విజయవాడ	560–00
రిటైల్ ధర (డజను)	72.00
24-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

వివిఫైకి రూ. 622 కోట్ల నిధులు

ఇక లఘు, చిన్న తరహా పరిశ్రమలకు రుణాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఫిన్‌టెక్ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ వివిఫై తాజాగా 75 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 622.50 కోట్లు) నిధులు సమీకరించింది. డెట్, ఈక్విటీ రూపంలో ఈ మొత్తాన్ని సమకూర్చుకున్నట్లు సంస్థ సహ వ్యవస్థాపకుడు అనిల్ పినపాల బుధవార మిక్కడ విలేకరులకు చెప్పారు. రుణాలు, కార్యకలాపాల విస్తరణకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు వివరించారు. కొత్తగా లఘు, చిన్న తరహా పరిశ్రమల విభాగంలోకీ ప్రవేశిస్తున్నట్లు అనిల్ చెప్పారు. గతేడాది దాదాపు రూ. 1,000 కోట్ల రుణాలు ఇవ్వగా, ఈసారి రూ. 3,000 కోట్ల వితరణను లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. సహ వ్యవస్థాపకుడు శ్రీనాథ్ కొంపెల్ల, చైర్మన్ ప్యాట్రిక్ కిషోర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫ్లెక్స్‌పే, ఫ్లెక్స్‌సాలరీ ఉత్పత్తుల ద్వారా సంస్థ అల్పాదాయ వర్గాలకు అత్యంత తక్కువగా రూ. 500 నుంచి రూ. 2.5 లక్షల వరకు అన్‌సెక్యూర్డ్ రుణాలు అందిస్తోంది.

ఇండియన్ ఆయిల్.. దూకుడు

నికర లాభం రూ. 8,063 కోట్లు



న్యూఢిల్లీ: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. స్టాండెలోన్ నికర లాభం భారీగా దూసుకెళ్లి రూ. 8,063 కోట్లను అధిగమించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 448 కోట్లు ఆర్జించింది. అయితే ఈ ఏడాది క్యూ2(జూలై–సెప్టెంబర్)లో ఆర్జించిన రూ. 12,697 కోట్లతో పోలిస్తే తాజా లాభాలు తక్కువేకావడం గమనార్హం.

ఫలితాల నేపథ్యంలో ఐవోసీ షేరు బీఎస్‌ఈలో 3.3 శాతం బలపడి రూ. 144 వద్ద ముగిసింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఐవోసీఎల్ పైప్‌లైన్స్ విభాగంలో 473 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్).. పైప్‌లైన్స్ డివిజన్ పరిధిలోని ఐదు రీజియన్‌లలో టెక్నికల్/నాన్ టెక్నికల్ ట్రేడుల్లో అప్రెంటిస్‌ల శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 473
» అర్హత: 12వ తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 12.01.2024 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, వైద్య పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 01.02.2024.
» అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు: 09.02.2024 నుంచి 18.02.2024 వరకు.
» రాతపరీక్ష తేది: 18.02.2024.
» వెబ్‌సైట్: https://www.iocl.com

ఎన్‌హెచ్ఏఐ, న్యూఢిల్లీలో 60 డిప్యూటీ మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన డిప్యూటీ మేనేజర్(టెక్నికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 60
» అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి సివిల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 30ఏళ్లు మించకూడదు.
» పే స్కేల్: రూ.15,600 నుంచి రూ.39,100.
» ఎంపిక విధానం: యూపీఎస్సీ 2023లో నిర్వహించిన ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, పర్సనాలిటీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.02.2024.
» వెబ్‌సైట్: https://nhai.gov.in


యూఓహెచ్‌లో ఎంబీఏ ప్రవేశాలు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్.. 2024–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, క్యాట్–2023 ఉత్తీర్ణులై ఉండాలి.
» ప్రవేశ ప్రక్రియ:క్యాట్–2023 స్కోర్, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.01.2024.
» వెబ్‌సైట్: www.uohyd.ac.in

క్యాట్.. మలిదశలో మెరిసేలా!

» ఇటీవల క్యాట్ 2023 ఫలితాలు వెల్లడి
» ఫిబ్రవరిలో మలిదశ ఎంపిక ప్రక్రియ!
» జీడీ,పీఐ,రిటెన్ ఎబిలిటీ టెస్ట్ కీలకం



ఎంబీఏ స్పెషల్

దేశంలోని ప్రతిష్టాత్మక మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లైన ఐఐఎంలు క్యాట్ స్కోర్ ఆధారంగా మలిదశ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తాయి. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు ఖరారు చేస్తున్నాయి. క్యాట్-2023 ఆన్‌లైన్ పరీక్షను నవంబర్ 26న నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫలితాల డిసెంబర్ 21న విడుదల చేశారు. ఈ క్యాట్ స్కోర్ ఆధారంగా ఫిబ్రవరిలో మలిదశ ఎంపికను ప్రారంభించనున్నాయి. ఇందుకు సంబంధించి ఐఐఎంలు, ఇతర టాప్ బీస్కూల్స్ షార్ట్‌లిస్ట్‌లను విడుదల చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో.. క్యాట్ మలిదశ ఎలా ఉంటుంది.. ఇందులో రాణించడమెలాగో తెలుసుకుందాం..

ఐఐఎంలు క్యాట్ స్కోర్ ఆధారంగా..మలిదశలో గ్రూప్ డిస్కషన్(జీడీ), రిటెన్ ఎబిలిటీ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ(పీఐ) నిర్వహిస్తున్నాయి. క్యాట్–2023 విజేతలు మలిదశపై సమగ్ర అవగాహన పెంచుకోవడం ద్వారా విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు. మలిదశలో ముఖ్యంగా నేర్చుకోవాలనే తపన, నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సానుకూల దృక్పథం తదితర లక్షణాలను పరిశీలిస్తారు.

గ్రూప్ డిస్కషన్

క్యాట్‌లో నిర్దేశిత కటాఫ్ సాధించిన అభ్యర్థులకు మలిదశలో ఆయా ఐఐఎం క్యాంపస్‌లలో నిర్వహించే ఎంపిక ప్రక్రియ.. గ్రూప్ డిస్కషన్. అభ్యర్థులను బృందాలుగా ఏర్పరిచి.. ఏదైనా ఒక అంశాన్ని ఇచ్చి దానిపై చర్చించమంటారు. ఇందులో కోర్ నుంచి కాంటెంపరరీ వరకు అనేక టాపిక్స్ అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచే సబ్జెక్ట్ నాలెడ్జ్‌తో పాటు సమకాలీన పరిణామాలపై అన్ని కోణాల్లో అవగాహన పెంచుకోవాలి. ఇందులో రాణించేందుకు ఆత్మవిశ్వాసంతో మాట్లాడేలా సాధన చేయాలి. అలాగే ఇతరులు చెప్పే విషయాలను శ్రద్ధగా వినే నైపుణ్యం పెంచుకోవాలి.

రిటెన్ ఎబిలిటీ టెస్ట్

గ్రూప్ డిస్కషన్ తర్వాత అభ్యర్థులు తమ ప్రతిభను నిరూపించుకోవాల్సిన మరో పరీక్ష.. రిటెన్ ఎబిలిటీ టెస్ట్. ఇందులో ఏదైనా నిర్దిష్టంగా ఒక అంశాన్ని పేర్కొని.. అభ్యర్థుల అభిప్రాయం లేదా సలహాలు వ్యక్తీకరించే విధంగా ప్రశ్నలు అడుగుతున్నారు. ఒక అంశానికి సంబంధించి మూడు వందల నుంచి నాలుగు వందల పదాల మధ్యలో అభ్యర్థులు తమ సమాధానం రాయాల్సి ఉంటుంది. సబ్జెక్ట్ నాలెడ్జ్, సోషల్ అవేర్‌నెస్ సమ్మిళితంగా ఈ ప్రశ్నలు ఉంటున్నాయి. అభ్యర్థులు ముందుగా ఇచ్చిన టాపిక్‌ను సమగ్రంగా అవగాహన చేసుకోవాలి. దానికి సంబంధించి అన్ని కోణాల్లో తన ఆలోచనలను ఒక క్రమ పద్ధతిలో సిద్ధం చేసుకోవాలి. వాటిని సులభమైన భాషలో రాయగలగాలి. ముఖ్యంగా గ్రామర్, స్పెల్లింగ్ పొరపాట్లు లేకుండా చూసుకోవాలి.

పర్సనల్ ఇంటర్వ్యూ

గ్రూప్ డిస్కషన్, రిటెన్ ఎబిలిటీ టెస్ట్‌లో విజయం సాధించిన అభ్యర్థులు చివరిగా ఎదుర్కోవాల్సిన ప్రక్రియ.. పర్సనల్ ఇంటర్వ్యూ. విద్యార్థికి మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఉన్న వాస్తవ ఆసక్తి, అతని భవిష్యత్తు లక్ష్యాలు, వాటిని అందుకునేందుకు అతను ఎంచుకున్న మార్గాలు వంటి వాటిని తెలుసుకునేలా నిపుణులైన ప్రొఫెసర్స్ కమిటీ ఈ ఇంటర్వ్యూను నిర్వహిస్తుంది. కాబట్టి అభ్యర్థులు తమ కెరీర్ లక్ష్యాలపై పూర్తి స్పష్టతతో ఇంటర్వ్యూకు వెళ్లాలి.

అకడెమిక్ వెయిటేజీ

ఐఐఎంలలో పీజీ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్‌లో చేరే అభ్యర్థుల తుది ఎంపికకు క్యాట్ స్కోర్, జీడీ, ఆర్‌ఏటీ, పర్సనల్ ఇంటర్వ్యూలలో ప్రతిభతోపాటు మరెన్నో అంశాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. తుది ఎంపికలో వాటికి కూడా నిర్దిష్ట వెయిటేజీ కల్పిస్తున్నారు. మొత్తం వంద మార్కుల వెయిటేజీ విధానంలో.. 35 నుంచి 50 శాతం మేరకు జీడీ, పీఐలకు వెయిటేజీ కల్పిస్తున్నారు. డైవర్సిటీ వెయిటేజీ పేరుతో జండర్ డైవర్సిటీ, కల్చరల్ డైవర్సిటీలకు మూడు నుంచి అయిదు శాతం చొప్పున వెయిటేజీ ఇస్తున్నారు. పలు ఐఐఎంలు అకడమిక్ వెయిటేజీ నిబంధన కూడా అమలు చేస్తున్నాయి. పదో తరగతి,ఇంటర్మీడియెట్,బ్యాచిలర్ డిగ్రీ కోర్సులకు పది శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తున్నారు. అదే విధంగా ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్స్ ఉన్న వారికి ప్రత్యేక వెయిటేజీని ఇస్తున్నారు. ఈ వెయిటేజీ రెండు నుంచి మూడు శాతం మధ్యలో ఉంటోంది.

వర్క్ ఎక్స్‌పీరియన్స్

ఐఐఎంలు తుది జాబితా రూపకల్పనలో పని అనుభవానికి కూడా వెయిటేజీ కల్పిస్తున్నాయి. వర్క్ ఎక్స్‌పీరియన్స్ ఉన్న అభ్యర్థులకు అయిదు నుంచి పది శాతం మధ్యలో వెయిటేజీ ఇస్తున్నాయి. ఈ వెయిటేజీ కూడా అభ్యర్థులు పని చేస్తున్న రంగం, మొత్తం అనుభవం గడించిన సంవత్సరాల ఆధారంగా ఉంటోంది.

జండర్ వెయిటేజీ

- జండర్ వెయిటేజీ..ఐఐఎంలు అనుసరిస్తున్న మరో వినూత్న విధానం. మేనేజ్‌మెంట్ విద్యలో మహిళా విద్యార్థులు చేరేలా ప్రోత్సహించేందుకు జండర్ డైవర్సిటీ విధానాన్ని అమలు చేస్తున్నారు.
- ఐఐఎం కోల్‌కత.. జండర్ డైవర్సిటీ వెయిటేజీ పేరుతో మహిళా విద్యార్థులకు అదనంగా మూడు మార్కులు కేటాయిస్తోంది.
- ఐఐఎం లక్నో.. మహిళా విద్యార్థులకు రెండు పాయింట్లు కేటాయిస్తోంది.
- ఐఐఎం రోహ్‌తక్.. జండర్ డైవర్సిటీ, నాన్–ఇంజనీరింగ్ ఫ్యాక్టర్స్ పేరుతో మొత్తం ఎంపిక ప్రక్రియలో 30పాయింట్లు కేటాయిస్తుండటం విశేషం
- ఐఐఎం రాయ్‌పూర్.. ఎంపిక ప్రక్రియలో 20 శాతం వెయిటేజీని జండర్ డైవర్సిటీ పేరుతో కేటాయిస్తోంది.
- ఐఐఎం– ఉదయ్‌పూర్ 15 పాయింట్లు; ఐఐఎం–కాశీపూర్ మూడు పాయింట్లు కేటాయిస్తోంది.

అకడమిక్ డైవర్సిటీ

క్యాట్‌లో ఉత్తీర్ణత, ఐఐఎంలలో ప్రవేశ ప్రక్రియలో ఇంజనీరింగ్ అభ్యర్థులు ముందంజలో ఉంటున్నారనే అభిప్రాయం నెలకొన్న సంగతి తెలిసిందే. దీంతో ఐఐఎంలలో నాన్–ఇంజనీరింగ్ విద్యార్థులకూ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ఐఐఎంలు అకడమిక్ డైవర్సిటీకి కూడా పెద్ద పీట వేస్తున్నాయి.

టెన్త్, ఇంటర్‌తోనే కేంద్ర కొలువు

ఏఏఐ నదరన్ రీజియన్‌లో 119 పోస్టులకు నోటిఫికేషన్

జాబ్స్ ఇన్ఫో

టెన్త్, ఇంటర్ విద్యార్హతతోనే కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతం చేసుకోవాలనుకునే వారికి చక్కటి అవకాశం. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ఉద్యోగ ప్రకటన విడుదల చేసింది. నదరన్ రీజియన్‌లోని వివిధ విమానాశ్రయాల్లో జూనియర్/సీనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్ దీవులకు చెందిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- మొత్తం పోస్టుల సంఖ్య: 119
- ఖాళీల వివరాలు: జూనియర్ అసిస్టెంట్(ఫైర్ సర్వీస్)–73 పోస్టులు, జూనియర్ అసిస్టెంట్(ఆఫీస్)–02,సీనియర్ అసిస్టెంట్(ఎలక్ట్రానిక్స్)–25, సీనియర్ అసిస్టెంట్(అకౌంట్స్)–19 పోస్టులు.

వయసు

20.12.2023 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు 5ఏళ్లు, ఓబీసీలు,ఎక్స్–సర్వీస్‌మెన్‌కు 3ఏళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు.

అర్హతలు-ఎంపిక విధానం

పోస్టును అనుసరించి విద్యార్హతలు, ఎంపిక విధానాలు వేర్వేరుగా ఉన్నాయి.

జూనియర్ అసిస్టెంట్ (ఫైర్ సర్వీసెస్)

- ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు పదోతరగతితో పాటు మూడేళ్ల రెగ్యులర్ మెకానికల్/ఆటోమొబైల్/ఫైర్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. లేదా ఇంటర్మీడియట్‌పాసవ్వాలి. స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ కింద ఈ పోస్టులను ఎక్స్–సర్వీస్‌మెన్ అభ్యర్థులకు కేటాయించారు. హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి.
- రాత పరీక్ష ఇలా.. ఎంపిక ప్రక్రియలో భాగంగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి 2 గంటలు. పార్ట్–1లో 50శాతం ప్రశ్నలు బేసిక్ మ్యాథమెటిక్స్, బేసిక్స్ సైన్స్, ఎలిమెంటరీ ఇంగ్లిష్/గ్రామర్‌ల నుంచి ఉంటాయి. ప్రశ్నపత్రం 10వ తరగతి స్థాయిలో ఉంటుంది. పార్ట్–బిలో 50శాతం ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ నుంచి అడుగుతారు. ప్రశ్నలు 10+2 స్థాయిలో ఉంటాయి. స్టేజ్–2: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. దీంట్లో పాసైతే డ్రైవింగ్, ఫిజికల్ ఎండ్యురెన్స్ టెస్ట్‌లు ఉంటాయి.

జూనియర్ అసిస్టెంట్ (ఆఫీస్)

- ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంపిక ఇలా.. కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 2 గంటలు. రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఎంఎస్–ఆఫీస్‌లో కంప్యూటర్ లిటరసీ టెస్ట్ నిర్వహిస్తారు. 50 శాతం ప్రశ్నలు విద్యార్హతల సబ్జెక్ట్‌లకు సంబంధించినవి ఉంటాయి. జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్‌లో 50శాతం ప్రశ్నలు అడుగుతారు.

సీనియర్ అసిస్టెంట్(ఎలక్ట్రానిక్స్)

- ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు ఎలక్ట్రానిక్స్/టెలికాం/రేడియో ఇంజనీరింగ్ డిప్లొమా, సంబంధిత విభాగంలో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
- రాత పరీక్ష.. కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. పరీక్ష వ్యవధి 2 గంటలు. ఇందులో అకడమిక్ సబ్జెక్టుల నుంచి 70శాతం ప్రశ్నలు అడుగుతారు. జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ నుంచి 30 శాతం ప్రశ్నలు ఇస్తారు.

సీనియర్ అసిస్టెంట్ (అకౌంట్స్)

- ఈ విభాగంలోని పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు బీకాం ఉత్తీర్ణులై ఉండాలి. రెండేళ్ల ఉద్యోగానుభవం తప్పనిసరి. ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్ తయారీ, టాక్సేషన్, ఆడిట్, ఫైనాన్స్, అకౌంట్స్ రంగాల్లో పరిజ్ఞానం ఉండాలి.
- రాత పరీక్ష: ఈ పోస్టుల ఎంపికలో భాగంగా 100 మార్కులకు ఆన్‌లైన్ విధానంలో రాత పరీక్షను నిర్వహిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. ఎంఎస్ ఆఫీస్‌లో కంప్యూటర్ లిటరసీ టెస్ట్ ఉంటుంది. సీబీటీలో అర్హత సాధించినవారికి కంప్యూటర్ లిటరసీ టెస్ట్ నిర్వహిస్తారు. ఇది అర్హత పరీక్ష మాత్రమే. సీబీటీలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థుల తుది ఎంపిక ఉంటుంది. విద్యార్హతలకు సంబంధించిన సబ్జెక్టుల నుంచి 70 శాతం ప్రశ్నలు ఇస్తారు. మిగతా 30 శాతం ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ నుంచి అడుగుతారు.

ప్రిపరేషన్ ఇలా


70 శాతం ప్రశ్నలు సంబంధిత అకడమిక్ సబ్జెక్టుల నుంచే వస్తాయి. కాబట్టి గతంలో చదివిన సబ్జెక్టులపై పట్టు సాధించడానికి ప్రయత్నించాలి. వీలైనన్నీ ఎక్కువ మాక్ టెస్టులు రాయాలి. జీకే, జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్‌ల కోసం పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయాలి. నెగిటివ్ మార్కులు లేవు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 26.01.2024
- వెబ్‌సైట్: https://www.aai.aero

నిర్ణయాధికారం 'ఆమె'దే!

152 నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువ



- రాష్ట్రంలో ప్రతీ వెయ్యి మంది పురుష ఓటర్లకు 1036 మంది మహిళా ఓటర్లు
- 18–19 ఏళ్ల వయసు గల మహిళా ఓటర్లు 3.5 లక్షల మంది
- ఓటర్ల జాబితా విడుదల చేసిన సీఈవో ముఖేష్ కుమార్ మీనా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రాబోయే సాధారణ ఎన్నికల్లో గెలుపు ఓటములను మహిళా ఓటర్లే నిర్దేశించనున్నారు. 152 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వారి సంఖ్యే ఎక్కువగా ఉంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సోమవారం అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం మొత్తం 152 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతీ వెయ్యి మంది పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారని తేలింది. రాష్ట్రం మొత్తం ఓటర్లలో ఎలక్ట్రోలర్ లింగ నిష్పత్తి సగటు కూడా ఎక్కువగానే ఉంది.

రాష్ట్రంలో 2014 నుంచి 2024 వరకు ఎలక్ట్రోరల్ లింగ నిష్పత్తి పెరుగుదల ఇలా...



రాష్ట్రంలో పురుషుల కన్నా దాదాపు పది వేలకు పైగా మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాలు

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు
కొవ్వూరు	1.30 లక్షలు	1.44 లక్షలు
రంపచోడవరం	1.30 లక్షలు	1.44 లక్షలు
ఏలూరు	1.10 లక్షలు	1.20 లక్షలు
గన్నవరం	1.33 లక్షలు	1.43 లక్షలు
పెనమలూరు	1.38 లక్షలు	1.48 లక్షలు
ప్రత్తిపాడు	1.27 లక్షలు	1.37 లక్షలు
తెనాలి	1.27 లక్షలు	1.37 లక్షలు
రామచంద్రాపురం	1.13 లక్షలు	1.23 లక్షలు
ఒంగోలు	1.13 లక్షలు	1.23 లక్షలు
మంగళగిరి	1.38 లక్షలు	1.48 లక్షలు
రాజమండ్రి(సిటీ)	1.25 లక్షలు	1.35 లక్షలు

పదేళ్లుగా పెరుగుతున్న నిష్పత్తి

రాష్ట్రంలో 2014 నుంచి వరుసగా 2024 వరకు ఓటర్ల జాబితాల్లో మహిళా ఓటర్ల నిష్పత్తి పెరుగుతూనే ఉంది. అర్హులైన యువతులను ఓటర్లుగా నమోదు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో 18 నుంచి 19 సంవత్సరాల వయసుగల ఎలక్ట్రోరల్ లింగ నిష్పత్తి 778 నుంచి 796కు పెరిగింది. ఈ వయసుగల మహిళా ఓటర్లు 3.5 లక్షల మంది ఉన్నారు. గిరిజనుల్లోని ప్రత్యేక సంచార జాతులను కూడా ఓటర్లుగా నమోదుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో వీరి జనాభా 4.29 లక్షలుండగా 18 సంవత్సరాలు నిండిన 2.94 లక్షల మందిని ఓటర్లుగా నమోదు చేశారు. బోడో గడబా, గుటోబ్ గడబా, చెంచు, బొండో పోర్జా, ఖోండ్ పోర్జా, పరేంగి పోర్జా, డోంగ్రియా ఖోండ్, కుటియా ఖోండ్, కోలం, కొండారెడ్డి, కొండ సవరాల జాతుల్లోని అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేశారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

ముఖ్య అతిథిగా గవర్నర్, గౌరవ అతిథిగా సీఎస్

సాక్షి, అమరావతి: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం ఉదయం ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగాను, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి గౌరవ అతిథిగాను ఈ వేడుకలకు హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా నూతనంగా ఓటర్లుగా నమోదైన యువతకు ఎపిక్ కార్డులు అందజేస్తారని చెప్పారు. ఎన్నికల జాబితా నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మూడు జిల్లాల కలెక్టర్లు సుమిత్ కుమార్ (అల్లూరి సీతారామరాజు), నాగలక్ష్మి (విజయనగరం), ఎస్.ఢిల్లీ రావు (ఎన్టీఆర్)లకు పురస్కారాలను అందజేస్తారన్నారు. అదే విధంగా ముగ్గురు ఈఆర్వోలు.. నెల్లూరు మునిసిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, సింహాచలం దేవస్థానం ఎస్డీసీ కె.వి.రామలక్ష్మి, భీమునిపట్నం ఆర్డీవో ఎస్.భాస్కర్‌రెడ్డిలతో పాటు పలువురికి అవార్డులను ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

బాక్సింగ్‌లో ఏపీకి 2 పతకాలు



సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ఏపీ బాక్సింగ్ క్రీడాకారిణులు తమ సత్తా చాటారు. చెన్నైలో జరుగుతోన్న పోటీల్లో బుధవారం విశాఖకు చెందిన కొలుసు శ్రీవర్షిత (45–48 కేజీలు), గులివిందల మానస (66–70 కేజీలు) వ్యక్తిగత విభాగాల్లో కాంస్య పతకాలు సాధించారు. దీంతో ఏపీ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది.

సోదరుడే కాలయముడై..

వేరే మతస్తుడిని ప్రేమించిన చెల్లిని చెరువులోకి తోసేసిన అన్న

- కాపాడబోయి తల్లి కూడా మృతి
- మైసూరు జిల్లాలో దారుణం



తల్లి అనిత, కుమార్తె ధనుశ్రీ (ఫైల్)

మైసూరు: ఇతర మతానికి చెందిన యువకుడిని ప్రేమించిందనే కోపంతో చెల్లిని సొంత అన్న చెరువులోకి తోసేయగా.. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన తల్లి కూడా జలసమాధి అయ్యింది. ఈ దారుణం మైసూరు జిల్లా హుణసూరు తాలూకా మరూరు గ్రామంలో జరిగింది. వివరాలు.. మరూరుకు చెందిన సతీశ్, అనిత(43) దంపతుల కుమారుడు నితిన్ కూలి పనులకు వెళ్తుండగా.. ధను శ్రీ(18) బీకాం రెండో సంవత్సరం చదువుతోంది. ఈక్రమంలో మారూరుకు పొరుగున ఉన్న హనగోడు గ్రామానికి చెందిన ఇతర మతస్తుడైన యువకుడిని ధనుశ్రీ ప్రేమిస్తోంది. ఈ విషయం తెలిసిన నితిన్ తరుచూ ధనుశ్రీతో గొడవ పడేవాడు. మంగళవారం సాయంత్రం బంధువులకు బాగా లేదంటూ నితిన్ బైక్‌పై తన సోదరి ధనుశ్రీని, తల్లి అనితను బయటకు తీసుకెళ్లాడు. ఊరి బయట ఉన్న చెరువు వద్ద ధనుశ్రీ ప్రేమ విషయమై వారి మధ్య గొడవ జరిగింది. ఇంతలో పట్టరాని కోపంతో నితిన్ తన చెల్లి చేతులను టవల్‌తో కట్టేసి చెరువులోకి తోసేశాడు. ఆ వెంటనే కుమార్తెను కాపాడుకునేందుకు తల్లి అనిత కూడా చెరువులోకి దూకింది. దీంతో తల్లిని రక్షించేందుకు నితిన్ నీటిలోకి దూకాడు. కానీ తల్లీకూతురు నీళ్లలో మునిగి మరణించారు. ఆ తర్వాత నితిన్ ఇంటికి వచ్చి తండ్రి సతీశ్‌కు ఈ విషయం తెలియజేశాడు. బుధవారం ఉదయాన్నే గ్రామస్తులు, ఫైర్ సిబ్బంది చెరువులో గాలించి అనిత, ధనుశ్రీ మృతదేహాలను బయటకు తీశారు. హుణసూరు రూరల్ పోలీసులు నితిన్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

రిపబ్లిక్‌డే వేడుకలకు చర్మకార దంపతులకు ఆహ్వానం



ఆహ్వానం అందుకున్న గోపాలంబాబు, మేరీ మిల్సన్

ఉండి: పశ్చిమగోదావరి జిల్లా, ఉండి మండలం, కోలమూరు గ్రామానికి చెందిన చర్మకార దంపతులు గొట్టేటి గోపాలంబాబు, మేరీ మిల్సన్‌కు ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే వేడుకలకు హాజరు కావాలంటూ దేశ ప్రధాని కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. బుధవారం కోలమూరులో వారు మాట్లాడుతూ దేశ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడంతో పాటు ప్రధానిని కలిసేమహత్తర అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలో పది మందికి ఆహ్వానాలు అందగా వారిలో తాము ఒకరు కావడం గొప్ప విషయమన్నారు. తమలాంటి వారికి ఇంతటి అవకాశం కల్పించిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. చర్మకారుల విభాగంలో రాష్ట్రంలో వీరికి ఆహ్వానం అందడంతో బుధవారం వారు ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో కొత్త ఓటర్ల సమ్మేళనాలు

సాక్షి, అమరావతి: భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు పార్టీ యువమోర్చా విభాగం ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకొన్న వారితో సమావేశాలు నిర్వహించనున్నట్లు యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వంశీకృష్ణ తెలిపారు. గురువారం దేశమంతటా 5,000 ప్రదేశాల్లో తమ పార్టీ ఆధ్వర్యంలో నూతన ఓటర్ల సమ్మేళనాలు కొనసాగుతాయని.. ఏపీలో 1.20 లక్షల మంది ఈ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.